
# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక, మార్చి, 2020 ₹ 30/-

ISSN 2454–4329



దీనార్లు

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 31** **సంచిక 3**

**మార్చి 2020**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI
Since 1946

Printed & Published by

BAPANNA ALAPATI

at Kala Jyothi Process Pvt. Ltd.,

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ ముంగిట వాలుతుంది...

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 - 27645538. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail : misimi90monthly@gmail.com,

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

https://twitter.com/MISIMIMONTHLY

YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## మార్చి నెల సూచికలు...



యక్షగానము


సంపాదకీయం : ... 5

కమ్మ తెమ్మెరలు : ... 6

యక్షగానము : డా. పప్పు వేణుగోపాల రావు... 9

కాకతీయులు - 1 : ఆర్. వరలక్ష్మి... 15

మొదలి నాగభూషణ శర్మ : ప్రొ. రావినూతల సత్యనారాయణ... 24

బేగమ్ కుద్సియా అయిజాజ్ రసూల్, ఆనీ మాస్‌కేర్ని : ఎమ్.వి. భారతలక్ష్మి.. 30

రేడియో నాటకం : గొల్లపూడి మారుతీరావు... 39

రేడియో నాటకం - సాహిత్య శిల్పం : దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు... 41

దహగం లక్ష్మీనారాయణ : మోటూరు శివరాంప్రసాద్... 45

వెల్దుర్తి మాణిక్యరావు : డా. దేవరాజు మహారాజు... 47

వాన్‌ఘో : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 50

మానవేంద్ర నాథ్ రాయ్ : నార్ల వెంకటేశ్వరరావు... 55

ఎం.ఎన్. రాయ్ మానవవాద రాజకీయం : నరిసెట్టి ఇన్నయ్య... 57

నటన: ఒక అబద్ధం - ఒక నిజం : డా. గోవిందరాజు భరద్వాజ... 59

మూసీ నది : రామవరపు వేంకట రమణమూర్తి ... 64

గిరిజనులు: అనుబంధ చేతివృత్తులు : అరుణ చామర్తి... 68

దక్షిణామూర్తి శాస్త్రి : ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ... 71

దుబ్బు కళాకారులు : డా. బాసని సురేష్... 73

వేదిక : ... 78

బెంజిమిన్ ఫ్రాంక్లిన్ - విశిష్ట వ్యక్తిత్వం : తాజీ ప్రసాద్... 79

చదవండి... : *మిసిమి*... 80




గొల్లపూడి



వాన్‌ఘో

**అట్టమీద బొమ్మలు**



**నీ కోసం**
(రాజస్థానీ మీనియేచర్ చిత్రం)



**దీనార్లు**
(చిత్రకారుడు: ఎడ్విన్ లార్డ్)



**అనార్లు**
(ఓరియంటల్ చిత్రం)



**నీటి కోసం**
(పంకజ్‌సాకిన చిత్రం)

భాగ్యనగరంలో ప్రతి సాయంత్రం ఎన్నో సభలు, సమావేశాలూ జరుగుతుంటాయి. ఎక్కువగా పురస్కార ప్రదానాలు, పుస్తకావిష్కరణలు, సంగీత నాట్య ప్రదర్శనలు - **మిసిమి** కి ఆహ్వానాలూ వస్తుంటాయి. అన్నింటికీ వెళ్ళలేకపోయినా కొన్ని సభాకార్యక్రమాలలో పాల్గొని, ప్రతిభావంతులను కలుస్తుంటాం. వారు పలికే మంచి మాటలు వింటుంటాం. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే - ఈ ప్రసంగాలలో తరచూ వినపడే మాటలు నాగరకత - సంస్కృతి - సంప్రదాయాలు. వినే సమయంలో వినసొంపుగానే ఉన్నా తరువాత ఆలోచిస్తుంటే ఏమిటి ఇవన్నీ అనిపిస్తుంది. మరింత లోతుగా చూస్తే....

నాగరకత అంటే ఏమిటి? నాగరకత భౌగోళికమైనది - భౌతికమైనది. మీ కట్టూ - మీ బొట్టూ - నగర నిర్మాణరీతులు - ప్రయాణ సాధనాలు - సాంఘిక కట్టుబాట్లూ బాధ్యతలు - ఇవన్నీ నాగరకతలో భాగం. నాగరకత భౌగోళికమైనది అని అన్నాం కదా - అంటే - ఇది ప్రదేశానికి, దేశానికి, ప్రజాసమూహాలకు విభిన్న రీతులలో వృద్ధి చెంది ఉంటుంది. ఒక దేశంలో ఉన్న నిర్మాణ పద్ధతులు, ప్రణాళికలు మరో దేశంలో ఉండకపోవచ్చు. అలాగే ప్రార్థనాలయాల కట్టడాల డిజైన్స్, డెకరేషన్లు మారుతుంటాయి. ప్రజల వస్త్రధారణ, శిరోలంకారాలు, నడకతీరు కూడా నాగరకతలో భాగమే. (మీరు అమెరికాలో చూస్తే అక్కడి నల్లవాని నడక తీరే వేరు). మరి ఇవన్నీ భౌతికమైనవే కదా! నాగరకత వృద్ధి చెందడానికి ఓ వంద సంవత్సరాలు చాలు. అది మారిపోతుంటుంది కూడా. ఒకే రీతిలో ఎల్లకాలమూ ఉండవలసిన అవసరమూ ఉండదు.

సంస్కృతి - ఇది మేథోపరమైనది, మానసికమైనది. ఒక జాతి వేల సంవత్సరాలలో రూపొందించుకొన్న ప్రత్యేకత. ఈ ప్రత్యేకతలో వారి సారస్వత రీతులు లోతుగా పాదుకొని ఉంటాయి. వారి సంగీత, నాట్యశాస్త్రాలు రూపొంది, పెంపొంది ఉంటాయి. ఒక సంస్కృతిని ఒక జాతికే ఆపాదించగలము. ఆ జాతి మూలాలు, అస్తిత్వమూ ఆ సంస్కృతిలో నిబిడీకృతమై ఉంటాయి. దీనికి వారి భాష మూలాధారం. అది ఒక రోజులోనో, ఒక సంవత్సరంలోనో సంభవించేది కాదు. వేల సంవత్సరాల కాలం దొర్లిపోవాలి. అప్పుడే ఒక సంస్కృతి ఒక జాతి నరాలలో లీనమై ప్రవహిస్తుంటుంది. నాగరకతను ఎరువు తెచ్చుకోవచ్చు. అంటే - అమెరికాలో కట్టినట్లు నిర్మాణాలను మనమూ కట్టుకోవచ్చు. కానీ వారికి మన సంస్కృతిని బదలాయించగలమా? అది దాదాపు అసంభవమనే చెప్పాలి. గ్రీకుల నుంచి ఇటలీకి అక్కడి నుంచి ఐరోపా అంతా వ్యాపించిన వారి సంస్కృతి మిగతా ప్రపంచానికి 'ట్రాన్స్‌ఫామ్' కాలేదంటే సంస్కృతి ఒక జాతికి చెందినదే చెప్పాలి. ఇది నాగరకతలో భాగం కానవసరం లేదు. కాదు కూడా.



ఇక సంప్రదాయం ఇది ప్రాదేశికమైనది, ప్రాంతీయమైనది! సంప్రదాయాలు, సమూహాలకు ప్రత్యేక ప్రదేశాలకు చెంది ఉంటాయి. పేరు ఒకటే కావచ్చు కాని తీరుతెన్నులు మారిపోతుంటాయి. ఉదాహరణకు వివాహం - సంస్కృతిలో భాగమే. కానీ ఎవరి సంప్రదాయం వారిది. ఒక్కో ప్రదేశంలో ఒక్కో రకంగా అదే వివాహాన్ని జరిపిస్తారు. ఆ జరిపే తీరును సంప్రదాయం అంటాం. అలాగే కుటుంబ వ్యవస్థలోని అన్ని కర్మలూ ఎవరి సంప్రదాయం ప్రకారం వారు నిర్వహిస్తారు. ఉత్తర భారతంలోని సంప్రదాయాలు అక్కడి రాష్ట్రాలలోనే భిన్నంగా ఉంటాయి. అక్కడి వర్గాలలోనే విభిన్నంగా ఉంటాయి. దక్షిణాదికి వచ్చేసరికి పూర్తిగా భిన్నం. మళ్ళీ దక్షిణాది రాష్ట్రాలలో ఎవరి పద్ధతి వారిదే. ఎన్ని ఉదాహరణలయినా చెప్పవచ్చు. ఇది గుళ్ళు, గోపురాలకు, దేవుళ్ళకు, దేవతలకు కూడా వర్తిస్తుంది. నాగరకతలో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు ఉంటాయి. అవి - ఆయా ప్రదేశాలకు అనుకూలంగా అక్కడి మచ్చికయిన జంతుసంపదను బట్టి ఉంటుంది. దీనిని సంస్కృతి అనలేము. కానీ ఆహారపుటలవాట్లు, ఆహారం తయారీ, వంటకాలు - ఇవన్నీ సంస్కృతిలో భాగంగానే భావించాలి. ఒక జాతి అలవాటు పడిన ఆహారం, మరో జాతి అరిగించుకోలేదు. అలాగే సంప్రదాయంలో ఆహారం వడ్డించే తీరు, ఆరగించే తీరు, కూర్చునే విధానం, బల్ల మీద, క్రింద, స్పూనులతోనా, పుల్లలతోనూ, చేతులతోనూ- ఇవన్నీ ఉంటాయి.

మరో విషయం చెప్పాలి. జీవనం అన్న తర్వాత మరణం ఉంటుంది. దీనికీ ఎవరి సంప్రదాయం వారిది. ఒక ప్రదేశంలో ఖననం చేస్తారు, మరో దేశంలో దహనం చేస్తారు. ఒక వర్గం జలసమాధులు చేస్తారు, మరో వర్గం కాకులకు, గ్రద్దలకు వదలిపెడతారు. ఆ క్రతువులన్నీ సంప్రదాయంలో భాగమే.

చివరిగా ఒక్కమాట - భారతీయ సంస్కృతి అంటూ ఏమయినా ఉన్నదంటే - అది భారత - రామాయణాలు కట్టిపడవేసిందే - దేశంలో ఏ భాషలోనైనా సారస్వతం మొత్తం వీటి చుట్టూనే తిరుగుతూ ఉన్నది. ఎవరి సంప్రదాయాలు వారు గౌరవించుకుంటున్నా మనల్ని ఒక జాతిగా బయటివారు గుర్తిస్తున్నారంటే కారణం దానికి దేశపుటెల్లలు కాదు - పైన చెప్పిన సంస్కృతీ మూలాలే.....

# కమ్మతెమ్మెరలు

"…. **మిసిమి** - ఫిబ్రవరి - 2020లో సంగీతానికి నృత్యానికి దేవదాసీలు చేసిన సేవలు అజరామరమని, దేవదాసీల నిస్వార్థ సేవలను మాత్రమే పరిగణలోకి తీసుకొని తెలుసుకొనవలెనని, నృత్యం రావాలి అంటే సంగీతం తెలిసి తీరాలి అన్న 'బాల సరస్వతి'గారి అభిప్రాయాన్ని నృత్యం నేర్పేవారు నేర్చుకునేవారు గౌరవంతో తెలుసుకొనవలసిన విషయమని పప్పు వేణుగోపాలరావు గారు చక్కగా ఉదహరించారు. మనతో పాటు పెరుగుతూ మన శరీరాన్ని ఎల్లప్పుడూ కప్పి ఉంచే వలువలు 'నైతిక విలువలు' , అవి మనిషిని నడిపించేవిగా ఉండాలి గానీ, మనుషులకు చూపించేవిగా ఉండకూడదు అని కిల్లాడ సత్యనారాయణ గారు తన రచనలో విలువలు గురించి వివరించిన వైనం బాగుంది. తెలుగు నాట మెరిసిన ఒక సాంకేతిక కిరణం 'మోక్షగుండం విశ్వేశ్వరయ్య' వారి జీవిత విజయ విశేషాలను విశదీకరించిన తీరు బాగుంది. తెలుగు నాటక పరిమళం 'మొదలి' గుబాళించింది. పల్లెటూరు దేశానికి అదే తల్లివేరు అనే చక్కని పోలికతో, ఊరితో బంధాన్ని, అనుబంధాన్ని , అనుభూతిని, పల్లె గమనాన్ని మరోసారి ప్రతి ఒక్కరు మననం చేసుకునేలా 'అమర సంజీవని ..మైత్రి'లో అభివర్ణించిన రచయితకు అభినందనలు. అనాదిగా ప్రాముఖ్యత కలిగిన లక్క గురించి వినియోగించే వారికి కూడా దాని పుట్టుపూర్వోత్తరాలు తెలియదంటే అతిశయోక్తి కాదు. లక్కను భద్రత దృష్ట్యా సీలు వేయటానికి ప్రభుత్వ కార్యాలయాల్లో మరీ ముఖ్యంగా ఎన్నికల సమయాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. స్త్రీల సాంప్రదాయ ఆభరణం గాజుల తయారీ వెనుక దాగిన శ్రమను, లక్క పుట్టే తీరు తెలియచేయటం కోసం రచయిత పడ్డ కష్టం అక్షరరూపం 'గాజులోయమ్మ గాజులు' అపురూపం.. కులవృత్తి పనివారల జీవన గాథలపై వచ్చిన సాహిత్యాన్ని సమగ్రంగా తెలియచేసిన 'బహుజనవాదం' బహుబాగుంది. మొత్తంగా దేనికదే సరి అన్నట్లుగా ఆసాంతం ఆస్వాదించే విధంగా ముస్తాబైంది ఫిబ్రవరి - 2020 **మిసిమి** పత్రిక. అభినందనలు…"

*- ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి*

"… మహాశయా, **మిసిమి** జనవరి - 2020 సంచికలో 'కృష్ణశాస్త్రి కవిత' పాపినేని శివశంకర్ పుటలు - 20-21. "… ఇది మల్లెలవేళయనీ… ఇది వెన్నెల మాసమనీ.." పాట 'రంగులరాట్నం'లోనిది కాదు, 'సుఖదుఃఖాలు'. మరో విషయం - 'మల్లెల వేళ - వెన్నెల మాసము' ఉండవు. కవి సమయాలు సరిపెట్టుకోవాలి…"

*- వి.ఎ.కె. రంగారావు, చెన్నై*




"…. 'కలల్ని ఏరుకుంటూ, ఏకతార మీటుకుంటూ - దారిన పోయే ఆ మహా మానవ ప్రేమికుడు కృష్ణశాస్త్రిగారిని మన కాలపు మోడువారిన ఎదల్లోకి పిలవకుండా ఎలా ఉండగలం? అతనంటూ రావాలేగాని మళ్ళీ మన బతుకుల్లోకి కించిత్తైన వసంత శోభని పట్టుకు రాకపోతాడ?' ఇల్లాటి మంచి గన్ధం వాసనలాటి భావాల్ని చిలకరిస్తూ రాసిన వ్యాసం పాపినేని శివసంకర్ గారి వ్యాసం *కృష్ణశాస్త్రి కవిత*. నిశ్చయంగా ఈ నెల (జనవరి - 2020) **మిసిమి** కి highlight ఆ వ్యాసమే…"

*- ఎ.వి. రెడ్డి శాస్త్రి, శ్రీకాకుళం*

"… జనవరి - 2020 **మిసిమి** లో రాఫెల్ గురించి కోడూరి పుల్లారెడ్డి గారి వ్యాసం చాలా సమగ్రంగా ఉంది. నిజంగా ఆయన వ్యాసం ఒక పరిశోధనా వ్యాసంలాగా ఉంది. కొన్ని వ్యాసాలు మిగిలిన కళాకారుల గురించి వ్రాశారు. వాటన్నిటిలోనూ ఈ వ్యాసం చాలా ప్రత్యేకంగానూ, విపులంగానూ ఉన్నది. అయితే రాఫెల్ కళాకారుడే కాదు - ఆర్కిటెక్చర్ కూడా. ఆ విషయం ప్రస్తావించలేదు. 37ఏళ్లకే మరణించిన కళాకారుడు. పైగా ఎంతోమంది

సమకాలికులు మైకెలాంజిలో, డావిన్సిలాంటి ప్రసిద్ధికెక్కినవారితో పోటీ పడుతూ ఎంతో మంచి కళాఖండాలను అందించడంలో తనకంటూ ఒక శైలిని అమర్చుకోవడం అతని ప్రత్యేకత. Prince Among Painters అంటూ కీర్తింపబడ్డాడు. చిత్రం Plato and Aristotle అంటూ ఇచ్చిన చిత్రం School of Athensగా ఎంతో ప్రఖ్యాతిగాంచింది. ఆ పేరు అలాగే ప్రచురిస్తే బావుండేది. ***మిసిమి*** లో కళలకు ఎప్పుడూ ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఇలాగే కొనసాగించాలని, పాఠకులకు ఇంత మంచి కళావిమర్శ అందించాలనీ కోరుకుంటున్నాను...''

*- మోటూరు శివరాంప్రసాద్, హైదరాబాద్*

''... కిల్లాడ సత్యనారాయణ గారికి నమస్కారం - నా వయస్సు 71 సంవత్సరాలు. సాహిత్యం అంటే ఇష్టం కానీ నాకు చదవడం తప్ప రాయడం రాదు. ఎప్పుడైనా ఇలా వ్రాయాలి అంటే నాలుగు మాటలు ఏరుకొని, కాస్త గ్రామర్ చేర్చుకొని రెండు వాక్యాలు కూర్చుకొనేసరికి ఏళ్ళూ, పూళ్ళూ గడిచిపోతాయి. సమయం, సందర్భం పాతపడిపోతాయి. ఇది నా సొంత గొడవ, వదిలేయండి. అక్టోబర్ - 2019 నెల ***మిసిమి*** లో మీ వ్యాసం 'మార్పుకి ముఖద్వారం వినడం' చదివాను. ఎంత చక్కగా వ్రాశారు! నిజానికి నాకు వ్రాయటానికి మాటలు తెలియటంలేదు. అది ఒక వ్యాసంలాగా లేదు. తిలక్, కృష్ణశాస్త్రిని చదువుతున్నంత హాయిగా ఉంది. చాలా సంవత్సరాల తర్వాత ఒక మంచి రచన చదివాను (నెల క్రిందట కవితా ప్రసాద్ 'కృష్ణ యానం' అని వ్రాశారు). తిరిగి మళ్ళీ మీ రచన. ఇలాంటి రచనలు సంవత్సరానికి ఒకటి వచ్చినా తెలుగు సాహిత్యానికి కొత్త బలం. దయచేసి వ్రాస్తూ ఉండండి. చివరాకరికి మీరు అన్యథా భావించరనే ధైర్యంతో వ్రాస్తున్నాను - ''బ్రాహ్మణుల్లో కూడా మహానుభావులు ఉంటారని గురజాడ అంటే - పోలీసుల్లో కూడా కళాపోషకులుంటారని మీరు, మీకు ముందు ఇద్దరు ముగ్గురు నిరూపిస్తున్నారు...''



*- మనోహర్ పంత్, హన్మకొండ*

''.... ***మిసిమి*** - ఫిబ్రవరి - 2020 సంచిక 'రాజ్యాంగ పరిషత్తు'లో సరోజిని నాయుడు గారు మాట్లాడుతూ ''భారత పతాకం క్రింద రాజైనా, రైతైనా సమానమే'' అని వెలిబుచ్చిన భావం అమోఘం. రాజ్యాంగ లక్ష్యాన్ని ఒక్క మాటలో గొప్పగా చెప్పారు ఆమె. నైతిక విలువల గురించి రచయిత (కిల్లాడ సత్యనారాయణ) వివరంగా పేర్కొన్నారు. మోక్షగుండం వారిలో ఆ విలువలు ఉన్నట్టు గ్రహించాను. ప్రతిభావంతుడని, సమస్యలకు భయపడక, వాటిని భయపెట్టే గుణమున్న మనిషని తెలిసింది. ఈ వ్యాసం నేటి ఇంజనీరింగ్ విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి. మొదలి నాగభూషణ శర్మ గారు నాటకానికే తన జీవితాన్ని అంకితం చేశారు. వారి బహుముఖ ప్రజ్ఞా పాటవాలు ఆకట్టుకున్నవి. వారితో నాకు వ్యక్తిగత పరిచయం ఉండటం నా భాగ్యం. వారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నప్పుడు మా పరిచయం ఏర్పడింది. అటువంటి వారు నేటి కాలంలో అరుదుగా కనిపిస్తారు. పరమార్థం ఉన్న జీవితం వారిది అనుటలో రవ్వంతయిన సందేహం లేదు. శీరంశెట్టి కాంతారావు గారు గాజులోళ్ళ మీద తను రాయ తలపెట్టిన నవలకు ముడి సరకు సేకరించడానికి వ్యయ ప్రయాసలకోర్చి పడిన శ్రమ అతని నిబద్ధతకు నిదర్శనం, రచయితలకు మార్గదర్శి. క్షేత్రస్థాయిలో ఉన్న గాజుల తయారీ కార్మికుల స్థితి గతులు స్వయంగా తెలుసుకొనేందుకు చేసిన ప్రయాణం ప్రశంసనీయం. అడుగడుగునా అతనికి సహాయ సహకారములు అందించిన పరిచయస్తులు / స్నేహితులు అభినందనీయులు. గాజుల్లో వాడే ''లక్క'' పక్షి రెట్ట అని తెలిసి అవాక్కయ్యాము. అది వ్యాపార వస్తువు కావడం ఆశ్చర్యకరం. 'వేదిక'ను ప్రవేశపెట్టి ***మిసిమి*** తన వన్నెను పెంచుకున్నది. ఇది రచయితకు, చదువరికి మధ్య వారధిగా ఉపయోగ పడుతుంది. ఆగస్టు, 2019 ***మిసిమి***లో నేను భగవద్గీత గురించి వెలిబుచ్చిన సందేహాలకు పురాణపండ రాఘవరావు గారు వారి ''పరిజ్ఞానం మేరకు'' ఇచ్చిన వివరణ నాకు జ్ఞానోదయం కలిగించింది. నా వృత్తి ప్రశ్నించు, సందేహ నివృత్తి కొరకు అని నేర్పింది. అదే చేశాను. సహృదయంతో గురువు గారు నా సందేహాలను తీర్చారు. వారికి నమస్కారం...''

*- పంజాల నరసయ్య, హైదరాబాద్*

".... దేశోద్ధారకులు కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు 1938 ఏప్రిల్ 11న దివంగతులయ్యారు. నాగేశ్వరరావు గారు పరమపదించే నాటికి *ఆంధ్రపత్రిక* 800 మందికి ఉచితంగా పంపుతుండేవారు. దానివల్లనే పత్రికకు నష్టమని పట్టాభివారు లెక్క కట్టారు. ***మిసిమి*** డిసెంబర్ - 2019 సంచికలోని మోటూరు శివరాం ప్రసాద్ గారి 'చీరాల నుండి కరాచీ వరకు' చదివాను. 'సింధ్ అబ్జర్వర్' స్థాపక సంపాదకుడు, ఆధునిక కరాచి నిర్మాణానికి కృషి చేసిన కోటంరాజు పున్నయ్య, పాకిస్తాన్ ఏర్పడినప్పుడు అక్కడ ఉండలేక తిరిగి వచ్చేశారు. 1948లో చెన్నపట్నంలో ఆంధ్రపత్రిక కార్యాలయం రెండవ అంతస్థులో జి. కృష్ణ, కోటంరాజు పున్నయ్యలు కిటికీ నుండి బయటకు చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో ఒక వృద్ధుడు ఒక తోపుడు బండిలో మిఠాయి అమ్ముకుంటూ రోడ్డున పోవడం పున్నయ్య గారు చూశారు. గబగబా క్రిందకి వెళ్లి ఆ వృద్ధునికి పాదాభివందనం చేశారు. ఆ వృద్ధుడు, పున్నయ్య గారు కౌగిలించుకుని ఏడవ సాగారు. వాళ్ళు కౌగిలి విడివడి, తమతమ కుటుంబాల వాళ్ళను గురించిన కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆ వృద్ధుడు 'సింధ్ అబ్జర్వర్' పత్రిక నిర్వాహక మండలి ప్రముఖుడు. అతడి ఆస్తిని పాకిస్థానీయులు దోచుకోగా అతడు తన వారిని తీసుకుని కట్టుబట్టలతో భారతదేశానికి వచ్చేశాడు. మిఠాయి అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. పున్నయ్య గారు ఆ వృద్ధుని వద్ద మిఠాయి కొని డబ్బులు ఇచ్చారు. డబ్బులు తీసుకోనన్నాడు వృద్ధుడు. ఇద్దరూ బావురుమన్నారు. ఏడుపు మించిన సౌహార్థ ప్రకటన వేరేమున్నది. మాటలకు అతీతమైన సౌహార్థం..."

*-ముప్పల సుబ్బరామయ్య, విజయవాడ*

".... ***మిసిమి*** సెప్టెంబర్ - 2019 సంచికలోని దిలావర్ గారి నాలుగు శ్లోకాలు చదివాను. అవి నా పాత జ్ఞాపకాలను బయటకు తీశాయి. మా అక్కయ్య పెళ్ళి 27-1-1980 న జరిగింది. 26-1-1980 రాత్రి ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు, సంస్కృత పండితులు అయిన రామకృష్ణ శాస్త్రి గారిని మా పిల్లలందరం ఏదో ఒకటి చెప్పమని బలవంతం చేస్తే - ఆ సమయానికి తగ్గట్టు ఈ నాలుగు శ్లోకాలు వివరించారు- అందులోనూ 'సామాన్య ప్రతిపత్తి పూర్వక మియందారేషు' వివరిస్తూ దిలావర్ గారి వివరణ ఇచ్చారు. తర్వాత దానినే సామ + అన్యగా చెబుతూ అది ఒక హెచ్చరికగా రాజుగారికి చెప్పారు - అని తెలిపారు. అక్కడే ఉన్నా మా ఇంకొక పెద్దాయన (నెరియనూరి వెంకట్రామయ్య గారు - ఆయన సహపాఠి) దానిని సరదాగా ఖండించినాడు. భార్య రూపవతి శత్రుఃను అలాగా విడదీస్తే భార్య+అరూపవతీ శత్రుః అవుతుంది కదా! మరి రూపవతిని, అమరావతినీ కాక ఇంకెవరిని చేసుకోవాలో చెప్పమన్నాడు. అందరూ నవ్వుకున్నాం. దిలావర్‌గారి పుణ్యమా అని కండ్ల ముందు రీలు వెనక్కు తిరిగింది..."

*- మోక్షగుండం ఆనందకుమార్, అనంతపురము*

".... అభినయ సరస్వతి, బాల సరస్వతి గురించి వేణుగోపాలరావుగారి వ్యాసం... బాల సరస్వతి పదమంజీర ధ్వనులు సుతారంగా, మధురంగా వినిపించారు. బాలమ్మ వ్యక్తిత్వము, నాట్యకళాకారిణిగా అద్భుత, నృత్య కళను సముపార్జించుకున్న మహోన్నత కళాకారిణిగా భారతావనికే గర్వకారణమైన విదుషీమణి. యౌవనంలో సంగీత కళానిధులు ఉన్న అపురూపమైన ఫోటో చారిత్రాత్మకమైనది. శ్రీ వేణుగోపాలరావుగారు బహుముఖ ప్రజ్ఞావంతులు. వారికి నా నమస్కారం తెలియజేస్తున్నాను. మోక్షగుండం విశ్వేశ్వర్యయ్య ఆధునిక భారత నగరాలను తీర్చిదిద్దిన సాంకేతిక ప్రతిభాశాలి. శివరాంప్రసాద్ గారు మోక్షగుండం గారి గురించి చక్కగా ముచ్చటించారు. విశ్వేశ్వరయ్యగారి పేరు చెప్పగానే డాల్ఫిన్స్ నోస్ - విశాఖపట్నం, రాజమండ్రి రైల్వేబ్రిడ్జి గుర్తుకు వస్తాయి. నైతిక విలువలు గురించి కిల్లాడ వారి రచన అద్భుతంగా ఉన్నది. ఇప్పుడు ఎక్కడా నైతిక విలువలు కరువైన ఈనాటి తరం వారిని ప్రభావితం చేస్తుందని ఆశిస్తున్నాను. రాజ్యాంగ పరిషత్తులో మహిళలు గురించి భారతలక్ష్మి వ్యాస పరంపర అద్భుతంగా ఉంటున్నది. గొప్పగొప్ప మహిళామూర్తులను పరిచయం చేస్తున్నారు. 'గాజులోయమ్మ గాజులు' అపూర్వమైన, పరిశీలనాత్మకమైన రచన. అనుభవాలు, ప్రయాణాలు, లక్కచెట్టు వివరాలు గాజుల తయారీ పరిశ్రమ కళ్ళకు కట్టినట్లు చెప్పారు. కాంతారావు గారు పాఠకుల్ని సైతం వారితో ప్రయాణింపజేశారు. వారి ప్రతిభాసంపన్నత్వంతో శ్రమైక జీవన సౌందర్యాన్ని దర్శించాను. మూడవ అట్ట నయనానందం, ఆమె కన్నులలో అనిర్వచనీయమైన భావం కళకళలాడుతుంది. ప్రతి రచన గుండెలను పట్టుకుంటుంది. సంపాదకులకు పాఠకులకు రుచి, అభిరుచి కలిగిస్తున్నందుకు శత సహస్ర వందనాలు..."

*- చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు*


యక్షగానము

# యక్షగానము

## ఆవిర్భావ వికాసములు

*– పప్పు వేణుగోపాల రావు*

యక్షగానం అనగానే కర్ణాటకలో కన్నడిగులు చేసే నాట్యం గుర్తొస్తుంది. సహజమే. కాని నిజానికి యక్షగానం, ముందు తెలుగు సాహిత్యంలో ఉద్భవించి, కర్ణాటక చేరింది. అక్కడ నుంచే ఇక్కడకు వచ్చింది అనేవాళ్ళూ ఉన్నారు. అసలు చరిత్ర ఏం చెప్తోందో చూద్దాం.

ఒక్కొక్క ప్రాంతంలో కొన్ని సంప్రదాయమైన, మౌఖిక పరంపరలో, అంటే ఒక్కో తరం నుంచి మరో తరానికి నోటిమాటగా వారసత్వంగా వచ్చే కళలూ సాహిత్యమూ ఉంటాయి. అవన్నీ జానపదాలు కావు. కొన్ని దేశీయ కళలు. ఆయా ప్రాంత ప్రజల సంప్రదాయం సంస్కృతిని ప్రతిబింబించే సంగీతం, నృత్యం, సాహిత్యం మొదలైనవి.

యక్షగానం అంటే యక్షులు చేసే గానం. ఎవరీ యక్షులు? మనం వ్యవహారంలో యక్షులు, గంధర్వులు, కిన్నెరులు, కింపురుషులు వీళ్ళని ఆకాశంలో విహరించే దేవతా స్వరూపులుగా అనుకుంటాం. గంధర్వులు సంగీతానికి, కిన్నెరులు కింపురుషులు, విద్యాధరులు, వాద్య నృత్య సంగీతాలకి విశిష్టులు. అసలు భరతముని నాట్య శాస్త్రంలో సంగీతం అనే మాటే వాడలేదు; గాంధర్వం అన్నాడు. గాంధర్వవేదం అంటే సంగీతానికి సంబంధించిన జ్ఞానం. యక్షులూ ఇందులో ఒక తెగవారే, మిగిలిన కిన్నెర, కింపురుష, విద్యాధరులులాగ. రామాయణ మహాభారతాల్లో యక్షులు అనే మాట వినిపిస్తుంది. ధర్మరాజుని యక్షప్రశ్నలు అడిగిన సంఘటన తెలుసు కదా. యక్షులు అనే మాట సంస్కృత సాహిత్యంలో కనిపిస్తుంది. కాళిదాసు మేఘసందేశంలో యక్షులు నృత్యంలో ప్రీతిగలవారని తెలుస్తోంది.

కన్నడ తెలుగు దేశాలలో యక్షగానం, సాహిత్యమై, సంగీతమై నృత్యమై విలసిల్లుతోంది. తెలుగులో మొదట పాలకురుకి సోమనాథుడు (1280-1340) పండితారాధ్య చరిత్రలో యక్షుల ప్రస్తావన కనిపిస్తుంది.

*ఆదట గాంధర్వ యక్ష విద్యాధ / రాదులై పాడెడు నాడెడువారు...*

*శ్రీనాథుడు తన భీమేశ్వరపురాణం (1430)లో..*

*కీర్తింతురెద్దాని కీర్తి గంధర్వులు / గాంధర్వమున యక్షగాన సరణి..*

సంస్కృత భీమపురాణంలో ఈ 'యక్షగాన' అన్నమాట లేదు.

దీనివల్ల మనకి 1430 నాటికే యక్షగాన శైలి ఒకటి తెలుగునాట ఉండేది అని తెలుస్తోంది. తరువాత అనేక కావ్యాలలో యక్షుల నృత్య ప్రశంస, గాన వైశారద్యం పేర్కొనబడింది. తెలుగులో జక్కులు అనే ఒక తెగవారు, కన్నడంలో ఎక్కలగాణలు తొలుత యక్షగానం పాడే జాతులవారని చారిత్రకులు చెప్తున్నారు. యక్ష, జక్క అనేవి భాషాశాస్త్రం ప్రకారం రూపాంతరమైన పదాలు. అలాగే ఎక్కలగాణలు కూడా. కన్నడ దేశంలో ఇప్పుడు ఎక్కలగాణలు లేరు, కాని ఆంధ్ర దేశంలో పెద్దాపురం, తెనాలి, గుంటూరు ప్రాంతంలో జక్కులు ఉన్నారు. వీరందరూ కళావంతులు! అంతేకాకుండా ఆంధ్రదేశంలో ఈనాటికీ కొన్ని ఊళ్ళ పేర్లు జక్కులని గుర్తు చేస్తున్నాయి. జక్కసానికుంట్ల - కర్నూలు జిల్లా, జక్కల చెరువు - గుత్తి తాలూకా, జక్కసముద్రం - హిందూపురం తాలూకా... మొదలైనవి.

15వ శతాబ్దం మొదటిలో వచ్చిన క్రీడాభిరామంలో 135వ పద్యంలో జక్కుల పురంధ్రి గానకళ, 138లో జక్కుల నృత్యం వర్ణన కనిపిస్తుంది. జక్కులపురంధ్రినే జక్కిణి అని ఇది యక్షిణికి వికృతి శబ్దమని తెలుస్తోంది.

మతంగుని బృహద్దేశిలో జక్కిణి లాస్యం పేర్కొనబడింది. కూచిపూడి భాగవతుల నాట్యంలో జక్కిణిదరువు ఉందని తెలుస్తోంది.

ఇలా ఒకప్పుడు జనసామాన్యంలో జక్కులపాట, నృత్యంగా ఉన్న కళ క్రమేణా పండితుల చేతులో పడి సాహిత్య స్వరూపాన్ని సంతరించుకుని, తిరిగి సంగీతమై, నృత్యమై విలసిల్లింది అనేది ఒక వాదం.

ఇంకొక వాదం తమిళనాట ఉన్న కొరవంజి క్రమంగా యక్షగానం అయిందని. కురవ అనేది ఒక జాతి. వారి అంజె, అంటే అడుగు, అంటే నృత్యం కొరవంజి. ఆంధ్రదేశంలో అనేక కొండ ప్రాంతాలలో శ్రీశైలం, గరుడాద్రి, సింహాద్రి మొదలైనచోట్ల ఈ కొరవంజులు చేసే నృత్యం కాలక్రమంలో యక్షగానం అయిందని వాదన. ఆంగ్లంలో తమిళ నిఘంటువులలో ఇలా ఉంది.

Koravanji is a female of korava community, a fortune-teller., a kind of a dramatic poem ( Madras University, Tamil Lexicon)

ఇదే విషయం కన్నడ నిఘంటువులులోనూ ఉంది.

బ్రౌన్ తెలుగు - ఇంగ్లీష్ నిఘంటువులో - a gypsy, a gypsy dancer అని ఉంది.

16వ శతాబ్దికి చెందిన అయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయంలో

*... జక్కిణి కొరవంజి మేళములు కేళిక సల్పిరి...* (2-131)

అన్నాడు.

కొరవంజి కథలను యక్షగానములనడం ఆంధ్ర, తమిళ మహారాష్ట్రలలో కనిపిస్తుంది.

కాని నాగురువులు ఆచార్య యస్వీ జోగారావుగారు 'ఆంధ్ర యక్షగాన చరిత్ర' అను వారి పరిశోధన గ్రంథంలో కొరవంజి నుంచి యక్షగానం ఆవిర్భవించింది అనే వాదాన్ని నిరాకరించారు. 60 సంవత్సరాల క్రిందట ప్రచురించిన వారి గ్రంథమే ఈనాటికీ ప్రమాణము. వారి వద్దనే నేను నా పరిశోధన చేసియున్నాను. ఎన్నోసార్లు వారితో ఈ విషయాలు కూలంకషంగా చర్చించాము. వారి పాదముల వద్ద అభ్యసించిన విద్య, వారి గ్రంథముల ప్రమాణములతోనే ఈ వ్యాసం వ్రాస్తున్నాను.



ఆచార్య యస్వీ జోగారావు

వీటన్నిటిలో మార్గ-దేశి వాదమొకటి ప్రబలమైనది. సంస్కృత రూపకాల నుంచి యక్షగానాలు పుట్టాయి అనేది మార్గవాదం. ఆయా ప్రాంతీయ పోకడలుగలది దేశి. యక్షగానం అంతా దేశ్యమే. ఇందులో సాహిత్యము, వస్తువు, ఛందస్సు చూస్తే, సాహిత్యం కొంత శిష్ట వ్యావహారికం, వస్తువు 5-6 శతాబ్దాలకి ముందు అంతా పురాణకథలే. ఛందస్సు, యక్షగానంలో విశిష్టమైన విలక్షణమైన ప్రధానమైన విషయం.

1. రేకు- రగడ లేక దరువు, 2. ద్విపద, 3. ఏలలు అర్ధ చంద్రికలు, ధవళములు, శోభనాలు మొదలైనవి, 4. వచనం - గద్యం, 5. చూర్ణిక - దండకం - శ్లోకాలు, 6. అనేక చందోరీతుల్లో పద్యాలు - ఉత్పలమాల మొదలైనవి.

వీటిని గురుంచి తరువాత చర్చిద్దాం, ఇందులో ముప్పాళ్ళు దేశీయం. తమిళ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలలో యక్షగానం దేశిరూపకంగా ఉంది. వీధినాటక లక్షణాలు యక్షగానానికి ఉన్నాయని, కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. కథకళి యక్షగానానికి చాలా దగ్గర అయిన ప్రక్రియ అని కొందరు చెప్పారు. 15-16 శతాబ్దాలలో భారత దేశంలో వివిధ భాషలలో వచ్చిన అనేకమైన ప్రక్రియలు, దేశీయమైన నృత్యాన్ని, సంగీతాన్ని ప్రతిబింబించేవిగా ఉన్నాయి. అన్నీ యక్షగానాలు కావు కదా. కన్నడిగులు యక్షగాన రచనలో కొన్ని ఛందస్సులు 9వ శతాబ్దికి చెందిన నృపతుంగుడు తన కవిరాజమార్గంలో చెప్పినట్టు తెలియజేశారు. అలాగే 10వ శతాబ్దికి చెందిన నాగవర్మ తన ఛందోంబుధిలో రఘుటా అంటే రగడ లక్షణం చెప్పాడు. అయితే M. గోవిందరావనే కన్నడ పరిశోధకుడు 17వ శతాబ్దానికి

పూర్వం కన్నడంలో యక్షగానాలు లేవని తేల్చి చెప్పాడు. ఇప్పటి ఆధునిక విద్వాంసుడు విమర్శకుడు నా మిత్రుడు ప్రభాకర్ జోషి తెలుగులోనే ముందర యక్షగానలున్నవని అంగీకరించారు. ఎందరో విమర్శకులు ఈ మాట అంగీకరించి తొలుత తెలుగుననే యక్షగానాలున్నాయని కన్నడిగులు వీటిని అనుసరించారని ఒప్పుకున్నారు. కాని కారంత్ వంటి పండితులు నరహరితీర్థుల కాలంలో (1250-1335) ఉడిపి నుంచి యక్షగాన ప్రక్రియ తెలుగు దేశానికి చేరిందని అన్నారు. అప్పటికి యక్షగానాలు పుట్టనే లేదు.

మొదట తెలుగుననే యక్షగానము ఉన్నదనడానికి చరిత్రయే ఆధారము. సాహిత్యంగా తెలుగులో యక్షగాన రచనకు పూర్వమే ఎక్కడెక్కడ తెలుగుకు 12-15 శతాబ్దాలలో పలుకుబడి ఉండేదో అక్కడక్కడ తెలుగు జక్కుల గానం, నృత్యం, రాజులకు, సామాన్యులకు వినోదాన్ని కలిగించేవి.

క్రీ. శ. 12 వరకు యక్షగానం అజ్ఞాత యుగం,

12-15 పరిణామ, ఆవిర్భావ యుగం, 15-19 వరకు వికాస యుగం అని వింగడించుకోవచ్చు.

తాళ్ళపాక అన్నమాచార్యులవారు (1408-1503) సంస్కృతంలో సంకీర్తన లక్షణం అని ఒక గ్రంథం వ్రాశారు, అది అలభ్యం. ఆయన మనవడు చిన్న తిరుమలాచార్యుడు 1537 నాటికి దానిని తెలిగించాడు. అందులో 50వ పద్యం నుండి 66 వరకూ అన్నీ యక్షగాన సంబంధమైన ప్రక్రియలే. 50లో దరువులు, రేకులు, జక్కుల రేకు, చందమామ పదములు, 51లో అర్ధ చంద్రికలు, ఏల పాటలు, గొబ్బిళ్ళు, 54లో చూర్ణిక, 63లో దరువు, 65లో ఏల, 66లో యక్షగానంలో రసాలు వివరించడం విశేషం. అంటే ఆనాటికే యక్షగానం దాని ఛందస్సులు ప్రాచుర్యంలో లేకపోతే, వాటిమీద ఒక లక్షణ గ్రంథంలో ప్రసక్తి రాదు.


ఆహార్యం

ఈ కారణాలు ఈ చారిత్రిక ఆధారాలవల్ల తెలుగుననే మొదట యక్షగానం 13-14 శాతాబ్దులనాటికి మౌఖికంగాను, 15-16 శతాబ్దులనాటికి సాహిత్యంలో దృశ్య, శ్రవ్య ప్రక్రియగాను, వచ్చిందనేది నేను కన్నడ దేశంలో ఉడిపిలో యక్షగాన కేంద్రంలో నిర్ద్వంద్వంగా ఋజువు చేసిన విషయం.

ఇప్పుడు తెలుగు సాహిత్యంలో యక్షగానాలను పరిశీలిద్దాం.

తెలుగులో మొదటి యక్షగానం 15వ శతాబ్దికి చెందిన ప్రోలుగంటి చెన్న సౌరి వ్రాసిన సౌభర చరిత్రం. కానీ ఇది అలభ్యం. మనకి లభ్యమవుతున్న మొదటి యక్షగానం కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం. ఇది 16వ శతాబ్దికి చెందిన అద్భుతమైన రచన. ఇదే సమయానికి చెందిన మరొక యక్షగానం విప్రనారాయణ చరిత్రం, రచయిత చక్రపురి రాఘవాచార్యుడు.

సుగ్రీవ విజయం కేవలం సాహిత్య ప్రక్రియ మాత్రమే కాదు, రుద్రకవి దీనిని కందుకూరిలో వెలసిన జనార్దనునికి అంకితం ఇచ్చాడు, ఇది వసంతోత్సవంలో ప్రదర్శింపబడుతూ ఉండేది అని చరిత్ర. ఆ తరువాత కోకొల్లలుగా యక్షగానములు రచన జరిగింది. తంజావూరులో దక్షిణాంధ్ర సాహిత్యంలో ఎన్నో యక్షగానాలు వెలశాయి. ముందు చిత్రకవి పెద్దన యక్షగాన లక్షణం గురుంచి చెప్పాడు. తరువాత అదే ఒరవడిలో కాకునూరి అప్పకవి కూడా వివరించాడు. వీరిద్దరూ 16-17 శతాబ్దులవారు. ఇంకను కొన్ని లక్షణ గ్రంథాలు యక్షగాన లక్షణాలను తెలిపాయి. కన్నడ సాహిత్యంలో మొదటి యక్షగానం 1550 ప్రాంతంలో పురందరదాసు రచించినట్లు చెప్పబడుతున్న అనసూయ చరిత్ర, కాని అలభ్యం. మొదట లభ్యమవుతున్న యక్షగాన రచయిత కుంబళ పార్తిసుబ్బ - ఈయన రచనలలో ఒకటి యక్షగాన ప్రసంగ-అంగద ఈయన

సుమారు 1590 ప్రాంతంవాడు. అంగద సంధాన అంటే అంగద రాయబారం. ఇందులో కందం, ద్విపద, వచనం ఉన్నాయి గాని దరువులు అని చెప్పుకోదగినవేవీ లేవు, రగడలూ లేవు. అంటే ఇది కన్నడిగుల యక్షగాన ప్రాథమిక దశ. ప్రవేశిక దారువులాంటి ఒక పాట ఉదాహరణకి చూద్దాం:

ರಾಗ ಪ್ಂತುವರಾಳಿ ಮ್ಟೆಟತಾಳ

ರಾಮ್ ಬಂದನು | ರಾಕ್ಷಸ ಕುಲ | ಭೇಮ್ ಬಂದನು || ಪಲ್ಲವಿ ||

ಕಾಮ್ರೂಪಿಗಳಾದ ಕಪಿ | ಸೂ◌ಿ◌ೀಮ್ಮನುನ ಕೂಡಿಕೂಂಡು || ಅನುಪಲ್ಲವಿ ||

తెలుగున 16వ శాతాబ్దినాటికే యక్షగానాలు సాహిత్యంలో ప్రబలంగా చోటుచేసుకున్నాయి. అంతకు ముందు రెండు మూడు శతాబ్దనాటికే అంటే 14-15 శతాబ్దులకు రంగస్థలం మీద రాణించాయి. ద్విపదలు, దరువులు, గద్య పద్యాలు కూచిపూడి వారి ప్రదర్శనలలో కనిపిస్తాయి, వీటి లక్షణాలు అన్నమయ్య సంకీర్తనల లక్షణంలో పేర్కొనబడడం గమనింపదగిన విషయం. అయితే యక్షగానం, యక్షగానంగా ఆంధ్రదేశంలో ప్రదర్శించడం చాలా తక్కువ. ఇది మిగిలిన కళలలో చేరి రాణించింది. ఆంధ్రదేశమున ప్రాథమిక దశలో జక్కుల కథగా ఉన్నప్పుడు కళావంతులే వాటిని ప్రదర్శించారు. ఎప్పుడైతే సాహిత్య ప్రక్రియగా ఏర్పడిందో అప్పటి నుంచి యక్షగానం రంగస్థలం మీద స్వయం ప్రతిపత్తిని కోల్పోయి, కూచిపూడి భాగవతుల భరతశాస్త్ర పాండిత్యమునకు దోహదం చేస్తూ వారి కళను సుసంపన్నం చేసింది. దక్షిణమున తంజావూరు చేరి మేలట్టూరు భాగవతమేళాలోను, కన్నడమున యక్షగాన సంప్రదాయంలోనూ రంగస్థలం మీద నేటికీ ప్రదర్శింపబడుతున్నాయి. అసలు యక్షగాన లక్షణాలను పరిశీలిద్దాం. తరువాత యక్షగానం ఏ రకంగా శాఖలై విస్తరిల్లిందో చూద్దాం:

**యక్షగానం:**

| | | |
|---|---|---|
| కూచిపూడి | మేలట్టూరు భాగవత | కన్నడ మేళాయక్షగానం |
| (ఆంధ్ర) | (తమిళనాడు) | (కర్ణాటకము) |

**ముందు యక్షగానం లక్షణాలు :**

యక్షగానాలు శ్రవ్యము, దృశ్యము, ఉభయము అని విభజిస్తే, కొన్ని కేవలం చదువుకోడానికి, కొన్ని ప్రదర్శనకి, కొన్ని రెండిటికి ఉపయోగపడేవి అని తెలుస్తుంది. ఇతివృత్తాన్నిబట్టి వర్గీకరిస్తే, పౌరాణికాలు, క్షేత్రమహాత్మ్యాలు, చారిత్రకాలు, మహాపురుషుల చరిత్రలు, సాంఘికాలు, కళ్యాణ గాథలు, తాత్త్వికాలుగా విభజించవచ్చు. దీనినిబట్టి యక్షగాన లక్షణం చెప్పాలంటే ఇలా చెప్పవచ్చు.

ఇతివృత్తమేదైనా కావచ్చు. రాగాతాళములు ప్రధానము, అటువంటి గీతములే ఉండాలి అంటే రేకు, దరువు, ద్విపద పద్యములు, అర్ధపద్యములు, చూర్ణికలు, సంవాద దరువులు, వచనము, ఏలా ఇటువంటివి కొన్నయినా ఉండాలి. అది యక్షగానం.

ఇప్పుడు యక్షగానంలో ఉపయోగించే ఛందస్సులు ప్రక్రియలు తెలుసుకుందాం.

1. రేకు: రేకులంటే పాట అని అనుకోవచ్చు. ఇవి ఝంపె, త్రిపుట మొదలైన తాళాలలో ఉంటాయని, రగడకు ఇంకో రూపం అని లాక్షణికులు చెప్పేరు. వాళ్ళు ఉద్దేశించినది మొదట జక్కుల రేకులు. జక్కుల రేకులే ప్రాచీన యక్షగానానికి పూర్వ రూపం. ఆ రోజులలో అవి తాళపత్రాల మీద వ్రాసేవారు గనుక ఒక ఆకుని ఒక రేకు అనేవారేమో.

ఇప్పుడు రగడనే రేకు అంటాం అని చెప్పుకున్నాం. ఇంతకు ముందే కన్నడంలో నాగవర్మ (12వ శతాబ్దం) తన చందోబుధిలో రఘటా లక్షణం చెప్పాడని చెప్పుకున్నాం. ఆయన చెప్పిన లక్షణం మన రగడకు సరిపోతోంది.

రగడలు కొన్ని రకాలు, వాటి వాటి నడకనుబట్టి. గుర్రం నడకతో ఉంటే దానిపేరు - హయ ప్రచారం - నాలుగు సూర్యగణాలు - దీనికి రెట్టింపు 8 సూర్య గణాలు ఉంటే అది తురగవల్గనము:

ఉదా: జారుకొప్పు జూచి యొకడు - జంకెనలకు భ్రమసి యొకడు ఓరచూపు జూసి యొకడు - తారతీరు జూచి యొకడు (కంకంటి పాపరాజు - విష్ణుమాయా

విలాసం). దీనికి రెట్టింపు ఉంటే దానిని విజయమంగళం అంటారు. 16 సూర్యగణాలు.

ద్విరదగతి అంటే ఏనుగు నడక. నగ, నలల, భల, తల, సల, ర వీటిలో ఏవైనా నాలుగు గణాలు:

ఉదాహరణ: సురరాజ సన్నుతికి సురుచిరాధర మతికి

కరుణా రసోన్నతికి గరుడాద్రి పతికిన్ - (ఓబయ - గరుడాచలం )

అంటే కిట తకిట - కిట తకిట.... తకిటా నడక

ద్విరదగతికి రెట్టింపు జయభద్రం.

మధురగతి రగడలో గగ, భ, స, నల గణాలు ఎవరుసలోనైనా దీనికి రెట్టింపు హరిగతి.

హరిణగతి అంటే లేడి నడక, గగ, భ, స, నల రెండు సూర్యగణాలు ముందుంటాయి. దీనికి రెట్టింపు వృషభగతి రగడ అంటే ఎద్దు నడక.

ఉదాహరణ: కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయం నుంచి :

7 లఘువులు - 2 పాదాలు : నడక తకిట కిట తక - తకిట కిట తక - తకిట కిట తక - తకిట కిట తక...... తక్కతకిట.

లలిత గాత్రుడు శుభచరిత్రుడు దళితశత్రుడు సుజనమిత్రుడు - నలిన నేత్రుడు కందుకూరి జనార్దనుండు -

ఇవికాక శహాజి తంజావూరు మహారాష్ట్ర పాలకుడు, శివాజీ వంశం వాడు తన విష్ణుపల్లకి సేవాప్రబంధంలో మయూరగతి రగడ అంటే నెమలి నడక రగడ వాడాడు. ద్విరదగతి రగడలోనే ఒక లఘువు తక్కువ.

ఉదాహరణ: మారమణి వల్లవకుమారమణి మోదంబూర కరుణింపను మయూరగతితో నే

తేర....

2. దరువు చూద్దాం -

దరువు అనేది భరతముని నాట్యశాస్త్రంలో చెప్పిన ధృవాశబ్దానికి రూపాంతరం. 32వ అధ్యాయంలో 5 రకాల ధ్రువాగానాలు చెప్పాడు. ఇవి సందర్భాన్నిబట్టి ఉపయోగించే గీతములు. ప్రవేశంలో పాడే దరువు ప్రవేశ దరువు. ఉన్నట్టుండి పాడేది, ఆక్షేపికి, రెండు విషయాల మధ్యలో దరువు అంతర, దైవప్రార్థనకు పాడేది ప్రాసాదికీ ధ్రువం. పాత్ర వెళ్ళిపోతూ పాడేది నైష్క్రామికీ. ఇందులో ఇప్పుడు ఎక్కువగా యక్షగానాలలో కనిపిస్తున్నది ప్రవేశ దరువు ఒక్కటే.

ఉదాహరణకి భామాకలాపంలో సత్యభామ ప్రవేశిక దరువు.

భామనే సత్యభామనే..

ఇలాగే నాయకులకు, ప్రతినాయకులకు కూడా ప్రవేశదరువులు ఉన్నాయి.

అక్కడక్కడ నైష్క్రామిక దరువులు కనబడుతాయి. ఉదాహరణకి కూచిపూడి ఉషాపరిణయంలో బాణాసురుడు దిక్పాలకులపై యుద్ధానికి వెళ్ళినపుడు.. పూర్వీకల్యాణిలో ..

వెడలె నసురజలది సోముడు - వేడ్కతో రథంబునెక్కి ..

భరతముని తరువాతి గ్రంథాలలో, నాట్యదర్పణం, వసంతరాజీయం మొదలైనవాటిలో ప్రవేశదరువు లక్షణాలు కనిపిస్తాయి.

అయితే దరువుకి ఇది లక్షణం, అని చెప్పుకోడానికి ఛందస్సుబట్టి లేదుగాని అవసరాన్నిబట్టి సన్నివేశాన్నిబట్టి ఉన్నాయి. పాత్రవర్ణన, ప్రవేశం, నిష్క్రమణం, సంవాదం, కథానుసంధానం ఇలాంటి వాటికి వాడే పాటలని దరువులనవచ్చు. అందుకే కోకొల్లలుగా యక్షగానాలలో కోరవంజి దరువులు, కోలాట దరువులు, జక్కిణి దరువులు, సంవాద దరువులు ఉన్నాయి.

ఇంకో రెండు రకాల దరువులు యక్షగానాలలో కనిపిస్తాయి. చాలా ఆసక్తికరమైన దరువులు. 1. వృత్త



లీలావతీ నటరాజన్



భాగవత మేళ సంగీతం

దరువు, అంటే పద్యంతో ప్రారంభమై పాటలోకి వచ్చే దరువు. రెండు పాదాలు పద్యం తరువాత పాట. ఉదాహరణకి ఎల్లయ చంద్ర తారావిలాసం నుంచి:

వృత్తం: సుందరమైన రూపమును జూచి మనంబున నాస చేతుగా

నందమునొంది తార హరిణాంకుని ప్రక్కను నిల్చి యేమిరా

దరువు: దంధాన సేయగ నేను మారునిబారి
తొందరకోర్వగాలేను ....

ఇంకో దరువు టప్పా దరువు ! టప్పాలు టుమ్రీలు మరాఠీ హిందుస్తానీ గాన విశేషాలు. ఆబాణీలో దరువులు టప్పా దరువులు.

ఇంకా ద్విపద, పద్యం, అర్థ పద్యాలు, వచనం, పదం అందులో రకరకమైన పదాలు, తుమ్మెద పదం,



యక్షగానం ట్రూప్‌తో నేను

వెన్నెల పదం, చందమామ పదం, నివాళి పదం, గూబి పదం ఇలాంటివి ఇవన్నీ ఆ పదాల పాదాల చివర వాడే మాటలు.

ఉదాహరణకి తుమ్మెద పదంలో తుమ్మెద చివరి మాటగా వస్తుంది:

ఇంటిలోని పోరు తుమ్మెదా - నను ఇల్లు వెళ్ళనీదు తుమ్మెదా !

వీటన్నిటిలోకి ప్రముఖమైనది ఏల పదం. యక్షగానాలలో ఎక్కువుగా ఉపయోగించేది. సంగీత లక్షణ గ్రంథాలలో బృహద్దేశి, సంగీత రత్నాకరం, సంగీత సమయసారం మొదలైన వాటిలో ఏల లక్షణం విస్తారంగా చెప్పారు. అన్నమయ సంకీర్తనల లక్షణంలో 65వ పద్యం ఏల లక్షణం చెప్పింది. నాయకునికి సంబంధించి తాళయుక్తంగా ఉండే పాట. ఇందులో 4 పాదాలుంటాయి, మూడో పాదంలో నాయకుని సంబోధన ఉంటుంది. అంతా కలిపి ఒకటే దళం.

ఉదాహరణకి: కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయంలో :

*భాను వంశామున బుట్టి*
*దానవా కామినీ గొట్టి*
*పూని మఖము నిర్వాహింపావా ఓ రామచంద్ర*
*మౌని వరులూ సన్నుతింపంగా*


*నేను రచించిన ఒక ఏల:*

*కాశిలో కొలువైనా వాడా*
*చూసుకో నీ భక్తూలానూ*
*ఆశలన్నీ దీర్చవేమయ్యా, ఓ విశ్వనాథా*
*వాసిగా నీ వారాణాశీలో*

ఇవికాక ఇంకా అనేకమైన ఛందో రీతులు పాటలు యక్షగానాలలో ఉంటాయి. యక్షగానాలు కూచిపూడిలో, మేలట్టూరు భాగవత మేళాలో కర్ణాటకంలో ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

తరువాయి భాగం వచ్చేనెల...

ఆచార్య పప్పు వేణుగోపాలరావు,
చెన్నై. e-mail: pappuvenu@gmail.com



# కాకతీయులు - 1

## వంశమూలాలు, తొలి పాలకులు

**– ఆర్. వరలక్ష్మి**

*మనకు చరిత్ర పట్ల గౌరవం తక్కువ - అలాగే గత రాజ్యాల చరిత్ర దానశాసనాలలోనే నిక్షిప్తమై ఉన్నది. ఏ రాజూ - ఏ చక్రవర్తి వంశ చరిత్రలు రాయించి పెట్టుకోలేదు - దానికి కారణాలు అప్పుడు రాతలు లేక కాదు. మహాకావ్యాలే రాయించిన మహారాజులు చరిత్ర ఎందుకు రాయించలేదు? ఇప్పుడు మనం స్వార్థపూరితంగా రాయించిన బ్రిటిష్ చరిత్రకారుల రాతలు - ఏకపక్షంగా రికార్డు చేయించుకున్న అక్బర్ నామాలు, అదిల్ షాల అవశేషాలే ఏరుకొని అందులో నిజమేమిటో పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే విజయనగర చరిత్రకు మా శక్తికొలదీ అక్షరరూపం ఇచ్చాం. అలాగే ఇప్పుడు కాకతీయులు అంటే రుద్రమదేవి, ప్రతాపరుద్రుడే కాదు, వందల సంవత్సరాల చరిత్ర ఉన్నది అని చెప్పటమే మా ఉద్దేశ్యం. - సం*

ప్రవేశిక:

"గతం వర్తమానంతో జరిపే నిరంతర సంభాషణే చరిత్ర" అన్న అభిప్రాయం చరిత్రకారులది. "చరిత్ర మనిషికి ఆశ కలిగిస్తుంది. అందుకే మన చరిత్రను మనం అవగాహన చేసుకోవాలి, అభిమానించాలి. భారతదేశ అతిపురాతన వర్గాల (జాతుల)లో ఆంధ్రులొకరు. ఆంధ్ర శబ్దము ఐతరేయ బ్రాహ్మణములో మొట్టమొదటిసారి కానవచ్చుటవలన ఆంధ్రులు ఆ కాలము నుంచి ఉన్నట్లు చరిత్రకారులు విశ్వసిస్తున్నారు. (మల్లంపల్లి సోమశేఖర శర్మ)

తెలుగు దేశపు గత చరిత్రలోని విశేషాలను మనం (ముఖ్యంగా ఈ తరంవారు) తెలుసుకొనడం ఎంతో అవసరం. ఈ రోజులలో ఆంధ్ర, తెలుగు పర్యాయ పదాలుగా పరిగణింపబడుచున్నవి. కాని, యిలాంటి వాడకం ప్రాచీన కాలంలో కనిపించదు. బౌద్ధ, పాళీ వ్మాయాలలో "ఆంధ్ర" అనే పదమే కనిపిస్తున్నది. అంటే, ఆంధ్ర, తెలుగు, తెనుగు, అనే మాటలు పర్యాయ పదాలుగా వాడుకలోనికి వచ్చినవని గుర్తించడం ప్రధానమైన విషయం. (మామిడిపూడి వెంకటరంగయ్య).

అన్ని ప్రాంతాల చరిత్రపై వాటి భౌగోళిక లక్షణాలు గొప్ప ప్రభావం చూపిస్తాయి. ఇవి ఆంధ్రదేశ చరిత్రపై కూడా రెండు, మూడు విధాలుగా ప్రభావం వహించినట్లు పేర్కొనవచ్చు. ఆంధ్రదేశం ఉత్తర, దక్షిణ భూభాగాలు కలిపే మార్గంలో ఉన్నది. అందుచేత, ఆర్యుల సంస్కృతికీ, ద్రావిడుల సంస్కృతికీ అది కూడలి ప్రదేశంగా రూపొందింది. ఆ కారణాన ఆంధ్ర సంస్కృతిలో ఆర్య సంస్కృతి ప్రభావం ఎక్కువ కనిపిస్తుంది. ఆంధ్ర భాషలో సంస్కృత పదజాలమెక్కువగా ఉండడం, ఆంధ్ర వాఙ్మయం, సంస్కృత వాఙ్మయ రీతులను అనుసరించడం ఈ సందర్భంలో గుర్తించ తగినది.

ఆంధ్రదేశంలో కోస్తా ప్రాంతాలు తప్ప మిగతా ప్రాంతాలు కొండలమయంగా ఉన్నవి. అందుచేత దేశమంతా ఒకే ప్రభుత్వ పరిపాలనలోనికి రావడం ఒక శాతవాహనుల కాలంలోనూ, కాకతీయుల కాలంలోను మాత్రమే జరిగింది. తక్కిన కాలాలో అది స్థానిక ప్రభువుల పరిపాలనలో చిన్న చిన్న రాజ్యాలుగా ఏర్పడి ఉండేది. అందువలన కర్ణాటకులు, తమిళులు దానిలో కొంత భాగాన్ని జయించి పరిపాలించారు.

ఈనాడు తెలుగుదేశం రెండు రాష్ట్రాలుగా విభజింపబడింది. కోస్తా ఆంధ్రా, రాయలసీమ కలిసి ఒక రాష్ట్రంగాను, తెలంగాణా భూభాగము ఒక రాష్ట్రంగాను రూపొందాయి. రెండు రాష్ట్రాలలోని ప్రజలు ఒకే భాషను మాట్లాడేవారైనా, వారిలో భావ సమైక్యత కష్టసాధ్యమైంది! దాని మూలంగా ప్రాంతీయాభిమానాలు నశించక, ఏక రాష్ట్రమైన ఆంధ్రప్రదేశం తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయింది! గతకాలపు చరిత్రలో ఎన్నో విశేషాలు నిహితమై ఉన్నవి! అవియన్నియూ తెలుసుకునే ప్రయత్నం చేయుట ఈనాటి తెలుగువారి కర్తవ్యం. ఆ దిశలో ఒక ప్రయత్నమే *కాకతీయులు* అనే ఈ వ్యాస శృంకల ఉద్దేశ్యం. ఈ నా ప్రయత్నాన్ని విజ్ఞులు హర్షిస్తారని ఆశిస్తాను.

**కాకతీయులు:**

ఆంధ్రదేశాన్ని ఎన్నో రాజవంశాలు పరిపాలించాయి. అయితే కాకతీయుల సామ్రాజ్యము వర్ధిల్లిన కాలము చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం. కాకతీయులు పెక్కు విషమ పరిస్థితులను ఎదుర్కొని, తెలుగుదేశపు నలుచరగులను వశపరచుకొని విశాల సామ్రాజ్యాన్ని స్థాపించిన మహనీయులు. తెలుగు ప్రజానీకమునకు ఒక వైశిష్ట్యమును, వ్యక్తిత్వమును సమకూర్చిన మహోదాత్త చరితులు. మధ్య యుగంలో కాకతీయులవలె, రాజకీయంగా ప్రజాసామాన్యంలో మన్ననలకు పాత్రులైన మరొక రాజవంశం తెలుగునాట లేదనటం అతిశయోక్తి కాదు. ఓరుగల్లు రాజధానిగా కాకతీయులు తెలుగుదేశాన్ని షుమారుగా క్రీ.శ. 1150 నుండి 1323 వరకు పరిపాలించారు. కాకతి అనుమకొండ శాసనం జే.ఎస్. ఫ్లీట్ 1882లో వెలికి తీయటంతో కాకతీయులను గురించిన శాస్త్రీయ పరిశోధనలు ప్రారంభ మయ్యాయి (Indian Antiquary, Vol.XI, pp.౯ ff). ఆ తర్వాత ఎంతోమంది చరిత్రకారులు కాకతీయ చరిత్ర పరిశోధనలో ఎంతో కృషి చేశారు. ఆ వరుసలో చివరిది 1960లో జి. యజ్దానీ సంపాదకత్వంలో వెలువడిన "ది యర్లీ హిస్టరీ ఆఫ్ ది డక్కన్"లో ఎన్. వెంకటరమణయ్య, ఎం. సోమశేఖర శర్మగారలు వ్రాసిన అధ్యాయం. అయితే తెలుగుదేశంలో సగభాగమైన తెలంగాణా, కాకతీయుల రాజధాని "వరంగల్లు నిజాం పరిపాలనలో ఉండటంవలన, తెలంగాణా ప్రాంతేతర పరిశోధకులు అడుగు పెట్టడం కష్టమైంది. కాకతీయ రాజ్యంలోని ఈ ముఖ్యప్రాంతపు శాసనాలు వెలుగు చూడలేకపోయాయి. చరిత్ర రచనకు ముఖ్య ఆధారాలు శాసనాలు. అవి లభ్యం కాక, ఈ విషయంలో తొలి చరిత్ర రచయితలు ఎంతో ఇబ్బందికి గురయ్యారు. తర్వాత కాలంలో కరీంనగర్, నల్గొండ జిల్లాలతో పాటు మరి కొన్ని ముఖ్య ప్రాంతాలు సర్వే చేయించడం జరిగింది. ఆ సర్వే ఫలితంగా ఎన్నో కొత్త శాసనాలు వెలుగు చూశాయి, ప్రచురితమయ్యాయి. కొత్త ఆవిష్కరణల ఫలితంగా, కాకతీయుల చరిత్రలో ఇప్పటిదాకా చరిత్రకారుల దృష్టిలోనికి రాని విషయాలు వెలికి రావటంతో ఇంతకు ముందు వెల్లడించిన, అభిప్రాయాలు మార్చి తిరిగి వ్రాయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. (పి.వి. పరబ్రహ్మ శాస్త్రి).

మిగతా వంశ చరిత్రలలాగా, కాకతీయ యుగాన్ని కూడా సౌలభ్యం కోసం మూడు భాగాలుగా విభజించి, పరిశీలిన చేయవచ్చు: 1. ప్రారంభదశ, 2. సార్వభౌమాధికారం, 3. పరిపాలన తదితర విషయాలు.

**ప్రారంభ దశ:**

కాకతీయులు రాష్ట్రకూట రాజుల దగ్గర సైన్యాధికారులుగా తమ జీవితాన్ని ప్రారంభించినట్లు తెలియుచున్నది. (Epigraphica Andhrica ౧, pp.౫౭.) తూర్పు చాళుక్యరాజు దానార్ణవుని క్రీ.శ. 956 (Inscriptions of Andhra Pradesh, Karimnagar Dt., ౨౪) నాటి మాంగల్లు దాన శాసనంవల్ల మనకు తొలి కాకతీయులను గురించి తెలియుచున్నది. అలాగే క్రీ.శ. 1163 నాటి రుద్రదేవుని అనుమకొండ శాసనంవల్ల వాళ్ళు స్వతంత్ర రాజులైనట్లు మనకు తెలియవస్తుంది. అలాగే, సామంతులుగా వారి చివరి శాసనం రెండవ ప్రోలరాజు వేయించిన క్రీ.శ. 1149 నాటి శనిగరం శాసనమని రూఢీ అయింది. దాదాపుగా రెండు శతాబ్దాల

కాకతీయుల తొలి జీవితం రాష్ట్రకూటులు, ఆ తర్వాత పశ్చిమ చాళుక్య ప్రభువుల సామంతులుగా గడచిపోయినట్లు తెలియనగుచున్నది. (పి.వి. పరబ్రహ్మ శాస్త్రి, కాకతీయులు, 2016.). ఈ కాలంలో కాకతీయుల కార్యక్రమాలు ద్విముఖంగా సాగాయి. ఓ ప్రక్కన తమ ప్రభువులకు సంబంధించినవయితే, మరోప్రక్కన పొరుగు సామంతులకు సంబంధించినవి.

ఈ వ్యాసంలో కాకతీయుల మూలాలు, ఆ వంశపు తొలిపాలకులు, స్వతంత్ర రాజ్యాధినేతలుగా కాకతీయుల ప్రాదుర్భావం వగైరా వివరాలు విపులంగా చర్చించడమైనది. కాకతీయుల తొలికాలపు నివాస స్థానం, మూలాల గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రస్తుత ఖమ్మం జిల్లాలోని బయ్యారం చెరువు శాసనాన్ని (Epigraphica Andhrica 1: 71 ff) ఇటీవలే కనుగొనడంతో, ఈ వంశపు తొలికాలపు రాజుల చరిత్ర, మూలాల గురించి క్రొత్త వెలుగు ప్రసరించినట్లయింది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి). నతవాడి నాయకుడు రుద్రుడి రాణి కాకతి మైలాంబ. ఈమె కాకతీయ గణపతి దేవుని సోదరి. ఆమె ఇచ్చిన వంశావళి ప్రకారం, కాకతీయ వంశపు మూలపురుషుడు దుర్జయుడు. ఆ తర్వాత వెన్నుడు, మొదటి గుండయ, రెండవ గుండయ, ఎర్ర, పిండి గుండయ లేక నాల్గవ గుండయ, గరుడ బేతయ, మొదటి ప్రోలయ, త్రిభువన మల్లుడు (అంటే రెండవ బేతయ), రెండవ ప్రోలయ, రుద్రుడు, మహాదేవుడు. మహాదేవుని కొడుకు పేరే గణపతి దేవుడు. మైలాంబ మహాదేవుని కూతురు. మైలాంబ నతవాడి రుద్రుని రాణి. పైన పేర్కొన్న వారిలో మూడవ గుండయ, ఎర్ర, నాల్గవ గుండయ పేర్లు వేంగి చాళుక్య రాజు దానార్ణవుని క్రీ.శ. 956 నాటి మాంగల్లు దాన శాసనంలో కనిపిస్తాయి. అందులో వీరికి అదనంగా మరో పేరు బేతయను, ఎర్ర, నాల్గవ గుండయల మధ్య చేర్చడం జరిగింది. ఆ పేరు బయ్యారం శాసనంలో లేకపోవటానికి కారణం ఆ కాలంలో అతడు మరణించడమనిపిస్తుంది? అయితే, మాంగల్లు శాసనంలో దాత నాల్గవ గుండయ కనుక, అతడు తన పూర్వికుల పేర్లను చెప్పిన తర్వాత తన తండ్రి పేరును పేర్కొన్నాడు. వంశ స్థాపకుడైన వెన్నుడు రాజ్యాన్ని తన రాజధాని కాకతి నుండి పరిపాలించాడు. కాబట్టి, ఈ వంశ పాలకులు కాకతీయులను పేరు గడించారు. అయితే, ఇందుకు భిన్నంగా, గణపతి దేవుని గరవపాడు తామ్ర పత్రాలు (Epigraphica Indica, XVIII, p. 350), విద్యానాథుని ప్రతాపరుద్రీయ యశోభూషణ వాఖ్యాత, సోమపీథి దుర్గారూపమైన దేవత కాకతిని తమ కులదైవంగా పూజించుటవలన ఈ రాజులను కాకతీయులుగా పేర్కొన్నారని చెప్పడం జరిగింది. అంతేకాదు, కొన్ని శాసనాలలో ఓరుగల్లునే కాకతీపురమని ప్రస్తావించడం జరిగింది. అందుకు కారణం బహుశా అది కాకతీయుల రాజధాని కావడమే స్పష్టం. కాకతీయుల మూలాలకు సంబంధించిన విపులమైన చర్చలు పరిశీలించిన తర్వాత, చర్చల సారాంశముగా మనం కొన్ని విషయాలపై స్పష్టమైన అవగాహన రూపొందించుకొనవచ్చు: 1) కాకతీయులు ఒక రాష్ట్రకూట కుటుంబానికి చెందినవారు. 2) వాళ్ళు రాష్ట్రకూట రాజుల సేనానులుగా తెలుగు దేశానికి వచ్చారు. 3) వాళ్ళు తమ ఇంటి పేరును కాకతి అన్న తమ స్వస్థలం పేరున పొందారు. 4) ఇంటి పేరు మీదనే వారి కులదేవతను సహితం కాకతీ అని పిలిచేవారు. 5) ఆ పేరున్న దేవతకు హిందూమత శాఖలైన శైవం లేక శాక్తేయాలలోగాని, జైనంలోగాని అంతగా జనాదరణ, ఆరాధనా ఉన్నట్లు కనిపించదు. 6) ఆధారాలు మనకు కాకతీయుల కులాన్ని గురించి రెండు వివాదస్పద అభిప్రాయాలను అందిస్తున్నాయి. గణపతిదేవుని శాసనాలు, లేక అతని పోషకత్వంలో ఉన్న గురువు విశ్వేశ్వర శివాచార్యుడిలాంటి వాళ్ళు కాకతీయులు సూర్యవంశము వాళ్ళని చెప్తే, విద్యానాథుడు వాళ్ళు సూర్య చంద్ర వంశాలు రెండు అధిగమించిన వాళ్ళని చెప్పాడు. అంటే, కాకతీయులు సూర్య వంశానికీ, లేక చంద్ర వంశానికీ - రెండింటిలో దేనికీ చెందనివారని చెప్పాడు! ఈ వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని మనం గౌణవృత్తిని మాత్రమే క్షత్రియ శబ్దానికీ, నిజదోః ప్రసూతి (బ్రహ్మ భుజాల నుండి పుట్టినటువంటి) అభివ్యక్తికీ వాఖ్య చెప్పుకోవలసి

ఉంటుంది. అలా ఈ అభివ్యక్తులు, వారి శౌర్య ప్రతాపాలనే వ్యక్తపరుస్తాయే కాని వారి కులాన్ని కాదు. అంతేకాదు, మనకు కాకతీయులు క్షత్రియేతరులు అని చెప్పే శాసనాధారం కూడా లభ్యమవుతుంది. గణపతి దేవుని కొలువులో ఉన్న మల్యాల గుండ సేనాని వేయించిన శాసనాలు కాకతీయులు చతుర్థ కులజులని నిర్ద్వందంగా చెప్తాయి. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

**తొలితరం నాయకులు:**

*వెన్నని నుండి రెండవ గుండన వరకు-*

మనము ఇంతకు ముందే ముచ్చటించుకొన్నట్లు కాకతీయ కుటుంబ మొదటి సభ్యుడు వెన్న నృపాలుడు. ఇతడు దుర్జయ వంశజునిగా పేర్కొనబడినది. వెన్నని గురించి చరిత్ర కందిన సమాచారం, అతడు కాకతీయ వంశ స్థాపకుడనీ, కాకతి అనే పట్నం నుండి పరిపాలించాడని మాత్రమే! ఆ కారణాన అతని వంశ సభ్యులను కాకతీయులని పేర్కొనుట జరిగింది. వెన్నని కాలాన్ని క్రీ.శ. 800 నుండి 815 వరకని నిర్ధారింపబడింది. తర్వాత పరిపాలకులైన మొదటి గుండన, రెండవ గుండనలను గురించి చరిత్రకారులకు ఎలాంటి సమాచారం లభ్యము కాలేదు. వారిరువురు పరిపాలనా కాలాన్ని క్రీ.శ. 815- 865గా భావించడమైనది.

**మూడవ గుండన, ఎఱ్ఱియ, బేతియ:**

కాకతీయ గుండ్యన (నాలుగో గుండన) కోరిక ప్రకారం, తూర్పు చాళుక్య రాజు దానార్ణవుడు క్రీ.శ. 956లో జారీ చేసిన మాంగల్లు దానపత్రం సందర్భవశాత్తూ ఆయన ముత్తాత, మూడవ గుండన వీరోచిత మరణాన్ని గురించి ప్రస్తావిస్తుంది. ఆ సంఘటనను వర్ణించే శ్లోకం తప్పులున్నా ఈ విధంగా ఉంటుంది.

***చాళుక్య వంశోదిత భూమిపాల శ్రీద్వారం ఆజ్ఞాను గతమ్ ప్రవాశ్య నూనమ్ విపద్వారం అముమ్ విశామీ త్యక్తంష్ఠ వాటమ్ గత వల్లభేశం***

''యజమాని ఆదేశానుసారం, చాళుక్యరాజు శ్రీద్వారం లేక ముఖ్యద్వారం ప్రవేశించి నేను (గుండన) విపద్వారాన్నే లేక మృత్యుద్వారాన్నే ప్రవేశించాను - అంటూ (గుండన) వాటలోనికి వల్లభుడికి ప్రవేశం కల్పించాడు''. చాళుక్య పట్నం వాటిపై వల్లభేశుడు దాడి చేసే క్రమంలో, ముఖ్యద్వారం చీల్చుకునే ప్రయత్నంలో గుండన శత్రువుల చేతిలో మరణించాడు - అని దానపత్రం తారీకు క్రీ.శ. 956కు షుమారు మూడు తరాల ముందు జరిగిన సంఘటనను ఇది చెప్తుంది కనుక, ఈ సంఘటనను మనం తొమ్మిదవ శతాబ్దపు తుది దశాబ్దిలో జరిగిందనుకోవచ్చు. "తూర్పు చాళుక్యుల రాజధానియైన విజయవాడపై రాష్ట్ర కూట రాజు రెండవ కృష్ణుడు తన సైన్యంలోని కొంత బలగాన్ని నడిపినప్పుడు, చాళుక్య బలగాలను మరల్చేందుకు దండెన గుండన పెదవంగూరు దగ్గరకు మరో వాహిని నడిపి, తన ప్రాణాలు పణంగా పెట్టి, తన యజమాని పనిని సులభం చేశాడు. ఈ సంఘటనను మాంగల్లు దానపత్రం గొప్పగా పేర్కొంది. ఈ గుర్తింపే అంగీకరించినట్లైతే, తెలుగు దేశానికి వచ్చిన కాకతీయుల్లో, మూడవ గుండన మనకు తెలిసిన తొలివాడవుతాడు. కాకతీయ చరిత్ర ఈ సంఘటనతో అంటే షుమారు క్రీ.శ. 895తో ప్రారంభమవుతుంది''. పి.వి. పరబ్రహ్మశాస్త్రి, pp.44.)

మూడవ గుండన తర్వాత వచ్చినవాడు యెఱ్ఱియ. బయ్యారం శాసనం ప్రకారం అతడు కుఱ్ఱవాడి, ఆ పరిసర ప్రాంతాల పాలకుడు. యుద్ధంలో రెండవ కృష్ణుడు కొరవి ప్రాంతంలో కొంత భాగాన్ని జయించి, దానికి పాలకునిగా ఎఱ్ఱియని నియమించినట్లు తెలియుచున్నది. మాంగల్లు దానపత్రం ప్రకారం ఎఱ్ఱియ కొడుకు బేతియ. అతనికి కుటుంబ చరిత్రలో హెచ్చు ప్రాముఖ్యత లేదు. అందుచేతనేమో బయ్యారం శాసనంలో అతని పేరు పేర్కొనబడలేదు?

**నాలుగవ గుండన:**

బేతియ కుమారుడు నాలుగవ గుండన. ఇతడు క్రీ.శ. 956 ప్రాంతమున చాళుక్యరాజు దానార్ణవునిచేత మాంగల్లు దానపత్రాన్ని జారీ చేయించినట్లు తెలియుచున్నది. మాంగల్లు శాసనం ప్రకారం ఇతడినే అతని పాలన తొలి కాలంలోనే, రాష్ట్రకూట రాజు మూడవ కృష్ణుడు క్రీ.శ. 956లో తన సవతి సోదరుడి (క్రీ.శ. 945-970)ని తొలిగించే ప్రయత్నంలో ఉన్న

దానార్ణవునికి సాయం చేయుమని పంపాడు. అమ్మరాజును కళింగకు పారద్రోలి దానార్ణవునికి పట్టం కట్టడంలో విజయుడయ్యాడు నాల్గవ గుండయ. గుండయ అభ్యర్ధనమేరకు దానార్ణవుడు, చాళుక్య రాజ్యంలోని నతవాడి విషయంలో (మండలంలో) ఉన్న మాంగల్లు గ్రామాన్ని గుండన పుణ్యం కోసం కర్పటీ వ్రతం చేసిన దొమ్మనకు అగ్రహారంగా ఇచ్చాడు. ఆ విధంగా క్రీ.శ. 956 నాటి మాంగల్లు దానపత్రం కాకతీయు నాయుకుల తొలికాలపు శాసనంగా రూపొందింది. క్రీ.శ. 973లో రాష్ట్ర కూటుల పతనం వరకు గుండన వారి విశ్వాసపాత్రుడైన సామంతునిగానే పనిచేశాడు. ఆ సంవత్సరములోనే వేంగి పాలకుడైన దానార్ణవుడు వధింపబడ్డాడు. రాష్ట్రకూటులతో సాన్నిహిత్యమున్న గుండన ఇప్పుడు తను చాళుక్య రాజు రెండవ తైలపునకు లొంగిపోవాలో లేదా దానార్ణవుని చంపి వేంగి రాజ్యాన్ని ఆక్రమించిన జటాచోడ భీమునికి విశ్వాసపాత్రుడిగా ఉండాలో తెలియని సందిగ్ధములో పడిపోయాడు. అందుకే ఇద్దరిలో ఎవరి దరికి చేరక, కొరవి ప్రాంతములోని తన చిన్న రాజ్యానికి స్వతంత్ర పాలకుడిగా ఉండాలని నిర్ణయించుకొన్నాడు. అయితే, నాలుగవ గుండయను కొత్త రాజు సహాయంతో పారద్రోలి, కొరవిని తిరిగి పొందాలనే ఆశతో రెండవ తైలపుని మద్దతుతో విరియాల యెర్రయ యుద్ధంలో గుండనను చంపి, కొరవిలో బొట్టు బేతయను పునఃప్రతిష్టించాడు. విరియాల మల్లుని గూడూరు శాసనం (Inscriptions of Andhra Pradesh Warangal:81)లోని తెలుగు విభాగం ఈ కాలపు సంఘటనలపై ముఖ్యంగా కాకతీయ మొదటి బేతరాజు లేక గరుడ బేతయ తొలి కాలపు జీవిత విశేషాలపై వెలుగును ప్రసరిస్తుంది. ఈ శాసనం క్రీ.శ. 1124లో ప్రకటితమైనది.

**మొదటి బేతయ:**

బయ్యారం శాసనంలో ఈ నాయకుడిని గరుడాంక బేతయగా అభివర్ణించడం జరిగింది. అందుకు కారణం ఆయనను ముదుగొండ చాళుక్య నాయకుడు బొట్టు బేతయ నుండి వేరుగా చూపడానికి, గూడూరు శాసనం కూడా అతన్ని ఆ విధంగానే అభివర్ణిస్తుంది. అదే శాసనం ప్రకారం, నాల్గవ గుండనను ముదుగొండ చాళుక్య నాయకుడు వధించినప్పుడు, గరుడ బేతయ శత్రువులతో పోరాడగలిగే అంత వయసున్నవాడు కాదు. ఫలితంగా కొరవిలో బొట్టుబేతయ పునఃప్రతిష్టాపనతో, తన తండ్రి సంపాదించిన ప్రాంతాలన్నీ వదులుకునే స్థితిలో ఉన్నాడు బేతయ. రాజకీయ గుర్తింపు లేకుండా కాకతీయ వంశం నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గూడూరు శాసనంలో 'పేర్కొన్న ప్రకారం, చిన్నవాడైన గరుడబేతయ పక్షాన కామవసాని" సార్వభౌముని దర్శించి కాకతి వంశాన్ని నిలబెట్టింది. (Inscriptions of Andhra Pradesh, Warangal District p.81, 11. 20-26). విరియాల యెఱ్ఱయ భార్య కామవసాని బంధుత్వం ఉన్న కారణంగా గరుడ బేతయకు ఈ సహాయం చేసిందని తెలియుచున్నది.

బేతయ మొదటగా అనుమకొండకు వచ్చి, పశ్చిమ చాళుక్యరాజు సామంతునిగా స్థిరపడ్డాడు. (బయ్యారం శాసనం ప్రకారం). అతనికి సంబంధించిన యితర రాజకీయ కార్యకలాపాలను గురించి మనకంతగా తెలియదు. దుర్గరాజు కాజీపేట దర్గాలో వేయించిన శాసనంలోని వక్తవ్యం ప్రకారం (Inscriptions of Andhra Pradesh. Warangal, No.15) అతనికి చోళచమూవార్ధి ప్రమథన, అనే బిరుదం ఉంది. ఆ బిరుదానికర్థం చోళ సైన్యాలని చిలికినవాడని! ఒక చిన్న నాయకుడైనతను తనంతట తాను చోళులపై దండయాత్ర చేశాడని, అనుకోలేం! అయితే, అతను చాళుక్య దండయాత్రలలో పాల్గొన్నాడనీ, చోళసైన్యాలపై దాడిచేసే అవకాశం పొందినవాడని భావించవచ్చు. ఈ నాయకుని గురించి ఇప్పటి వరకూ వెలుగులోనికి వచ్చిన శాసనం, శనిగర శాసనం, క్రీ.శ. 1051 నాటికి చెందినది. బాల్యంలోనే క్రీ.శ. 1000 ప్రాంతంలో రాజకీయ జీవితం ప్రారంభించిన గరుడ బేతయ క్రీ.శ. 1052 దాకా క్రియాత్మక జీవితం గడిపాడని భావించవచ్చు. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

**మొదటి ప్రోలుడు:** *క్రీ.శ.1052-1076.*

కరీంనగరుకు సమీపాన ఉన్న శనిగరంలో ఇటీవలి

కాలంలో ఐదు శాసనాలు కనుగొనడం జరిగింది. ఆ శాసనాలు కాకతీయ వంశములోని నలుగురు తొలి సభ్యులకు సబంధించినవి. ఆ సభ్యులు: మొదటి బేతియ, మొదటి ప్రోలుడు, రేండవ బేతయ, రెండవ ప్రోలుడు. అందువలన పూర్వంకంటే ఈ నాయకుల పాలనాకాలాన్ని ఖచ్చితంగా నిర్ణయించే అవకాశం లభించింది. కాకతీయ మొదటి బేతరాజుకు వారసుడిగా అతని కుమారుడు మొదటి ప్రోలుడు రాజ్యానికి వచ్చాడు. అది షుమారు క్రీ.శ. 1055 ప్రాంతంలో జరిగినట్లు తెలియుచున్నది. బయ్యారం శాసనం అతన్ని ''అరిగజకేసరి (శత్రువులనబడే యేనుగులకు సింహంలాంటివాడు) అని అభివర్ణించింది. అయితే, అది మొదటి ప్రోలుని విషయంలో ఒక విశిష్ట ప్రాముఖ్యాన్ని కలిగి ఉంది. మొదటి ప్రోలుడు ఒక చెరువును త్రవ్వించి, తన బిరుదం, అరిగజకేసరి మీదుగా దానిని కేసరీ తటాకమని పేరు పెట్టాడు. వరంగల్లు జిల్లాలోని కేసముద్రమనే గ్రామంలో ఈ కేసరీ సముద్రం లేక కేసముద్రం ఉన్నది. అతనిపట్ల కృతజ్ఞతగా అతని వారసులు తమ నాణాల పైన వరాహ చిహ్నాన్ని, తమ పశువుల మందను - చెరువుని త్రవ్వి ఉద్ధరించినందుకు గుర్తుగా - వేయించారని ఈ శాసనం చెప్తుంది. వరాహ చిహ్నాం కాకతీయులకు చెందినది కాదు. అది వారి ప్రభువులైన కళ్యాణ చాళుక్యుల నుండి, అనువర్తించుచున్నది. కాకతీయుల మౌలిక చిహ్నాం గరుడుడు. గరుడ చిహ్నాం కాకతీయుల జెండాలను చివరిరాజు ప్రతాపరుద్రుని వరకు, అలంకరించింది.

మొదటి ప్రోలుని రాజకీయ జీవితమతని తండ్రి కాలంకంటే, సంఘటనాత్మక భరితంగా సాగినట్లు కాజీపేట దర్గాశాసనం (Inscriptions of Andhra Pradesh, Warangal District, No.15) మూలంగా తెలియుచున్నది. ఆ శాసనానుసారం చిత్రకూట విషయంలో వ్యవహారాలనతడు సరిదిద్దాడనీ, భద్రంగుని చేత కాలికి బుద్ధి చెప్పించాడనీ, కొంకణుని ఓడించాడనీ, పృధివీతలమంతా తన కీర్తిని వ్యాపింపజేశాడనీ, ఆ శాసనం ఉల్లేఖిస్తుంది. అంతేకాదు, పొరుగువాడూ, కాడ్పర్తిదుర్గుని పుత్రుడూ, గొప్ప వన్య నాయకుడూ అయిన అన్నయను ఓడించి, గుణసాగరకు చెందిన పురుకూట నాయకుడు గొన్నను యుద్ధంలో వధించి, అతడి రాజు త్రైలోక్య మల్లుని నుండి అనుమకొండ విషయాన్ని పరిసర ప్రాంతాలతోసహా, శాశ్వత మాన్యంగా పొందాడు! ఈ విజయాలు అతని కీర్తిని వ్యాపింపజేశాయిగాని, భౌతిక సంపదను పెంచలేదన్న విషయాన్ని శాసనంలోని కథనం స్పష్టం చేసింది. అయితే, పైన పేర్కొన్న దండయాత్రలు బహుశా ఆయా దేశాలపై చాళుక్యులు చేసినవై ఉండవచ్చు. వాటిలో మొదటి ప్రోలుడు ప్రముఖపాత్ర వహించి ఉంటాడు. విక్రమాంక చరిత్రను రచించిన బిల్హణుడు ఆరవ విక్రమాదిత్యుడు యువరాజుగా ఉండగానే, చోళ, కొంకణ, చిత్రకూట రాజ్యాలపై క్రీ.శ. 1066లో దాడి చేసినట్లు చెప్పాడు. ఆ సందర్భంలోనే మొదటి ప్రోలుడు, క్రియాశీలక పాత్ర పోషించి, తన ప్రభువయిన అహవమల్ల సోమేశ్వరుని సంతోష పెట్టి ఉంటాడు. అతని సాహస యాత్రల్లో రెండో భాగం, కాజీపేట శాసనం ప్రకారం, ఇరుగు - పొరుగు నాయకులతో సంబంధం కలిగి ఉన్నది. మొదటి ప్రోలుడు కాడపర్తి, పురుకూత ప్రాంతాలను రెండింటినీ జయించాడు. వాటిని తన హనుమకొండ విషయంలో కలుపుకున్నాడు. మొదటి ప్రోలుని శక్తి సామర్థ్యంపట్ల, అచంచల విధేయత పట్ల ప్రసన్నుడైన మొదటి సోమేశ్వర చక్రవర్తి అతడి హనుంకొండ విషయాన్ని, దాని కొత్త విస్తరణలతో పాటు, శాశ్వత సామంత రాజ్యంగా, వరాహ చిహ్నాంతో నాణాలు ముద్రించుకొనే హక్కుతోపాటు ఇచ్చాడు. ప్రోలుడు గొప్ప వీరుడే కాదు, మంచి పరిపాలకుడు. సాగుకు చెరువులు త్రవ్వించీ, రైతులకు వ్యవసాయ సౌకర్యాలు ఏర్పాటుజేసి, వ్యవసాయం మెరుగుపరచడానికి, అతడు ఎంతో కృషి చేశాడు. ఇతరులు వేయించిన శాసనాలు ఈ విషయాలు పేర్కొంటాయి.

**రెండవ బేతయ:** *(షుమారు క్రీ.శ.1076 - 1108)*

మొదటి ప్రోలుని తర్వాత, అతని కొడుకు రెండవ బేతయ పరిపాలన చేపట్టాడు. ఈయనను శాసనాలు

త్రిభువన మల్లుడని అభివర్ణించాయి. దానికి కారణ మతని ప్రభువు త్రిభువనమల్ల (ఆరవ) విక్రమాదిత్యుని పేరతను పెట్టుకొనడమేనని శాసనాలు తెలియజేస్తాయి. రెండవ బేతరాజు రెండు శాసనాలు - ఒకటి హనుమకొండలోనూ, రెండవది బానాజీపేటలోనూ, ఇప్పటివరకు వెలుగులోనికి వచ్చాయి. మాంగల్లు శాసనాన్ని వదలివేస్తే, ఇవి కాకతీయుల తొలి శాసనాలు. బేతయ హనుమకొండ శాసనం క్రీ.శ. 1079 నాటిదని తెలియుచున్నది. బానాజీపేట శాశనం క్రీ.శ. 1082 నాటిది. రెండవ ప్రోలుని హనుమకొండ శాసనం ప్రకారం (Epigraphica Indica, IX: 256 ff) రెండవ బేతయ, తన సమర్ధ మంత్రి వైజదండాధిపుని సాయంతో సబ్బినాడు 1000ని పొందాడని తెలియుచున్నది. మంత్రి వైజదండాధిపుడు రెండవ బేతయను చాళుక్య చక్రవర్తి దగ్గరకు తీసుకువెళ్ళి, అందుకు ఆమోదం ప్రసాదింపజేసినట్లు తెలియుచున్నది. మొత్తం సబ్బినాడు 1000పై కాకతీయులు భూభాగం విస్తరించడానికి ఇది మొదలు. ఏ పరిస్థితులలో రాజు ఈ క్రొత్త భూభాగ విస్తరణ కనుమతి జారీ చేశాడో వివరాలు మనకు తెలియుటలేదు. అయితే, కాజీపేట దర్గాశాసనం ప్రకారం, తన తండ్రిలాగానే బేతరాజు కూడా, చోళ, మాళవ దేశాలపై జరిగిన చాళుక్య దండయాత్రలలో పాల్గొన్నాడు. అందుకు బహుమతిగా అతడు రాజు నుండి సబ్బినాడు 1000ని పొంది ఉండవచ్చునని తెలియుచున్నది. రెండవ బేతరాజంతకు ముందు మహామండలేశ్వరుడు మేడరాజు సామంతుడుగా ఉండేవాడని బానాజీపేట శాసనం తెలియపరుస్తుంది. ఇప్పుడు సబ్బినాడు హనుమకొండ విషయంలో చేరంటం మూలాన రెండవ బేతరాజు స్థాయి (హోదా) పెరిగింది. ఇప్పుడు రెండవ బేతరాజు మేడరాజుకంటే ఎక్కువ ఆధిక్యం కలిగిన స్థాయిని సంపాదించుకున్నాడు.

**దుర్గరాజు:** *(షుమారు క్రీ.శ.1098 - 1116)*

కాకతీయ నాయకుడు రెండవ బేతరాజు తర్వాత, అతని పెద్ద కొడుకు దుర్గరాజు క్రీ.శ. 1098 సింహాసనానికి వచ్చాడు. ఈయనకు కూడా త్రిభువన మల్లుడన్న బిరుదమున్నట్లు తెలియుచున్నది. ఇప్పటి వరకూ వెలుగు జూచిన శాసనాల్లో ఈ నాయకుడుకి చెందిన ఒకే శాసనం, అంటే కాజీపేట దర్గా శాసనం (Inscriptions of Andhra Pradesh, Warangal District, No.15) ప్రోలయ కొడుకైన బేతరాజు హనుమకొండలో శివపురమనే బస్తీని ఏర్పాటు చేసి, అందులో ఒక శివాలయాన్ని నిర్మించి, ఆ రెండింటినీ శ్రీశైలంలోని మల్లికార్జున శిలామఠాధిపతి, కాలముఖ శాఖకు చెందిన శైవాచార్యుడు రామేశ్వర పండితునికి, అర్పించాడని ఆశాసనం చెబుతుంది. ఆ శాసనంలో రెండు తేదీలున్నవి. మొదటిదాని తర్వాత, ఎనిమిదేండ్లకు రెండవది వస్తుంది. ఆరెండు సంవత్సరాలు వరుసగా క్రీ.శ. 1090, 1098లకు సరిపోలుతాయి. మొదటి శాసనపు సమీకరణే రెండవదన్న సందేహం మనకు కలుగుతుంది. దీనినిబట్టీ రెండవ బేతరాజు కనీసం క్రీ.శ. 1098 వరకు జీవించి ఉన్నట్లు తెలియుచున్నది. అయితే, ఈ శాసనం నుండి దుర్గరాజు రాజకీయ జీవితం గురించి మనకు ఏ విధమైన సమాచారం లభించదు. అతడు క్రీ.శ. 1116 వరకు పాలించి ఉండవచ్చు?!

"ఒకవేళ దుర్గరాజే కనుక పాలించి ఉన్నట్లయితే, అది క్రీ.శ. 1108-1117ల మధ్యే జరిగి ఉండాలి" అని పి.వి. పరబ్రహ్మశాస్త్రి గారు తమ అభిప్రాయం వెల్లడించారు. బేతయ తర్వాత పది సంవత్సరాలలో అతని రెండవ కొడుకు ప్రోలుడు రాజ్యానికి వచ్చాడు. దుర్గరాజు చాలా కొద్ది కాలమే పరిపాలించాడు." అతని కొడుకు రెండవ ప్రోలుని శరణుజొచ్చాడు అన్న మాటలే పరిగణిస్తే, దుర్గరాజు పాలన, అకస్మాత్తుగా అంతమయింది. ఫలితంగా అతని కొడుకు ప్రోలుని శరణుజొచ్చాల్సి వచ్చిందని భావించవచ్చు, దుర్గరాజును పరిమార్చి ప్రోలుడే రాజ్యాన్ని హస్తగతం చేసుకుని ఉండవచ్చు"?నన్న భావన కలుగవచ్చు? క్రీ.శ. 1107-1117 మధ్య కాలంలో అనుమకొండ, సబ్బినాడు ప్రాంత నాయకుల మధ్య పెద్ద రాజకీయ ఉపప్లవం, అలజడిలాంటిదేదో సంభవించి ఉండాలన్న పెద్దనుమానం కలుగుతుంది. (పి.వి. పరబ్రహ్మశాస్త్రి).

**రెండవ ప్రోలుడు:** *(షుమారు క్రీ.శ.1117-1156)*

దుర్గరాజు తర్వాత, కాకతీయ రాకుమారుడు రెండవ ప్రోలుడు షుమారు క్రీ.శ. 1117లో రాజ్యాధికారము చేపట్టాడు. అతడు రాజ్యానికి వచ్చేటప్పటికి కాకతీయులు కళ్యాణ చాళుక్య ప్రభువుల సామంతులుగానే ఉన్నారు. కనుక రెండవ ప్రోలుడు ఓ చిన్న ప్రాంతాన్ని అంటే వరంగల్లు జిల్లా ఉత్తర ప్రాంతం, కరీంనగరు జిల్లా వాయువ్య ప్రాంతాన్ని పరిపాలించే మాండలిక సామంతుడు. ఆ జిల్లాలోని మిగతా భాగాలు రెండవ మేడరాజు పాలనలో ఉన్నాయి. ఈ మేడరాజు కళ్యాణ చాళుక్యరాజుకి విధేయుడేకాక, రెండవ ప్రోలునికి సామంతుడు కూడా. క్రీ.శ. 1117 నాటి హనుమకొండ పద్మాక్షీ ఆలయంలోని రెండవ ప్రోలుని శాసనం (Epigraphica Indica, IX; 256 ff) రెండవ మేడరాజు (పొలవాస) అతని సామంతుడని తెలియజేస్తుంది.

రెండవ ప్రోలుడు తన తండ్రి త్రిభువనమల్ల రెండవ బేతరాజుకు రాజ్య వ్యవహారాల్లో సాయం చేసేవాడని క్రీ.శ. 1120నాటి మాటేడు శాసనం (Inscriptions of Andhra Pradesh, Warangal: No.24) తెలియజేస్తుంది. వేమచోళ కుటుంబ నాయకుడైన రేవుని సాయంతో బేతయ" పరస్పర వినాశకారి, అయిన తిరుగుబాటును అణచివేశాడనీ, రేవయ యతనికి పాలనాంగ వ్యవహారాల్లో సాయం చేశాడనీ చెప్తుంది. శాసనంలో బేతయను, ప్రోలుని ప్రస్తావించడం, త్రిభువనమల్ల (రెండవ) బేతయ, రెండవ ప్రోలునితోనూ సరిపోతుందని, వారి సమకాలికుల తేదీలతో శాసనపు తేదీ సరిపోతుంది కనుక, ఆ విధంగా భావించడం జరిగింది. అయితే ఆ తిరుగుబాటును గూర్చి ఎక్కువ వివరాలు లభించలేదు.

రెండవ ప్రోలుడునటవాడి దుర్గరాజు సోదరి ముప్పాంబను వివాహం చేసుకన్నాడు. దుర్గరాజు కూడా కళ్యాణ చాళుక్యుల సామంతుడే. తన చిన్న రాజ్యం, నేటి కేసముద్రం మండలం (వరంగల్లు జిల్లా) ఇంగుర్తిని పాలించేవాడు. రెండవ ప్రోలుడు, ముప్పాంబలకు కలిగిన అయిదుగురు కొడుకులలో ఇద్దరు మాత్రమే - రుద్రదేవుడు, మహాదేవుడు ప్రాముఖ్యత గడించారు. మిగతా చిన్న శాసనాలు (South Indian Inscriptions, X:254; IV:270) ప్రస్తావన ద్వారా మిగిలిన ముగ్గురు - హరిహరుడు, గణపతి, రేపొల్ల దుర్గరాజులను గురించి తెలుసుకుంటాం. రెండవ ప్రోలుని పూర్వికుడు దుర్గరాజు పాలన సంఘటనారహితంగా గడిచినట్లు కనిపించినా, రెండవ ప్రోలుని వీరకృత్యాలు, అతని కొడుకూ, వారసుడూ అయిన రుద్రదేవుడు వేయించిన వేయిస్తంబాల గుడి శాసనంలో ప్రస్తావించబడ్డాయి (Indian Antiquary, XI: 12ff).

రెండవ ప్రోలుడు బహిరంగంగా మంత్రకూట ప్రభువు మంతెన గుండనను, అవమానపరచి, అతని వక్షంపై వరాహ ముద్రవేయించి, చంపాడని శాసనం చెబుతుంది. మరో పాలకుడు, ఎడయ రెండవ ప్రోలుని ఎదుర్కొనే ధైర్యం లేక పారిపోయాడని చెప్తుంది. కళ్యాణ చాళుక్య వంశమున్రైన తైలపుడు ఏనుగుపై ఎక్కి ఉండగా రెండవ ప్రోలుడు పట్టుకున్నాడనీ, అతని భక్తిశ్రద్ధలు, స్నేహపూర్వక ప్రవర్తనా గమనించి విడుదల చేశాడని చెప్పడం జరిగింది. రెండవ ప్రోలుడు గోవింద రాజును కూడా బంధించి, విడుదల చేశాడు - కానీ అతని రాజ్యాన్ని ఉదయచోడుడనే మరొకతనకి ఇచ్చాడు. చివరగా, చాలామంది నాయకులను కూడగట్టుకొని హనుమకొండను ముట్టడించిన జగ్గదేవుని రెండవ ప్రోలుడు తరిమికొట్టాడు! ఈ సంఘటలన్నీ ఆ కాలపు రాజకీయాలను ఎంతో ప్రభావితం చేసినట్లు తెలియుచున్నది. అప్పటి పరిస్థితులను పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే, విశేష పరిశీలన అవసరమనిపిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే రెండవ ప్రోలరాజు పశ్చిమ చాళుక్యుల సామంతులైన తైలపదేవుడు, గోవిందరాజు, గుండరాజు (మంథెన ప్రాంతం), జగ్గదేవుడు అనే నలుగురు రాజులను జయించి తెలంగాణములో చాళుక్యుల పాలనను అంతమొందించాడు. అంతేకాదు, ఇతడు కళ్యాణిని పాలిస్తున్న బిజ్జలునికి సహకారంగా తన సేనను పంపి, అతడు కళ్యాణి నగరాన్ని పశ్చిమ చాళుక్యుల నుండి

వశం చేసుకోవడానికి సహాయం చేశాడు. ఇంతకు ముందే చెప్పినట్లు క్రీ.శ. 1050-1162 మధ్య కాలంలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి నెలకొనింది. రుద్రదేవునికి పూర్తి స్వాతంత్ర్యం ప్రకటించడానికి, అవకాశం లభించింది. తీరాంధ్రాలో చాళుక్య-చోళరాజు రెండవ రాజరాజు కోట కుటుంబానికి చెందిన చోడరాజుపై కోన హైహయ వంశానికి చెందిన మన్మసత్య, మల్లిదేవులు తిరుగుబాటు చేసినప్పుడు, రెండవ రాజరాజుకు సాయం చేయడానికతడు క్రీ.శ. 1158కి ముందు ఎప్పుడో వెళ్ళినప్పుడు రెండవ ప్రోలుని సంఘటనా భరిత పాలన, అంతమయింది. ఆ సమయంలో రెండవ ప్రోలుని వెంట వెళ్ళిన, అతని సేనానుల్లో ఒకరు ఇనంగాల బ్రహ్మిరెడ్డి. చాళుక్య-చోళ రాజుల బలగాలతో చేయి కలుపుటవల్ల తన ప్రభావ రంగాన్ని విస్తరించుకోవాలని ప్రోలుడు భావించి ఉంటాడు. అయితే, దురదృష్టవశాత్తు, అది, అతని ఆఖరి యుద్ధమైంది. ప్రోలుని చంపిన ఘనతను అయిదుగురు పాలకులు వహించారు. కోట వంశస్థుడైన చోడరాజు, కోన హైహయ వంశస్థులు మన్మసత్య, మల్లిదేవులు, సూర్యవంశ నాయకుడైన మహదేవరాజు, వేంగి చాళుక్య రాజు సామంతుడు మల్ల విష్ణువర్ధనుడు. ఈ విషయం దాక్షారామంలోని ఒక శాసనం (South Indian Inscriptions, IV: 1242) చెప్తుంది. రెండవ ప్రోలరాజు, ఓరుగల్లు కోటనిర్మాణాన్ని ప్రారంభించినట్లు ఇటీవల వెలుగు చూచిన క్రీ.శ. 1264 నాటి చింతలూరి తామ్రశాసనంవల్ల తెలియుచున్నది. యుద్ధము నుండి తిరిగి వచ్చిన తర్వాత ఇనంగాల బ్రహ్మిరెడ్డి రెండవ ప్రోలుని కొడుకు హనుమకొండ రుద్రదేవుని తమ ప్రభువుగా ప్రకటించాడు.

రెండవ ప్రోలుని మరణంతో క్రీ.శ. 800లలో వెన్నని నుండి మొదలైన తొలి తరం కాకతీయ నాయకుల జీవిత, పరిపాలనా విశేషాలు పూర్తయినట్లు పరిగణించవచ్చు.

**ముగింపు:**

తెలుగుదేశం చరిత్రలో కాకతీయ యుగమత్యంత చారిత్రక ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. దాదాపు 300 సంవత్సరాలకు పైగా కాకతీయుల పరిపాలన కొనసాగడమే దీనికి కారణం కాదు. శాతవాహనుల తర్వాత, తెలుగుదేశం మొత్తాన్ని రాజకీయంగా, సాంస్కృతికంగా, ఐక్యం చేసిన ఘనత కాకతీయులది. కాకతీయులకు పూర్వం ఆంధ్రదేశ చరిత్రలో రాజ్యపీఠాలు, రాజ్య వంశాలు, ప్రధానంగా కోస్తా ఆంధ్రప్రాంతానికే పరిమితమయ్యాయి. కాకతీయ రాజ్యమందుకు భిన్నం! అది ఓరుగల్లు కేంద్రంగా స్థాపించబడిన ప్రముఖ రాజ్యం.

సాంస్కృతికంగా కాకతీయులు తెలుగు భాష మాట్లాడేవారినందరినీ ఒక త్రాటి క్రిందికి తెచ్చారు. వారి పాలనాకాలంలో తెలుగు సాహిత్య, లలితకళలు విస్తృతంగా పరిపుష్టి పొందాయి. కుల సామరస్యంతో పాటు, మతాన్ని వారు తమ రాజ్య సుస్థిరతకు దోహదం చేసుకున్నారు.

పైన పేర్కొన్న విషయాలన్నీ విపులీకరిస్తూ, చారిత్రక సాధికారికత పాటిస్తూ, అందరికీ (ముఖ్యంగా ఈ తరం వారికి) సులభంగా అర్థమయ్యే భాషలో కాకతీయ యుగ చారిత్రక విషయాలు చర్చిస్తూ, సమగ్ర దృష్టితో కొన్ని వ్యాసాలు వ్రాయాలన్న సంకల్పానికి ఇది నాందీ వ్యాసం. ఇందులో కాకతీయుల మూలాలు, ఆ వంశపు తొలి పాలకులు, సామంతులుగా రాజకీయ జీవితాన్ని జీవితాన్ని ప్రారంభించి, స్వతంత్ర రాజ్యాధి నేతలుగా కాకతీయుల ప్రాదుర్భావం, మొదలైన విషయాలు క్లుప్తంగా చెప్పటం జరిగింది. విజ్ఞులైన పాఠకులు నా ఈ ప్రయత్నాన్ని హర్షిస్తారని ఆశిస్తాను. ఈ వ్యాసాలు సమీకరించటానికి ఉపయోగించిన ఆధార, ఆకరాలను తుది వ్యాసంలో కృతజ్ఞతా సహితంగా పేర్కొనడం జరుగుతుంది.

కాకతీయుల సార్వభౌమ పాలకులను గూర్చిన విశేషాలు వచ్చే వ్యాసంలో...

**ఆర్. వరలక్ష్మి**
**హైదరాబాద్. ఫోన్: 961 852 4702.**

ఆధునిక తెలుగు నాటక వైతాళికుడు –


# మొదలి నాగభూషణ శర్మ

*– రావినూతల సత్యనారాయణ*

తరువాయి భాగం

**దొరా నీ సావు మూడింది:**

"దొరా! సింహానివని సింహాసనం మీద కళేబరాన్ని తినే డేగలా మా ఒళ్ళంతగా గుచ్చి-గుచ్చి తిన్నావ్. బడుగోళ్ళని, నమ్మినోళ్ళనీ, దేవుడని కొలిసి నోళ్ళనీ సంపుక తిన్న దొర! ఇయాల్తో నీ సావు మూడింది... ఇది నీకే కాదు, నీలాంటి నరపసువులందరికీ హెచ్చరిక" అంటూ పీడిత, తాడిత, జనావళి తిరుగు లేని నీ ఆధిపత్యాన్నీ, జులుమును ప్రదర్శిస్తున్న దొరతనంపై యెక్కు పెట్టిన వాడి ములుకు... నీ ఆటకట్టని హెచ్చరిస్తూ, పెట్టిన పొలికేక దొరా! నీ సావు మూడింది. యూజీనీ ఓనీల్ రచించిన ఎంపరర్ జోన్స్ నాటకానికి అనుసృజనగా ఆచార్య శర్మగారు ఈ నాటకాన్ని రచించారు. తరతరాలుగా పెత్తనం చేస్తున్న దౌర్జన్యాన్ని, నరనరాన అహంకారాన్ని జీర్ణించుకున్న చక్రవర్తి అనే రాజును ప్రజలు ఒక్కుమ్మడిగా ఏకమై తుదముట్టించిన ఉదంతమే ఈ నాటక ఇతివృత్తం. అభివ్యక్తీకరణ ధోరణిలో వ్రాయబడిన ఈ నాటకంలో శర్మగారు తెలుగునాట సుప్రతిష్టమైన జానపద కళారూపాలను అంతర్భాగంగా చేయడంతో ఇది తెలుగువారి కథ



మొదలి నాగభూషణ శర్మ

అన్నంత సహజత్వం వాటిల్లింది. ఈ నాటకంలో శారద కథ, వీరవిద్యావంతులు, ఒగ్గు కథలను సన్నివేశానుగుణంగా ప్రయోగించారు. ఈ నాటకానికి దర్శకులు శర్మగారే! ఈ నాటకాన్ని మొదట శర్మగారి దర్శకత్వంలో నరజాతి చరిత్ర సమస్తం అనే పేరుతో ఉస్మానియా థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలో అమరేంద్ర, ఫ్రాన్సిస్, నవీనలక్ష్మి, సేనాపతిమోహన్, తదితరులు నటించారు. మళ్ళీ ఇదే నాటకాన్ని "దొరా! నీ సావు మూడింది" అనే పేరుతో అమరేంద్ర స్వీయ దర్శకత్వంతో ప్రదర్శించారు.

**అంధయుగం:** డా. ధర్మవీర్ భారతి హిందీలో రచించిన *అంధాయుగ్* నాటకానికి మొదలి నాగభూషణ శర్మగారి అనుసరణ ఈ అంధయుగం. కురుక్షేత్ర సంగ్రామ తుదిదశలో *మహాభారత* కథను ఇతివృత్తంగా తీసుకొని వ్రాసిన *అంధాయుగ్* నాటకం భారతీయ భాషా నాటక చరిత్రలో ఒక సంచలనం సృష్టించింది! ఈ నాటకాన్ని రాంగోపాల్ బజాజ్ దర్శకత్వంలో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ నాటక విభాగం విద్యార్థులు ప్రదర్శించారు. శ్రీ బజాజ్ హిందీ *అంధాయుగ్* కి కూడా దర్శకత్వం వహించారు! ఈ నాటకాన్ని బజాజ్ ఆకృత రంగస్థల (థియేటర్-ఇన్-రౌండ్) శైలిలోనే ప్రదర్శించారు. ఈ నాటక అనుసృజనలో ఆచార్య శర్మగారి అర్ధాంగి సరస్వతి గారు సహానువాదకురాలిగా వ్యవహరించారు!

**కాయితం పులి:**

శంకర్ శేష్ హిందీలో రచించిన *పోష్టర్* నాటకానికి అనుసృజనగా శర్మగారు, వారి శ్రీమతి సరస్వతి గారితో కలిసి రచించిన నాటకం *కాయితంపులి* ఈ నాటకం గిరిజన, బడుగు, బలహీన వర్గాలపై జరిగే అత్యాచారాలకు అద్దం పడుతుంది. బడుగు జీవుల జీవన విధానాలు మెరుగు పరచడానికి వారి సమస్యల పట్ల అవగాహన కలిగించడమే సరైన మార్గమని నాటక ఇతివృత్తం సూచిస్తుంది. ఈ నాటకం సంపూర్ణ నాటకం (అంటే టోటల్ థియేటర్) శైలిలో ప్రదర్శింపబడింది. ఆట, పాట, మూకాభినయం, అంగిక భాష, ఈ విధమైన

నాటక శైలిలో ప్రాధాన్యం వహిస్తాయి. హాస్యానికి వీర, భయానక రసాలు జోడించి, ఆధునిక జీవన సత్యాలకు ఈ నాటకం అద్దం పడుతుంది. *కాయితం పులి* నాటకాన్ని హైద్రాబాదు, కేంద్ర విశ్వవిద్యాలయ నాటక విభాగం విద్యార్థులు ఆచార్య నాగభూషణ శర్మగారి దర్శకత్వంలో ప్రదర్శించారు.

**మన్మథుడు మళ్ళీ పుట్టాడు:**

"బాహ్య సౌందర్యమే సర్వస్వం అనుకొంటున్న ఈ కాలంలో అసలు సౌందర్యం అంటే ఏమిటి అనే ప్రశ్న ఉదయించడమే ఒక సవాలు. ఈ ప్రశ్నకు సమాధానంగా ఆదర్శాలను పేర్కొనడం అంటే నేల విడిచి సాము చేయడమే కావచ్చు. కాని ఆదర్శాల సాధనలోనే మనిషి ఆశించిన గమ్యాలు చేరుకోగలుగుతాడు. మనిషి సౌందర్యం అంతర్నిహితం. ఆయా వ్యక్తులు తాము చేసే పనుల్లో తన్మయులైనప్పుడు వారి మనసులు ఉత్తేజం పొందుతాయి. ఆ ఉత్తేజం వల్ల ఒక వర్చస్సు జ్వలిస్తుంది. దానినే సౌందర్యమంటాము. చాలామంది ఈ సౌందర్యాన్ని చూడలేరు, అందుకోనూ లేరు. మన చుట్టూ మనసులోనే ఉన్న ఈ అందాన్ని చూడడానికి మన మనసులకు కొత్త దృక్పథం కావాలి. ఈ దృక్పథాన్ని కలుగజేయడానికి వీలైన ఆలోచనను రేకెత్తించడమే ఈ నాటక లక్ష్యం" అని రచయిత శర్మగారు పీఠికలోనే పేర్కొన్నారు. ఈ నాటకంలో ఫాంటసీ ఉంది. అభూత కల్పనా ఉంది. కాటికి కాళ్ళుచాపుతున్న ముసలివాడు కూడా నువ్వు ఎంతో అందంగా ఉన్నావంటే ఇరవై యేళ్ళ కుర్రాడిగా మారిపోతాడు! మంచివాడిలోను, చెడ్డవాడిలోను కలిగే భావాలను దృశ్యంలో బంధించడానికి ఫాంటసీ దోహదం చేస్తుంది. ఈ నాటకానికి *అపోలో ఆఫ్ బెల్లాక్* అనే ఫ్రెంచి నాటకం ప్రేరణనిచ్చిందంటారు రచయిత శర్మగారు. ఈ నాటకానికి డా. చాట్ల శ్రీరాములు దర్శకత్వం వహించగా రంగస్థలంపై ప్రదర్శించుటతోపాటు, రేడియోలో శ్రవ్య నాటికగాను, దూరదర్శన్‌లో దృశ్యరూపకంగాను ప్రసారం చేశారు.

**ప్రజానాయకుడు ప్రకాశం:**

ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు వింటేనే రోమాంచితం కలుగుతుంది! అన్నింటినీ దేశం కోసం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనుడాయన. కుటిల రాజకీయపు విషపు కోరలలో చిక్కి పదవిని కోల్పోయిన నిష్కళంక రాజనీతి దురంధరుడు ప్రకాశం పంతులు! నమ్మిన సిద్ధాంతం కోసం కొండనైనా సరే ఢీకొనే ధీశాలి. తెలుగువాడి ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానం అనే మాటకు అసలైన నిర్వచనం ఆయన. ఆ మహనీయుని జీవిత చరిత్రను కళ్ళకు కట్టేలా శర్మగారు రచించిన నాటకం "ప్రజానాయకుడు ప్రకాశం. ఈ నాటక రచనకు ప్రేరేపణను గురించి ముచ్చటిస్తూ "తెలుగువాండ్లు జాతీయ స్థాయిలో ఏ ఒక్క రంగములోను నాయకత్వాన్ని సాధించలేకపోవడానికిగల కారణాలు ప్రకాశం సుదీర్ఘ రాజకీయ జీవితంలో అంతఃసూత్రంగా ఉన్నాయనిపిస్తుంది. ఆ కారణాలు విశ్లేషించుకొని, ఆ పరిస్థితులను అధిగమించి అత్యుత్తమ స్థాయిలో గుర్తింపు పొందగలిగిన అవకాశాలను సృష్టించుకోవడం ఇప్పటికైన అవసరం అంటూ తెలుగువారికి సమర్పించుకొనే వినతి పత్రం ఈ నాటకం" అంటారు శర్మగారు. ఇంకా, "ఇది డాక్యుమెంటరీ డ్రామా కాదు, చారిత్రక నాటకం. డాక్యుమెంటరీ డ్రామాలో సంఘటనలను యథాతథంగా చిత్రిస్తాం. పాత్రల ప్రతిచర్యా మనకవగతమై ఆ పాత్రల, అస్థిత్వం మన అనుభవాలకు లోబడి ఉండాలి. చారిత్రక నాటకంలో పాత్రల సంఘటనల మూలాలు చరిత్ర నుండి గ్రహించినవే. కాని, చారిత్రకత చెడిపోకుండా అది యినుమడింపజేసేలా ఆ సన్నివేశాల రూపకల్పన చేయడం చారిత్రక నాటకావసరం. చారిత్రక నాటకంలో ఆయా వ్యక్తుల మనస్తత్వాలను ఆయా సంఘర్షణలు రూపుగడుతున్నాయా లేదా అన్న విచక్షణ ముఖ్యం. ఆ నియమిత నేపథ్యంలో యిలాగే జరిగి ఉండాలని ప్రతి సన్నివేశం గురించి ప్రేక్షకులు అనుకోవాలి. ఈ చారిత్రక స్పృహను చారిత్రకత (Historicity)ను ప్రతిబింబించే విధంగా వ్రాసిన, ఎపిక్ ప్లే (కావ్య నాటకం) ఇది. ఎపిక్ ప్లేలో అంతర్లీనంగా ఉండే లక్షణాలు ఇందులో ఉన్నాయి... కథను సుగమం చేయడానికే

సన్నివేశాల మీద వ్యాఖ్యలు చేయడానికి ఉపయోగించడం జరిగింది. అందువల్ల నాటకంలోని సంఘటనలు ఎంత ముఖ్యమైనవో కథనం కూడా అంత ముఖ్యమైనది" అన్నారు. ఈ నాటకానికి శర్మ గారు దర్శకత్వం వహించారు. ప్రకాశం పంతులు పాత్రను డా. చాట్ల శ్రీరాములు పోషించారు. ప్రకాశం తల్లి సుబ్బమ్మ పాత్రను బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, ఇమ్మనేని పాత్రను దుగ్గిరాల సోమేశ్వరరావుతో పాటు 45 మంది కళాకారులు వివిధ పాత్రలను పోషించారు. ఈ నాటకాన్ని 1999 నుండి రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో 25 పైగా ప్రదర్శనలిచ్చారు. హైద్రాబాదు దూరదర్శన్ దీనిని టెలిఫిల్మ్‌గా చిత్రించి పలు పర్యాయాలు ప్రసారం చేసింది.

"ఆంధ్రదేశం గర్వించదగ్గ ఒక మహామహుడి జీవితాన్ని నాటకంగా వ్రాయగలగడం, దానిని నలుమూలలా ప్రదర్శించే వీలు కలగడం ఒక గొప్ప జీవితానుభవంగా భావిస్తాను" అంటారు శర్మగారు! ప్రజానాయకుడు ప్రకాశం నాటకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ ప్రతిభామూర్తి పురస్కారాన్ని ప్రదానం చేసింది.

**హయవదన:** భారతీయ నాటక రంగంలో డా. గిరీష్ కర్నాడ్ రచించిన "హయవదన నాటకానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఒక జానపథ కథను ఆధారంగా చేసుకొని కర్నాడ్ ఈ నాటకాన్ని మొదట కన్నడంలో రచించారు. తర్వాత ఇది ఆంగ్ల భాషలోనికి అనువదించబడినది. ఆంగ్ల నాటకానికి ఆచార్యా నాగభూషణ శర్మగారు దర్శకత్వం వహించారు. రంగోద్దీపనలో ఈ నాటకం కొత్త పుంతలు తొక్కింది! శర్మగారి దర్శకత్వంలో హయవదన నాటకాన్ని అనామిక అనే సంస్థ విజయవంతంగా అనేక ప్రదర్శనలిచ్చింది.

**రచయితగా ఆచార్య నాగభూషణ శర్మ:**

సంగీత నాటక అకాడమీ వారి "నాట్యకళలోనూ ఇతర పత్రికలలోను నాటక సాహిత్యం మీద వ్యాసాలు వ్రాయడంతో రచనా ప్రస్థానం ప్రారంభించారు శర్మగారు. క్రమేణా ఆయన ఆసక్తి తెలుగు సాహిత్యంవైపుకి మళ్ళింది. తెలుగు సాహిత్యంలో పరిశోధన మొదలెట్టారు. శర్మగారి సాహితీ కృషిని త్రివేణీ సంగమంగా భావించవచ్చు. అవి: *ప్రముఖుల జీవన రేఖల రచన; నాటకాలపై సాధికారిక పరిశోధనా గ్రంథ రచన;* సాహిత్య విమర్శ, సంపాదకత్వం, సంకలనం. శర్మగారు రచించిన కొన్ని ప్రముఖ రచనలు:

1. బళ్ళారి రాఘవ - శరత్ అండ్ ఆనంద్ పబ్లిషర్స్, హైదరాబాద్ వారు 1982లో ఆంగ్లంలో ప్రచురించిన బళ్ళారి రాఘవ (Bellari Raghava - Prince of Players). ఈ ఆంగ్ల గ్రంథం పీఠికలో శర్మగారు ఈ గ్రంథ రచనకు దారితీసిన, అంశాలు ప్రస్తావించారు. 1980లో బళ్ళారి రాఘవ శతజయంతి ఉత్సవాలు జరిగాయి. ఆ సందర్భంగా దాక్షిణాత్య నాటక రంగానికి రాఘవ చేసిన సేవలను గూర్చి శర్మగారు అనేక సభలలో ప్రసంగించారు. అప్పట్లో రాఘవ నటనా కౌశలాన్ని గురించి ఆంధ్రేతరులకు పరిచయం చేసే నిమిత్తం శర్మగారు విశేష పరిశోధన చేసి, సాధికారికతతో కూడిన సమగ్ర గ్రంథాన్ని ఆంగ్లంలో రచించి ప్రచురించారు. 10 విభాగాలలో రచించిన ఈ గ్రంథం రాఘవ నటకౌశలమేగాక, వ్యక్తిగా ఆయన సాధించిన ఘనవిజయాలను వివరిస్తుంది. ఉత్తర దేశంలోని వారికి, విదేశీయులకు రాఘవను పరిచయం చేయడంలో ఎంతో ఉపయోగపడుతుంది. గ్రథం మధ్య మధ్యలో రాఘవ సమకాలీన వ్యక్తుల ఛాయా చిత్రాలను ప్రచురించారు.

2. ఆచార్యా ఆత్రేయ - సమకాలీన తెలుగు నాటకరంగం (Acharya Atreya - Contemporary Telugu Theatre). పైన పేర్కొన్న గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వారు 1986లో ప్రచురించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని థియెటర్ ఆర్ట్స్ విభాగం వారు 1986 మార్చి 23 నుండి 27 వరకు ఆచర్య నాగభూషణ శర్మగారి అధ్వర్యంలో ఆత్రేయ నాటకోత్సవాలు నిర్వహించారు. ఆత్రేయగారు రచించిన మూడు నాటకాలను ప్రదర్శించడంతోబాటు ఆత్రేయపై ఆంగ్లంలో మోనోగ్రాఫ్ ప్రచురించారు. ఆ సదస్సులో ఆచార్య ఆత్రేయ గారు స్వయంగా పాల్గొన్నారు. శర్మగారు ఆత్రేయ సమగ్ర నాటక సాహిత్యాన్ని అవలోకనం చేసి

వాటి స్వరూప స్వభావాలను వివరిస్తూ ఆంగ్లంలో ఒక గ్రంథాన్ని రచించారు. అందులో ఆచార్య ఆత్రేయగారు 1943-1963 మధ్య రచించిన 10 నాటకాలు, 15 ఏకాంకికలు విశ్లేషించబడినవి. అంతేకాదు, "ఆచార్య ఆత్రేయగారు మొదట రంగస్థల మెళుకువలు తెలుసుకొని, తర్వాత నాటక రచనలు చేసి ఆరంగంలో ఆద్యుడయ్యాడు" అని నిర్ధారించారు. శర్మగారి రచన మేధావుల ప్రశంసలందుకున్నది.

3. స్థానం నరసింహారావు నటజీవన ప్రస్థానం: పురుషులే స్త్రీ వేషాలు ధరించే రోజుల్లో రంగస్థలం అధిరోహించి విభిన్నమైన, ఒక్కొక్కప్పుడు పరస్పర విరుద్ధమైన పాత్రలను ధరించి ప్రతి పాత్రలోనూ తనదైన ప్రత్యేకతను చూపించి, 30 సంవత్సరాలపాటు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన అత్యంత ప్రతిభాశాలి స్థానం. ఆయన జీవితంలోని విభిన్న కోణాలను, ఆయన ధరించిన పాత్రలలోని విశిష్టతను, వ్యక్తిత్వ గరిమను వెల్లడించే గ్రంథం ఈ రచన. ఈ గ్రథంలోని ఏడు ప్రకరణాలలో స్థానంవారి నటన కౌశలాన్ని చక్కగా విశదపర్చారు, ఆచార్య శర్మగారు. అంతేకాదు, స్థానం నటనను నాలుగు విధాలుగా బేరీజు వేశారు. శర్మగారి భావనలో స్థానం నటనా చాతుర్యం, నటనా వైదుష్యం, నటనా వైశిష్ట్యం, ఆయన వ్యక్తిత్వ వైశిష్ట్యం ఆయనను పూర్ణ నటకునిగా మార్చింది! శర్మగారి మాటల్లో స్థానం నాటక ప్రథమ ప్రదర్శన వరకు నిత్య విద్యార్థిగా మారేవాడు. ముందుగా పాత్రకు సరి పోలిన స్త్రీలను వెతికి కనుక్కోవడం ఒక ఎత్తు... నిజానికి వేష భాషలు బాహ్యాలంకరణకే! అసలు సమకూర్చుకొనవలసింది ఆ పాత్రను సూచించే, ప్రతిబింబించే అంతర భావన. అది ఎలా గ్రహించేవారో?!" ఈ రచన గొప్ప జీవిత చరిత్ర.

4. ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటక సాహిత్యం - సమగ్ర పరిశీలన: రామకృష్ణమాచార్యులవారు ప్రతిభావంతులైన నటులు, దర్శకుడు, సంగీత సారథి మరియు ప్రయోక్త. 25 సంవత్సరములు నాటికకు ఊపిరిగా సంచరించిన మహామేధావి! వారి జీవిత విశేషాలతో రంగ సంపద ప్రచురణగా 2018లో శర్మగారు మూడు సంపుటాలకు సంపాదకత్వం స్వీకరించారు. ఆచార్యుల వారి 20 నాటకాల సంక్షిప్త పరిచయం 90 పుటల సాధికారిక పరిశోధనాంశాలు సమకూర్చారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు తెలుగు నాటక రంగానికి చేసిన సేవ అనే ప్రకరణలో తొమ్మిది విధాల నూతనాంశాలను నాగభూషణ శర్మగారు విశదీకరించారు. ధర్మవరం వారి నాటకాలలో పాత్రలు ధరించిన వివిధ నటుల ఫొటోలు ఈ పరిశోధనా గ్రంథ విలువను ఎక్కువ చేశాయి. నాటకాలపై పరిశోధన చేసేవారికి ఈ రచన కరదీపికగా ఉపకరిస్తుంది. పైన ఉల్లేఖించిన గ్రథాలన్నీ తెలుగు నాటక రంగంలోని కొందరు ప్రముఖుల జీవనరేఖా వివరాల విశ్లేషణగా భావించవచ్చు.

**నాగభూషణ శర్మగారి పరిశోధనాత్మక, విమర్శనాత్మక తెలుగు రచనలు:** 1. *తెలుగు సాహిత్యం - గాంధీజీ ప్రభావం*, 2. *తెలుగు నవలా వికాసం*, 3. *నాటక శిల్పం*, 4. *నూరేళ్ళ తెలుగు నాటకరంగం*, 5. *కన్యాశుల్కం - నూరేళ్ళ సమాలోచనం*, 6. *నాట్యాంబుజము - నాట్య అశోకము - సంస్కరణ ప్రతి సంపాదకత్వం*, 7. *నాటకరంగ పారిభాషిక పదకోశం*.

**తెలుగు సాహిత్యంపై గాంధీజీ ప్రభావం:**

చాలాకాలం వరకు తెలుగు సాహిత్యంపై గాంధీజీ ప్రభావం అనే విషయంపై పరిశోధనాత్మక విమర్శా గ్రంథమేది ప్రచురణ కాలేదు. శర్మగారు 1970లో ఆ కొరతను తీర్చారు. ఆయన విశేష పరిశ్రమ చేసి గ్రంథాలయాల్లో అనేక పుస్తకాలు పరిశీలించి, గాంధేయ సాహిత్యంపై వివరణాత్మకమైన పుస్తకాన్ని రూపొందించారు. ఈ నాటికీ తెలుగు సాహిత్యంపై గాంధీజీ ప్రభావం అనే అంశంపై శర్మగారి రచన ప్రామాణిక గ్రంథంగా పరిగణించబడుతోంది. శర్మగారి రచనలో తొమ్మిది ప్రకరణలున్నవి. అవి: *సాహిత్యం - జాతీయత, కావ్య సాహిత్యం, గాంధీజీ శతకాలు, ఖండకావ్యాలు, గేయాలు - పాటలు, కీర్తనలు, భజనలు, నాటక సాహిత్యం, నవలా సాహిత్యం, జీవిత చరిత్రలు - సిద్ధాంత గ్రంథాలు.*

**తెలుగు నవలా వికాసం:**

తెలుగు నవల ప్రారంభ, వికాస పరిణామ దశలను సవివరంగా విశదీకరిస్తూ, విశ్లేషిస్తూ శర్మగారు వ్రాసిన పుస్తకం తెలుగు నవలా వికాసం. ఈ పుస్తకాన్ని గూర్చి ముచ్చటిస్తూ తెలుగు నవలా సాహిత్యాన్ని గురించి వ్రాసిన రచనల్లో దీనిని పేర్కొనదగిన గ్రంథంగా పరిగణించారు డా. అక్కిరాజు రమాపతిరావు తమ తెలుగులో పరిశోధన అనే గ్రంథంలో. ఈ పుస్తకాన్ని విస్తృత పరచుటకు శర్మగారు ఎంతో శ్రమపడి పాత పుస్తకాలను పరిశీలించవలసి వచ్చింది. అంతటి పరిశ్రమతో రూపొందిన తెలుగు నవలా వికాసం అను గ్రంథం తెలుగు విమర్శా సాహిత్యంలో మణిపూసగా భావించవచ్చును. సాహిత్య పరిశోధకులు తప్పక చదువవలసిన రచన.

**నాటకశిల్పం:**

ఈ పుస్తకంలో భారతీయ పాశ్చాత్య నాటక రచనా సంవిధాన విశ్లేషణ, విభిన్న ప్రక్రియల విశేషాల విమర్శనాత్మక వివరణ, వివిధ మాధ్యమాల తులనాత్మక పరిశీలన మొదలైన విషయాలు విస్తృతంగా చర్చింపబడ్డాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో అధ్యయన, అధ్యాపనలు కొనసాగించిన ఆచార్య నాగభూషణ శర్మగారు ఎం.ఎ. తరగతుల థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన పాఠ్యగ్రంథమిది. రచయిత ముందుమాటలో పేర్కొన్నట్లు "ఈ పుస్తకానికి నిజమైన రచయితలు 40 సంవత్సరాలపాటు నేను పాఠాలు చెప్పిన వివిధ విశ్వవిద్యాలయాలలోని రంగస్థల శాస్త్ర విద్యార్థులు. వాళ్ళందరికీ పాఠాలు చెప్పడం ఓ అద్భుతమైన అనుభవం''. నాటకశిల్పం పుస్తకం ఈ తరం అధ్యాపకులకు కరదీపికగా ఉపయోగిస్తుంది. ఇది కేవలం ఒక text-book కాదు, నాటకం - భూమిక; నాటక ప్రత్యేకత; నాటక రచనాంశనాలు; పాత్రచిత్రణ; భాష; ప్రదర్శనాంశాలు; భారతీయ నాటక ప్రక్రియలు; పాశ్చాత్య నాటక ప్రక్రియలు; నాటకం - ఇతర మాధ్యమాలు; నాటక విశ్లేషణ. ఈ అంశాలన్నిటితోపాటు సంక్షిప్త నాటక పరిభాషను అనుబంధంగా జోడించారు. నాటకశిల్పం రచనకు తెలుగు విశ్వవిద్యాలయ విమర్శ అవార్డు లభించింది.

**నాట్యాంబుజము, నాట్య-అశోకము:**

తెలుగులో నాటకశాస్త్ర చర్చకు లక్ష్య ప్రమాణాలనందించే రచనలు చేసిన మహామనీషి శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు (1888-1941). ఆ రోజులలో తెలుగు దేశాన్ని ప్రభావితం చేసిన ముగ్గురు మహనీయులలో ప్రథములు. మిగతా ఇద్దరూ పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి, శ్రీపాద కామేశ్వరరావుగార్లు. విస్తృతప్రాచ్య, పాశ్చాత్య నాటక సాహిత్య పరిచయం, విజ్ఞానశాస్త్ర అధ్యయనం నేర్పిన విశ్లేషణా పద్ధతుల అవగాహన, కళాపారమ్యం ఎరిగిన విచక్షణ శీలత లక్షణాలు ప్రాతిపదికగా చేసుకొని, సూరిశాస్త్రిగారు ఆరు విమర్శనా గ్రంథాలను రచించారు. అందులో రెండు గ్రంథాలు - నాట్యాంబుజము, నాట్య-అశోకము తెలుగునాటక విమర్శకు మార్గదర్శకాలైన తొలి రచనలు. నాట్యాంబుజము 1923లోను, నాట్య - అశోకము 1925-1927 మధ్యకాలంలోను ప్రచురితమైనవి.

ఎప్పుడో 19వ శతాబ్దపు రెండో దశకంలో పురాణం సూరిశాస్త్రిగారు రచించిన నాట్యాంబుజం, నాట్య-అశోకము గ్రంథాలను మళ్ళీ ఈతరం నాటక ప్రియులకందజేయాలన్న ఆశయంతో ఈ గ్రంథాల పునఃప్రచురితమైనవి. ఆచార్య శర్మగారు ఈ గ్రంథాలకు సంపాదకత్వం వహించి వాటిని పరిష్కరించుటయేగాక - అప్పటి వైభవాన్నీ, నాటక చరిత్రలో ఈ గ్రంథాల ప్రాధాన్యాన్నీ వివరిస్తూ, సాధికారకమైన పీఠికను, అధోసూచికల ద్వారా వివరణలను పొందుపరిచారు. ఈ పరిశ్రమ, ఈ గ్రంథాన్ని విలువైన ఆకరంగా మార్చి, అధిక సమాచారన్ని సమకూరుస్తుంది. సంపాదకత్వం బాధ్యతలు ఇంత గురుతరంగా నిర్వహించినందుకు ఆచార్య శర్మగారు అభినందనీయులు! తెలుగు నాటక రంగ చరిత్రకు సంబంధించినంతవరకు, ఇవి ప్రధాన గ్రంథాలు. అందువలన విపులమైన పీఠిక పాఠకులకు ఎక్కువ సౌకర్యం సమకూరుస్తుంది. నాట్యాంబుజంలోని

ఎనిమిది దశలు: 1. నాటకానుభవములు, 2. ఆంధ్ర నాటకములు, 3. నాటక సమాజలు, 4. ప్రసిద్ధ నటులు, 5. ప్రదర్శన విమర్శనములు, 6. పరిహరించారు (సంపాదకులు), 7. నాటక సమస్యలు, 8. నాటక విమర్శనము.

**నాట్య అశోకము:** ఈ రచనలోని మొదటి మూడు అధ్యాయాలను సంస్కరించిన ప్రతిలో వదిలివేయడం జరిగింది. అందులో మిగతా 11 అధ్యాయలు: 1. *రామదాసు*, 2. *హరిశ్చంద్ర*, 3. *నటప్రకాశిక నాటకాలు*, 4. *ఆంజనేయనటేశం*, 5. *కన్యాశుల్కము*, 6. *ప్రతాప రుద్రీయము*, 7. *షోరాబు-రుస్తుం*, 8. *దొరస్వామి-దుష్యంతుడు*, 9. *గంజాంనటులు*, 10. *చంద్రహాస-నటలోక సంచారము*, 11. *మృచ్ఛకటికం*.

**నాటకరంగ పారిభాషిక పదకోశం:**

ఇది మౌలికమైన పరిశోధనాత్మక గ్రంథం. సామాన్యంగా ఇటువంటి సంకలన, పదనిర్మాణ కార్యక్రమము పండిత పరిషత్తులు (Learned Organisations) చేపట్టి సంవత్సారాల తరబడి పరిశ్రమించి, పదకోశ నిర్మాణం చేస్తాయి. ఇది పలువురు పండితులు కలిసి చేయవలసిన కార్యక్రమం. అధిక వ్యయ ప్రయాసలతో కూడినది. ఒక్క చేతి మీదుగా ఇంతటి కృషి చేసిన ఆచార్య శర్మగారు ప్రశంసార్హులు. శర్మగారు నాటక రంగంలో వాడుకలో ఉన్న పాశ్చాత్య సాంకేతిక పదాలకు తెలుగు సమార్థకాలు, ఆంగ్ల, ఆంధ్ర భాషల్లో ఆ పదాలకు వివరణ సంకూర్చరు. అంతేకాదు, పాశ్చాత్య దేశాల నాటకరంగ చరిత్రను గూర్చిన అంశాలు, విభిన్న నాటక ఉద్యమాల, సిద్ధాంతాల సంక్షిప్త పరిచయం 400ల పుటల గ్రంథంలో సోపత్తికంగా అందించారు. ఈ పారిభాషిక పదకోశ నిర్మాణంలో తాను అనుసరించిన, పద్ధతులను, పాటించిన నియమాలను గురించి శర్మగారు తాను రచించిన పీఠికలో విపులంగా చర్చించారు. ఆ సందర్భంగా ఇలా వ్రాస్తారు "ఆంగ్ల పదాన్ని రెండు మూడు అర్థాలలో వాడిన సందర్భాలను సూచించడానికి (ఉదా. black out: కాంతిరాహిత్యం, స్మృతిరాహిత్యం). ఇంగ్లీషు పదాలు ప్రాచూర్యం పొందినవై ఉంటే, ఆంగ్ల పదానితోపాటు తెలుగు సమానార్థకాన్ని కూడా ఇచ్చాను. ఉదా. Jack అనే పదానికి జాక్ అని ఊతకోల అని సమానార్థాలుగా ఇవ్వడం జరిగింది. రెండు తెలుగు సమానార్థకాలు ఉంటే ఆ రెంటినీ (ఉదా. Curtain: యవనిక, తెర) ఇవ్వడం చూడొచ్చు". ఆ విధంగా ఒక నిర్ధిష్ట, నిర్దుష్ట ప్రణాలికను రూపొందించుకొని, ఈ బృహత్తర పారిభాషిక పదకోశాన్ని పూర్తి చేశారు. ఇది శర్మగారు సాధించిన విజయాలలో ఉల్లేఖనీయమైనది.

**జానపద కళల్లో శర్మగారి కృషి:**

తెలుగు జానపదకళా రూపాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడంలో కృషి చేసిన వారిలో శర్మగారు ముఖ్యులు. శర్మగారు తన నాటకం నరజాతి చరిత్ర సమస్తంలో నాలుగైదు జానపదకళా రూపాలలోని మూల కథలను వాడుకొని నాటకంలో జరుగుతున్న సంఘటనలు వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ జానపద కళారూపాలలో అతిప్రాచీనమైనది తోలుబొమ్మలాట! మనిషి తనకు ప్రతిరూపంగా తోలుబొమ్మని సృష్టించాడు. శర్మగారు వాటిలో వినోదం, విజ్ఞానం పొందడానికి ప్రదర్శనలు తయారు చేశారు. నూఢిల్లీలోని సంగీత నాటక అకాడెమీ వారికి తోలుబొమ్మలాట అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని వ్రాసి యిచ్చారు. అంతేకాదు, Association for the promotion of puppetry in AP. అనే సంస్థను 1986లో ఏర్పాటు చేశారు. దానికి ఆయనే అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆసంస్థ ద్వారా ఎన్నో ప్రయోగాలు, ప్రదర్శనలు, కార్యక్రమాలు నిర్వహించారు. Educational Puppetry for the Young Teachers అనే కార్యక్రమాన్ని రూపొందించి, నాలుగు రోజులు నిర్వహించారు. 1995లో Folk Performing Arts in AP అనే పుస్తకం రచించి, ప్రచురించారు. అప్పటిదాకా తెలుగులో వున్న 65 కళారూపాల సమాచరం ఆంగ్ల పరిశోధకులకు అందుబాటులోకి వచ్చింది. శర్మగారు షుమారు 300ల జానపద కళారూపాల నుండి ప్రదర్శన కళారూపాలను ఎంపిక జేశారు. నిజానికి జానపద విజ్ఞానంలో కళలపై అధ్యయనం చేయడానికి, ఆ విషయాలవైపు దృష్టి

మరల్చడానికి, శర్మగారి కృషి ఎంతో దోహదకారకమయింది. పాశ్చాత్య జానపద పరిశోధకులు ఎన్నో సిద్ధాంతాలు చేశారు. అందులో Performance Theory ఒకటి. తెలుగు నేల మీద ఈ ప్రదర్శన సిద్ధాంతనికి తనదైన ఆలోచనలతో దేశీయమైన అధ్యన రూపం ఇచ్చి ఈ సిద్ధాంతనికి అన్వయం, ఉపయోగిక విధానం కల్పించారు. కళారూపాలను నాటక విద్యార్థులకు, ఎక్కువమంది పెద్దలకు పరిచయం చేసింది శర్మగారే!

జానపద బొమ్మలాట టీమ్స్‌తో జపాను, ఫ్రాన్సు, గ్రీసు దేశాలో పయనించి UNIMA International Puppetry సంస్థ నిర్వహించే Festivalలో పాల్గొని ప్రదర్శనలు ఏర్పాటు చేసి, ఆంధ్రదేశ జానపద కళారూపాలకు అత్యంత పేరుప్రతిష్టలు ఆర్జించారు. శర్మగారు Founder chief Editorగా Nartanam (నర్తనం) త్రైమాసిక పత్రికను 2001-2012 నడిపి, నాట్యకళపై Classical Styles మీద మంచి సమాచారన్ని, అందజేశారు. సంపాదకునిగా కార్యకలాపలు నిర్వహిస్తూనే, 26 పరిశోధనా వ్యాసాలు వ్రాశారు. తెలుగు ప్రజల హృదయాలలో జానపద కళారూపాలపై ఆసక్తి పెంచి, వాటి వికాసానికి శర్మగారు చేసిన అమోఘసేవ మరువరానిది.

***ఆచార్య నాగభూషణ శర్మగారందుకొన్న కొన్ని పురస్కారలు:*** *శర్మగారు నాటక రచయితగా, విమర్శకునిగా, దర్శకునిగా, అధ్యాపకునిగా లబ్ధప్రతిష్టులు. వారి జీవితకాలంలో అనేక విధములైన సన్మాన సత్కారాలను పొందారు. వాటన్నిటినీ వివరిస్తే అదే ఒక పెద్ద పుస్తకముగా తయారౌతుంది! అందువలన ఆ పనికి పూనుకొనలేదు. ఇచ్చుట కొన్ని ముఖ్యమైన పురస్కారాలను ఉల్లేఖించడమైనది.*

*✤కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం : ఠాగూర్స్ అకాడమీ రత్న. ✤ Prestigious: Theatre Academy Fellowship. ✤ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం (ఎన్.టి.ఆర్. అవార్డు). ✤ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ప్రజానాయకుడు ప్రకాశం అనే నాటక రచన, దర్శకత్వం, నాటకశిల్పం, మొదలైన విషయాలకు : ప్రతిభామూర్తి పురస్కారం. ✤ విజయనగరం సాహితీ సమాఖ్య ద్వారా : గురజాడ పురస్కారం. ✤ అనంతపురం లలితకళా ద్వారా : బళ్ళారి రాఘవ పురస్కారం. ✤ హైదరాబాద్ అభినందన సంస్థ ద్వారా : ఆచార్య ఆత్రేయ పురస్కారం. ✤ రావులపాలెం సర్ ఆర్థర్ కాటన్ కల్చరల్ క్లబ్ ద్వారా : సర్ ఆర్థర్ కాటన్ పురస్కారం. ✤ బళ్ళారి ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారి : రంగసిరి పురస్కారం. ✤ విశ్వనాథ సాహిత్య అకాడమీ వారి : విద్యాసుందరీ బెంగుళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం. ✤ తెనాలి రంగస్థల కళాకారుల సంఘం ద్వారా : ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం. ✤ భారత ప్రభుత్వం : పద్మభూషణ పురస్కారం. ✤ అప్పాజోస్యుల - విష్ణుభొట్ల - కందాళం ఫౌండేషన్ వారి : ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం.*

ఆచార్య మొదలి నాగభూషణ శర్మ ఆధునిక రంగస్థలాన్ని రసరంజితంగావించేందుకు నిమగ్నమైన తపస్వి, నిత్య ప్రయోగశీలి, నిరంతర పరిశోధకుడు. ఆయన పరిశోధనా వ్యాసాంగాన్ని మాత్రమే పరికించి చూచినా, "తను కావించిన సృష్టి తక్కొరుల చేతకాదు" అనే భావం స్ఫురించడంలో అసహజత్వం యేమీ లేదు! ఆయన చేపట్టిన యేరంగములో నైనా నవ్య కాంతులను వెదజల్లారు. మరుగుపడిన దీధితులను వెలికి తెచ్చారు. ప్రాచ్య, పాశ్చాత్య నాటక విధానాలను పక్షపాతం లేకుండా అవలోకన చేశారు. అలాగే, జానపద కళలను, ముఖ్యంగా తోలుబొమ్మలాటవంటి కళలను తవ్వి తీశారు. చదివిన పాఠకుడికి జానపదకళపై సాధికారత కల్పించే రచనలు చేశారు. తాను తెలుసుకున్నవాటిని, తెలియజేయాలనుకున్నవాటిని, తెలుగులోనేకాక, ఆంగ్లంలో కూడా విస్తారంగా వ్రాయడం వలన సాంస్కృతికంగా వివిధ రంగాలలోని తెలుగు పెద్దలను, ప్రక్రియలను అంతర్జాతీయ వేదిక మీద నిలబెట్టారు శర్మగారు. అందుకు తెలుగుజాతి వారికి కృతజ్ఞతాబద్ధులై ఉంటారు. విమర్శతో, అధ్యయనాలతో, మన కళాప్రాభావాన్ని నిలపడానికి నడుం బిగించిన సాంస్కృతిక సేనాని మొదలి నాగభూషణ శర్మ. ఉత్తమ దర్శకుడు, నటుడూ, అధ్యాపకుడు, పరిశోధకుడు ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు. 2019, జనవరి 15న తెనాలిలో స్వర్గస్థులయ్యారు.

ప్రొ. రావినూతల సత్యనారాయణ
హైదరాబాద్. ఫోన్: 961 852 4702.

## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-5
# బేగమ్ కుద్సియా అయిజాజ్ రసూల్
(ఏప్రిల్ 2, 1909 - ఆగస్ట్ 1, 2001)

*- ముత్తంగి వేంకట భారతలక్ష్మి*



బేగమ్ కుద్సియా అయిజాజ్ రసూల్

రాజ్యాంగ పరిషత్తు (కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ)కి ఎంపిక అయిన ఏకైక ముస్లిమ్ వనిత బేగమ్ కుద్సియా అయిజాజ్ రసూల్. 1937లో యునైటెడ్ ప్రావిన్స్ (సంయుక్త పరగణాలు) లేజిస్లేటివ్ కౌన్సిలుకు ఆమె నాన్- రిజర్వ్‌డ్ సీటు నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాజ్యాంగ చట్టంపై చర్చలు జరుగుతున్నప్పుడు ఆమె అనేక ముఖ్యమైన అంశాలను సూటిగా ప్రశ్నించి, అనేక సవరణలను తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఇతర దేశాల రాజ్యాంగ చట్టాల గురించి ఆమెకు లోతైన అవగాహన ఉండడం చేత, కొత్తగా ప్రవేశపెట్టబోతున్న బారత రాజ్యాంగ చట్టం గురించి ఆమె నిశితంగా పరిశీలించి సరైన సవరణలు ప్రతిపాదించారు. ఆమె తన జీవిత గాథ 'ఫ్రమ్ పర్దా టు పార్లమెంటు (పర్దా నుండి పార్లమెంటు)లో తన రాజకీయ ప్రస్థానాన్ని ఆమె ఎదుర్కొన్న సవాళ్ళను, మన దేశ రాజకీయ రంగంలో అంతర్భాగంగా ఉన్న వివిధ దృక్కోణాలు విశదపరిచారు. బేగమ్ అయిజాజ్ రసూల్‌గా పేరొందిన కుద్సియా 2 ఏప్రిల్ 1909లో జన్మించారు. తండ్రి నవాబ్ జుల్ఫికర్ ఆలీఖాన్ అవిభక్త పంజాబ్ రాష్ట్రంలో మలేల్ కోట్లా రాజవంశానికి చెందినవారు. తల్లి మహముదా బేగమ్ లాహోర్ నవాబ్ అల్లాదీన్ అహమ్మద్‌ఖాన్ కుమార్తె. రాజవంశానికి చెందిన కుద్సియాకు 12వ ఏటనే వివాహం జరిగింది. నవాబ్ అయిజాజ్ రసూల్‌కిచ్చి పెళ్ళి చేశారు. ఆయన ఉత్తరప్రదేశ్‌లో 'ఖుద్' అనే ప్రాంతానికి చెందిన జమిందారు. ఇప్పుడు ఖుద్‌ను హర్దాల్ జిల్లాగా వ్యవహరిస్తున్నారు. కుద్సియా వివాహం అయిన రెండేళ్ళకు తండ్రి మరణించడంతో ఆమెను అత్తమామలు వారింటికి తీసుకు వెళ్ళిపోయారు. అప్పటి నుండి కుద్సియాను బేగమ్ అయిజాజ్ రసూల్‌గా భర్త పేరుతో పిలిచేవారు. అదే పేరు అన్ని రికార్డులలో నమోదు అయింది. ఆమె తండ్రికి రాజకీయ, సాంఘిక, మేధావి వర్గంలో ప్రత్యేక స్థానం ఉంది. కుమార్తెను ఆయనతోపాటు రాజకీయ సభలకు తీసుకువెళ్ళేవారు. చిన్న వయసులోనే ఆమె తన తండ్రికి సెక్రటరీగా వ్యవహరించేవారు. తండ్రి ఆమెను అభ్యుదయ భావాలతో పెంచి, ఆమెకు పర్దా ఉన్నా లేకపోయినా జీవించగలిగే ధైర్యం ఇచ్చారు. ఆమె తన ఆత్మకథలో ఇలా రాశారు- "రాజకీయాల్లో ప్రవేశించాక, నేను పరదా నుండి బయటకు వచ్చాను. తమ ఆడవాళ్ళను పరదాలలో ఉంచేవాళ్ళు ఆహ్వానిస్తే వెళ్తానని నా భర్తకు చెప్పాను. ఆ రోజుల్లో జమిందార్లు హిందువులైనా, ముస్లిమ్‌లైనా తమ భార్యలను బయటకు తీసుకు వచ్చేవారు కాదు." ఆ విధంగా ఆమె పర్దాలో ఉన్న స్త్రీలకు ఆత్మస్థైర్యం ఇచ్చి మార్గదర్శకులయ్యారు. ఆమె తండ్రివలె ఆమె భర్త కూడా ఆమెకు నైతిక బలం ఇచ్చారు. రాజకీయాల్లోకి వచ్చినందుకు, పర్దా పాటించనందుకు బేగమ్ రసూల్ ఛాందస ముస్లిమ్ వర్గాల నుండి వ్యతిరేకత ఎదుర్కొన్నది. ఆమె కుమార్తె జీనత్ రసూల్ తల్లి గురించి ఇలా చెప్పారు. 1935లో అమ్మ రాజకీయ రంగంలో అడుగు పెట్టింది. ఆమె యునైటెడ్ ప్రావిన్స్ (యు.పి.) లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబరు అయింది. ముస్లిమ్ స్త్రీ ఇస్లామ్ మతానికి విరుద్ధంగా ప్రజాజీవితంలోకి రాకూడదని ఆమెపై ఫత్వా విధించారు. ఆమె ఆ ఆంక్షల్ని ఉపేక్షించింది." 1935లో ఇండియా యాక్ట్ అమలులో పెట్టాక, బేగమ్ రసూల్, ఆమె భర్త ముస్మిల్ లీగ్‌లో సభ్యత్వం తీసుకొన్నారు. దేశ విభజన తర్వాత చాలామంది ముస్లిమ్‌లు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందారు. రసూల్ దంపతులు మాత్రం నిశ్చింతగా ఉన్నారు. స్వతహాగా రిజర్వేషన్లకు వ్యతిరేకి అయిన బేగమ్ రసూల్ 1937 ఎన్నికలలో సంయుక్త పరగణాలు (యునైటెడ్

(ప్రావిన్స్) నుండి నాన్-రిజర్వ్‌డ్ సీటుపై పోటీ చేసి గెలుపొందినది. 1937 నుండి 1952 వరకు ఆమె యునైటెడ్ ప్రావిన్స్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యురాలిగా ఉన్నది. ఎమ్మెల్యేగా ఉంటూ ఎన్నో ప్రముఖమైన పదవులు అలంకరించింది. 1937 నుండి 1940 వరకు ఆమె డిప్యూటీ ప్రెసిడెంట్ ఆఫ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

1946లో దేశ విభజన తర్వాత ముస్లిమ్ లీగ్ నాయకుడు చౌధురి ఖలీ బుజ్జామన్ పాకిస్థాన్ వెళ్ళిపోయాక, బేగమ్ రసూల్ ముస్లిమ్ లీగ్ పార్టీ నాయకురాలిగా అధికారంలోకి వచ్చారు. 1946లో ముస్లిమ్ లీగ్ వ్యవస్థాపక నాయకుడు మహమ్మద్ ఆలీ జిన్నాను కలుసుకొన్నప్పుడు, దేశ విభజన గురించి జిన్నా ఆమెను ఒప్పించలేకపోయారు. ఆ సంవత్సరంలోనే (1946) ఆమె కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీకి ఎంపిక అయ్యారు. 1950లో ముస్లిమ్ లీగ్ ఇండియాలో రద్దు అయ్యాక, రసూల్ దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. ముస్లిమ్‌లు అత్యధిక సంఖ్యలో ఉన్న యునైటెడ్ ప్రావిన్స్‌కు, ఒక ముస్లిమ్ వనిత ప్రాతినధ్యం వహించడం, సాధారణంగా పురుషులకు మాత్రమే కేటాయించబడే పదవులు ఆమె సమర్థవంతంగా నిర్వహించడం వలన బేగమ్ రసూల్ కొత్త పుంతలు తొక్కి భావితరాల మహిళలకు మార్గదర్శకురాలయింది. 1946లో ఆమె రాజ్యాంగ పరిషత్తు (కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీ)కి సభ్యురాలిగా ఎంపిక అయిన తర్వాత మైనారిటీ వర్గ సభ్యురాలిగా ఆమెను డ్రాఫ్టింగ్ కమిటీలో తీసుకొన్నారు.

1950-1952లో కౌన్సిల్‌లో ఆమె ప్రతిపక్ష నాయకురాలిగా ఎంపిక అయ్యారు (డిప్యూటీ లీడర్ ఆఫ్ అపోజిషన్‌గా కాన్‌స్టిట్యూఎంట్ లేజిస్లేటివ్ అసెంబ్లీ) పురుషాధిక్యత ఉన్న రాజకీయ రంగంలో సాహసోపేతంగా కీలకమైన పదవులు చేపట్టిన ప్రప్రథమ భారతీయ మహిళ. ఇండియాలోనేకాక, యావత్ ప్రపంచంలో అత్యున్నత పదవులు అలంకరించిన మొదటి ముస్లిమ్ వనిత. కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీలో ఆమె చేసిన ప్రసంగాలు అధికారంగా రికార్డు చేయబడి, నేటికీ కీర్తిస్తంభాలుగా నిలిచి ఉన్నాయి. భారత రాజ్యాంగంలో ఎక్కువ భాగం ఆమె చేసిన ప్రతిపాదనలు, సవరణలే! రాజ్యాంగ పరిషత్తు (కాన్‌స్టిట్యూఎంట్ అసెంబ్లీ)లో డ్రాఫ్ట్ కాన్‌స్టిట్యూషన్ చర్చించినపుడు ఆమె ఇలా అన్నారు- "రాజ్యాంగాన్ని రూపొందించడంలో పాల్గొనడం ప్రత్యేక అర్హతగా భావిస్తున్నారు. ఈ చారిత్రాత్మక ఘటన సందర్భంగా మనమందరం భారత ఉపఖండంలో నివసిస్తున్న 30 కోట్ల ప్రజల భవిష్యత్తు, సాంఘిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల్ని దృష్టిలో పెట్టుకొని, మన బాధ్యత పూర్తిగా తెలుసుకొని రాజ్యాంగాన్ని రూపొందించాలి. దేశప్రజల ఆశలు, ఆశయాల్ని రాజ్యాంగం రూపొందించింది. ప్రజాస్వామ్య గణతంత్ర దేశం (డెమోక్రాటిక్ రిపబ్లిక్)లో ప్రజాస్వామ్య ఫలాలు ప్రతి ఒక్క పౌరుడికి జాతి, మత, వర్ణ, లింగ వివక్షత లేకుండా అందాలి. ఆర్టికల్స్ 14 నుండి 28 వరకు ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం, మత స్వాతంత్ర్యం గురించి సమాన హక్కులు ఉంటాయని హామీ ఇవ్వబడింది. ఆర్టికల్స్ 29, 30లలో మైనారిటీ వర్గాలకు వారి భాష, లిపి, సంస్కృతులు రక్షిస్తాయని హామీ ఇవ్వబడింది. ఆర్టికల్ 31లో ఆస్తి, హక్కుల గురించి న్యాయవిరుద్ధంగా అన్యాయం జరిగింది" అని ఆమె నిష్కర్షగా చెప్పారు. "వయోజన ఓటు హక్కు ప్రవేశపెట్టి మన దేశం ఓ అడుగు ముందుకు వేసింది. ఈ పద్ధతి ప్రభావవంతంగా పనిచేయాలంటే దేశంలో నిరక్షరాస్యులైన అధిక జనాభాకు పౌరసత్వ బాధ్యతలు గురించి సరైన అవగాహన కల్పించాలి" అన్న మాటలు దేశ ప్రజల నాడి చూసి చెప్పినట్లుగా ఉన్నాయి. "లింగ వివక్షతకు తావు ఇవ్వకుండా డ్రాఫ్టు కాన్‌స్టిట్యూషన్ తయారు చేసినందుకు మహిళగా నేనెంతో తృప్తి చెందాను. కొత్త రాజ్యాంగంలో మహిళలు సమాన అవకాశాల కోసం ఎదురు చూడవచ్చు" అన్నారామె.

జాతీయ భాష గురించి చర్చ జరుగుతున్నప్పుడు ఆమె "ఇప్పుడు దేశంలో చెలామణి అవుతున్న భాష హిందుస్థానీ, ఉర్దూ హిందీల మిశ్రమం. హిందీకంటే హిందూస్థానీయే ఎక్కువమంది మాట్లాడుతున్నారు. నలభై మిలియన్ల ముస్లిమ్‌లను ఒక్కసారిగా భాషను

మార్చుకోమంటే కష్టమే. హిందుస్థానీ జాతీయ భాషగా అమలు పరచాలంటే హిందీ మాట్లాడని ప్రాంతాల వారికి కనీసం కొన్ని సంవత్సరాల వ్యవధి ఇవ్వాలి" అన్నారామె.

లేజిస్లేచర్లలో మైనారిటీ వర్గాలకు ప్రత్యేకంగా సీట్లు రిజర్వు చేయడాన్ని ఆమె వ్యతిరేకించినా, "ఏ మైనారిటీ వర్గమైనా, ఇండియాలో ఎక్కడ ఉన్నా, వారికో ప్రత్యేక భాష, లిపి ఉన్నట్లయితే వారి పిల్లలకు ప్రాథమిక విద్య వారి మాతృభాషలోనే ఉండాలి" అని ఆమె ప్రతిపాదించారు.

ఆర్టికల్ 31లో ఆస్తి హక్కుల విషయం గురించి చర్చ జరిగినప్పుడు, ఆమె ఇలా అన్నారు- "నగర నిర్మాతలువలె రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని అన్ని కాలాలకు చెందేటట్లు, అందరికీ చెందేటట్లు మూలసూత్రాల్ని సిద్ధాంతాలు రూపొందించి అందరికీ ఆమోదయోగ్యంగా అమలు పరచడానికి వీలుగా చేయాలి. రాజ్యాంగం ఒక పార్టీకిగాని, ఓ వర్గానికిగాని, ఒక ప్రాంతానికిగాని అనుకూలంగా ఉండకూడదు" అని బేగమ్ రసూల్ హెచ్చరించారు. జమీందారీ రద్దు విధానం కొన్ని ప్రాంతాలలో అమలుపరచలేదు, యునైటెడ్ ప్రావిన్స్, బీహార్, మద్రాసు ప్రాంతాలను మినహాయించారు. ఈ మూడు ప్రాంతాలలో ప్రజల ఆస్తిపైన వారికి న్యాయపరమైన హక్కులు లేవు. వారికి జీవనాధారమైన వ్యవసాయ భూముల ఆస్తిపైన ప్రాథమిక భూములపైనా న్యాయపరమైన హక్కు లేకపోవడం రాజ్యాంగంపై మచ్చలా మిగిలిపోతుంది. అందమైన చిత్తరువులో అసహ్యకరమైన మచ్చలా ఉంటుంది" అని ఆమె వ్యాఖ్యానించారు.

17 జూలై, 1947 నాడు రాజ్యాంగ పరిషత్తు 'మోడల్ ప్రావెన్షియల్ కాన్స్టిట్యూషన్' (క్లాజ్ 12)పై చర్చలు జరిపింది. మంత్రుల నియామకంపై అహమ్మద్‌ఖాన్ ప్రతిపాదించిన ఎమెండ్‌మెంట్‌ను సవరిస్తూ బేగమ్ రసూల్ ఇలా అన్నారు- "బ్రిటిష్ పాలిత పరగణాలకు నామినేట్ చేయబడిన మంత్రులకు స్వయంనిర్ణయాలు తీసుకొనే హక్కులేదు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలలో బలహీనమైన మంత్రివర్గం వలన ప్రభుత్వం కూలిపోవడం మనం చూస్తున్నాం. రెండు పార్టీల నుండి మంత్రివర్గం ఏర్పరచవలన ఇలా జరుగుతుంది. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఇప్పుడిప్పుడే అమలు పరచబోతున్న ఇండియాలో స్థిరంగా దృఢంగా ఉండే మంత్రివర్గం ఉండాలి. పార్టీ ఇష్టాఇష్టాల వలన ప్రభావితం కాకూడదు. అందుచేత లేజిస్లేచర్ చేత ఎన్నుకోబడిన మంత్రుల పదవీ కాలానికి తగిన వ్యవధి ఉన్నట్లయితే మంత్రులు సరిగ్గా ప్రభావితం చేయగల పనులు చేపట్టగలరు. మంత్రివర్గ పదవీకాలం, అసెంబ్లీ జీవితకాలం ఏకకాలంలో ఉన్నట్లయితే సమన్వయం కుదురుతుంది. అమెరికా విధానంలో ప్రెసిడెంటు తన కార్యనిర్వాహక వర్గాన్ని నామినేట్ చేసుకొంటాడు. మన దేశం ఆ పద్ధతికి సిద్ధంగా లేదు. స్విస్ (స్విట్జర్లాండ్) పద్ధతిలో లెజిస్లేచర్ కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకొంటుంది. అటువంటి విధానం మన దేశానికి తగినదిగా ఉంది. అన్నారామె. చాలా విషయాలు రాజ్యాంగం దృష్ట్యా అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, స్విట్జర్లాండు నుండి తీసుకొన్నాం. మంచి విషయాలను ఇతర రాజ్యాంగాల నుండి తీసుకోవడం తప్పు కాదు కాని మన దేశ ప్రయోజనాలు, సంక్షేమం దృష్టిలో పెట్టుకోవాలి" అన్నారామె.

రాజ్యాంగ పరిషత్తు చర్చలలో పాల్గొంటూ ఆమె చేసిన ప్రసంగాల వలన ఆమె జాతీయ స్థాయి వ్యక్తి (నేషనల్ ఫిగర్)గా గుర్తింపు పొందారు. రిజర్వేషన్ల గురించి ముస్లిములు, సిక్కులు గట్టిగా ప్రతిఘటించారు. కానీ దేశ విభజన జరిగాక ఈ విషయం పై వారు పునరాలోచన చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. సర్దార్ పటేల్ అధ్యక్షతన ఓ సబ్‌కమిటీ ఏర్పరచి రిజర్వేషన్ల గురించి సమీక్షించారు. అందులో బేగమ్ రసూల్ ప్రధాన సభ్యురాలు. ఆమె ముస్లిమ్ రిజర్వేషన్ల గురించి వారితో చర్చలు జరపడానికి కీలక పాత్ర ధరించారు. దేశ విభజన నేపథ్యంలో జరిగిన మారణహోమ సమయంలో ఆమె ఎంతో ధైర్యంగా ఈ విషయాన్ని చర్చించారు. ఆమె తన ఆత్మకథలో ఇలా పేర్కొన్నారు- "నేను ముస్లిమ్ (మతస్థులు) వర్గంలో అత్యంత ముఖ్యమైన విషయాన్ని చర్చించడానికి సమయం ఇవ్వమని పటేలును అడిగాను. ఆయన వెంటనే ఒప్పుకొని ఈ విషయంపై చర్చను వాయిదా వేశారు. ముస్లిమ్ వర్గ నాయకుడు నవాబ్ ఇస్మాయిల్‌ను

సంప్రదించి యునైటెడ్ ప్రావిన్స్ ఏరియా (యు.పి.ఏ.) అసెంబ్లీ కౌన్సిలులో రిజర్వేషన్ల గురించి చర్చించడానికి మీటింగు ఏర్పరచాలి. లక్నోలో చర్చలు జరిగాయి. మారిన పరిస్థితుల దృష్ట్యా సీట్ల రిజర్వేషన్ అర్థం లేదని అందరూ ఒప్పుకొన్నారు. వారందరి తరఫున ఈ విషయం నివేదించడానికి నాకు అధికారం ఇచ్చారు. అది ఆ పరిస్థితుల్లో గొప్ప కీలకమైన మలుపు (టర్నింగ్ పాయింట్) ఈ సంకేతాన్ని గ్రహించి సిక్కు మతస్థులు ప్రత్యేక రిజర్వేషన్ల గురించి లేవనెత్తిన ఆందోళనను నిలిపి, వారి డిమాండ్‌ను ఉపసంహరించుకొన్నారు. "రిజర్వేషన్లు రద్దు చేయాలని నేను గట్టిగా వాదించాను. మతం పేరిట రిజర్వేషన్లు కోరి ఏర్పాటు వాదాన్ని బలపరచి వేరుపడితే అది మైనారిటీ వర్గాలకు ఆత్మహత్యా సదృశ్యం అవుతుంది'' అన్నారామె. 1948లో సర్దార్ పటేల్ అధ్యక్షతన జరిగిన మీటింగులో ఆమె ఇలా అన్నారు- "రిజర్వేషన్లు స్వయంనాశక ఆయుధంలా అనిపిస్తుంది. ఎందుచేతనంటే మైనారిటీ వర్గాలు ఎప్పటికీ మెజారిటీ వర్గాలు స్నేహసౌహార్ధాలు సంపాదించలేకపోతాయి. దీనివలన వేర్పాటువాదం కుల, మత, తత్వవాదం స్థిరంగా ఉండిపోతాయి. కుల మత తత్వాలు పూర్తిగా సమసిపోవాలంటే రిజర్వేషన్లు ఉండకూడదు.'' (నేటి భారతదేశంలో రిజర్వేషన్లు మరీ ఎక్కువగా పెరిగి కుల, మత, ప్రాంతీయవాదులు దేశాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తున్నాయో మనం చూస్తున్నాం). ఆ రోజుల్లో మైనారిటీ రిజర్వేషన్లను ప్రతిఘటించిన ఏకైక ముస్లిమ్ వనిత ఆమె. తర్వాత 1999లో మత, వర్గ విభేదాలు హిందూత్వ భావజాలం ప్రబలిపోతోంటే "ఇప్పుడు మళ్ళీ కొత్తగా ఆలోచించాల్సి వస్తోంది. ముఖ్యంగా ముస్లిమ్‌ల ఆర్థిక, సామాజిక పరిస్థితుల గురించి'' అని వేదన చెందారామె. 1909లో బ్రిటీష్ వలస పాలకులు మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పరచినందుకు ఆమె ప్రతిఘటించారు. మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలు రద్దు చేయించినందుకు ఆమె ముస్లిముల నుండి తీవ్ర విమర్శకు గురి అయ్యారు. అదే విధంగా ఆమె జమిందారీ కుటుంబానికి చెందినప్పటికీ జమీందారీ వ్యవస్థ రద్దుకు మద్ధతునిచ్చారు. 1939లో యునైటెడ్ ప్రావిన్స్ లెజిస్లేచర్‌లో మాట్లాడుతూ, భూస్వాములకంటే భూమిని దున్నే రైతులకు హక్కులివ్వాలని ఆమె అన్నారు. రాజ్యాంగ పరిషత్తులో చర్చలలో పాల్గొన్నప్పుడు ఆమె వారసత్వ హక్కులు రైతుకు చెందాలని వాదించగా చాలామంది జమిందార్లు ఆమె ప్రతిపాదించిన బిల్లును వ్యతిరేకించారు.

8 నవంబరు, 1948 రాజ్యాంగ పరిషత్తు ప్రాథమిక హక్కులు మైనారిటీ హక్కుల గురించి చర్చించడానికి సమావేశమయింది. బేగమ్ రసూల్ తన ప్రతిపాదనలు చేసే ముందు, డ్రాఫ్ట్ కానిస్టిట్యూషన్ ఛైర్మన్ డా. అంబేద్కర్‌ను కమిటీ సభ్యులను డ్రాఫ్ట్‌ను ఎంతో సమర్థవంతంగా తయారు చేస్తున్నందుకు అభినందించారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, నిర్దేశిక సూత్రాలు అన్ని ప్రాంతాలలో, అన్ని జిల్లాలలో ఆచరణలో పెట్టాలని, అవి సరిగ్గా అమలు పరిచారో లేదా పర్యవేక్షించడానికి ఒక అధికార బృందం ఉండాలని సూచించారు. ప్రాథమిక హక్కులపై విధించిన పరిమితుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక చేత్తో ఇచ్చి మరొక చేతితో లాక్కున్నట్లు ఉంది. ప్రాథమిక హక్కుల్ని లెజిస్లేచర్ చట్టాలు మార్చకూడదు. ప్రాథమిక హక్కుల బిల్లులో మినహాయింపులు, సడలింపులు చేయడానికి వీలుగా ఉంది, ఇప్పుడు మనం చేసిన ప్రాథమిక హక్కుల బిల్లును ముందు కాలంలో లెజిస్లేచర్ చట్టాలు సులభంగా మార్చేయడానికి అవకాశం ఉంది'' అని అందులో ఉన్న లోపాల్ని సహేతుంగా చూపించారామె. ఆమె ప్రత్యేక నియోజక వర్గాలు మైనారిటీ వర్గాలకు ఎందుకు వద్దన్నారో సహేతుకంగా వివరించారు. "నేను ముస్లిములు అధిక సంఖ్యలో ఉన్న యునైటెడ్ ప్రావిన్స్ నుండి వచ్చాను. పదేళ్ళపాటు ముస్లిమ్ స్త్రీ, పురుషుల సమూహంలో పనిచేశాను. వాళ్ల ఆలోచనా సరళి ఎలా ఉంటుందో నాకు కొంతవరకైనా తెలుసు. ఆర్థికంగా, విద్యాపరంగా, వెనుకబడినా, ముస్లిములలో రాజకీయ అవగాహన ఉంది. వారిలో రాజకీయ చైతన్యం ఉంది. విభజన తర్వాత పాకిస్థాన్ వెళ్ళదలుచుకొన్న ముస్లిమ్‌లు అక్కడకు వెళ్ళిపోయారు. ఇక్కడే ఇండియాలో స్థిరపడదలుచుకొన్నవారు స్నేహపూర్వకంగా అధిక

సంఖ్యాకులైన హిందువులతో అన్యోన్యంగా ఉండాలనుకొంటారు. వారి జీవితాలను పరిస్థితులకు తగినట్లుగా, ప్రస్తుత వాతావరణంలో ఇమిడేటట్లుగా చేసుకొంటారు. ఈ రెండేళ్ళలో జరిగిన మార్పులు చూస్తూంటే దేశ చరిత్ర దుఃఖపూరితంగా ఉంది. ఇప్పుడు ముస్లిములే ఎక్కువగా బాధితులు. వాళ్ళ జీవితాలు, ఆస్తులు, అపాయకర స్థితిలో ఉన్నాయి. అనిశ్చిత స్థితి నెలకొంది. ముస్లిములలో అభద్రతా భావం, రిజర్వేషన్లు లేకపోతే మళ్ళీ లెజిస్లేచర్‌కు రాలేమనే భయం ఉంది. అందుచేత నేను ముస్లిమ్ సోదరుల్ని ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోంటున్నాను. మైనారిటీ వర్గమైన ముస్లిమ్‌లకు రిజర్వేషన్లు ఉన్నట్లయితే మెజారిటీ వర్గం వారు "వాళ్ళకు (మైనారిటీ వర్గం వారికి) కొన్ని నియోజకవర్గాలు ఇద్దాం" అంటారు. ఈ ఏర్పాటు వలన మెజారిటీ వర్గం వారి సౌహార్ద్రత మనకు లభించదు. మైనారిటీ వారికి ప్రత్యేక నియోజక వర్గాలు ఉన్నట్లయితే మైనారిటీ వర్గం ఓట్లు మాత్రమే లభిస్తాయి, మెజారిటీ వర్గం మద్దతు లభించదు. ప్రత్యేక నియోజకవర్గాలు లేనట్లయితే మనకు హాని జరుగుతుంది అని ముస్లిములు అనుకొంటున్నారు. కాని అటువంటి హాని ఏమీ జరగదు. కొన్ని సీట్లు రాకపోయినా, ముస్లిములకు మెజారిటీ వర్గం మద్దతు లభిస్తుంది" అన్నారామె.

కామన్‌వెల్త్‌లో భారతదేశానికి సభ్యత్వం గురించి ఆమె మద్దతు ఇస్తూ ఆమె ఇలా అన్నారు- "కామన్‌వెల్త్‌లో సభ్యత్వం భారతదేశాన్ని ఉన్నతంగా అత్యున్నత స్థాయిలో నిలబెట్టింది. ప్రపంచ శాంతికై కామన్‌వెల్త్ దేశాలు కృషి చేస్తున్నప్పుడు కామన్‌వెల్త్‌లో ఉన్నట్లయితే ఇండియా, విశ్వశాంతికి తోడ్పడగలదు. మహాత్మాగాంధీ నాయకత్వంలో ఎన్నో ఏళ్ళు శాంతియుత పోరాటంలో పాల్గొని స్వాతంత్ర్యం పొందిన ఇండియా ఆసియా ఖండానికే కామన్‌వెల్త్‌లో నాయకత్వం వహించబోతోంది. ఇండియాను 150 ఏళ్ళు పాలించిన, గ్రేట్ బ్రిటన్ ఇక్కడ నుంచి వెళ్ళిపోయాక, మన దేశంతో స్నేహ, సౌహార్దాలు పొందడానికి స్నేహ హస్తం చూపుతోంది. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల అపనమ్మకం, అనుమానాలతో ఉండే పాత సంబంధాలు సడలించి స్నేహ హస్తం అందుకొనే ఘనత మన దేశానిది, మన దేశ ప్రధానమంత్రిది. కామన్‌వెల్త్‌లో సభ్యత్వం వలన మన దేశానికొచ్చే ప్రయోజనం ఏముందని కొందరు వ్యతిరేకించారు. కానీ మన దేశ పరువు ప్రతిష్టలు కామన్‌వెల్త్ సభ్యత్వం వలన ఇనుమడిస్తాయి."

కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీలో ఆమె స్వరం సుస్థిరంగా, దృఢంగా నిలిచింది. ఆమె ప్రసంగాల్లో స్పష్టత, ధ్యేయం, ఆశాభావంతో పాటు సభ్యులందరినీ ప్రభావితం చేసే శక్తి ఉంది. జమీందారీ బిల్లును సభలో ప్రవేశ పెట్టే ముందు, ఆ బిల్లును సెలెక్ట్ కమిటీ ముందు ఉంచారు. బేగమ్ రసూల్ ఆ కమిటీ సభ్యురాలు. ఆ బిల్లును నిశితంగా పరిశీలించి ఆమె ఇలా వ్యాఖ్యానించారు. "జమీందారీ ఆస్తులను, జమీందారీ వ్యవస్థ రద్దు చేసి, స్వాధీనపరచుకొన్నప్పుడు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం సరిగ్గా లేనట్లయితే, కోర్టును ఆశ్రయించే హక్కు వారికి ఉంది. కొన్ని ప్రాంతాలలో, ఆస్తులు స్వాధీనపరచుకొనేందుకు 'లెజిస్లేషన్ పాస్' చేసినప్పుడు నష్టపరిహారం విషయంలో న్యాయం జరగనప్పుడు కోర్టును ఆశ్రయించే హక్కు లేదనడం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లవుతంది" ఆమె తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా అధ్యక్షులు ముగించమని అడిగారు. ఆమె యునైటెడ్ ప్రావిన్స్ గురించి చెప్పి ముగిస్తానని ఇలా అన్నారు- "యునైటెడ్ ప్రావిన్స్‌లో లెజిస్లేచర్ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా జమీందారీ ఆస్తులకు నష్టపరిహారం చెల్లించే పరిస్థితిలో లేమని, యునైటెడ్ ప్రావిన్స్ ప్రధానమంత్రి ఏ బాధ్యతా తీసుకోవడం లేదు. ఇటువంటి స్థితిలో ఆర్టికల్ 24 ను ప్రాథమిక హక్కుల చట్టం నుండి ఉపసంహరించాలి లేదా క్లాజ్ (4) క్లాజ్ (6)లను తీసివేయాలి. యునైటెడ్ ప్రావిన్స్‌లో దాదాపు కోటి ప్రజలు జమిందారీ వ్యవస్థలోనే ఉన్నారు. ప్రభుత్వం వారికివ్వాలనుకొన్న నష్టపరిహారం చాలా తక్కువ. వాళ్ళు జీవితాలు ఎలా గడపాలి? యు.పి. ప్రధానమంత్రి వాళ్ళ గతి గురించి ఆలోచించారా? ఏ విధమైన భృతి కల్పించకుండా వారిని రోడ్ల మీద పడేశారు. జమీందారీ వ్యవస్థ పనిచేసిన వారందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్య సహాయం, ప్రతి ఒక్క పౌరునికి జీవనోపాధి కల్పించినట్లయితే మేము


నష్టపరిహారం అడగం" అంటూ యథార్థ స్థితిని నివేదించి ప్రజలకు న్యాయం చేకూర్చమని అడిగారు.

1950 నుండి 1952 వరకు ఆమె లేజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్నారు. 1952లో బేగమ్ రసూల్, అమ్ము స్వామినాథన్, రాజకుమారి అమృత్‌కౌర్‌వలె రాజ్యసభ సభ్యురాలిగా ఎంపిక అయ్యారు. స్వాతంత్ర్యం ముందు, తర్వాత కూడా చాలా ముఖ్యమైన పదవుల్ని అలంకరించారు. వివిధ మంత్రిత్వ శాఖల్ని సమర్థవంతంగా నిర్వహించారు. 1969 నుండి 1989 వరకు ఆమె యు.పి. (ఉత్తరప్రదేశ్) లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యురాలు. 1969-1971లో ఆమె సోషల్ వెల్‌ఫేర్ & మైనారిటీస్ శాఖకు మంత్రిగా వ్యవహరించారు. ఇరవైఏళ్ళపాటు, ఆమె ఇండియన్ ఉమెన్ హాకీ ఫెడరేషన్‌కు ప్రెసిడెంటుగా ఉన్నారు. హాకీ అసోసియేషన్ ప్రెసిడెంటుగా ఆమె ఇలా అన్నారు- "ఆంగ్లో - ఇండియన్ హాకీ ఆటగాళ్ళు పెద్ద ప్రవాహంలా రావడం వలన, మహిళా హాకీ టీములు సన్నగిల్లాయి.

1947 (స్వాతంత్ర్యం రాక ముందు) ముందు ఆంగ్లో - ఇండియన్లకు హాకీపై మంచి పట్టు ఉండేది. నేను క్రమేపీ దేశంలో వివిధ ప్రాంతాలలో హాకీ ఆడడానికి మహిళలను ప్రోత్సహించాను. ముఖ్యంగా ఆడపిల్లలు హాకీ ఆడడానికి వేసుకొనే డ్రెస్ విషయంలో వెనుకంజ వేశారు. భోపాల్, యు.పి. అమ్మాయిలు సల్వార్, కమీజ్ వేసుకొని ఆడేవారు. ఎలాగైతేనేం, అమ్మాయిల్ని హాకీ డ్రెస్ వేసుకొని ఆడడానికి ఒప్పించాను." తర్వాత ఆమె ఏషియన్ ఉమెన్స్ హాకీ ఫెడరేషన్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు. భారత మహిళా హాకీ కప్పు ఆమె పేరున ఇవ్వబడింది. ఆమెకు క్రీడారంగంలో అత్యంత శ్రద్ధ ఉంది. పురుషులు ధరించే క్రికెట్ దుస్తులు ధరించి ఆమె 'గుడ్ విల్ మ్యాచ్'లో ప్రెసిడెంట్ వర్సెస్ ప్రైమ్‌మినిస్టర్ టీమ్‌లో బ్యాటింగ్ చేశారు 1952లో.

హాకీ కెప్టెన్ పని చేసిన ఎల్వేరా బ్రిటో (Elvera Britte) బేగమ్ రసూల్ చేసిన కృషిని ప్రశంసిస్తూ ఇలా అన్నారు- "బేగమ్ అయిజాజ్ రసూల్ హాకీ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టక మునుపు స్త్రీల హాకీకి అసలు గుర్తింపే లేదు. ఆమె నాయకత్వంలో మిగతా కమిటీ సభ్యులతో హాకీ ఎంతో అభివృద్ధి చెందింది. హాకీ క్రీడ ప్రమాణాలు పెంచడానికి ఆమె హాకీ ఆటలో ప్రముఖులైన వ్యక్తులను కమిటీలలో వేసేది. బేగమ్ ఉనికి, ఆమె ప్రభావం వలన నేషనల్ ఛాంపియన్‌షిప్, టెస్ట్ సిరీస్‌లు ఆడటంవంటి ఎన్నో కార్యక్రమాలు కొనసాగాయి. జపాన్, శ్రీలంక దేశాలకు టీములు పంపి భారతీయ మహిళా హాకీ టీముకు పేరుప్రఖ్యాతులు వచ్చేలా చేసేవారు" అన్నారు.

1937 నుండి 1989 వరకు బేగమ్ రసూల్ జీవితం రాజకీయ రంగంలో సాహసోపేతంగా గడిపారు. కాన్‌స్టిట్యూషనల్ అసెంబ్లీకి ఎంపిక అయిన 28 ముస్లిమ్ లీగ్ సభ్యులలో ఒకే ఒక ముస్లిమ్ వనిత గంభీరమైన స్వరం వినిపించింది. తన వాదనలను మైనారిటీ వర్గాల సమస్యల మీద కేంద్రీకరించింది. ఆమె తన ఆత్మకథలో జీవితంలో జరిగిన సంఘటనలు హాయిగా కథ చెప్పుకున్నట్లు లలితంగా చెప్పారు. 'పర్దా నుండి పార్లమెంటుకు' నాటి రాజకీయ నేపథ్యంతో ఆమె జీవితం ఎలా పెనవేసుకుపోయిందో వివరిస్తుంది. ఆమె కుమార్తె జీనత్ అన్నట్లు ఆమెకు రావలసినంత గుర్తింపు రాలేదు, చరిత్రకారులు ఆమెకివ్వవలసినంత ప్రాముఖ్యతా ఇవ్వలేదు." ఎన్నో దేశాలు విస్తృతంగా పర్యటించిన బేగమ్ రసూల్ 1953లో ప్రధానమంత్రి 'గుడ్‌విల్ డెలిగేషన్' (సౌహార్ద్ర బృందం) తరఫున జపాన్‌కు, ఇండియన్ పార్లమెంటరీ డెలిగేషన్ తరఫున టర్కీకి 1955లో వెళ్ళారు. ఆమెకు సాహిత్యంలో కూడా చక్కని అభినివేశం ఉంది. ఆమె 'జపాన్‌లో మూడు వారాలు' అనే పుస్తకం వివిధ పత్రికలకు వ్యాసాలు వ్రాశారు. ఆమె ఆత్మకథ 'పర్దా నుండి పార్లమెంటుకు' (From Purdah to Parliament), 'భారతీయ రాజకీయ రంగంలో ముస్లిమ్ వనిత' అని రచించారు. ఆమె చేసిన అమూల్యమైన సామాజిక సేవకు భారత ప్రభుత్వం 2000 సంవత్సరంలో 'పద్మభూషణ్' బిరుదుతో సత్కరించింది.



## రాజ్యాంగ పరిషత్తులో మహిళలు-6
# ఆనీ మాస్‌కేర్నీ
(Annie Mascarene)
(1902 - 1963)

స్వాతంత్ర్య యోధురాలు ఆనీ మాస్‌కేర్నీ బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ట్రావెన్‌కోర్ సంస్థానాన్ని నిర్భయంగా ఎదుర్కొంది. ధైర్యసాహసాలకు మారు పేరైన ఆనీ, లాటిన్ క్యాథలిక్ కుటుంబంలో 6 జూన్ 1902లో జన్మించింది. ఆమె తండ్రి గేబ్రియల్ మాస్‌కేర్నీ ట్రావెన్‌కోర్ స్టేట్‌లో గవర్నమెంట్ ఆఫీసర్‌గా పని చేశారు. ఆనీ మహారాజా కాలేజీ ట్రావెన్‌కోర్‌లో ఎమ్.ఎ. హిస్టరీ, ఎమ్.ఎ. ఎకనామిక్స్, డబుల్ డిగ్రీతో పట్టభద్రురాలైంది. కొన్నాళ్లు ఆమె సిలోన్ వెళ్లి లెక్చరర్‌గా పని చేసింది. తర్వాత తిరిగి ట్రావెన్‌కోర్‌కి వచ్చి మహారాజా కాలేజిలో ఎల్.ఎల్.బి. (లా కోర్సు) చేసింది.


ఆనీ మాస్‌కేర్నీ

1925-35 మధ్య కాలంలో ఎంతోమంది యువతీ యువకులు కార్యకర్తలుగా కాంగ్రెస్‌లో చేరి ఉద్యమాన్ని బలపరుస్తున్నారు. ఆనీ ట్రావెన్‌కోర్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరిన ప్రథమ మహిళ. అనతి కాలంలో ఆమె స్టేట్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో భాగమైంది. అక్కమ్మ చెరియన్, పట్టం థాను పిళ్ళైలతో కలసి ఉద్యమ నాయకురాలయింది. బ్రిటీష్ ప్రభుత్వం జాతీయోద్యమాన్ని అణచివేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. నాయకుల్ని జైల్లో పెట్టి హింసిస్తోంది. ఆనీ చురుకుగా రాజకీయాల్లో పాల్గొనడం వలన 1932-47 మధ్యకాలంలో ఆమెను ఎన్నోసార్లు బ్రిటిష్ పాలకులు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. 1938 ఏప్రిల్‌లో ఆమెపై ఎన్నోసార్లు హత్యా ప్రయత్నాలు జరిగాయి. ఆమె బంధువుల ఆస్తిపై దాడులు జరిగాయి. ట్రావెన్‌కోర్ రాజ్య పాలకులకు ఆమె ట్రావెన్‌కోర్ పౌరులతో ఉద్యమంలో పనిచేయటం అవరోధంలా అనిపించింది. ఆనీకెన్నో బెదిరింపులు, వీటి గురించి ఆమె కంప్లైంట్ ఇచ్చినా లాభం లేకపోయింది.

దేశానికి స్వాతంత్ర్యం వస్తే తమ రాజ్యాన్ని కోల్పోతామనే భయంతో సంస్థానాధీశులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. ట్రావెన్‌కోర్ దివాన్ సి.పి. రామస్వామి అయ్యర్ 1947 తర్వాత ట్రావెన్‌కోర్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలనే పట్టుదలతో ఉన్నాడు. ఆనీ ట్రావెన్‌కోర్ స్టేట్‌ను స్వాతంత్ర్య భారతదేశంలో విలీనం చేయాలనే దృఢ సంకల్పంతో కృషి చేస్తోంది. ఆమె అద్భుతమైన వాక్పటిమగల వ్యక్తి. ఆమె తన ఉపన్యాసాలతో ప్రజలను ప్రభావితం చేస్తోందని 1938లో 18 నెలలు రాజద్రోహం కేసు పెట్టి ఆమెను నిర్బంధించారు.

1942లో 2 సంవత్సరాలు ప్రజలను రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇస్తోందని జైల్లో పెట్టారు.

1946లో ఆరు నెలలు ఆమె పుకార్లు పుట్టించి ప్రజలను హింసాయుత కార్యకలాపాలకు పాల్పడేలా చేస్తోందని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆమె గురించి వార్తాపత్రికలలో వ్యతిరేకంగా రిపోర్టులు రావడంతో ఆ రిపోర్టు చదివిన గాంధీజీ ఆమెను మందలించారు.

1932లో లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎగువ, దిగువ సభలతో ఏర్పరిచారు. అటువంటి అసెంబ్లీ ఏర్పరచడం ఇండియాలో మొదటిసారి. స్టేట్ కాంగ్రెస్‌లో ఉండగా ఆనీ రాజకీయ రంగంలో 'పాలసీ మేకింగ్', రాజకీయ చతురత, రాజ్య తంత్రంలో ఆరితేరింది. లెజిస్లేటివ్ అసెంబ్లీలో అన్ని కులాలు, మతాల ప్రాముఖ్యత లేదు.

1938-39 మధ్య కాలంలో ఆనీ ట్రావెన్‌కోర్ ప్రభుత్వంలో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. 1944లో ఆమెను ట్రావన్‌కోర్ స్టేట్ కాంగ్రెస్ సెక్రటరీగా ఎన్నుకొన్నారు. 1946లో రాజ్యాంగ పరిషత్తు (కాన్‌స్టిట్యూఎంట్ అసెంబ్లీ)కి ఎంపికయిన 15 మంది మహిళలలో ఆనీ ఒకరు. రాజ్యాంగ సభలో ఆనీ మాస్‌కేర్నీ

వాదనలు ట్రావన్‌కోర్ సంస్థానం (ప్రిన్స్ లీ స్టేట్)లో ఎలా ఉండేవో అవే సిద్ధాంతాలు, అదే ఉత్సాహం, ఆమె వాదనలు ఆమె నమ్మిన సిద్ధాంతాలపై ఆధారపడి ఉన్నాయి. రాజ్యాంగ పరిషత్తు సభాపతికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆమె ఇలా అన్నారు -

"ఇక్కడున్న కొద్దిమంది మహిళల తరపున మీరు మాకు తగినంత రక్షణ, ఈ సభలో మా ఉద్దేశ్యాలు చెప్పడానికి అవకాశాలు ఇస్తారని ఆశిస్తున్నాను." ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకై ఆమె ఎంత పాటుపడ్డారో ఆమె రాజ్యాంగ పరిషత్తులో ఇచ్చిన ప్రసంగాలలో తెలుస్తుంది. ఆర్టికల్ 289 గురించి డా. అంబేద్కర్ ఇచ్చిన వివరణతో ఆమె సంతృప్తి చెందినది. కానీ కె.ఎమ్. మున్షీ ప్రావిన్షియల్ ఎలక్షన్లకు కేంద్ర పర్యవేక్షణ ఉండాలి అని ప్రతిపాదించినప్పుడు ఆమె ఇలా అన్నారు- "ప్రావెన్స్‌లో ఉన్న ప్రజలు వారి ప్రతినిధులను ఎన్నుకోవడంలో ఎటువంటి 'కంట్రోల్', 'సూపర్ విజన్', 'డైరెక్షన్లు' లేకుండా ఎన్నుకునే హక్కు ఉందని నేను నమ్ముతున్నాను. అధికార కేంద్రీకరణ విజయవంతమైన ప్రజాస్వామ్యానికి అవసరం. కానీ విపరీతమైన కేంద్రీకరణ ప్రజాస్వామ్య సంస్థల రూపురేఖలను మార్చేస్తాయి. కేంద్రం 'కస్టోడియన్ ఆఫ్ జస్టిస్' (న్యాయ పరిరక్షణ బాధ్యత)గా పాత్ర వహించకూడదు. ఈ రోజు మిస్టర్ మున్షీ ఆర్టికల్ 289 గురించి చర్చిస్తూ ప్రయోజనం (ఎక్స్‌పీడియన్సీ) వాస్తవికత (రియాలిటీ) దృష్ట్యా ప్రావిన్స్ ప్రజల హక్కులు కాపాడాలని అన్నారు. ఈ రోజు 'ఉపయోగకరం', 'యదార్థం' అన్నది రేపు (భవిష్యత్తులో) కాకపోవచ్చునని చరిత్రలో దృష్టాంతాలు రుజువు చేశాయని ఆనీ, రోమ్, నెపోలియన్ సంస్కరణలు, ఇంగ్లాండ్‌లో క్రాంవెల్ ప్రతిపాదనలు ఉదాహరణలుగా ఇచ్చారు. ఎలక్షన్ కమిషన్ నియామకం గురించి ఆమె సూటిగా చెబుతూ మనం ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలు (రూడిమెంటరీ ప్రిన్సిపల్ ఆఫ్ డెమోక్రసీ) చేయడానికి ఇక్కడ ఉన్నాం. అంతేగాని వచ్చే ఎన్నికలకు కమిషన్ వేయడానికి కాదు. మనం చేసే సిద్ధాంతాలు భావితరాలకు, దేశానికి పనికొచ్చేవిగా ఉండాలి. నైతిక సిద్ధాంతాలు పరిగణలోనికి తీసుకోవాలి కానీ లాభదాయకమైన సిద్ధాంతాలు కావు. నేను రాజకీయ సిద్ధాంతాలను అధికార నిబద్ధమైన నైతిక సిద్ధాంతాలుగా నమ్ముతాను" అని అన్నారు.

12 అక్టోబరు 1949న, రాజ్యాంగ పరిషత్తులో సర్దార్ పటేల్ దేశంలో ఉన్న చిన్న-చిన్న సంస్థానాలు, పరగణాలను అన్నింటినీ 'ఇండియన్ డొమినియన్'లో విలీనం చేయడం గురించి స్టేట్‌మెంట్ ఇచ్చారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా ట్రావెల్‌న్‌కోర్ స్టేట్‌ను స్వతంత్ర భారతదేశంలో విలీనం చేయాలని కృషి చేస్తున్న ఆనీ ఆ సందర్భంలో ఇలా అన్నారు- "స్టేట్స్ విలీనం గురించి నాకున్న భయాలన్నీ పోయాయి. 'బిస్మార్క్ ఆఫ్ ఇండియా' (పటేల్) వివేకం ఎంత గొప్పదో అర్థం చేసుకోగలం. రక్తపాతం లేకుండా దేశంలో ఉన్న చిన్న-చిన్న సంస్థానాలు, ప్రావిన్సెస్ అన్నింటినీ విలీనం చేసి ప్రజాస్వామ్య దేశంగా ఇండియాను మలచగలిగారు."

ట్రావెన్‌కోర్ స్టేట్‌లో రాజకీయ అనుభవాలు, ట్రావెన్‌కోర్‌ని ఇండియాలో విలీనం చేయాలనే పట్టుదల, ఆనీ మాస్‌కర్నీ భావాల్ని రూపొందించాయి. రాజ్యాంగ పరిషత్‌లో ఉన్న మహిళా సభ్యులందరిలో ఆమె విలక్షణమైనది. ఆమె ఉపన్యాసాలు ఆనాటి కాలంలో (రాజ్యాంగ నిర్మాణ కాలం) నెలకొన్న ఉద్రిక్తతను ప్రతిబింబిస్తాయి.

1948-52 మధ్యకాలంలో ట్రావెన్‌కోర్ - కొచ్చిన్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యురాలిగా ఆనీ సేవలందించింది. 1949-50లో ట్రావెన్‌కోర్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఆరోగ్య శాఖా మంత్రిగా మంత్రిత్వ శాఖను నిర్వహించిన ప్రథమ మహిళ. ఇండిపెండెంట్ అభ్యర్థిగా, తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుండి 1951 ఇండియన్ జనరల్ ఎలక్షన్‌లో ఎన్నికయ్యారు. ఆమె కేరళ నుండి ప్రథమ మహిళా పార్లమెంటేరియన్. ఆ ఎన్నికలలో పార్లమెంటుకు కేరళ నుండి ఎన్నికైన పదిమందిలో ఆమె ఒకరు.

ముత్తంగి వేంకట భారతలక్ష్మి
కాకినాడ. ఫోన్: 944 021 5330.

# రేడియో నాటకం

*– గొల్లపూడి మారుతీరావు*

దాదాపు యాభై సంవత్సరాల క్రితం హిందూ రీడింగ్ రూమ్‌లో ఓ సభ జరిగింది. వేదిక మీద ముగ్గురే ఉన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు అబ్బూరి రామకృష్ణారావుగారు ఆ సభకు అధ్యక్షులు. నేను రేడియో నాటకం గురించి అనర్గళంగా మాట్లాడాను. పోణంగి శ్రీరామ అప్పారావుగారు స్టేజీ నాటకాన్ని గురించి ఇంకా అనర్గళంగా మాట్లాడారు. చివరికి అబ్బూరి లేచి నిలబడ్డారు. “ఇదా రేడియో నాటకానికి, స్టేజి నాటకానికీ తేడా? ఏమయినా నాకు రేడియో నాటకమే గొప్పదనిపిస్తుంది. ఎందుకంటే బాగు లేకపోతే రేడియో వెంటనే ఆపేసుకోవచ్చు. స్టేజి నాటకానికయితే ఆడియన్స్‌లో ఇరుక్కుంటాం” అన్నారు.

ప్రేక్షకులంతా ఫక్కుమని నవ్వారు. కానీ నాకు మాత్రం ఆ మాట చురకలాగ తగిలింది. చాలా సందర్భాలలో రేడియో ప్రసారాలలో జరిగే బోధనా తరగుతలలో ఉద్యోగులతో ఈ విషయం చెప్పకుండా ఉండను. అవసరమనిపించినా, విసుగు పుట్టినా ఎవరితో ప్రమేయం లేకుండా రేడియోని ఆపేసుకునే శ్రోత సౌకర్యమే రేడియో ప్రయోక్తికి సవాలు. ఈ వెసులుబాటే ఆ మాధ్యమానికి హెచ్చరిక. కనువిప్పు. ఇంకా చెప్పాలంటే ఒక హద్దు. అయితే ఈ వెసులుబాటు ప్రసారానికి మాత్రమే పరిమితం. సజావయిన ప్రసారం కలిగించే ప్రభావానికి కాదు. రేడియో ఒకే ఒక శ్రవణేంద్రియం ద్వారానే అలరించే ప్రక్రియ. నిజానికి పంచేంద్రియాలలో ‘అలరింపు’ విషయంలో వినే వ్యక్తి ప్రమేయాన్ని ఎక్కువగా ఆశించే ఇంద్రియం - చెవి. చెవి విన్నదాన్ని విచక్షణ, అభిరుచి పరీక్షించాకే దాని అలరింపు. విన్న విషయం ఆలోచనగా మారి, అనుభూతిగా తర్జుమా అయిన తర్వాతే దాని మంచిచెడ్డలు. రేడియో ఎవరిని అలరిస్తోంది? డ్రాయింగు రూమ్‌లోనో, మరమరాల దుకాణం దగ్గరలో, కిళ్ళీ కొట్టుదగ్గరో, పడక గదిలోనో, రోడ్డు పక్కనో - ఎక్కడయినా, ఎప్పుడయినా, ఎలాగైనా శ్రోతకి అందుతుంది. ఇది ఛాలెంజ్. శ్రోతకి కార్యక్రమాన్ని అందుకునే ప్రయత్నం లేదు. ప్రయత్నం జరగాలనే పట్టింపు లేదు. నాటకం చూడాలనుకున్న ప్రేక్షకుడు - ఆ నాటకానికి మోజుపడి, టిక్కెట్టు కొనుక్కొని, ప్రయత్నించి ఆడిటోరియంలో కూర్చుంటాడు. దీపాలు ఆరుతాయి. తెర లేస్తుంది. ఇద్దరి మధ్యా ఒక Anticipation ఉంది. ఒక ప్రయత్నం ఉంది. ఒక సమన్వయం ఉంది. రేడియో నాటకానికి ఎక్కువమంది కమిటెడ్ శ్రోతలు కారు. ఆ కమిట్‌మెంట్‌ని ప్రయోక్త సంపాదించుకోవాలి. రేడియో నాటకి ప్రారంభమయింది. వంట గదిల్లో పొయ్యి మీద పాయసం తయారవుతోంది. ఇల్లాలి శ్రద్ధ ఆ మేరకి పలచబడుతుంది. మనవడు బండి దిగాడు. ఆ పసివాడి పలకరింత నాటికని బలితీసుకుంటుంది.



గొల్లపూడి మారుతీరావు

రేడియో వెయ్యి రకాలైన ఆకర్షణలతో, అవసరాలతో, ఆటుపోట్లతో సతమతమయే జీవితంలో నిస్సహాయంగా చొచ్చుకు వచ్చే, బలహీనమయిన వినోదం. బలహీనం ప్రసార లోపం కాదు. శ్రోత ప్రయత్నానికి గల హద్దులు.

ప్రపంచ ప్రఖ్యాత యాంకర్ రాబర్ట్ ఫాస్ట్ (నాకంటే 7 రోజులు పెద్ద) తన చిన్నతనంలో అంటే 1947 ప్రాంతంలో రేడియో గురించి రాస్తూ ఇలా అన్నాడు: "Any sense of togetherness and community was more a function of radio... than of - say any news papers, because even the individual listener in a room knows that he or she is part of its shared experience."

ఇప్పుడా shared experienceని టీవీలు దోచుకున్నాయి. ఇక రేడియో నాటకం ప్రయోక్తకి సవాలు. సంగీతాన్ని ఆస్వాదించడానికి కొండొకచో instinct చాలు. కాని నాటక శ్రోతకి అదెంత ప్రాథమికమైనా కొంత intelligence

కావాలి. అరిస్టాటిల్ ప్రతిపాదించిన మూడు యూనిటీలు - time, space, action కేవలం శబ్దం ద్వారానే ప్రతిపాదించాలి. పాత్రల స్వభావాలు, వయస్సు, సన్నివేశం జరిగే స్థలం, పాత్రల వయస్సులు, వారి ఆవేశాలూ, హావభావాలూ - వెరసి అన్నిటికీ ఊతం కేవలం శబ్దమే. ఇది uni-dimensional మాధ్యమం. జరపాల్సింది multi-dimensional కార్యం.

ఈ సవాలుని సమర్థవంతంగా దాటగలిగితే ఏమవుతుంది? మాధ్యమాన్ని ఒడిసి పట్టుకోగల రేడియో కార్యక్రమం ఏం సాధించగలుగుతుంది. రేడియో నాటకం సరాసరి శ్రోత ఆలోచనకి నిచ్చెన వేసే ప్రక్రియ. అంటే ప్రయోక్త కృషికి శ్రోత initiativeని అనుసంధించే ప్రక్రియ. అది కేవలం ప్రాథమిక దశలో.

దమ్మున్న ప్రయోక్త - మాధ్యమాన్ని ఆయుధాన్ని చేయగలిగిన ప్రయోక్త చేతిలో - ఆలోచనను పదును పెట్టగల శ్రోత మరబొమ్మ అవుతాడు. ప్రయోక్త చేవకొద్దీ మర తుపాకీ కూడా కాగలడు. ప్రసారం ఒక ఆయుధం కాగలదు. ఒక నూతన ప్రపంచాన్ని సృష్టించగలదు. ఇది దృశ్యానికి దక్కని కేవలం శ్రవణ ప్రక్రియకు మాత్రమే దక్కే అదృష్టం. ఆలోచనకి ఒక నియతి లేదు. పరిధి లేదు. హద్దు లేదు. ఆలోచన ఆకాశం. శ్రోత మనస్సు అతని సంస్కారం మేరకి, శ్రోత ఆలోచనా ప్రపంచంలోకి ప్రయోక్త చొచ్చుకు రాగలిగిన మేరకి, ఆ అనుభూతి పరిపుష్టం అవుతుంది. అవుతూనే ఉంటుంది. చేసుకున్నవాడికి చేసుకున్నంత. ఆలోచించగలిగినవారికి ఆలోచనకి రెక్కలు తొడగగలిగినంత.

మనస్సులో బొమ్మ రూపు దిద్దుకోవడానికి ప్రయోక్త కొన్ని ఉపాధుల్ని ఏర్పరుస్తాడు. ఆ ఉపాధుల్ని ఆధారం చేసుకొన్న శ్రోత మనస్సు విజృంభిస్తుంది. తన ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకొంటూ పోతుంది. తన ఆలోచనాస్థాయి మేరకి ఆ బొమ్మని భూతద్దంలో నిలుపుతుందా? రంగులు దిద్దుతుందా? అలంకరిస్తుందా? ఏమో! అది ప్రయోక్త దమ్ము. శ్రోత అదృష్టం. రుషి భగవంతుడిని చూశాడు. నిర్వికార, నిరామయమైన ఆ స్వరూపం అతనికి బ్రహ్మానందాన్ని కలగజేసింది. ఆ స్థితిని మాటల్లో వాచ్యం చేయాలని రుషి తాపత్రయం. ఏ భాష దేవుడిని చూసిన అనుభూతిని ఏ మాటల్లో లొంగదీస్తుంది? ఆ మైకంలో రుషి తన అనుభూతికి నిస్సహాయంగా మాటల్ని వెతుకుతున్నాడు. ఆ అనుభూతిని, ఆ ప్లేన్‌లో అందుకోగలిగిన సంస్కారికి లేదు, తన్మయునికి ఆ అనుభూతి అందుతుంది.

ఓ గొప్ప అనుభూతిని volatile మాధ్యమంలో నిచ్చెన వేయగల అపూర్వమైన ఆయుధం 'శ్రవణం'. ఈ దశలో అబ్బూరివారిని మనం క్షమించగలం.

ఇందులో మరొక తిరకాసు ఉంది. ప్రయోక్త తన స్థాయి మేరకి ఒక అనుభూతిని శ్రోతకి అందించాలని ప్రయత్నం చేశారు. శ్రోత మనస్సు ఇంకా గొప్ప స్థాయిలో దాన్ని అందుకుంది. సృష్టకర్తకంటే 'సృష్టి' మరింత ఉన్నతమయి కూర్చుంటుంది. 'భక్త పోతన' మనందరికీ కేవలం మంచి సినిమా. కాని ముమ్మిడివరం బాలయోగికి ఐహిక జీవనం నుంచి విముక్తికి సోపానం. మరొక్కసారి చేసుకున్నవాడికి చేసుకున్నంత. ఇక్కడ చేసింది 'శ్రవ్యం' అని మనం గర్వపడాలి. This is the ultimate, exalted excercise. మళ్ళీ ఇది ఒక పార్శ్వం. మనస్సుని సూటిగా సంధించగల ఒక్క కారణానికే రేడియో నాటిక ఇతివృత్తానికి అవధి లేదు. It can travel through time and space, centuries and continents. శ్రోత మనస్సులో విమానాన్ని సృష్టించవచ్చు. బంగారు గనిలోకి వెళ్ళవచ్చు. నదీగర్భంలోకి చొచ్చుకుపోవచ్చు. గుడిలో విగ్రహాలు భక్తిడితో ప్రసంగించవచ్చు. ప్రముఖ కవి, రచయిత అనిశెట్టి సుబ్బారావుగారు 'కర్రా చెప్పులూ' అనే నాటిక రాశారు. యజమాని మీద కర్రా చెప్పులూ తిరగబడతాయి. నేను 'రేపటి మనిషి' రాశాను. ఏదో సంజీవని కారణంగా చావులేని మానవుడు - ఏం అనర్థం తెచ్చిపెడతాడు? అదీ నాటిక. లోగడ ఇర్విన్ షా "Bury the dead" అనే నాటిక రాశాడు. 'సహస్రబాహు' అని నేను రాసిన నాటిక చీకటిలో జరుగుతుంది. ఇది 'వినే' చీకటి. ఊహకి మరో డైమన్షన్.

రేడియో నాటిక పెద్ద ఆయుధం - నిశ్శబ్దం. నిశ్శబ్దం ఉత్కంఠని పెంచుతుంది. ఆదుర్దాని కలిగిస్తుంది Silence

is the most pronounced verbal in the sound media. చీమ నుంచి బ్రహ్మదాకా శ్రోత ఆలోచనని - అణువు దగ్గర్నుంచి ఆకాశం దాకా 'ఆలోచన' అనే ఆలంబనతో విశ్వరూపాన్ని చూపించగల అతి విస్తృతమైన పరిధిని ఆవిష్కరించగలిగే ఒక ఒక ప్రక్రియ - రేడియో నాటిక. సినీ తెర మీద ఇంద్రలోకాన్ని చూపడానికి ఖర్చు అవుతుంది. ఆలోచనలో ఇంద్రలోకం అరక్షణంలో ప్రత్యక్షమవుతుంది. రేపటి రొబోట్‌తో బీచ్‌లో కాస్సేపు ముచ్చటించే కొత్త సన్నివేశం - ప్రయోక్త అందించగలిగినంతగా, శ్రోత ఊహని ఉద్దీపన చేసేంతగా రూపుదిద్దుకుంటుంది.

ఆఖరుగా నా స్వానుభవాన్ని చెప్పి ముగిస్తాను. నేను శ్రవణ మాధ్యమాన్ని 20 సంవత్సరాలు ఉపాశించాను. కేవలం శబ్దంతో అన్ని యూనిటీలను ప్రతిపాదించడాన్ని యజ్ఞం చేసుకున్నాను. నా 42వ ఏట అనుకోకుండా సినీ నటుడినయాను. నా ముందు కెమెరా నిలిచింది. నన్ను ప్రేక్షకుడు చూస్తున్నాడు. నేనెక్కడ నిలబడ్డానో కెమెరా చెప్తోంది. నా మాటకు ఎదుటి వ్యక్తి రియాక్ట్ అవడం తెలుస్తోంది. నా ముందు ఓ కొత్త ప్రపంచం ఆవిష్కృతమైంది. ఇది శ్రవణ మాధ్యమంలోంచి వచ్చినవారికి కొత్తగా కలిసి వచ్చిన అవకాశం. నేను సినిమా ఇంటర్వెల్‌కే స్టార్‌నయాను. 38 సంవత్సరాలు 300 సినిమాలకు 'శబ్దం' ఇచ్చిన వరం అది.

అన్ని మాధ్యమాలలో పని చేసినవాడిగా ఇప్పటికీ నేను రేడియో నాటకానికే ప్రథమ స్థానాన్ని ఇస్తాను. అయితే ఈ కారణానికి రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒక ప్రక్క అబ్బూరి రామకృష్ణారావుగారు, రెండో ప్రక్క గొల్లపూడి మారుతీరావూ ఉన్నారు.

*

# రేడియో నాటకం - సాహిత్య శిల్పం

*- దాసరి సుబ్రహ్మణేశ్వరరావు*

కావ్యేషు నాటకం రమ్యమన్నారు మనవాళ్ళు. నాటకాన్ని చాక్షుష క్రతువు అన్నాడు కాళిదాసు. ప్రచార సాధనాలు వచ్చిన తర్వాత చాక్షుష క్రతువైన నాటకం శ్రవ్యక్రతువైంది. అదే నేటి రేడియో నాటకం. ప్రస్తుత కాలానికి రేడియో నాటకం అంటే యువతకి తెలియదంటే ఆశ్చర్యపోనక్కరలేదు. సరిగ్గా చెప్పాలంటే రేడియో అంటేనే తెలియనివాళ్ళు ఈ కాలంలో ఎక్కువమంది ఉన్నా రేడియోలో వచ్చే నాటకాలంటే తెలియనివాళ్ళు ఎక్కువ. ఇప్పుడున్న పరిస్థితులనుబట్టి పిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకూ తెలుగు సాహిత్యం మీద ఎవరికి అవగాహన లేదనే చెప్పాలి. అందులో రేడియోలో వచ్చే సాహిత్యంపై కార్యక్రమాలు ఒకప్పటి తరం వినేవాళ్ళు. ఇప్పుడు సాహిత్య కార్యక్రమాలు రేడియోలో ప్రసంగించిన వినే వాళ్ళే లేరు.

రేడియో నాటకం ఓ టెలిగ్రామ్‌లాంటిదన్నారు వెంకట సుబ్బయ్య గారు. అనుకున్న కాలం లోపల సందేశం అందించాలంటే టెలిగ్రామ్ ఇస్తాం. అందులో మాటలు క్లుప్తంగా, సూటిగా, ఉద్దేశించినవారికి అర్థం స్ఫురించే విధంగా ఉంటాయి. సందేశం అందుకున్న వారికి ఆనందమో, బాధో, విచారమో - ఏ భావోద్రేకం కలగాలో అది వెంటనే కలుగుతుంది. తప్పు చిరునామా అయితే మాత్రం అంతా అయోమయమే. తప్పు చిరునామా కాకుండా చిరునామాకి సరాసరి టెలిగ్రామ్ పంపడంలాంటిదే రేడియో నాటక సాహిత్య శిల్పం. అంటే ప్రేక్షకుల్ని కాకుండా, శ్రోతలను మనసులో పెట్టుకుని శ్రవణం ద్వారా రసానుభవం కలిగించే విధంగా నాటకం రచించే పద్ధతే రేడియో నాటక సాహిత్య విధానం అన్నమాట. రేడియో నాటకంలో సమాజానికి సంబంధించి మార్పులను తీసుకు రావడమే రేడియో నాటక రచన మంచి సాహిత్య విలువలను పెంపొందింప చేస్తుంది.

రంగస్థల నాటకానికి - రేడియో నాటకానికిగల భేదం: రంగస్థల నాటకంలో కళాకారులు, ప్రేక్షకులు, శ్రోతలు కూడా ఉంటారు. మనం కళ్ళతో చూస్తూ, చెవులతో వింటాం. ఈ రెండు పనులు ఏకకాలంలో జరుగుతాయి. దృశ్యం ద్వారా, శబ్దం ద్వారా విషయాలను తెలుసుకుంటారు. దృశ్యం తెలియచేయనిది శబ్దం

ద్వారా, శబ్దం చెప్పనిది దృశ్యం ద్వారా తెలుసుకుంటారు. దృశ్యం, శబ్దం ఒకదానికొకటి పూరకాలవుతాయి. రేడియో నాటకం అలా కాదు. శ్రోత దృశ్యాలేమీ చూసే అవకాశం లేదు. వినేవాళ్ళు చెవులు మాత్రమే పని చేస్తాయి. విన్నదానిని బట్టే అంతా ఊహించాలి. అందువల్ల నటీనటుల అందచందాలకీ, హావభావాలకీ ఆంగిక విన్యాసాలకీ ఇక్కడ చెల్లుబడి లేదు. సంభాషణలే ప్రాణం. కాబట్టి రంగస్థలం నాటకానికి ఉన్న ఒక ముఖ్యమైన అనుకూలం- అంటే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం రేడియో నాటకానికి లేదు. ఒకప్పుడు రంగస్థలం నాటకం ఆడాలంటే సమయం వాతావరణం కూడా అనుకూలంగా ఉండాలి. ఎందుకంటే స్టేజి అప్పటికప్పుడే కట్టుకునే విధంగా ఉండేవి. వర్షాకాల సమయంలో అయితే నాటకాల ప్రసక్తే ఉండేది కాదు.

రంగస్థలం నాటకానికి లేని ఒక అనుకూలం రేడియో నాటకానికి ఉంది. అది స్థల కాలాలకి సంబంధించింది. రంగస్థల నాటకంలోని ఘట్టాలు కొన్ని పరిమిత ప్రదేశాల్లోనే జరగాలి. డ్రాయింగ్ రూమ్, పార్క్ రోడ్, కోర్టువంటివి. ఘట్టాలు అనేక స్థలాల్లో జరిగితే నాటకం ప్రదర్శన యోగ్యం కాదు. సెట్టింగులు వేయటంలోనే కాలం గడిచి పోతుంది అలాగే కాలం విషయంలో కూడా. ప్రతి ఘట్టం ఏ రెండు మూడు నిమిషాల్లో మాత్రమే ఉంటే మాటిమాటికి తెరపడి గందరగోళం అవుతుంది. అంటే రంగస్థలం నాటకానికి స్థలంలో, కాలంలో ఐక్యత ఉండే విధంగా ఘట్టాలు కూర్చుకోవాలి. రేడియో నాటకానికి ఈ ఇబ్బంది లేదు. సెట్టింగులు, తెరలు ఉండవు. కనుక ఇందులో ఘట్టాలు కథా సంవిధానాన్ని బట్టి ఏ స్థలాలలోనైనా, ఎన్ని స్థలాల్లోనైనా, ఎన్ని క్షణాలైనా, ఎన్ని నిమిషాలైనా జరిగే విధంగా కూర్చవచ్చు. ఇంకో తేడా ఏమంటే రంగస్థలం నాటకాన్ని ప్రేక్షకుడు జనసామాన్యంలో ఒకడిగా థియేటర్లు చూస్తాడు. అందువల్ల జనసామాన్యం వైఖరి ఈలలు, చప్పట్లు ద్వారా అతని మీద కొద్దో-గొప్పో ప్రభావం చూపిస్తుంది. ఒక విషయం ఏమిటంటే అతను చెప్పే మాటల్లో చురుకుగా తెలుగు సాహిత్యంలో మాటలు ఒకదానికొకటి విస్తృతంగా ఉన్నా వెంట-వెంటనే ఆ మాటలు ప్రయోగిస్తే ప్రేక్షకులు మరింత ఉత్తేజాన్ని చూపిస్తారు. రేడియో నాటకం విషయంలో ఇది వర్తించదు. శ్రోతలు ఇంట్లో ప్రశాంతంగా నాటకం వింటారు. అందువల్ల నాటక ప్రభావం శ్రోతల మీద సూటిగా ఉంటుంది. ఈ ఈ రెండిటి మధ్య వ్యత్యాసాలు గమనించి అనుకూలాన్ని ఉపయోగించుకొని ప్రతి కుల్యాల్ని అధికమించి రచయిత రేడియో నాటక సాహిత్య శిల్పాన్ని రూపొందించుకోవాలి. ఈ శిల్పంలోనే కొన్ని ముఖ్యాంశాలను మనం పరిశీలించుకోవచ్చు.

**శ్రోత:** రేడియో నాటకం శ్రోతని ఉద్దేశించి సృష్టించే సాహిత్య ప్రక్రియ. నాటకాన్ని శ్రోత ఒంటరిగానో కుటుంబ సభ్యులతోనో వింటాడు. టికెట్ దండగ అవుతుందన్న బాధ లేదు కనుక, నాటకం బాగుండలేదనిపిస్తే రేడియో ఆఫ్ చేయడానికి అతనికి క్షణం పట్టదు. అందువల్ల రేడియో నాటకం ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగాలి. రంగస్థల నాటకంలో ఆసక్తి క్రమేణ పెంపొందవచ్చు. కానీ రేడియో నాటకం మొదటి నుంచి శ్రోత మనసును ఆకట్టుకోవాలి.విషయం సామాన్య శ్రోత అనుభవంలోకి వచ్చేదిగా ఉండాలి. శ్రోతలు అనేక స్థాయిల్లో ఉన్నా మానవ స్వభావం సార్వజనీనం కనుక సాధారణంగా ఒక శ్రోతని రంజింపజేసే నాటకం అనేకమందిని రంజింప చేస్తుంది. ఈ విధంగా ప్రజాబాహుళ్యానికి తన భావాలను వెల్లడించే అవకాశాన్ని రచయిత జాగ్రత్తగా వినియోగించుకోవాలి.

**కథా సంవిధానం:** తెలుగు సాహిత్యంలో మొదటిగా కథకు ప్రావీణ్యం ఉంటుంది. అందులో రంగస్థలంకైనా, రేడియో నాటకంకైనా కథలో మంచి సాహిత్య ప్రావీణ్యం ఉండాలి. రంగస్థలం నాటకం కంటే రేడియో నాటకం వ్యవధి చాలా తక్కువ. అందువల్ల కథాసంవిధానంలో సరిగా అతకని ఘట్టానికి తావులేదు. ఆసక్తి దృష్ట్యా, కకాల దృష్ట్యా కూడా కథాగమనం వేగంగా ఉండాలి. విషయం తేలికగా అర్థమయ్యే విధంగా కథా సంవిధానం రూపొందించాలి. స్థల కాల పరిమితులు లేవు కనుక ఆ అవకాశం పూర్తిగా వినియోగించుకునే విధంగా

ఘట్టాలు కూర్చాలి. డ్రాయింగ్ రూముల్లో, ట్రాఫిక్ మధ్య, హోటళ్లలో, బస్సుల్లో, రైళ్లల్లో, సముద్ర తీరాల్లో, అడవుల్లో, ఎడారుల్లో, తుఫాన్లో, జలపాతాల దగ్గర, హిమాలయాల్లో ఎక్కడైనా సంఘటనలు జరగొచ్చు. అవకాశాన్నిబట్టి కొద్ది క్షణాలే ఉండే చిన్న ఘట్టాలైనా, నిమిషాలు పట్టే పెద్ద ఘట్టాలైనా ఉండొచ్చు. కథాసంవిధాన చాతుర్యాన్ని బట్టి రసవంతమైన ఘట్టాల్ని కూర్చడంలోనే రచయిత విజయం ఆధారపడి ఉంటుంది.

**పాత్రలు:** రంగస్థలం నాటకంలో పాత్రలు ఎక్కువగా ఉన్నా, వాళ్ళని ప్రేక్షకులు వాళ్ళ ఆకారాన్నిబట్టి పోల్చుకోగలడు. కానీ రేడియో నాటకంలో పాత్రలు ఎక్కువైతే గందరగోళమే. పాత్రల్ని వాళ్ళ కంఠస్వరాన్ని బట్టీ, లేకపోతే ఇతర పాత్రలు వారిని సంబోధించడం బట్టి శ్రోత పోల్చుకోవాలి. ఇది కష్టం స్త్రీల విషయంలో మరీ కష్టం. అందువల్ల పాత్రలు ఎంత తక్కువ ఉంటే అంత మంచిది. ఉన్న పాత్రలు కూడా వివిధ వయసుల్లో ఉంటే కంఠ స్వరాల్లో భేదాలు స్పష్టమవుతాయి.

**సంభాషణలు:** రేడియో నాటకం జీవం పాత్రల సంభాషణలలోనే ఉంది. అన్ని పాత్రలు ఒకేవిధంగా మాట్లాడితే చప్పగా ఉంటుంది. ప్రతి పాత్ర సంభాషణల్లో అతని ధోరణి వెల్లడైతే శ్రోతలు ఆ పాత్రని సులభంగా గుర్తిస్తారు. సంభాషణలు పాత్రల మూర్తిమత్వం వెల్లడించేవిగా కూడా ఉండాలి. పాత్రధారులు ఒకరికొకరు సంభాషణ సరిగ్గా లేకపోయినా అర్థం కాకుండా ఉన్నా ఇది నాటకానికి మాయని మచ్చగా ఉంటుంది. అంతేకాకుండా శ్రోతల్లో రంజింపజేయడానికి మాటల సంభాషణ స్పష్టంగా, చాకచక్యంగా, గంభీరంగా ఉండాలి. మాటల్లో అర్థమయ్యే విధంగా నిడివి చాలా తక్కువగా ఉండే మాటలు మాత్రమే సంభాషణలో ఉండాలి.

**ఘట్టాల విభజన:** ఘట్టాల విభజన అనేది రంగస్థలం నాటకాన్ని బట్టి ఎక్కువ ఘట్టాలు ఉంటాయి. రేడియో నాటకంలో ఘట్టాలు తక్కువగా ఉంటాయి. రేడియో నాటకంలో ఒక ఘట్టం అయిపోయిందనే సూచనగా ఆ ఘట్టం చివరి భాగాన్ని క్రమంగా దూరంగా వినిపించి అంతరింప చేస్తారు. దీన్నే ఫెడ్ టెక్నిక్ అంటారు. కొంచెం సేపటి తర్వాత మరో ఘట్టం ప్రారంభం అవుతుంది. లేదా రెండు ఘట్టాల మధ్య విరామం సూచిస్తూ సంగీతం వినిపిస్తారు. ఘట్టం భావోద్వేగంతో ముగిస్తే నేపథ్య సంగీతమే విరామ సంగీతంగా కొనసాగించవచ్చు. అలా అయితే శ్రోత ఘట్టం అయిపోయిన కొన్ని క్షణాలు హృదయ వీణతో శృతి కలిపే సంగీతంతో స్థిమితపడి తర్వాతి ఘట్టం వినడానికి ఉద్యుక్తుడవుతాడు. అందువల్ల రచయిత ఘట్టాలు భావోద్వేగంతో ముగించడం ప్రయోజనకరం. ఇక్కడ భావోద్వేగంతో అంటే ఇతరులను కించపరిచే విధంగా కాకుండా చచైతన్యపథలోకి తీసుకెళ్లే ఘటాల విభజన ఉండాలి.

**ధ్వని సంకేతాలు:** సహజంగా ధ్వని సంకేతాలను బట్టి శ్రోతలు స్పందన ఎలా ఉంటుందో చెప్పాలంటే ఆ ధ్వని శబ్దాలను ఉపయోగించేవాళ్ళను బట్టే ఉంటుంది. రేడియో నాటకంలో ఘట్టాలు అనేక స్థలాల్లో జరుగుతాయి. ఆ స్థలాలు సూచించటానికి ధ్వని సంకేతాలు వాడవలసి వస్తుంది. అయితే నాటకం మొదటి నుంచి చివరి వరకు ధ్వనే కనుక దానికి తోడు ఈ ప్రత్యేక ధ్వనులు కూడా విరివిగా ఉంటే శ్రోతలకు విసుగుపుడుతుంది. ప్రతి తలుపు చప్పుడూ, అడుగు చప్పుడూ సూచిస్తూ రచయిత సాహిత్యపరంగా రచన చేయనవసరం లేదు. స్థలం సూచించే ధ్వనులు కథాగమనానికి ఆవశ్యకమైన ప్రత్యేక ధ్వనులుంటే అవి సూచిస్తే సరిపోతుంది.

**కాలం:** రంగస్థలం నాటకానికి కళాకారులు ప్రదర్శించే సమయాన్ని బట్టి నాటకం పెరుగుతుంది. రేడియో నాటకం అలా కాదు సాధారణంగా పదిహేను నిమిషాల నుంచి గంట వరకు ఉంటుంది. రేడియో కార్యక్రమాలు నిర్ణీత కాల ప్రకారం జరగాలి కనుక కథాసంవిధానంలో సమతూకం కలిగే ఈ విధంగా ఘట్టాలను ఏర్చి కూర్చి నిర్ణీతమైన వ్యవధిలో ముగించే విధంగా రచయిత రేడియో నాటకం రచించాలి. లేకపోతే కొన్ని ముఖ్యమైన ఘట్టాలే ఎడిటింగ్‌లో కత్తెరకి గురి కావచ్చు. రచయిత బలమైన మాటలను తీసుకుని రంగ

స్థలంలోనే ప్రేక్షకులను ఆకట్టుకోవాలి. రేడియో నాటకంలో శ్రోతలను మరింతగా ఆకట్టుకోవాలి. రంగస్థలం నాటకం కన్నా రేడియో నాటకానికి అతి చిన్న మాటలు అవి గొప్పగా బలంగా శ్రోతల హృదయాల్లో నాటుకోవాలి. అంటే రేడియో నాటకంలో పెద్ద పెద్ద పదాలు లేకుండా ఎడిటింగ్ చేయకుండా చిన్న మాటలతో శ్రోతల హృదయాలను రంజింప చేయాలి.

**రచయితలు- సాహిత్యం:** రచయితలు నాటకాలను దృష్టిలో పెట్టుకుని రరంగస్థలలోనే ప్రేక్షకులను ఎలా ఆకట్టుకోవాలి. రేడియో నాటకాలను దృష్టిలో పెట్టుకుని శ్రోతలను ఎలా రంజింప చేయాలి అనే తమ ఆలోచలకు ఎల్లప్పుడూ పదును పెట్టాలి. రేడియో నాటకంలో శ్రోతలు వినడానికి నిడివి చాలా తక్కువగా ఉండాలి కాబట్టి సాహిత్య పరంగా నాటకంలోని కథాంశాలు సమాజానికి పూర్తిగా ఉపయోగపడే విధంగా ఉండాలి. అతి చిన్న సందేశం శ్రోతల మెదళ్ళకు ఎక్కువ రోజులు గుర్తుండి పోయే విధంగా ఉండాలి. సందేశం చిన్నదైనప్పటికీ ఎక్కువ మంది శ్రోతల నుంచి మన్ననలు పొందే విధంగా ఉండాలి. రంగస్థలం నాటకం అయినా రేడియో నాటకం అయినా అది రచయిత బలమైన సందేశాన్నిబట్టి సమాజానికి ఉపయోగపడే విధంగా మంచు మార్పులను తీసుకొచ్చే విధంగా ఉండాలి అప్పుడే రచయితకు బలమైన సంకల్పం చేకూరుతుంది.

**చివరి సందేశం:** సంక్షిప్తంగా చెప్పాలంటే రేడియో నాటకంలోనే పూర్వం పొలాల్లో కూడా నాటకాలను శ్రద్ధగా వినేవారు. ఎప్పుడైతే దూరదర్శన్ మరియు సెల్ ఫోన్లు వచ్చాయో రేడియో అన్నా, రేడియో నాటకం అన్నా ఈ కాలం ప్రజలకు తెలియదంటే ఆశ్చర్యపడనవసరం లేదు. రేడియో, రేడియో కార్యక్రమాలు, రేడియో నాటకం ఈ కాలం ప్రజలకు తెలియాలంటే పాఠశాల విద్య నుంచే రేడియో కార్యక్రమాల ద్వారా ఒక భాగంగా పాఠ్యప్రణాళికను ప్రవేశపెడితేగాని ప్రజల్లోకి విస్తృతంగా వెళుతుందని మనం భావించాలి.

రేడియో నాటకం గురించి చివరి మాటల్లో క్లుప్తంగా చెప్పాలంటే సాధారణ ఇతివృత్తం ఎన్నుకోవడం స్థల కాలపరిమితుల్ని దాటి వేగవైన సరళవైన కథాసంవిధానం రూపొందించటం, పాత్రల కంఠ స్వరాలు గుర్తుపట్టేలా కొద్ది పాత్రల్ని మాత్రమే ప్రవేశపెట్టడం పాత్రల వ్యక్తిత్వాలని సంభాషణా చాతుర్యంతో ఆవిష్కరించడం ప్రత్యేక ధ్వని సంకేతాలని సూచించడం ఘట్టాలను ముగించే ఫెడ్ టెక్నిక్ ప్రయోజనకరంగా ఉపయోగించుకోవటం ఆద్యంతం ఆసక్తికరంగా ఉండే విధంగా కాలం విలువ గుర్తించి రచించడం రేడియో నాటక సాహిత్య రచనలో విలువైన రహస్యాలు ఉంటాయనడంలో సందేహమే లేదు.

**దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు**
**బంటుమిల్లి, కృష్ణా జిల్లా. ఫోన్:** 949 303 3534.

## తెల్లవారదదు

అహిరి రాగము - త్రిపుట తాళము

*ఎంతట తెల్లవారదెంతట ప్రొద్దుగ్రుంక దేమందు నమ్మలారా!*
*కంతుజలకుడైన మువ్వగోపాలుడు*
*కౌగిట లేనందుకు అమ్మ నేజెల్ల!*
*పతియు నేను గూడిన – వితమెల్ల దలచుక*
*వెతల గొంతసేపు – వెన్నెలకాకకు*
*సతులు సేయు శైత్యోప – చారముల గొంతసేపు*
*నత డిందులేకలో – కాస్తమానమైనట్లు*
*గతము కొందరింతులు – పతుల బాసికూడిన*
*కతల గొంతసేపు గరి – గమనలు పుణ్య*
*వతి ని పతి రేపే వచ్చుననెడి*
*నుతుల గొంతసేపు నోరు నిండినట్లు ॥*

*కోరినట్ల మా మువ్వ – గోపాలుడిందు వచ్చి*
*యూరడించి కొంతసేపు – నొక నిమిషమొక యేడై*
*యా రమణితో నన్ను – యదిదెలుప గొంతసేపు*
*మారుకేళిగూడి నా మనసుదీర్చుకోలేక!*

క్షేత్రయ్య పదాలు - శ్రీనివాస చక్రవర్తి


దహగం లక్ష్మీనారాయణ

దాత

# దహగం లక్ష్మీనారాయణ

*– మోటూరు శివరాం ప్రసాద్*

నైజాం పాలనలో పూర్వపు కరీంనగర్ జిల్లాకు చెందిన మంథని ప్రాంతం నుండి దహగం పుల్లయ్య గారు తమ కుటుంబ తగాదాల వలన సెంట్రల్ ప్రావిన్స్‌కు ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తమై తరలి వెళ్లారు. నాగపూర్ వద్ద కాంప్టీలో ఆయన నివసించి స్థిరపడ్డారు. ఆయన మూడవ భార్య రామాబాయ్ కుమారుడు లక్ష్మీనారాయణ 1877, జనవరి 13వ తేదీన ఆయన జన్మించారు. అతి పిన్న వయసులోనే లక్ష్మీనారాయణకు తండ్రి ఉపనయనం చేశారు. ఆయన పదవ ఏటనే పుల్లయ్య మరణించారు. తండ్రి మరణం తర్వాత తన తల్లితో పాటు లక్ష్మీనారాయణ ఉన్నారు. ఆమె పరిస్థితుల మార్పు వలన కాకుళం పంతులు అనే చిన్న కాంట్రాక్టర్ వద్ద వారు తలదాచుకున్నారు. ఆయన సంరక్షణలో లక్ష్మీనారాయణ ఇంటర్మీడియట్ వరకు హిస్లాప్ కళాశాలలో చదివి ఆ తర్వాత కాకుళం పంతులు గారి కాంట్రాక్ట్ పనులలో సహాయంగా మిడ్నపూర్ కలకత్తా రైల్వేలో కాంట్రాక్టులో పనిచేశారు. ఆ పనులు నేర్చిన తర్వాత లక్ష్మీనారాయణ 1898లో కాంప్టీకి వచ్చారు. అటు తరువాత ఆయన కొన్ని సొంత కాంట్రాక్ట్‌లు చేపట్టారు.

తరువాత ఆయన central provincesprospecting syndicateలో కోలాచలం పంతులు గారితో భాగస్వామి అయి మ్యాంగనీస్ గనుల తవ్వకాలను దానికి సంబంధించిన వ్యాపారం చేశారు. 1904లో కోలాచలం పంతులు గారు మరణించడం వలన ఆ వ్యాపారానికి ఆయన పూర్తి హక్కుదారు అయ్యారు. సిండికేట్‌లోని నిర్వహణా ప్రతినిధితో విభేదాలు వచ్చి ఆయన తన సొంత పేరుతో ఖనిజ గనుల లైసెన్సుకు దరఖాస్తు చేశారు. ఆయన పేరుతో మాంగనీస్ గనులు ప్రభుత్వం వారు కేటాయింపు చేశారు. ఆ వ్యాపారంలో అప్పటికే అనుభవం గడించిన ఆయనకు వ్యాపారం సునాయాసమై అదే వ్యాపారంలో 1925 వరకు కొనసాగుతూ చాలా పేరుప్రఖ్యాతులు, ఆస్తులు, డబ్బు సంపాదించారు. ఆయన ఆధ్వర్యంలో గనుల వ్యాపారంలో కనీసం 1700 మందికి ఉద్యోగాలు కల్పించారని చెప్పుకుంటారు. ఆయన మాంగనీస్ ఖనిజాన్ని ఇతర దేశాలకు కూడా ఎగుమతులు చేశారు.

ఆయన కేవలం వ్యాపారవేత్తగానే కాదు ప్రజా జీవితంలోనూ పాలుపంచుకున్నారు. 1914-26 సంవత్సరాల మధ్య కాలములో నాగపూర్ జిల్లా బోర్డు సభ్యుడిగా ఎన్నుకోబడ్డారు. 1923లో సి.పి. అండ్ బెరారె మైనింగ్ అసోసియేషన్ ప్రతినిధిగా central provinces legislativecouncilలో సభ్యుడిగా ఎన్నుకోబడ్డారు. 1908లో ప్రభుత్వం ఆయనను గౌరవ మెజిస్ట్రేట్‌గా నియమించారు. 1926 జనవరిలో ప్రభుత్వం ఆయనను నాగపూర్ జిల్లా మేజిస్ట్రేట్‌గా పదోన్నతి కల్పించారు. 1910లో ఆయనకు ప్రభుత్వం రావుబహద్దూర్ బిరుదునిచ్చి సత్కరించారు. కాంప్టీ నగర పాలక సంస్థకు కూడా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1916లో లక్నోలో జరిగిన కాంగ్రెసు మహా సభలలో సెంట్రల్ ప్రావిన్సెస్ ప్రాంతానికి ఆయన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సహాయని రాకరణ చేపట్టే వరకు ఆయన కాంగ్రెస్‌లో కొనసాగారు. ఆ తరువాత మదన్మోహన్ మాలవీయ వ్యస్థాపించిన లిబరల్ పార్టీలో కూడా చేరి దేశ స్వాతంత్రం కోసం పోరాడారు.

శాసన సభ్యునిగా ఆయన central provinces tenancy amendment బిల్లు ప్రవేశపెట్టి కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న ప్రజల పౌరహక్కులను కాపాడటం కోసం దాన్ని శాసనం చేయడంలో విజయం సాధించారు. అంబాలలో జరిగిన అఖిల భారత కంటోన్మెంట్ సదస్సుకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. "కంటోన్మెంట్ అడ్వకేట్" అనే వార్తాపత్రికకు ధనసహాయం చేసి అది మూతపడకుండా చూశారు. నాగపూర్‌లోని పయనీర్ ఇన్సూరెన్స్ కంపెనీ డైరెక్టర్ల సంఘానికి అధ్యక్షుడిగా, సెంట్రల్ ప్రావిన్సెస్ ఇండస్ట్రియల్ బోర్డు సభ్యునిగాను, బొంబాయి నుండి కలకత్తా, మధ్యభారత్ నుండి మద్రాసు వరకు రైల్వే సర్వీసులు నిర్వహించిన గ్రేట్ ఇండియన్ పెనిన్సుల (GIP) రైల్వేస్ కంపెనీ సలహా సంఘ సభ్యుడిగాను, ఆ ప్రాంతపు సాంఘిక విద్యావిషయాలలోనేకాక పారిశ్రామిక ప్రగతికి సంబంధించి ఆయన ఎంతో సేవ చేశారు.

చట్టసభలలోను, మరెన్నో ఇతర సంస్థలలోనూ ఆయన చేసిన ప్రసంగాలను ఆయన వ్రాసిన వ్యాసాలను, 'రైటింగ్స్ అండ్ స్పీచెస్ ఆఫ్ Raisaheb D. Lakshmi Narayana అనే పేరుతో పుస్తకంగా ముద్రించబడ్డాయి.

సుమారు నాలుగు వేల పుస్తకాలు ఉన్న తన సొంత గ్రంథాలయాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి దానం చేశారు. Ramtek, boolaghat లవద్ద ఆసుపత్రులు నెలకొల్పడానికి ధన సహాయం చేశారు. 1930 మే మూడో తారీఖున వ్రాసిన విల్లులో తన ఆస్తిని నాగపూర్ విశ్వవిద్యాలయానికి దానం చేశారు. ఆ కాలంలో ఆయన ఇచ్చిన ఆస్తుల విలువ 35 లక్షల 20 వేల 540 రూపాయలుగా అంచనా వేశారు. 1930 సెప్టెంబర్ 30వ తేదీన ఆయన మరణించారు. ఆయన దేశంలో యువతరానికి సాంకేతిక విద్య అవసరాన్ని గుర్తించి దాంతో తాను ఇచ్చిన దానంతో ఒక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాల్సిందిగా ఆ విల్లులో కోరారు. 1932లో నాగపూర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మాచిరాజు భవానీ శంకర్ నియోగి ఆధ్వర్యంలో యూనివర్సిటీ వారు bequest scheme commitee పేరుతో ఒక కమిటీని నియమించారు. వారి సలహా మేరకు సర్ harisingh gaur 1936లో 78 ఎకరాల భూమిని సేకరించి లక్ష్మీనారాయణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ [LIT] పేరుతో పెద్ద సాంకేతిక విద్యాసంస్థను నెలకొల్పారు. కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ టెక్నాలజీ, ఆయిల్ టెక్నాలజీ, పెయింట్ టెక్నాలజీలతో ఆ సంస్థలో బోధనలు 1942లో ప్రారంభించారు.

మన దేశంలోనే ఆయిల్ టెక్నాలజీ బోధన ప్రారంభించిన మొదటిసంస్థ ఎల్.ఐ.టి. అప్పటి వరకు సాధారణంగా సివిల్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇంజనీరింగ్ తప్ప కొత్త సాంకేతిక శాస్త్రాలను బోధించటం ఎవరూ ఆలోచించలేదు. లక్ష్మీనారాయణ గారి ముందుచూపుతో ఆయన విల్లులో వ్యక్తపరిచిన ఆయన అభిమతాన్ని యూనివర్సిటీ పెద్దలు నెరవేర్చారు. ఈ సంస్థ తర్వాత కాలంలో పెట్రోలియం టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, cellulose టెక్నాలజీ వంటి కొత్త పాఠ్యాంశాలను బోధిస్తూ ఎంతో మందిని సాంకేతిక విద్యావంతులుగా తీర్చిదిద్ది పదేళ్ల తర్వాత ప్రారంభింపబడిన IITలకు మార్గదర్శకమైంది.

మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు అదే కాలంలో కొంత ముందుగా Jamshetji Nusserwanji Tata సుమారు ఇంతే విరాళంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు, బెంగళూరులో స్థాపించటం గుర్తు చేస్తూ లక్ష్మీనారాయణగారిని ఎంతో కొనియాడారు. కానీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు మైసూర్ మహారాజా 371 ఎకరాలను సమకూర్చడంవల్ల ఆ సంస్థ ఎంతో ముందుకు పోయింది. Jamshetji ఒక పెద్ద సంస్థకు యజమనిగా విరాళం ఇవ్వడం ఒకెత్తు కానీ ఒక వ్యక్తిగా తెలుగువాడైన దహగం లక్ష్మీనారాయణగారి ఉదారత, సాంకేతిక విద్య కోసం ఆయన పడిన తపన నాగపూర్ ప్రాంత ప్రజలకు, దేశం మొత్తానికి, ఎంతో ప్రయోజనం ఇచ్చింది.

మోటూరు శివరాంప్రసాద్, C.A.,
హైదరాబాద్. ఫోన్: 986 633 8088.

### తెలంగాణ ప్రజల భాషలో తొలి నాటకకర్త

# వెల్దుర్తి మాణిక్యరావు

*– దేవరాజు మహారాజు*

పత్రికా రచయిత, కథా రచయిత, కవి అయిన వెల్దుర్తి మాణిక్యరావు మెదక్ జిల్లా, వెల్దుర్తి గ్రామంలో 1914లో జన్మించారు. ఆయన 'అణా గ్రంథమాల' అనే ప్రచురణ సంస్థకు పర్యాయపదమైనారు. అణా గ్రంథమాల అనే నాణానికి కె.సి. గుప్త ఒక పార్శ్యమయితే వెల్దుర్తి మరో పార్శ్వం. గుప్త ప్రచురణకర్త అయితే వెల్దుర్తి సంపాదకుడు. ప్రతి పుస్తకం ఒక అణాకే అంటే నాటి 6 పైసలకే పాఠకులకు అందివ్వాలన్నది వీరి లక్ష్యం! నెహ్రూ, ఎమ్.ఎన్. రాయ్, జయప్రకాష్ నారాయణ్, సుబాష్ చంద్రబోస్, వీర్ సావర్కర్ మొదలైన నాయకుల జీవిత చరిత్రలు ప్రచురించేవారు. కొన్ని పుస్తకాల్ని నాటి నిజాం ప్రభుత్వం నిషేధించింది. ఒకసారి ఈ విషయంలో గుప్త జైలుకు వెళ్లారు. బూర్గుల రామకృష్ణారావు కేసు వాదించి, విడిపించారు. నిషేధాలతో ఆగకుండా, అణా గ్రంథమాల వారు పుస్తకాలు అచ్చు వేస్తుండేవారు. వెల్దుర్తి 'రైతు' పుస్తకాన్ని కూడా నాటి నిజాం ప్రభుత్వం 1940లో నిషేధించింది.

చాలాకాలం 'గోలకొండ' పత్రికకు సహాయ సంపాదకులుగా పనిచేసిన వెల్దుర్తి మద్రాసు నుండి వెలువడే 'ప్రజామిత్ర' విజయవాడ నుండి వెలువడే 'యువవాణి' వారపత్రికలకు 'హైదరాబాద్ లేఖలు' రాసేవారు. అందులో ఇక్కడి రాజకీయ, సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, కళారంగ విశేషాల్ని పొందుపరిచేవారు. 'తార్కె ముస్కిరాత్' అనే ఉర్దూ మాసపత్రికకు, మద్యపాన నిరోధక మాసపత్రికకు సంపాదకత్వం నెరపారు. 'హైదరాబాద్ రాజ్యాంగ సంస్కరణలు' అనే అనువాద గ్రంథంతో నిజాం నవాబు ప్రవేశపెట్టిన దొంగ సంస్కరణలోని బండారం బయటపెట్టి సంచలనం సృష్టించారు. 'ఖాదీ', 'సర్దార్ జమలాపురం కేశవరావు జ్ఞాపకాలు'వంటి చిన్న పుస్తకాలే కాదు, 'హైదరాబాద్ స్వతంత్ర చరిత్ర'వంటి 840 పుటల బృహద్గ్రంథాన్ని కూడా రచించారు. స్వాతంత్ర సమర సంచికలు ఎన్నింటికో సంపాదకత్వం వహించారు. 'స్వయంప్రకాశం' అనే కలం పేరుతో కథలు రాశారు. అయితే అవి ఏవీ గ్రంథస్తం కాలేదు. 2002లో వెలువడ్డ 'తెలంగాణ తొలి తరం కథలు' అనే కథా సంకలనంలో సంపాదకులు వెల్దుర్తి మాణిక్యరావు కథ 'ఎయిర్ మెయిల్' సంపాదించి అచ్చేశారు.

'ఎయిర్ మెయిల్' కథ చాలా చిన్నది. సరదాగా సాగుతుంది. ముగింపులో గుండెల్ని పిండేస్తుంది. రామం, పూర్ణిమలు భార్యాభర్తలు. వారి అనురాగ సరాగాలతో కథ ప్రారంభమవుతుంది. ఒకరంటే ఒకరికి ప్రాణం. కానీ ఆరోజు భార్య పూర్ణిమ బొంబాయిలో ఉన్న తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ ఎడబాటుని ఎలా భరించాలో ఇద్దరికీ అర్థం కాదు. అయినా తను లేనప్పుడు ఏవేవి తినాలో, ఏవి ఎక్కడ ఉన్నాయో అన్నీ చెబుతూ ఇల్లు అప్పగిస్తుంది భార్య. ప్రయాణానికి, ఇతర ఖర్చులకు డబ్బు అందించి బొంబాయి చేరగానే ఎయిర్ మెయిల్ పంపమని అడ్రస్ రాసిన కవర్ అందిస్తాడు భర్త. యాంత్రికంగా స్టేషన్ చేరడం, రైలు కదిలేదాకా ఒకరికొకరు జాగ్రత్తలు చెప్పుకోవడం జరిగిపోతాయి. రైలు కదిలిన తర్వాత "చేరగానే కవర్ పంపు" అని

భర్త గొంతు పెంచి చెప్పడం, వారి చెవిలో ప్రతిధ్వనిస్తుంది. భార్యను పంపించి, భర్త వెనక్కి తిరిగి వస్తాడు. ఆ మరునాటి ఉదయం వార్తాపత్రికలు అమ్ముకునే కుర్రాడి కేక వినిపించి, భర్త రామం వెళ్లి పేపర్ కొంటాడు. 'రైలుపై దాడి, సాయుధ దుండగుల ఘోర దౌర్జన్యం' అని తాటికాయలంత అక్షరాలు పతాక శీర్షికగా భయపెడతాయి. వివరాలు పూర్తిగా లేకపోయినా, భర్త రామం మనసులాగానే పాఠకుల మనసులు కూడా ఒక్కసారిగా మెత్తబడి, విషాదంలో మునిగి, ఆలోచనలో పడతాయి. బహుశా ఈ కథ రజాకార్ల ఆగడాల నేపథ్యంలో వచ్చి ఉంటుంది. ఏమైనా వెల్దుర్తి కథలన్నీ సంపుటిగా వెలుగు చూసి ఉంటే, తెలుగు కథానిక ప్రియులకు ఒక మంచి పుస్తకం అంది ఉండేది. అంతేకాదు, నాటి సామాజిక స్థితిగతులు తరువాతి తరం వారికి అందించి ఉండేది. కథలేకాక వెల్దుర్తి బాలగేయాలు కూడా రచించారు.

1986 ప్రాంతంలో వీరి కవితా సంపుటి 'మాణిక్యవీణ' అచ్చయింది. చివరి దశలో ఆయన క్వార్టర్ నెంబర్ బి-19-9, ఎమ్.సిహెచ్., కాలనీ, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్-13 చిరునామాలో ఉండేవారు. ఈ ప్రాంతం కాచిగూడ స్టేషన్ నుండి చాదర్‌ఘాట్ బ్రిడ్జివైపు వస్తూ ఉంటే ఎడమ వైపున ఉంటుంది. 1988లో నేను ఆయనను కలిసినప్పుడు అణా గ్రంథమాల పుస్తకాలు కొన్ని 'దయ్యాల పన్గడ' నాటకం కొన్ని గోలకొండ పత్రికలు వారి శ్రీమతి నాకు అందించారు. ఆయన సరిగా మాట్లాడే స్థితిలో కూడా లేరు. అయితే మాట్లాడిన కొద్ది మాటల్లో ఆయనకు తెలంగాణ అంటే ఎనలేని అభిమానమని తెలిసింది. 1989, ఆగస్టు 13న బసంత్ టాకీస్ హాల్‌లో జరిగిన 'మా తెలంగాణ' పత్రిక ఆవిష్కరణోత్సవంలో వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయక సతీసమేతంగా వచ్చి అందరికీ విస్మయానందాన్ని కలిగించారు. అది 1940-41 ప్రాంతం.

నిజాం పరిపాలిస్తున్న హైదరాబాదు సంస్థానంలో త్రాగుడు మానిపించడానికి నాటి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్న సమయం. ఆ సమయంలో మద్యపాన నిరోధక కేంద్రం ఒకటి పనిచేస్తూ ఉండేది. ఆ కేంద్రం 'మద్యపాన నిరోధక పత్రిక' అనేదాన్ని ప్రచురిస్తూ ఉండేది. దానికి వెల్దుర్తి మాణిక్యరావు సంపాదకులు. అప్పుడు ఆయన అప్పుడు మద్యపాన నిరోధక కేంద్రంలో ఉద్యోగి. ఉద్యోగంలో భాగంగానే ఆయన మద్యపాన నిరోధక పత్రికకు సంపాదకులయ్యారు. అంతేకాదు - 'దయ్యాల పన్గడ' అనే నాటకం రాశారు. తెలంగాణ ప్రజల భాషలో అది తొలి నాటకం అయింది. రష్యన్ మహా రచయిత లియో టాల్‌స్టాయ్ రచన 'ద ఫస్ట్ డిస్టిలర్' తనకు ఎంతగానో స్ఫూర్తినిచ్చిందని, దానికి తెలుగు అనుసరణ రాయకుండా ఉండలేకపోయానుని వెల్దుర్తి గారు చెప్పుకున్నారు. ముందుమాటలో ఈ విధంగా రాసుకున్నారు-

"అర్థిక సంపత్తిని హరించి, దేహదారుఢ్యతను, మనోవికాసమును హరించి, ఆత్మబలము హరింపజేసి, మానవ జాతిని సర్వ నాశనమొనరించు కల్లు, సారా, నల్లమందు, భంగు వంటి మత్తు పదార్థములు సర్వకాల సర్వావస్థలయందు వర్జించవలసినవని, ధర్మ సంస్థాపకులు, ధర్మసంస్థాపకులు, సంఘసంస్కర్తలు సెలవిచ్చియున్నారు. రానురాను మద్యపానము వలన కలుగు ఆదాయము భూమ్యాదాయముతో సరితూగుతూ వచ్చెను. ఇట్లు మొత్తము 233 కోట్ల రూపాయలు ఈ మద్యము వలన హిందూ దేశీయులు గోల్పోవుచూ వచ్చిరి. నాగరికులమని విర్రవీగు పాశ్చాత్యులు చేయజాలనని దానిని చేసి చూపించి, మరియొకసారి భారతదేశము తన ప్రశస్తిని నిలుపుకొన్నది. అదియే మద్యపానం నిషేధ శాసనము. ఇది నేడు ఆసేతు హిమాచలము ఝుంఝూమారుతమువలె



వెల్దుర్తి మాణిక్యరావు

వీచున్నది'' అంటూ ఆనాటి విశేషాల్ని రచయిత వెల్దుర్తి తాను రచించిన నాటకానికి ముందు తొలిపలుకులలో వివరంగా రాసుకున్నారు.

సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే 'దయ్యాల పన్గడ' ఇతివృత్తం ఇలా ఉంది- కాయకష్టం చేస్తూ, నిరంతరం శ్రమిస్తూ ఉన్న రైతు దయ్యాల రాజుకి లొంగడు. అప్పుడు రైతును లొంగదీసుకోవడానికి దయ్యాల రాజు ఒక దయ్యాన్ని రైతు వద్దకు పంపుతాడు. ఆ దయ్యం మారువేషంలో రైతును చేరి, అతని వద్ద సేవకుడిగా చేరుతుంది. సేవకుడు అంటే జీతగాడు. జీతగాడిగా మారు రూపంలో ఉన్న దయ్యం, పంటలు విపరీతంగా పండిస్తుంది. రైతుకు మతి పోతుంది. ఊహించని సిరి ఎదురైతే కోర్కెలు పుట్టడం సహజం. ఇదే మంచి అదను అనుకుని దయ్యం రైతుకు సారాబట్టీ పెట్టడం నేర్పుతుంది. ఆ తరువాత క్రమంగా త్రాగుడు అలవాటు చేస్తుంది. కొంతకాలం గడిచిన తరువాత తన పతనానికి మూలకారణం తాను మద్యానికి బానిసనవడమని గ్రహిస్తాడు రైతు. తాగుడు మానేసి తన జీవితాన్ని సరిదిద్దుకుంటాడు. ఇక్కడ దయ్యం, దయ్యాల రాజు అనే పాత్రల్ని మానవ బలహీనతకు సంకేతంగా తీసుకోవాలి. హైదరాబాదులోని నారాయణగూడ వై.యం.సి.ఎ. చౌరస్తాలో ఆనాటి హైదరాబాద్ కొత్వాలు రాజ బహద్దూర్ వెంకటరామ రామారెడ్డి విగ్రహం ఉంది. ఆ విగ్రహానికి కుడివైపు బాలికోన్నత పాఠశాల, ఎదురుగా వంద మీటర్ల దూరంలో రెడ్డి మహిళా కళాశాల ఉన్నాయి. ఆ రెండూ రాజ బహద్దూర్ వెంకట రామారెడ్డి చొరవతో రూపుదిద్దుకున్నవే. ఆయన ఆ రోజుల్లో సాహితీవేత్తలను, కళాకారుల్ని గౌరవించేవారు. తన కింద అతి చిన్న ఉద్యోగంలో ఉన్న ఒక రచయితను గుర్తించి, గౌరవించి కితాబులివ్వడం ఒక అద్భుతమైన విషయం. ఆయన ఆనాడు వెల్దుర్తి మాణిక్యరావుని గుర్తించి అభినందించారు. 'దయ్యాల పన్గడ' పుస్తకానికి పీఠిక రాశారు. ఆ పీఠికలోని విషయం- ''ప్రజల సమస్యను తీసుకొని ప్రజల కొరకు చేసిన రచన ప్రజల భాషలో ఉండక తప్పదని, అయితే ఈ రచయిత ఆ ప్రయోగాన్ని చిత్తశుద్ధితో చేశారని, ఆయన కృషి విజయవంతమై, మంచి ఫలితాలనిచ్చింద''ని రాజబహద్దూర్ తన సంతృప్తిని ప్రకటించారు. రాజా వెంకట రామారెడ్డి బహద్దూర్ ఒ.బి.ఇ. స్పెషల్ ఆఫీసర్, సర్ఫ్‌ఖాస్ ముబారక్, మధ్య నిరోధక కేంద్ర సంఘ సభాసదులుగా ఉండేవారు. పుస్తకంలో ఆయన ఫోటో కింద పై వివరాలు ఉన్నాయి. చిన్న ఎక్కాల పుస్తకం సైజులో ప్రచురింపబడిన ఈ పుస్తకం వెల: రెండు అణాలు. పేజీలు: డెబ్బైఏడు. ప్రేమసాగర ముద్రాక్షరశాల, గౌలిగూడ, హైదరాబాద్ - దక్కన్‌లో అచ్చయింది. మొదటిపేజీ (ఇన్నర్ టైటిల్)లో 'పచ్చి పల్లెటూరి బాస' అని 'ఆరంకాల నాటకమ్' అని ప్రముఖంగా ప్రచురించడం జరిగింది. పుస్తకాన్ని వెల్దుర్తి మాణిక్యరావు తన కన్న తండ్రి వెంకటేశ్వరరావుకు అంకితమిచ్చారు. ఆ రకంగా తెలంగాణ ప్రజల భాషలో తొలి నాటకం వెలుగులోకి వచ్చింది.

తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ తరపున మిత్రుడు ప్రభాకర్ 'మా తెలంగాణ' పత్రికను ప్రచురించాడు. బహుశా అది 1987-90 మధ్యకాలం. నేను ఆ 'దయ్యాల పన్గడ' నాటికను 1988-89 ప్రాంతంలో 'మా తెలంగాణ' పత్రికలు పునర్ముద్రించగలిగాను. వెలువడిన 50 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రజల భాషలో వచ్చిన తొలి నాటికను మళ్ళీ తరువాతి తరం పాఠకులకు పరిచయం చేయగలిగాను. చూస్తుండగానే ఇప్పుడు 30 ఏళ్లు గడిచిపోయాయి. ఒక ముందు తరం రచయితను గుర్తు చేసుకొని 78 ఏళ్ల తర్వాత ఆయన రచనలను, అందులోని విలువల్ని బేరీజు వేసుకోవడం సంతోషాన్నిస్తుంది.

డా. దేవరాజు మహారాజు
హైదరాబాద్. ఫోన్: 990 863 3949.



Self potrait of Van gogh

## అర్ధంతరంగా ముగిసిన ప్రతిభ

# వాన్‌ఘో

[VAN GOGHO]

– *తంగెడ విశ్వేశ్వర ప్రసాద్*



Self potrait of Van gogh

బతికుండగా మెచ్చుకోలుకు నోచుకోకపోయినా, చనిపోయిన తర్వాత ముద్రావాద అనంతర (Post impressionist) ఉద్యమకారుల్లో ప్రముఖుడిగా, పాశ్చాత్యకళను ప్రభావితం చేసిన కళాకారుడుగా కీర్తింపబడిన / బడుతున్న ప్రతిభాసంపన్నుడు వాన్‌ఘో. ఫ్రాన్స్ కళాకారులు సెజానె, గూగెన్‌ల సమకాలికుడు. నెదర్లాండ్స్‌లోని జున్‌డెర్టులో మార్చి 30, 1853లో జన్మించాడు.

ఒక దశాబ్ద కాలంలోనే 860 తైలవర్ణ చిత్రాలు, నీటిరంగు చిత్రాలు, డ్రాయింగులు కలిపి మొత్తం 2,100 కళాఖండాలను సృష్టించాడు. ప్రకృతి దృశ్యాలు, స్టిల్‌లైఫ్ పెయింటింగు, స్వీయ చిత్రాలు వేసిన సమర్థుడు. ముదురు రంగులు ఉపయోగించి, కుంచె ద్వారా బలంగా భావవ్యక్తీకరణ చేసి ఆధునిక చిత్రకళకు పునాదులు వేసిన ప్రతిభావంతుడు. ఐనా, వ్యాపారదృష్ట్యా జీవిత కాలంలో ఏ మాత్రం విజయం సాధించలేకపోయాడు. మానసిక అనారోగ్యం, పేదరికం కారణాలుగా ముప్పది ఏడవ ఏటనే ఆత్మహత్యకు పాల్పడి జీవితాన్ని అంతం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌లోని ఓవర్స్ సుర్ వాస్‌లో 1890, జులై 29న మరణించాడు.

1869లో అంతర్జాతీయ చిత్రకారుల పెయింటింగులు విక్రయించే సంస్థలో ఉద్యోగిగా చేరి, కొంతకాలం హేగ్ నగరంలోనూ, మరికొంతకాలం 1873-1876 మధ్య లండన్, పారిస్ శాఖల్లోనూ పనిచేశాడు. 1876లో ప్రవర్తన సరిగా లేదన్న నెపంతో ఉద్యోగం పోగొట్టుకున్నాడు. లండన్‌లో ఉన్న సమయంలో అద్దెకుంటున్న యజమానురాలితో ప్రేమలో పడి విఫల ప్రేమికుడౌతాడు. స్త్రీతో ఆనందంగా జీవితం గడపాలనుకున్న ఆశ, ప్రయత్నం ఎన్నటికీ ఫలించదు. తర్వాత కొంతకాలం టీచరుగానూ, మత (ప్రొటెస్టెంటు) ప్రచారకునిగానూ పనిచేసే క్రమంలో తన దగ్గర ఉన్నవన్నీ వారికి ఇచ్చివేస్తాడు. బోధనలను తన దృక్కోణంలో చేసేసరికి ఆ ఉద్యోగం కూడా ఊడిపోతుంది. కటిక పేదరికంలో మతపరమైన సంక్షోభం / సంఘర్షణలో జీవితం 1880 వరకు గడిచిపోతుంది. చిత్రకళ ద్వారా మానవాళికి ఊరడింపు కలిగించవచ్చునే భావనకు వస్తాడు. అదే తనకు తగిన వృత్తిగా గుర్తిస్తాడు. పేదరికంవల్ల తరచుగా తిండిగూడ దొరక్క బాధలు పడ్తాడు. అనారోగ్యం నుండి బయటపడిన్పుడు విరివిగా చిత్రాలు వేశాడు. అకారణంగా మానసికంగా కుంగిపోయి, విపరీతంగా ప్రవర్తించేవాడు. కానీ బాగా చదువుకున్నందువల్ల ఉన్నతభావాలు కలిగి, ఎంతో ఆలోచించిన తర్వాత, ప్రణాళికాబద్ధంగా బొమ్మలు వేశాడు.

1881-85 మధ్యకాలంలో కొంతకాలం తలిదండ్రులతోనూ, కొంత కాలం లాడ్జింగులలోనూ గడిపాడు. లాడ్జింగు ఖర్చులను సోదరుడు థియో భరించేవాడు. జీవితాంతం థియోనే వాన్‌ఘోను పోషించాడు. థియో పారిస్‌లో పెయింటింగుల వ్యాపారి.

వారిరువురి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల వల్లనే వాన్‌ఘో కళాజీవితాన్ని గురించిన సమాచారాన్ని తెలుసుకో గలుగుతాం. వాన్‌ఘో ఉత్తరాలు రాయడంలో చాలా శ్రద్ధ, ఉత్సాహం చూపేవాడు. వారిరువురి 800 లేఖలు తర్వాత ఆరు సంపుటాలుగా వెలువడ్డాయి.

1885 వాన్‌ఘో బెల్జియంలోని ఆంట్‌వెర్ప్ అకాడమీలో చేరి కొద్దికాలం చదివాడు. అక్కడ నేర్చుకునేదేమీ లేక తానే స్వయంగా బొమ్మలు వేయడం నేర్చుకున్నాడు. తర్వాత పారిస్ చేరుకుని అక్కడ ఆనాటి చిత్రకారులు డెగాన్, గూగెన్, సిస్సారో, సురాత్ (SEURAT) టులోస్ (TOULOUSE)లతో పరిచయం పెంచుకున్నాడు. అంతవరకూ తను పాటిస్తున్న శైలిని అకస్మాత్తుగా మార్చుకుని ఇంప్రెషనిజం, జపాన్ ప్రింటు ప్రభావంతో అనేక కొత్త పద్ధతులలో ప్రయోగాలు చేశాడు. ఇంకు, పెన్ను, నల్లలిథో గ్రాఫిక్ పద్ధతులలోని మెలకువలు సాధించాడు. చివరిగా 1882 నుండి ఆయిల్ పెయింటింగులపై దృష్టి కేంద్రీకరించాడు. మానవత్వ దృక్పథంతో, పనిపాటలు, వ్యవసాయ కూలీల జీవితాలు ముడిసరుకులుగా చిత్రాలు వేయడం ప్రారంభించాడు. 1885లో వేసిన ఆలుగడ్డలు తింటున్నవారి (Potato Eaters) చిత్రం చాలా ప్రఖ్యాతిగాంచింది. దాన్ని గురించి "తాము తవ్వితీసిన ఆలుగడ్డలను తమ చేతులతోనే వంటపాత్రలో తామే వండుకుని తినడంలో వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కినట్లైంది. అది వారు నిజాయితీగా సేకరించిన ఆహారం" అని థియోకు లేఖలో రాశాడు.

రెండేళ్ళ నగర జీవితానికి విసుగు చెంది ప్రకృతిలో స్వేచ్ఛగా గడపాలన్న కోరికతో 1885 ఫిబ్రవరిలో ఫ్రాన్స్ దక్షిణ ప్రాంతంలోని ఆర్లీకు చేరుకుంటాడు. అక్కడ గడిపిన 15 నెలల కాలంలో రెండు వందల పెయింటింగులు వేయగలిగాడు. ఆ చిత్రాలే వాన్‌ఘోకు గుర్తింపునూ, గౌరవాన్నీ తెచ్చిపెట్టిన కళాఖండాలుగా ప్రసిద్ధి చెందాయి. 1888లో మానసిక కల్లోలంతో, కుంగుబాటుకు గురవుతాడు. ఐనా కళాకారుల సహకారకేంద్రం స్థాపించాలన్న తన కలకు రూపం యిచ్చి కమ్యూనిటీ ఆర్టులో సమకాలీన ఆర్టిస్టులతో



వాంగో చిత్రం

పరిశోధనలు, ప్రయోగాలు చేశాడు. అక్టోబర్ నెలలో గుగేన్ వచ్చి కొద్దికాలం ఆర్లీలో వాంఘోతో గడుపుతాడు. గుగేన్, వాంఘోలు పెయింటింగు విషయంలో భిన్నదృక్పథాలు కలిగినవారు. ఒక చిన్న తగాదా కారణంగా వాంఘో తన ఎడమ చెవి భాగాన్ని పదునైన కత్తితో కోసుకుంటాడు. మానసిక అశాంతికి, మూర్ఛవ్యాధి, వంశపారంపర్యంగా సంక్రమించిన మనోవైకల్యం కారణాలుగా చెప్పుకుంటారు. ఐనా నింద గుగేన్ మీదకు పోతుంది. తర్వాత వాన్‌ఘో తానే స్వయంగా చెవి కోసుకున్నానని చెప్పుకుంటాడు. తాను ఆర్లీలో నివసించిన భవనానికి తన పెయింటింగులు యల్లోహౌస్ (Yellow House), పడకగది (The Bedroom) రెంటిలో అమరత్వం కల్పించాడు.

1889 మేలో ఆర్లీ సమీపంలోని (అసైలంలో) మానసిక చికిత్సా కేంద్రంలో చేరతాడు. అక్కడ గడిపిన సంవత్సర కాలంలో 200 వందల పెయింటింగులు, డ్రాయింగులు వేస్తాడు. నక్షత్రాకాశం (Starry Night) అప్పుడు వేసిన చిత్రమే. తర్వాత పారిస్‌లో తమ్ముడి దగ్గరకు చేరబడతాడు. చివరి 70 రోజుల్లో మరిన్ని గొప్ప



dream Tree

చిత్రాలను / పెయింటింగులను వేస్తాడు. ఉన్మాద స్థితిలో తనకు తాను తుపాకీతో కాల్చుకొని రెండురోజుల తర్వాత మరణిస్తాడు. జీవితకాలంలో ఒకే ఒక పెయింటింగు 'వైన్‌యార్డ్ దృశ్యం'ను థియో అమ్మిపెడ్తాడు. అనామకుడిగా, అశాంతితో బతికిన వాంఘో ప్రత్యేకతను, ప్రతిభను మొదట్లో నెదర్లాండు గుర్తించింది. వాంఘో మరణం తర్వాత బ్రస్సెల్సు, పారిస్, హేగ్, ఆంట్వెర్ప్‌లలో వాంఘో స్మారక ప్రదర్శనలు జరగడంతో వాంఘో ప్రతిభ క్రమక్రమంగా తెలియవచ్చింది. ప్రపంచయుద్ధాల అనంతరం వాంఘో కీర్తి ప్రతిభలు అంతర్జాతీయంగా వ్యాపించాయి.

భావవ్యక్తీకరణ వాదం, ఫావిజం, తొలిదశ విరూపచిత్రకళ, ఇరవైయవ శతాబ్దపు ఇతర కళాంశాల మీద వాన్‌ఘో ప్రభావం అపారమైనది. జీవితంపట్ల గాఢమైన అనురాగం, ప్రేమతో తన భావాలపట్ల ఏమాత్రం వైతొలగని అంకితభావంతో ఆర్టిస్టుగా జీవించాడు వాంఘో. 20వ శతాబ్దపు కళకు ఆరోగ్యకరమైన ముడిసరుకును సమకూర్చినవాడిగా, ఆధునిక సాంస్కృతిక ప్రయోక్తలలో ఒకడిగా నిలిచిపోయాడు. ఇర్వింగ్‌స్టోన్ కాల్పనిక మనోవిశ్లేషణాత్మక నవల లస్ట్ ఫర్ లైఫ్ [Lust for Life] అదే పేరిట వచ్చిన సినిమా (1956) వాన్‌ఘో జీవితం నుండి పుట్టుకొచ్చినవే.

**వాన్‌ఘోను గురించిన కొన్ని ఆసక్తికర విషయాలు:**

వాన్‌ఘోకు కళావిపణి అంటే ఇష్టం లేదు. కళాకారుల నైపుణ్యాన్ని మిగతా వస్తువులలాగా అమ్మడం-కొనడం ఏమిటి? అని ప్రశ్నించి ఉద్యోగం పోగొట్టుకుంటాడు (గుప్టిల్ కంపెనీవారి కళావ్యాపారంలో కొద్దికాలం పనిచేశాడు) మత ప్రచారకునిగా కొంత కాలం పనిచేసి, థియాలజీ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోయినందున మతబోధకునిగా కొన సాగలేక పోయాడు. తన 37 స్వీయచిత్రాలపైనే అనేక టెక్నిక్‌లతో ప్రయోగాలు చేశాడు. అలా వేసిన స్వీయచిత్రం ఒకటి 1998లో 71.5 మిలియన్ డాలర్ల అధికవెలకు అమ్ముడు పోవడం ఆశ్చర్యం కలిగించే విషయం.

తన జీవిత కాలంలో ఒకే ఒక పెయింటింగ్, అదీ సోదరుడు థియోవాన్ 400 ఫ్రాంకులకు అమ్ముతాడు. సోదరుల మరణానంతరం థియోభార్య వాటిని అమ్మకానికి పెట్టింది.

1889లో వాన్‌ఘో డిప్రెషన్‌కు లోనయి హాస్పిటల్‌లో చేరి, ఆ హాస్పిటల్ తోటలో, ఐరిస్, లైలాక్ పెయింటింగులు వేశాడు.

జపాన్ ప్రింట్ల ప్రభావంతో తన పెయింటింగ్‌శైలిని మార్చుకొని ఆకర్షణీయమైన ప్రకృతిదృశ్యాలను (Land scapes) చిత్రించాడు.

**వాన్‌ఘో Quotesలో కొన్ని:**

- *నక్షత్రాలను చూస్తే కలల్లో తేలిపోతాను.*
- *మనుషులను ప్రేమించటం కంటె మించిన గొప్పకళ ఏదీలేదు.*
- *ప్రేమించడంతో బలం పెరుగుతుంది. ఎక్కువగా ప్రేమిస్తే ఎక్కువగా పనిచేస్తాము. విజయం సాధిస్తాము. ప్రేమతో చేసిందేదైనా సవ్యంగానే ఉంటుంది.*
- *పగటికన్నా రాత్రి రంగులమయంగా, చైతన్యవంతంగా కనిపిస్తుంది.*
- *ప్రకృతిని ప్రేమించగలిగితే అంతటా అందమే కనిపిస్తుంది.*
- *ఏ ప్రయత్నం చేసే ధైర్యంలేని జీవితం అర్థరహితం.*

*- హృదయపూర్వకంగా పనిచేయడంలో విచక్షణను కోల్పోతాము.*

*- అందరూ నడిచేదారి సుగమమైనది. నడవడానికి సుఖంగా ఉంటుంది. కానీ, ఆ దారిలో పూలు పూయవు.*

*- దుఃఖానికి అంతం లేదు (విషాదం చిరంజీవి).*

*- విచ్ఛిన్న జీవితానికి ఊరడింపు కళ.*

*- నా కళద్వారా ఇతరుల హృదయాలను తాకాలని, 'ఎంత సున్నితంగా, గాఢంగా తాకాడు' అని వినాలని కోరిక.*

*- ఇంకా ఏదో సాధించాలని, నేర్చుకోవాలనే తపనతో ఇంకా ఇంకా పనిచేస్తాను.*

వాన్‌ఘో జీవితం కళాక్షేత్రం మీదనే కాకుండా సినిమారంగంమీదా ప్రభావం చూపింది. ఆ ప్రభావం నుండి వచ్చినవే LOVING VINCENT, Gauguin and Gogh అన్న సినిమాలు.

**లవింగ్ విన్సెంట్**: ఇది 2017 వ సంవత్సరంలో విన్సెంట్ వాన్‌ఘో జీవితం మీద వెలువడిన మొదటి సినిమా. అంతేకాదు, ప్రప్రథమంగా పూర్తిగా తైలవర్ణ చిత్రాలను (oil paints) ఉపయోగించి తీసిన ప్రయోగాత్మక ఏనిమేటెడ్ (animated) సినిమా. పోలెండ్ యూకేల సంయుక్త నిర్మాణం. చిత్రదర్శకురాలు- డొరోటా కోటియాలా (Dorota Kotiela), హ్యూ వెల్చ్‌మన్ (Welchman)లు. వాంఘో జీవితాన్ని, పెయింటింగులను బాగా అవగాహన చేసుకున్న తర్వాత, స్వయంగా చిత్రకారిణి ఐన డొరోటా కోబియాలా చిత్ర దర్శకత్వాన్ని చేపట్టింది. వందమంది ఆయిల్‌పెయింటర్లు కాన్వాసు మీద వాన్‌ఘో అనుసరించిన టెక్నిక్‌నే ఉపయోగించి చిత్రించిన 65,000 ఫ్రేములలో ఎన్నిక చేసిన వెయ్యి పెయింటింగులతో చిత్ర నిర్మాణం జరిగింది. ఈ మొత్తం ప్రక్రియతో సినిమా పూర్తికావడానికి నాలుగు సంవత్సరాల కాలం పట్టింది. బెర్లిన్ 30వ ఐరోపా చలన చిత్రోత్సవంలో ఉత్తమ ఏనిమేటెడ్ చిత్రంగా ఆవార్డు దక్కించుకుంది. 2018లో అకాడమీ ఆవార్డుకు నామినేట్ చేయబడింది. పాతతరం పెంయింటర్లను పక్కనపెట్టి, కేవలం ఆయిల్ పెయింటు వేసే 20 దేశాల నుండి వచ్చిన 5,000



starry - night

దరఖాస్తుల నుండి 125 మంది కొత్త వారిని మాత్రమే ఎంపిక చేసి ఈ ప్రణాళికకు ఉపయోగించుకున్నారు.

120 సంవత్సరాల సినీచరిత్రలో ఎవరూ చేయని ప్రయోగం అతి నెమ్మదిగా సినిమాను రూపొందించే సాంకేతిక ప్రక్రియను చేపట్టి చిత్రీకరణ జరిపాము, అని దర్శకులలో ఒకరైన వెల్చ్‌మన్ అన్నాడు.

సినిమా నిర్మాణానికి (5.5 మి) ఐదున్నర మిలియన్ డాలర్లు ఖర్చు పెడ్తే దానికి ఎనిమిదిరెట్లు 42 మిలియన్ డాలర్లను ఆర్జించిపెట్టింది. అనేకమంది విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తర్వాత అది అందుకున్న అవార్డులకు లెక్కేలేదు. వాన్‌ఘో జీవితం, పెయింటింగు దశలు, మరణానికి దారితీసిన పరిస్థితులను వివరించే



**The yellow house**



**Sea shore**

'లవింగ్ విన్సెంట్' చిత్రాన్ని యూట్యూబ్‌లో చూడ వచ్చు. వాంఘో ఆత్మహత్య చేసుకోలేదని, ఒక ఆకతాయి దగ్గరనుండి పేల్చినందునే చనిపోయి ఉండవచ్చని వాన్‌ఘోకు వైద్యం చేసిన డాక్టర్ అభిప్రాయపడతాడు.

At Eternity Gate:

**గుగేన్-వాన్‌ఘో సినిమా:** 2018లో విడుదలైన ఈ సినిమాలో వాన్‌ఘో చివరి రెండు సంవత్సరాలు దక్షిణ ఫ్రాన్స్‌లోని ఆర్లీన్‌లో గడిపిన జీవితం- గుగేన్‌తో కళకు సంబంధించిన అంశాలను చర్చించడం- ఉద్రేకంలో చెవి భాగాన్ని కోసుకోవడం- 'కౌబాయ్' ఆట ఆడుతూ ఎవరో పేల్చిన తుపాకీ దెబ్బకు గురికావడం- పేల్చిన తుపాకీని నదిలో విసిరివేయడం- పేల్చిందెవరో చెప్పకుండా తానే ఆ పని చేసుకున్నానని డాక్టర్‌కు చెప్పడం- తమ్ముడు రాకముందే మరణించడం - ఇతివృత్తంగా తీసిన సినిమా ఇది. వెనిస్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఉత్తమ చిత్రంగా ఎన్నికై విమర్శకుల మన్ననలు పొందింది. కొద్దిపాటి లాభాలను ఆర్జించింది.

దీని దర్శకుడు జూలియన్ ష్నాబెల్ (JULIAN SCHNABEL) విలియం డెఫో వాన్‌ఘోగా, అస్కార్ ఐజాక్ పాల్ గుగేన్‌గా నటించారు. వాన్‌ఘోగా వేసిన పది అత్యంత ప్రముఖమైన పెయింటింగులు - 1. నక్షత్రాకాశం *(Starry Night)* (1889), 2. పొద్దుతిరుగుడు పూలు *(Sunflowers)* (1889), 3. పొటాటోలు తింటున్నవారు *(Potato Eaters)* (1885), 4. ఐరిస్ పుష్పాలు *(Irises)* (1889), 5. చెవికి కట్టుతో ఉన్న స్వీయచిత్రం *(Self Portrait with Bandaged Ear)* (1890), 6. ఆర్లీస్‌లోని పడకగది *(Bedroom in Arles)* (1888), 7. కాకులలో ఉన్న గోధుమ పొలం *(Wheatfield with crows)* (1890), 8. పసుపుపచ్చ నివాసం *(Yellow House)* (1888).

వాన్‌ఘో పెయింటింగులు ప్రముఖ మ్యూజియాలన్నింటిలోనూ స్థానం దక్కించుకున్నాయి.

**ఆంస్టర్‌డామ్:** డచ్ మ్యూజియంలో వాంఘో పెయింటింగులు, డ్రాయింగులు రెండువందల వరకు సేకరించబడినాయి. ఇంకే మ్యూజియంలోనూ ఇంతపెద్ద సంఖ్యలో వాంఘోబొమ్మల ప్రదర్శన లేదు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్-లండన్, న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియం, పారిస్, లాస్ ఏంజిల్స్‌లాంటి నగరాల్లోని మ్యూజియాలలో కూడా వాంఘో కళాఖండాలు ప్రదర్శింపబడుతున్నాయి.

*(2019 జనవరిలో హాలెండ్ లోని హెర్టోజన్ బాస్క్ (....) పట్టణం, డాన్‌బోస్క్ సిటీమ్యూజియంలో తాము అమితంగా గౌరవించే కళాకారుడు వాంఘో పెయింటింగుల ప్రదర్శనకు ఉంచింది. ఇందులో వాంఘో వేసిన డ్రాయింగులు, పెయింటింగులు, ఫోటోగ్రాఫ్‌లు, వాంఘోకు సంబంధించిన సమాచారం తెలిపే పత్రాలను సేకరించి ప్రదర్శించింది. వాంఘోపట్ల ఉన్న దురభిప్రాయాన్ని పటాపంచలు చేయడం, కష్టాలు పడ్డ విషయాలు, హింసకు, వేదనకు గురి కాలేదని, స్వయంగా బతికాడనీ, ప్రదర్శనలో చూసినవారికి ఉర్థమౌతుంది. (తన చుట్టూ ఉన్న సమాజంతో సత్సంబంధాలతో) మానవ సత్సంబంధాలు అత్యంత ముఖ్యమైన విషయంగా భావించాడనీ, కొందరితో సంబంధాలను జీవితాంతం కొనసాగించాడనీ అర్థమౌతుంది. డాన్‌బాస్క్‌కు సమీపంలోనే వాంఘో జన్మించిన జున్‌డెర్ట్ పట్టణం ఉండటంతో సందర్శకులు ఆ పట్టణాన్నీ దర్శించుకొని ఆ మహాకళాకారునికి నివాళులర్పించుకొనగలిగారు).*

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
హైద్రాబాద్. ఫోన్: 798 139 8250.



ఎమ్.ఎన్. రాయ్

## మానవతావాది:
# మానవేంద్ర నాథ్ రాయ్

*– నార్ల వెంకటేశ్వరరావు*

మానవ జీవిత సాఫల్య వైఫల్యాలకు మానదండాలేవి? ఆర్జించిన సిరిసంపత్తులా? అనుభవించిన సుఖసంతోషాలా? అధిష్ఠించిన పదవులా? సాధించిన ప్రాబల్యమా? పొందిన ప్రశంసలా?

ఇట్టి మానదండాలను వర్తింపజేసే, ఎం.ఎన్. రాయ్ జీవితాన్ని నిరర్థకమైందిగానే పరిగణించవలసి వస్తుంది. ఇంచుమించు ఆరు దశాబ్దాలకు, నాలుగు ఖండాలకు విస్తరించిన ఆయన జీవితంలో సామాన్య దృష్టికి కానవచ్చేవి జారవిడిచిన మహదవకాశాలే, కాలదన్నిన కీలక పదవులే, చేజేతుల మంటగలుపుకున్న పేరుప్రఖ్యాతులే! అద్భుత మేధాసంపత్తి ఉండి కూడా అసాధారణ ప్రజ్ఞాప్రాభవాలుండి కూడా ఈ విధంగా ఆయన వర్తించడం సామాన్య జనులకు విపరీతంగా తోస్తుంది. ఉన్మాదుల పట్టికలో ఆయన పేరును వారు చేర్చుతారు.

ఆ పట్టికలో చార్వాకుని నిరసనను, మక్ఖలి గోశాలుడి సరసను, సంజయవేళట్టి పుత్రుని సరసను, అజితకేశ కంబళుని సరసను, డెమోక్రటీజ్ సరసను, టి.హెచ్. హక్స్లీ సరసను, కార్ల్‌మార్క్స్ సరసను తన పేరు కనబడినందుకు శ్రీ రాయ్ మాత్రం ఎంతో సంతోషించేవాడని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. వారివలె ఈయన కూడా "అబద్ధాల వేట"నే తన వృత్తిగా పెట్టుకున్నాడు; అప్రియ సత్యాలను పలకడమే తన పరమ ధర్మంగా భావించుకున్నాడు; అనాదృత సిద్ధాంతాల ప్రతిపాదననే తన విశిష్ట లక్ష్యంగా ఎంచుకున్నాడు; అపజయం వాటి ముఖాన స్పష్టంగా వ్రాసిపెట్టబడి ఉన్న యుద్ధాలలో దూకడానికే తన జీవితాన్ని అంకితం చేశాడు. ఇతరుల ఆమోద ప్రమోదాలను లెక్కచేయక, ప్రాపంచిక దృష్టి నుంచి జయాపజయాలను సరకుగొనక, సత్యపథం వెంట నిత్యపథికులుగా నిలవడాన్ని మాత్రమేఈ కోవకు చెందిన ఉన్మాదులు కాంక్షిస్తారు.



ఎవెలీన్ ట్రెంట్ రాయ్

**త్యాగధనుడు:**


తానై కోరుకొనకపోయినా, శ్రీ రాయ్ ఒకసారి మెక్సికోలో, మరొకసారి సోవియెట్ రష్యాలో కీలక స్థానాలకు రాకపోలేదు. అయినా వాటిని కాపాడుకొనడానికి ఆయన యత్నించలేదు. తన మాట దాదాపు తిరుగు లేకుండా చెల్లుతున్న ఘట్టంలో మెక్సికో నుంచి (లెనిన్ ఆహ్వానంపై) కొత్త దేశంలో, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఆయన నిస్సంకోచంగా బయలుదేరాడు. తాత్కాలికంగా మౌనం వహించినప్పటికీ అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం కేంద్ర కార్యవర్గంలో మిగిలే తన సభ్యత్వాన్ని దాపరికం లేకుండా తన విరుద్ధాభిప్రాయాలను వెల్లడించడం ద్వారా కోల్పోయాడు. యౌవన దశలోనే కాక, వయస్సు మళ్ళిన తరువాత

కూడా తన విశ్వాసాల కోసం ఈ విధమైన త్యాగాలను చేస్తూనే పోయాడు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో నాయకత్వానికి కాకపోయినా, ఒక ప్రముఖ స్థానానికి వచ్చి కూడా ద్వితీయ ప్రపంచ యుద్ధ సందర్భంలో బ్రిటన్ పట్ల అవలంబించదగు వైఖరి విషయంలో అత్యధిక సంఖ్యాకులతో ఏకీభవించలేక తన సభ్యత్వానికి రాజీనామా పెట్టివేశాడు. తర్వాత తాను సంస్థాపించిన రాడికల్ డెమొక్రటిక్ పార్టీని, కొంతవరకు అది వేళ్ళు తన్నదొడగిన ఘట్టంలో, రాజకీయ పక్షాల నిర్మాణం తగదన్న తమ నూతన విశ్వాసానుసారం, రద్దు చేసి వేశాడు.

తర్కంలోని నిష్కర్ష, సత్యంలోని కాఠిన్యం, ఏకాగ్రతలోని నిశ్చలత్వం శ్రీ రాయ్ వ్యక్తిత్వంలో ప్రస్ఫుటమౌతూ ఉండేవి. అందువల్లనే పెక్కుమంది ఆయనను మెదడు తప్ప హృదయం లేనివానిగా అపార్థం చేసుకునేవారు; ఔదార్యానికి, ప్రేమకు, క్షమకు ఆయన అపరిచితుడని భ్రమపడేవారు. ఆయనను కేవలం ఒక 'థింకింగ్ మెషిన్'గా పరిగణించేవారు. ఆలోచనకు ఆయనెంత ప్రాధాన్యమిచ్చినా, దాని వెనుక 'తక్కిన జంతుకోటి నుంచి తమను వేరు చేస్తున్న మెదడు తమకు ఉండి కూడా మానవులు దాన్ని వినియోగించరేం?" అనే తీవ్రావేదన దాగి ఉండేది. సత్యపరిశోధన కోసం ఎంత దీక్షతో ఆయన తపస్సు చేసినా, అది కేవలం సత్య సాక్షాత్కారాన్ని పొందగలిగినానన్న వ్యక్తిగత సంతృప్తి కోసం కాదు; మత మౌఢ్యాల నుంచి నీచ స్వార్థాల నుంచి, ఆత్మ విధ్వంసక విధానాల నుంచి మానవ జాతిని సముద్ధరించవలెనన్న గాఢ తపనతోనే! జాతి, మత, వర్ణ, కుల, వర్గాది విభేదాల నెరుగని ఆయన విశ్వమానవ ప్రేమే ఆయనను మానవతావాదిని చేసింది.

**తాత్త్విక రచనలు:**

శ్రీ రాయ్ తాత్త్విక రచనలు ఆయన పూర్తి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించవు. వాటిలో ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, దార్శనికాది వివిధ శాస్త్రాల చర్చ విశేషంగా ఉన్నందున, ఆ శాస్త్రాల పారిభాషిక పదజాలంతో అవి నిండి ఉన్నందున, వాటిని త్వరగాగాని, తేలికగాగాని చదవలేము. కొన్ని వేల సంవత్సరాల నుంచి మనలో జీర్ణించుకుపోయిన అంధ విశ్వాసాలను కూకటి వేళ్ళతో పెకలించి వేయాలనే ప్రతయ్నంలో ఒక భాగంగా మానసిక విప్లవాన్నే అవి ప్రధానంగా కాంక్షిస్తాయి కాబట్టి, మన హృదయాన్ని కదిలించడానికి కాక, మన మనస్సుకు పదును పెట్టడానికి వాటిని శ్రీ రాయ్ వచించాడు. ఈ రెండు కారణాలవల్ల శ్రీ రాయ్ తాత్త్విక రచనలతో మాత్రమే పరిచయమున్నవారు ఆయనను గౌరవించినంతగా ప్రేమించలేరు. మన గౌరవంతోపాటు ప్రేమను సైతం పూర్తిగా పొందగల శ్రీ రాయ్ మనకు కనబడేది ఆయన తదనంతరం ఇటీవలనే వెలువడిన ఆయన స్వీయచరిత్రలోనే. ఐదువందల పుటలకు మించిన ఈ స్వీయచరిత్ర ఆయన జీవితంలో కేవలం ఏడు సంవత్సరాలకు పరిమితం. 1914తో ప్రారంభమై, 1921తో ఇది సమాప్తి చెందుతున్నది. ఆయన శైశవ, బాల్యావస్థల ప్రసక్తి దీనిలో లేదు; తాత ముత్తాతల ప్రసక్తి లేదు; తల్లిదండ్రుల ప్రసక్తి లేదు; కౌమార దశలో వంగ రాష్ట్రంలోని ఒక రహస్య విప్లవ సంఘ సభ్యుడుగా ఆయన కొనసాగించిన సాహస కృత్యాల ప్రసక్తి సైతం లేదు. ఆలోచనారహితమైన అనుభవ శూన్యమైన తన తొలి జీవిత ఘట్టాలకు చెందిన అప్రధాన సంఘటనలుగా వాటినన్నింటిని ఆయన విడిచిపెట్టాడు. అయినా చివరి వరకు దాన్ని వ్రాసి ఉంటే శ్రీ రాయ్ స్వీయచరిత్ర బహుశా ఏ రెండు, మూడు వేల పుటలకో విస్తరించి ఉండేది; ఎన్నెన్నో మహత్తర విషయాలను అది వెల్లడించి ఉండేది. కాని దాన్ని పూర్తి చేయకుండానే శ్రీ రాయ్ కాలధర్మం చెందాడు.



నార్ల

*(ఆంధ్రజ్యోతి - 5.9.1965)*

పరిశోధనలలో బయటపడిన అంశం గమనార్హం! ఎం.ఎన్. రాయ్ (మానవేంద్రనాథ్ రాయ్) నాటిన మానవవాద రాజకీయ వృక్షం ఆంధ్రలో అని తేలిన సంగతి పరిశోధనా ఫలితమే.

1936లో మహారాష్ట్రలోని ఫైజ్‌పూర్ గ్రామ శివార్లలో కాంగ్రెసు మహాసభలు జరిగాయి. నాయకులందరూ కూడిన ఆ సభలకు తొలిసారిగా, అప్పుడే ఆరేళ్ళ జైలు జీవితం నుండి బయటపడిన ఎం.ఎన్. రాయ్ వచ్చారు. స్వాతంత్ర్య సమర యోధుడుగా బ్రిటిష్ వారి జైలు శిక్ష అనుభవించి వచ్చిన రాయ్ ఒక కొత్త, వింత ప్రతినిధిగా ఉన్నాడు. ఆయన పేరు వినడమేగాని, వివరాలు తెలియని రోజులవి. కాంగ్రెస్ మహాసభలకు నాయకులంతా వచ్చారు.

ఆంధ్ర నుండి వెళ్ళిన ప్రతినిధులలో వెన్నెలకంటి రాఘవయ్య, కాకినాడ నుండి ములుకుట్ల వెంకటశాస్త్రి ఉన్నారు. రాఘవయ్యను గిరిజన గాంధి అనేవారు. కాంగ్రెస్‌లో సోషలిస్టు భావాలుగలవారితో ఉన్నారు. ములుకుట్ల వెంకట శాస్త్రి కాకినాడలో అడ్వొకేట్‌గా ఉంటూ, మద్రాసు నుండి కుందూరి ఈశ్వరదత్ నడిపే *లీడర్* పత్రిక ప్రతినిధిగా సభలకు వెళ్ళారు.

ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సభలలో తొలిసారి ఎం.ఎన్. రాయ్ మాట్లాడడం విశేషంగా కాంగ్రెస్ సోషలిస్టులను ఆకట్టుకున్నది. ప్రసంగం అనంతరం ఆయన్ను కలిసి ఆంధ్రకు రావలసిందిగా వెన్నెలకంటి రాఘవయ్య ఆహ్వానించారు. దక్షిణ భారత వ్యవసాయ కార్మికుల సభను ప్రారంభించమని కోరారు. రాయ్ అంగీకరించారు. తరువాత కాకినాడ రమ్మని ములుకుట్ల వెంకట శాస్త్రి అర్థించారు. వారి కోరిక ప్రకారం రాయ్ వచ్చారు.

ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సభలలో మరో విశేషం గాంధీ - రాయ్ కలసి మాట్లాడుకోవడం. రాయ్ చెప్పినదంతా విన్న గాంధీ ఆయన్ను కాంగ్రెస్‌లో మౌనంగా సేవ చేయమని కోరాడు. అంటే రాయ్ భావాలతో ఏ మాత్రం అంగీకరించలేదన్నమాట. అంతే ఆ తరువాత వారెప్పుడూ కలవలేదు!

తెలుగు వారితో ఆరంభమైన

# ఎం.ఎన్. రాయ్ మానవవాద రాజకీయం

– *నరిసెట్టి ఇన్నయ్య*

నెహ్రూ మాత్రం రాయ్‌ను తన ఇంటికి ఆహ్వానించడం, వారిరువురూ మిత్రులుగా కొనసాగడం ఒక పరిణామం.

**నెల్లూరు రాక:**

ఎం.ఎన్. రాయ్ 1937లో నెల్లూరు ప్రాంతాలలో పర్యటించారు. వెన్నెలకంటి రాఘవయ్య ఆయన వెంట ఉండి పర్యటన ఏర్పాట్లు చూశారు. ఆనాడు కొంత కాలం రాయ్ ఖాదీ ధరించి, ఖద్దరు టోపీ పెట్టాడు. నెల్లూరు, కావలి, చంద్రగిరి, తిరుపతి ప్రాంతాలలో వెన్నెలకంటి రాఘవయ్య ఏర్పాటు చేసిన సభలలో రాయ్ ప్రసంగాలు జనాన్ని ఆకట్టుకున్నాయి.

రాయ్ తొలి ఆంధ్ర పర్యటన వివరాలు, ఫొటోలు నాడు మద్రాసు నుండి వెలువడే ఆంధ్రపత్రికలో వివరంగా ప్రచురించారు. ఇది 1938 నాటి సంగతి. స్థానిక వార పక్ష పత్రికలు కొన్ని ప్రచురించాయి. జమీన్ రైతు నెల్లూరు వెంకట్రామా నాయుడు సంపాదకత్వాన వెలువడినా, వెన్నెలకంటి రాఘవయ్యకు ప్రత్యర్థి కావడం వలన వార్తా వివరాలు రాయలేదు!

ఆ విధంగా రాయ్ నెల్లూరు పర్యటన జరుగుతుండగా, ఆయనకు జబ్బు చేసింది. ఈ విషయం తెలిసి, తక్షణమే ములుకుట్ల వెంకటశాస్త్రి కాకినాడ నుండి వచ్చి రాయ్‌ను కాకినాడ తీసుకెళ్ళి చికిత్స చేయించారు. కుదుట పడగానే, వారు తరలి విశాఖపట్టణం వెళ్ళారు. అది ఒక గొప్ప దశ. చెప్పుకోదగిన మార్పులన్నింటికీ విశాఖ నాంది పలికింది. ఎం.ఎన్. రాయ్‌ను విశాఖపట్టణం తీసుకు రావలసిందిగా అబ్బూరి రామకృష్ణారావు ఆనాడు ఎం.వి. శాస్త్రికి కబురు చేశారు. నాడు ఆంధ్ర యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా నాటకరంగ పరిశోధకుడుగా అబ్బూరి ఉన్నారు. ఆయన కోరిక మేరకు ఎం.ఎన్. రాయ్‌ను వెంటబెట్టుకొని

ఎం.వి. శాస్త్రి వైజాగ్ వచ్చారు. తొలుత స్వాగతం పలికినవారిలో అబ్బూరి వరద రాజేశ్వరరావు, అత్తలూరి నరసింహారావు, పి.హెచ్. గుప్త, అబ్బూరి గోపాలకృష్ణ ఉన్నారు. విశాఖలోని మహారాణి పేటలో పి.హెచ్. గుప్త నివసిస్తున్నారు. ఆయన ఇల్లు సముద్రపు ఒడ్డున ఉన్నది. ఆ వాతావరణం రాయ్‌కు సరిపడుతుందని అక్కడ పెట్టారు. నాడు ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న కట్టమంచి రామలింగా రెడ్డికి రాయ్‌ను పరిచయం చేయడంలో అబ్బూరి కీలక పాత్ర వహించారు. రాయ్ మేథస్సు పట్ల ఆకర్షితుడైనా కట్టమంచి ఆయన్ను ప్రొఫెసర్‌గా ఉండమని యూనివర్సిటీకి ఆహ్వానించారు! రాయ్ నవ్వుతూ ఆహ్వానాన్ని తిరస్కరించి, ధన్యవాదాలు చెప్పారు. వారిరువురూ మంచి స్నేహితులయ్యారు. జైలు నుండి రాయ్ రాసిన ఉత్తరాలు చదివి కట్టమంచి ఆకర్షితుడై చక్కని ఉపోద్ఘాతం రాశారు. అది గ్రంథంగా వెలువడింది.

విశాఖలో విద్యార్థులు కొందరు రాయ్ పట్ల బాగా ఆకర్షితులై, తమ కళాశాలలో ప్రసంగించమని కోరారు. విశాఖ సముద్ర బీచ్‌లో సభను ఏర్పరచారు. కాలేజీ ప్రిన్సిపాల్ గాంధేయుడుగా రాయ్ ప్రసంగం ఏర్పాటును వ్యతిరేకించాడు. అయినా పట్టుదలతో విద్యార్థులు సభ నిర్వహించారు. వారిలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఉండడం చరిత్ర. ఆయన తన డైరీలో రాయ్‌తో తన పరిచయం, ప్రభావం వివరంగా రాశారు. విజయనగరం నుండి తాతా దేవకీనందన్ తొలుత రాయ్‌కు సన్నిహితులయ్యారు. ఉత్తరోత్తరా ఆయన విజయనగరం ఛైర్మన్ అయ్యారు. నెల్లిమర్ల జూట్ మిల్ కార్మికుల సంఘ రాయ్ భావాలకు ఆకర్షితులై పెమ్మరాజు వెంకట్రావు నాయకత్వాన రాయ్ భావాలకు తగ్గట్టుగా సాగి, సమ్మెలు నడిపారు. పార్వతీపురం ప్రాంతంలో రాయ్ భావ ప్రభావానికి లోనైన వారిలో చీకటి పరశురాం నాయుడు ఉన్నారు. ఆయన తన మనమడికి రాయ్ అని పేరు పెట్టడం గమనార్హం. నేడు అతను ఆంధ్ర హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. రాయ్ ప్రారంభించిన ఇండిపెండెంట్ ఇండియా పత్రికను తెప్పించి, బాగా ప్రచారం చేసిన వారిలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఉన్నారు. ఇదంతా ఎం.ఎన్. రాయ్ తొలి పర్యటన సంవత్సరాల చరిత్ర. ఆ విధంగా ఆంధ్రలో రాయ్ మానవవాద యాత్ర సాగింది. అప్పుడే తణుకు నుండి కె.పి.ఎన్. రాజు పెద్ద ఊరేగింపు ఏర్పరచి, రాయ్‌ను ఊరేగించారు. ఖద్దరు వేషంలో రాయ్ ప్రధాన ఆకర్షితుడుగా ప్రసంగాలు చేశారు. 1938 నాటి గాథయిది. తెలుగువారితో ఆరంభమైన ఎం.ఎన్.రాయ్ మానవవాద ఉద్యమం ఆ తరువాత ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. ఇది తొలి గాథ. ఇప్పుడది చరిత్ర!

*(మార్చి 21 మానవేంద్రనాథ్ రాయ్ పుట్టినరోజు )*

**డా. నరిసెట్టి ఇన్నయ్య,**
**మేరీలాండ్, వాషింగ్టన్.**
**ఇ-మెయిల్:** innaiah@gmail.com

---

## తెల్లవారె!

మోహన రాగము - ఝంప తాళము

*మగువ తన కేళి కా – మందిరము వెడలెన్*
*వగకాడ మాకంచి – వరద తెల్లవారె ననుచు ॥*

*విడజారు గొజ్జంగి – విరిదం డతోను*
*కడుచిక్కుబడి పెనగు – కంటసరితోను*
*నిడుదకన్నుల దేరు – నిదురమబ్బుతోను*
*తొడరిపదయుగమున – దడబడెడు నడతోను!*
*సొగసి సొగయనివలపు – సొలపు జూపుల తోను*
*వగవగల ఘనసార – వాసనల తోను*
*జిగిమించు కెమ్మోవి – చిగురుకెంపులతోను*
*సగముకుచముల విదియ – చందురులతోను*
*తరితీపుసేయు సమ – సురతి బడలికతోను*
*జరుతపావడ చెరగు – జార్పైట తోను*
*యిరుగడల కైదండ లిచ్చు తరుణుల తోను*
*పరమాత్మ మువ్వగోపాల తెల్లవారె ననుచు ॥*

క్షేత్రయ్య పదాలు - శ్రీనివాస చక్రవర్తి

# నటన: ఒక అబద్ధం - ఒక నిజం

*- గోవిందరాజు భరద్వాజ*

**నటన అంటే ఏమిటి?**

నిజానికి నటన అనే పదాన్ని నిర్వచించడం చాల కష్టం. కేవలం ఒక నిర్వచనం సరిపోదు. కానీ అనేకమంది నటులు, రచయితలు, దర్శకులు, నట సిద్ధాంత ప్రయోక్తలు నటనని నిర్వచించడానికి సాహసించారు . వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాము.

"ప్రపంచమంతా ఒక రంగస్థలం. మనమంతా అందులో పాత్రధారులం. ఎన్నో ప్రవేశాలు... నిష్క్రమణలు... కొన్ని సార్లు ఒకే వ్యక్తి తన జీవిత కాలంలో అనేక పాత్రల్ని పోషిస్తుంటాడు" విలియం షేక్స్పియర్.

"రంగస్థలం మీద జరిగే ప్రతి చర్య సమర్థవంతంగా, పొందికగా, తర్కబద్ధం గా ఉండాలి" -స్టానిస్లావిస్కీ.

నటన ఊహాజనితమైన సందర్భాల్లో ప్రదర్శించబడే ఋజు ప్రవర్తన. - స్టాన్స్‌ఫోర్డ్ మెయిస్నేర్.

అలాగే ప్రసిద్ధ అమెరికన్ నటుడు హార్డీ అల్బ్రైట్ *Acting : The Creative Process* అనే గ్రంథంలో నటన అంటే వేరొకరి స్థానంలో ప్రవర్తించడం అంటాడు. అంటే వేరొకరి భౌతిక, మానసిక, సామజిక పరిమాణాలను (dimensions) తమపై కావలసినప్పుడు ఆపాదించుకోగలగడం. సులభంగా అర్థం చేసుకోవాలంటే రంగస్థలంపై రచయిత సృజించిన పాత్ర తాలూకు భావోద్వేగాలను అంగిక, వాచిక, సాత్వికాలతో ప్రేక్షకులకు చేర్చగలగడం. చదివితేనో, వింటేనో ఈ మాటలు సులభంగాను, అర్థమవుతన్నట్లే ఉన్నా నిజంగా దీన్ని సాధించడం ఓ తపస్సే అవుతుంది.

అసోసియేట్ ప్రొఫెసర్ , స్కూల్ అఫ్ పెర్ఫార్మింగ్ అండ్ విజువల్ ఆర్ట్స్, ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (IGNOU), న్యూ ఢిల్లీ -110066.

అసలు ఓ నటుడు/నటి స్టేజి పైకి వెళ్లి ఏం చేస్తారు?

అతడు / ఆమె మాట్లాడుతారు లేదా అటు ఇటు నడుస్తారు.

కొన్ని యాక్షన్స్ చేస్తారు.

ఎవరి కోసం ఎవరితో మట్లాడుతారు?

నటుడు/నటి తాము పోషిస్తున్న పాత్ర తరపున మాట్లాడుతారు. పాత్ర తరపున వకాల్తా పుచ్చుకుని స్టేజి మీద జీవిస్తారు నవ్వుతారు. నవ్విస్తారు. ఏడుస్తారు. లేదా ఏడిపిస్తారు. నిజానికి నటీనటుల పని రంగస్థలం మీదికి వెళ్లి తమ పాత్ర కోసం పోరాడటమే. చివరగా పాత్ర తాలూకు చైతన్య స్రవంతిని తమ ప్రదర్శన ద్వారా ప్రేక్షకులకు అందజేస్తారు .

వాస్తవానికి నటనని అర్థం చేసుకోవడానికి మానవ సమాజ ప్రవర్తనని అర్థం చేసుకోవాలి. నిజ జీవితంలో మనం ఎన్నో సందర్భాలలో జరిగే సంఘటనలకు రకరకాలుగా స్పందిస్తాము. మనస్పందనలతోపాటు ఎన్నో అనుభవాలతో ఎందుకు వెళతాం. వాటిలో కొన్ని ఆనందాన్ని ఇచ్చేవి కావచ్చు లేదా విషాదాన్ని పంచేవి కావచ్చు. వాటితో కొంత దూరం ప్రయాణం చేస్తాము. ఇవేకాక వాటితోపాటే ఓ ఆలోచన, భావోద్వేగం, ఇంద్రియ స్మృతి, శారీక కదలిక లేదా ఇవన్నీ కలగాపులగంగా కలసి మనం అవన్నీ అనుభవిస్తాం. ఈ అనుభవాలు వ్యక్తికీ వ్యక్తికీ వారివారి భౌతిక, సామజిక,

మానసిక స్థితిగతులనుబట్టి వేరు వేరుగా ఉంటాయి. అంటే ఒకేరకమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రతి వ్యక్తికీ వేరు వేరు స్పందనలు కలుగుతాయి అన్నది వాస్తవం. ఈ విధంగా నిజ జీవితంలో మనం ఏ సందర్భానికైనా స్పందిస్తే దాన్ని నటన అనరు. కానీ ఒకవేళ ఊహాజనితమైన (Imaginary) పరిస్థితులకు స్పందిస్తే దానిని నటనగా గుర్తించవచ్చు. కారణం ఇక్కడ స్పందించడానికి హేతువు నిజమైన పరిస్థితి కాకపోవడమే. అది కృత్రిమమైన, కల్పించబడ్డ ఒక స్థితి కావడమే. కానీ అలాంటి పరిస్థితులలో కూడా సహజంగా స్పందించగలిగిన సామర్థ్యం ఒక్క నటుడికి మాత్రమే సాధ్యం. అంటే అతనికి ఆ సమస్య లేదా పరిస్థితికి సంబంధించిన విశ్వసనీయత, ఊహాశక్తి, అంతకు మించి ముందే ఉహించి చేయాలనుకున్న ప్రతిక్రియ అంతేకాక వీటన్నిటినీ ప్రేక్షకులకి చేరవేయగలిగిన సామర్థ్యం. వీటన్నిటిని నటుడు అలవరచుకోవాలి. అంటే నటుడికి శిక్షణ ఎంతైనా అవసరం. ఇక నటనకి సంబందించిన సాంకేతికతను అర్థం చేసుకుంటే ప్రాథమికంగా నటన అనుకరణ అనే ఊనికతో మొదలవుతుందని చాలమంది పరిశోధకులు అంగీకరించారు.

మనం ఎవరిని అనుకరిస్తాం?

మనం మన చుట్టూ ఉన్న ప్రకృతిని అనుకరిస్తాం.

భరతముని తన నాట్యశాస్త్రంలో “లోకవృతానుకరణం నాట్యం” అన్నాడు. అంటే రంగస్థలం ప్రకృతిని దానిలోని వివిధ అంశాలను అనుకరిస్తుంది అని అర్థం.

మన రోజువారీ జీవితంలో అనుకరణని సులభంగా అర్థం చేసుకోవాలంటే చిన్న పిల్లలు ఆడుకునేటపుడు వాళ్ళని గమనించండి. వాళ్ళు ఆడుకునేటప్పుడు సహజంగా వాళ్ళ పెద్దవాళ్ళని అంకరించడం చూస్తాము. వాళ్ళు ఆడుకునే అమ్మ-నాన్న ఆటలో అదేపనిగా తాదాత్మ్యములో మునిగిపోవడం గమనించవచ్చు. ఆట మధ్యలో వాళ్ళు ఉత్తుత్తి వంట, అందులో అన్నం, పప్పు, కూర, వంట గిన్నెలు, ఒకటేమిటి అనేకం సృష్టిస్తారు. ఆట చాల సహజంగా అచ్చు రోజు మన ఇంట్లో జరిగే సన్నివేశంలాగానే లేదా కొన్నిసార్లు ఇంకా బాగా కనిపిస్తుంది. ఇందులో పేక్షక పాత్రేమీ లేదు కనక దీనిని మనం నటన అనలేము. అయితే పిల్లలు వారిని ఎవరైనా గమనిస్తున్నారని గ్రహిస్తే తిరిగి అదే ఆట ఆడమని ఎవరన్నా అడిగినా, సిగ్గుతో ఆగిపోతారు. కానీ ఈ ఆటలో మంచి నటనకి కావలసిన అన్నిలక్షణాలు ఉన్నాయి. అవి:

అద్భుతమైన ఏకాగ్రత, జీవితాన్ని పరిశీలించగలిగిన శక్తి, నమ్మకంతో కూడిన ఊహాశక్తి, పాత్ర పోషణ (Role Play), అవసరానికి తగనట్టు శరీర భంగిమలు, పాత్రోచిత సంభాషణ, సద్యోఽనటన సామర్థ్యం (Improvisation).

పైన పేర్కొన్న అన్ని లక్షణాలను మేళవిస్తే సృజనాత్మకతతో కూడిన మంచి నటన అవుతుంది. అంటే ఇక్కడ చిన్న పిల్లల ఆట రూపంలో జరుగుతున్నా ప్రదర్శనకి ఆధారం మనచుట్టూవున్న విషయాల అనుకరణే అని తెలుస్తోంది. అయితే మరి నటన అంటే కేవలం అంకరణేనా? కాదు. ఐతే మనం దేనిని అనుకరించాలి దేనిని అనుకరించకూడదు? అందుకే అరిస్టాటిల్ Ideal ఇమిటేషన్ గురించి ప్రస్తావిస్తాడు. అంటే నటులు కావాలనుకునేవాళ్ళు అప్పటికే లబ్ధప్రతిష్టులైన నటుల్ని అనుకరించకూడదు. ఎందుకంటే ఈ తరహా అనుకరణలో సృజనాత్మకత కొరవడుతుంది. ఒకవేళ అనుకరించినవాళ్ళు ఆయా నటులను ప్రతిరూపాలుగా మిగిలిపోతారు. అది రానురాను మార్పులేని విసుగు పుట్టించే అర్థం లేని గతి విన్యాసాలకు, ముద్రాంకిత నటనకు (cliche) దారి తీస్తుంది. తద్వారా సృజనాత్మకతను చంపేసి వ్యక్తిగత శైలికి దోహద పడకుండా ఆపుతుంది. ఆరంభంలో అనుకరణ అనే ఆలవాలంతో మొదలైన నటుల ప్రయాణం తరవాత సహజమైన, స్వచ్ఛమైన నైపుణ్యంతో అర్థవంతమైన ప్రదర్శన వైపు అడుగులు వెయ్యాలి. దీనికి తనను అర్థం చేసుకోవడంతో పాటు కొంత రంగస్థల అవగాహన కూడా అవసరం. మనం మన నిజ జీవితానికి రంగస్థలం మీద జీవించే జీవితానికి తేడా ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేద్దాం. నాటకం జీవితాన్ని అద్దం పడుతుందని ముందే అనుకున్నాం. నిజ జీవితంలో జరిగే సంఘటనలే నాటకానికి కావలిసిన

కథావస్తువులు. సంఘటనలు అవే అయినా అవి జరిగే క్రమంలో అనేక భేదాలుంటాయి. నిజ జీవితంలో మన నమ్మకాలకి, ప్రవర్తనకి, స్టేజి మీద జరిగే అవే సంఘటనలకు, వాటికీ మన ప్రతిక్రియలకి చాల మార్పులు ఉంటాయి. అవేమిటో ఈ కింది పట్టిక ద్వారా తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం.

**నిజ జీవితం:**

1. మనకు జరగబోయే సంఘటనల గురించి ఏమాత్రం తెలియదు. మనం అందుకే ఏదైనా సంఘటన జరిగినపుడు దానికి తగినట్లు ప్రవర్తిస్తాం.

2. జీవితంలో మనకెదురయ్యే ఘటనలకు లేదా సమస్యలకి కాలపరిమితి ఉండదు.


3. మనకి ఎదురయ్యే సంఘటనల గురించి తెలియక పోవడంవల్ల వాటి ప్రభావంవల్ల మనం నిరాశ పడవచ్చు, ఆందోళన చెందవచ్చు, సంభ్రమాశ్చర్యాలకు లోను కావచ్చు. శక్తిహీనులం కావచ్చు లేదా ఆయా పరిస్థితుల్ని ఆనందంగా స్వీకరించి సంతోషపడవచ్చు.

4. ఇక్కడ జీవితంలో జరిగే సంఘటనలు, పరిస్థితులు, వాటి సందర్భాలు, ప్రదేశాలు అన్ని నిజమైనవి.

5. ఇక్కడ జరిగిన సంఘటన తాలూకు ప్రతిచర్యలు కాలానుగుణంగా మన భావోద్వేగాలపై ప్రభావాన్ని చూపుతాయి.

**స్టేజి మీద జీవితము:**

1. రంగస్థలం పైన జరగబోయే సంఘటనల గురించి మనకు ఖచ్చితంగా తెలుసు. అలాగే ఆయా



*The Longest Day* - Richard Burton - 1962

సంఘటనలకు ఎలా రియాక్ట్ కావాలో , ఎంత వరకు రియాక్ట్ కావాలో తెలుసు. ఇక్కడ జరగబోయే సంఘటనల గురించి ముందే తెలిసిన మనకేమి తెలియనట్లు ఆ సంఘటనలు మొట్టమొదటిసారి మన ముందు జరుగుతున్నట్లు ప్రవర్తిస్తాం.

2. ఇక్కడ జరిగే ప్రతి సంఘటన/పరిస్థితి /చర్య ఒక నిర్దిష్ట కాల పరిమితికి లోబడి ఉంటుంది.

3. ఇక్కడ అలాంటి ప్రమాదాలు కానీ వాటికీ ఆస్కారాలు కానీ ఉండవు.

4. సంఘటనలు / పరిస్థితులు / స్థలాలు ఊహాజనితలు, సృజిపబడినవి లేదా కల్పించబడినవి.

5. నటులు, ప్రేక్షకులు ఒకే సమయంలో ఒకేచోట ఒకే రకమైన భావోద్వేగాలకు లోనవుతారు. చివరగా రససిద్ధి పొందుతారు.

ఇక్కడ పైన ఉదహరించిన ఉద్దేశాలు తాలూకు మర్మం ఏమిటంటే నటి,నటులకి నిజజీవితానికి, స్టేజి మీద వాళ్ళు జీవించే జీవితానికి పోలికలు తేడాలు ఖచ్చితంగా తెలిసివుండాలి. లేకపోతే సంఘటనల తాలూకు ఆనందంలో ఉద్వేగాల పరంపరలో ప్రమాదాలు జరిగే అవకాశాలు వుంటాయి . అందుకే ఈ తారతమ్యాలు,తేడాలు, సమానతలు తెలుసుకోవాలి.

ఇక నటన దాని స్వరూప స్వభావాల విషయానికి వస్తే, ఒక విజయవంతమైన నాటక ప్రదర్శన ప్రేక్షకుల గుండెల్లోకి దూసుకు వెళ్లాలంటే అది ఏ ఒక్కరి వల్లా కాదు . అది నటీనటుల సమిష్టి కృషి. చక్కటి విజయాన్ని సాధించాలంటే అది కేవలం ఒక సామూహిక ప్రయత్నంవల్లే సాధ్యం అవుతుంది. రచయిత రాసిన మాటల రాతల్ని మూటకట్టి వాటిని జాగ్రత్తగా పేక్షకులకు చేరవేయాలి. ఎక్కడ ఎంతటి భావాన్ని ప్రదర్శించాలో అక్కడ దాన్ని ప్రయోగిస్తూ ఎక్కువ కాకుండా అలాగని చప్పగా ఉండకుండా ప్రదర్శనని ఉండాలి. మరి అలాంటి సామర్థానికి ఫార్ములా చెప్పడం కష్టమే అయినా కొన్ని ప్రాథమిక నట స్వభావాలని చెప్పుకోవచ్చు.


అవి: 1. <u>విశ్లేషణాత్మకత</u>: సరైన నటనకి, తరవాత దానిని రంగస్థలం మీద ప్రదర్శించడానికి విశ్లేషణాత్మకత

ఎంతైనా అవసరం. నాటక రచయిత తన కధాంశాన్ని ఎలా చెప్పాలనుకున్నాడో ముందు నటుడు/నటి తెలుసుకోవాలి. అలాగే ఎలా చెప్పాలనుకున్నాడో తెలుసుకోవాలి.

2. **వివరణాత్మకత**: నటన వివరణాత్మకంగా ఉండాలి. అంటే తెలుసుకున్న అర్ధాన్ని సాధ్యమైనంత సరళంగా ప్రేక్షకుల ముందు ఉంచాలి. అలాగే రచయిత, దర్శకులు ఎలా చెప్పాలనుకున్నారో దాన్ని నటన ద్వారా ఎలా సాధించాలో తెలుసుకోవాలి. దీనికి నటీనటుల ఆంగికాభినయం, వాచికం, హావభావాలు, పాత్ర తాలూకు ఆహార్యం ఉపయోగపడతాయి.

**రూపకాత్మకత (Formalization):**

నటి/నటులు తాము చెప్పదలుచుకున్న వివరణలు తగిన దృశ్య, శ్రవణ రూపాలని ఏర్పాటు చేసుకోవాలి. అంటే పాఠ్యాన్నిబట్టి శైలిని, శైలినిబట్టి నటనా విధానాన్ని తద్వారా ప్రతి నాటకానికి ఒక రూపాన్ని కల్పించాలి.



Merlyn Brando in *Streetcar Named desire*

ఇవన్నీ చేయాలి అంటే ముఖ్యంగా రచయిత వాడిన భాష, నాటకాన్ని ఎక్కడ వేయాలి అన్న విషయాల పైన ఆధారపడి ఉంటాయి.

**ప్రక్షేపము:**

రచయిత సృజించిన పాత్రల తాలూకా స్వరూప స్వభావాలను తమపై ఆపాదించుకోవడానికి నటులకు కొన్ని మార్గాలున్నాయి. ఒకటి తాము వేయబోయే వేషం లేదా పాత్ర యొక్క స్వరూప స్వభావాలు ఎక్కడైనా నటి/ నటులు నిజ స్వరూప స్వభావాలతో సారూప్యం ఉందా? ఒకవేళ ఉంటే ఆ లక్షణాలను పాత్ర రూపంలో ప్రతిక్షేపించడం కొంత తేలిక. కానీ ఒకవేళ వేయబోయే పాత్రకి నటి/నటుల స్వరూప, స్వభావాలకి అస్సలు పొంతన లేకపోతే పాత్రకి కావలసినవి నటుడు తమపై ఆపాదించుకొని ప్రేషేపించాల్సి ఉంటుంది. ఏది ఏమైనా ఆపాదించబడ్డ లేదా అంతకు ముందే తనలో ఉన్నా సామర్ధ్యాలను ప్రేక్షకాకులకు అందించడానికి ప్రేక్షేపణ అవసరం. నిజానికి అది ఒక టెక్నిక్. అది అనుభవంతో మాత్రమే వస్తుంది.

**ప్రదర్శన సామర్థ్యం:**

నాటకంలోకి కావలసిన ప్రేక్షేపణని ఇచ్చి అది విజయవంతం అయ్యాక అదే నాటకం మళ్ళీ-మళ్ళీ వేయవలసి వస్తే కొన్నిసార్లు నటనలో మోనోటొనీ రావడానికి అవకాశం ఉంది. కానీ నాటకం ప్రేక్షకుల ముందుకు వెళ్లిన ప్రతిసారి కొత్తగా మొట్ట మొదటిసారి ఆడుతున్నట్లు ఉండాలి. అంటే ఒకే నాటకాన్ని విసుగు విరామం లేకుండా ఎక్కడ బోరు కొట్టకుండా నటి / నటులు నటిస్తేనే ఆ నాటకానికి మనుగడ. అలా చెయ్యడానికే సాధన ఉపయోగపడతాయి.

పైన ఉదహరించిన అంశాలను సాధించాలి అంటే నటుడికి స్వయంగా ఉపజ్ఞ ఉండాలి అని చాలామంది అభిప్రాయం. మరి ఈ ఉపజ్ఞ లేదా టాలెంట్ ఎలావస్తుంది? పుట్టుకతో వస్తుందని వాదించేవాళ్లే ఎక్కువ. ఐతే ప్రఖ్యాత నట శిక్షకు రాలు Uta Hagen ఈ ఉపజ్ఞ గురించి ఏమన్నారంటే.....

Talent, as Ms Hagen defines it, is:

"..... An amalgam of high sensitivity; easy vulnerability; high sensory equipment (seeing, hearing, touching, smelling, tastingointensely); a vivid imagination as well as a grip on reality; the desire to communicate one's own experiences and sensations, to make's self-heard and seen."

అంటే "సున్నితత్వం, సులభ ప్రతిక్రియ సామర్థ్యం, సంవేదన సామాగ్రి (చూడడం, వినడం, స్పర్శ, వాసన, రుచి), ఇంకా స్పష్టమైన ఊహాశక్తి, వాస్తవికత పైన పట్టు, తమ అనుభవాలను ఇతరులతో పంచుకోవాలనే తపనతోపాటు, వాటిని ఇతరులకు చూపించడానికి, వినిపించగలిగే సామర్థ్యాన్ని ఉపజ్ఞ (talent) అనవచ్చు.

మరి నటులు ఇవన్నీ సంపాదించాలంటే లేదా సాధించాలంటే ముందే చెప్పినట్టుగా శిక్షణ అవసరం. ఈ అవసరాన్ని చాల కాలంగా గుర్తిస్తూ వస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇవాళ పేరు పొందిన శిక్షణ పద్ధతి సైకో టెక్నిక్ అనబడే మెథడ్ యాక్టింగ్. దీనిని ప్రతిపాదించినవాడు స్టానిస్లావిస్కీ. రష్యాకు చెందిన రంగస్థల నట సిద్ధాంత ప్రయోక్త. దీనిని అయన రెండు భాగాలుగా విడదీశారు. అవి శరీరాన్ని మనస్సుపై తగిన పట్టు సాధించడానికి కావలసిన శిక్షణ. నటుడు/నటి తమ మనస్సు మీద, వాచికం మీద, శరీర కదలికల పైన పట్టు సాధించడానికి తగిన శిక్షణ, వాటిని మళ్ళీ సులభంగా అర్థం చేసుకొని నేర్చుకోవడానికి.

1. ఏకాగ్రత, 2. కండర, మానసిక సారళ్యం, 3. పరిశీలన, 4. ఊహాశక్తి, 5. ఉద్వేగస్మృతి, 7. ప్రధాన లక్ష్యం అనే వివిధ అంశాలుగా విభజియించి ప్రతీ అంశానికి అనేక అభ్యాసాలనీ పొందుపరిచారు (ఈ మెథడ్ యాక్టింగ్‌లో హాలీవుడ్ నటుడు మెర్లిన్ బ్రాండో, హిందీ నటుడు దిలీప్ కుమార్ ప్రసిద్ధులు).

వీటితో పాటు నటన సమస్యభాశాలు, ఆశు నటన, మూకాభినయం, సన్నివేశ ఆభ్యాసాలు, నృత్యం - ఇవేకాక తన స్వరం, వాచికం పైన పట్టు సాధించడానికి అనేక శ్వాసక్రియలు, స్వర సాధన ఆభ్యాసాలు, వాచికాభినయ



Method actor - Dilip Kumar

అభ్యాసాలు ఇలా అనేకానేక అంశాలను నట శిక్షణలో భాగం చేశారు. పై సంగతులకు సంబంధి వివరణాత్మకంగా తరువాత తెలుసుకుందాం.

నటన ఇతర కళారూపాలకంటే భిన్నమైనది. ఇక్కడ నటుడి శరీరమే ముఖ్యమైన మధ్యమము సాధకము కూడా. నటన ప్రక్రియలో భాగంగా నటుడు ఇంకా తాను ధరించే పాత్ర మధ్య గతితార్కిక సంబంధం ఏర్పడుతుంది. ఈ ప్రవృత్తే దీనిని ఇతర ప్రక్రియల నుంచి వేరు చేయడమేకాక ప్రత్యేకతను కూడా ఆపాదిస్తుంది . నటన నటుడి ఆత్మశక్తితో ముందుకు వెళ్లే ఒక అద్భుత ప్రక్రియ. నిరంతర అభ్యాసం, అనుభవంతో దీని ప్రయాణం కొనసాగుతుంది. దీనివల్లనే ప్రదర్శన సులభం అవుతుంది. నటుడి అభ్యాసం ఆత్మగతం కావడంవల్ల సాధన నిరంతరం అంతర్గతంగా కొనసాగుతూ ఉంటుంది. మి

డా. గోవిందరాజు భరద్వాజ, Associate Professor, SOPVA, IGNOU, New Delhi-68. ఫోన్: 995 887 2478.

# మూసీ నది

## అచ్ఛమైన తెలంగాణా నది కథ

*– రామవరపు వేంకట రమణమూర్తి*



మూసీ ప్రవాహం

ముత్యాల గురించి మాట్లాడితే ఆవూరు జ్ఞాపకం వస్తుంది. ఒక నవాబు రాజకుమారుని ప్రేమ గురించి ఆలోచిస్తే ఒక నది జ్ఞాపకంకు వస్తుంది. ఆ నగరం హైదరాబాద్ అయితే, ఈ 'మూసీ' నది. నాలుగు వందల సంవత్సరముల పైబడి చరిత్ర కలిగిన హైదరాబాద్‌ను తలుచుకుంటే వెంటనే జ్ఞాపకం వచ్చేది మూసీ నదే. నది చిన్నదైనా, మహోన్నత వారసత్వ సంపదను హైదరాబాద్ నగరానికి అందించి, హైదరాబాద్‌లో "ప్రణాళికా రహిత అభివృద్ధి వల్ల వచ్చిన "కలుషిత" వ్యాధితో నేడు కుళ్ళిపోతున్న నదే ఈ "మూసీ" నది.

మూసీ నదికి ఉన్న ఇంకొక నామధేయం "ముచికుంద" తెలంగాణా రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ పట్టణం దగ్గర్లో ఉన్న "శివారెడ్డి పేట" దగ్గరి అనంతగిరి కొండల్లో ఉద్భవిస్తోందీ నది. అక్కడ నుండి బయలుదేరి నవాబ్‌పేట ప్రాంతం దాటి రంగారెడ్డి జిల్లాలోనికి శంకర్‌పల్లి ప్రాంతం పరిసరాల్లో ప్రవేశిస్తోంది. అక్కడ నుండి గండిపేట (ఉస్మాన్ సాగర్) కు చేరుతోంది. గండిపేట దాటిన తరువాత లంగర్ హౌస్ (హైదరాబాద్) ప్రాంతంలో "మూసీ" నదిని 'ఇసీ' (మూసా) నది వచ్చి కలిసి "నదీ సంగమాన్ని" ఏర్పాటు చేస్తోంది. ఇసీ నది కలిసిన మూసీనది సరూర్‌నగర్ ప్రాంతం దాటిన తరువాత మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల సరిహద్దుగా సాగుతోంది.మేడ్చల్ జిల్లా వైపు ఉప్పల్, మేడిపల్లి, ఘటకేశ్వర్ ప్రాంతాలు ఉండగా, రంగారెడ్డి జిల్లా వైపు సరూర్‌నగర్, హయత్ నగర్ ప్రాంతాలు ఉన్నాయి. ఈ నది యాదాద్రి జిల్లాలోనికి ముక్తారం ప్రాంతంలో ప్రవేశిస్తోంది. యాదాద్రి జిల్లాలో బి.పోచంపల్లి ప్రాంతం దాటిన తరువాత వంకమామిడి, ధర్మారెడ్డి, సూర్యాపల్లి ప్రాంతాల మధ్య "చిన్న మూసీ" నది మూసీనదిని కలుస్తోంది.

ఇక్కడ నుండి మూసీనది రామన్నపేట మండలం దాటి, అడ్డగూడూరు దాటి అక్కడ నుండి యాదాద్రి, నల్గొండ జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తూ సూర్యాపేట జిల్లాలోనికి "చింతలూరు" ప్రాంతంలో ప్రవేశిస్తోంది. యాదాద్రి జిల్లా నుండి వచ్చే ఆలేరు నది లేదా వాగు సూర్యాపేట జిల్లా చింతలూరు ప్రాంతంలో మూసీనదిని కలుస్తోంది. ఇక్కడ నుండి మూసీనది సూర్యాపేట, నల్గొండ జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తోంది. ఇటు సూర్యాపేట జిల్లాలో జే.జే.గూడెం, సూర్యాపేట, నేరేడుచర్ల, పాలకీడు ప్రాంతాల్లో ప్రవహిస్తోంది. అటు నల్గొండ జిల్లా. శౌలిగారరం, కేతేపల్లి, మిర్యాలగూడా, దామన్‌చర్ల ప్రాంతాలు ఉన్నాయి. కేతేపల్లి, భీమవరం దాటిన తరువాత "కాలేపల్లి" ప్రాంతంలో "పల్లేరు" వాగు వచ్చి కలుస్తోంది. దామన్‌చర్ల ప్రాంతంలోనే మూసీనది పూర్తిగా నల్గొండ (నల్లగొండ) జిల్లాలోనికి వచ్చి కొద్ది దూరంలో నున్న వాడపల్లి (వజీరాబాద్) వద్ద "కృష్ణవేణి" (కృష్ణా) నదితో ఐక్యమవుతోంది.

ఇక మూసీ నదితో పెనవేసుకొని ఉన్న పురాణ కథనం చూద్దాం. శ్రీరాముడు పుట్టిన రఘువంశం లేదా ఇక్ష్వాకుల వంశంలోని వాడే మంధాత పుత్రుడు "ముచుకుందుడు". ఒకసారి రాక్షసులను సంహరించిన ముచుకుందుడు విశ్రాంతికోసం అనంతగిరి కొండల్లోని గుహలో నిద్రిస్తుంటాడు. అదే సమయంలో శ్రీకృష్ణ బలరాములు "కాలయవనుడు" అన్న రాక్షసుని నుండి

రక్షణ కోసం అనంతగిరి కొండల్లోనికి వచ్చి అదృశ్యమవుతారు. వారిని వెతుకుతూ వచ్చిన ఆ కాలయవనుడు అనంతగిరి కొండల్లో నిద్రిస్తున్న ముచుకుందుడుకి నిద్రాభంగం కలిగిస్తాడు. తనకు నిద్రాభంగం కల్గించేవారు ఎవరైనా వారిని భస్మం చేసే వరం పొందిన ముచుకుందుడు "కాలయవను"ని భస్మం చేస్తాడు. ముచుకుందుని కోపాన్ని తగ్గించడానికి శ్రీకృష్ణుడు అనంతగిరి కొండల్లో అనంత పద్మనాభునిగా శాంతాకార స్వరూపంలో దర్శనం ఇచ్చి అక్కడ వెలుస్తాడు. అనంత పద్మనాభుని పాదాలను తన కమండలంలోని నీటితో ముచుకుందుడు అభిషేకం చేస్తాడు. ఈ అభిషేక జలం "ముచుకుందా నది"గా మారి ప్రవహించడం మొదలుపెట్టింది. కాలక్రమేణా ముచుకుందా నది "మూసీ" నదిగా మారింది. ఈ మూసీ నదిని కుతుబ్ షాహీ రాజులు "నెర్వా" (NERA) నది అని పిలిచేవారు.

కృష్ణానది మూసీ నదుల సంగమ ప్రాంతం శిభిరం నుండి రెండవ గోవిందరాజు వ్రాయించిన తామ్రశాసనంలో మూసీనది పేర్కొనబడింది.

*ప్రభూత వర్ష విక్రమావలోక శ్రీ గోవిందరాజో*

*యువ రాజః వేంగి మండలోపర్యాయాత*

*విజయస్కంధావారే... వేంగిళే కృష్ణవేణ్ణ*

*మూసీ సంగమే... సర్వానామ్రాస్త్ర యతిస్మ*

*(A lass plates of Govind II, Epigraphia India Vol. VI No.18 (శ.స.692)*

*(ప్రాంచీనాంధ్ర చారిత్రిక భూగోళం : పార్టు-2 పేజీ 271-కుందూరి ఈశ్వరదత్తు)*

మూసీనదిని పేర్కొన్న అత్యంత ప్రాచీన శాసనం ఇది. మూసీనది చరిత్రలో ప్రేమ వారధిగా ఎలా నిల్చిందో చూద్దాం. కుతుబ్ షాహీ వంశస్తులు గోల్కొండను రాజధానిగా చేసుకుని రాజ్యం పాలిస్తున్న రోజులు అవి. మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1565-1612) (గోల్కొండ 5వ రాజు) నర్తకి అయిన భాగమతిని ప్రేమించడం, మూసీనదిని దాటి చిచ్లాం లేదా చించలాం గ్రామంలో కలుస్తుండడం ఒక ప్రేమ కధగా నిల్చింది. కులీ కుతుబ్ షా రాజైన తరువాత భాగమతిని వివాహం ఆడడం. భాగమతి ఇస్లాం మతం స్వీకరించి "హైదర్‌మహల్"గా మారడం జరిగింది. మూసీ నది ఒడ్డున 1591లో కులీ కుతుబ్‌షా భాగమతి ప్రేమ సూచికగా హైదరాబాద్ నగరం నిర్మించేడు. అదే "భాగ్యనగరం"గా పేరు పొందింది. ఆ తరువాత రాజ్యం రాజధాని నగరం గోల్కొండ నుండి హైదరాబాద్"కు మారింది.

శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావ్ (రజని)గారు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో (1960-66) నుండగా "మూసీపై వలపుల వంతెన" అన్న సంగీత రూపకం ప్రసారం చేశారు. ఈ ప్రేమకథపై అలాగే ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వారు 1970లో "భాగ్య నగరం" అన్న నాటకంను ప్రసారం చేశారు.

తల్లిలాంటి మూసీ, ప్రేమను వర్షించిన మూసీనది 1908లో తన ఉగ్రరూపాన్ని చూపించింది. మూసీనదికి 1908 సెప్టెంబరు 26, 27 లలో కురిసిన వర్షాల వలన సెప్టెంబరు 28, 29 న విపరీతమైన వరదలు వచ్చాయి. హైదరాబాదు నగరం అతలాకుతలం అయింది. దాదాపుగా 15,000 మంది చనిపోయారు. తరువాత కాలంలో 1920లో మూసీ నదిపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట చెఱువు); 1927లో ఈసీనదిపై (మూసీ నదిపై) హిమాయత్‌సాగర్ జలాశయాలు నిర్మింప బడ్డాయి. వీటి నిర్మాణం చివరి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ సమయంలో జరిగేయి. ఈ 1908 వరదల సమయంలో ఉస్మానియా ఆసుపత్రిలోని 200 సం॥ నాటి చింతచెట్టు దాదాపు 150 మంది ప్రాణాలను కాపాడింది. ఉర్దూ కవి అయిన అమ్జాద్ హైదరాబాదీ (22 సం॥ ఆనాడు) ఈ వరదల్లో తన కనుల ఎదుటే తన తల్లి, భార్య కుమార్తెను పోగొట్టుకున్నాడు. తన ప్రాణాలను చింతచెట్టు వలన కాపాడుకో గలిగేడు. ఆనాటి దృశ్యాన్ని తన రుబాయి "కయామత్-ఇ-సోగ్రా"లో ఇలా పేర్కొన్నాడు.

"Itni Dar'ya may Bhi Na Duba Amjad

Dub'nay valo ko Bus Ek Chul'lu Kafi Hai"

మూసీ నదికి 1908లో వచ్చిన వరదల్ని చూసి బాధపడిన నిజామ్ ఆలీఖాన్ ఆసిఫ్‌జా అంతరంగాన్ని

"ది టియర్స్ ఆఫ్ ఆసిఫ్" (The Tears of Asif) అన్న ఆంగ్ల పద్యంలో సరోజినీనాయుడు వర్ణించింది.

*శ్రీ కరంబుగ సిరుల్ చెన్నొంది వెలసిన*
*బాగుగా గోల్కొండ పట్నమందు*
*ముచికుంద నది వచ్చి ముంచుకపోయెను*

...............................................

*చారు కమానులు చంప దర్వాజయు*
*వురుదు బజారంత వూడ్చినట్లు*

..................................

*చారుమీనారంత చంప దర్వాజయు*
*బేగము బజారు ఆగమాయె*

....................................

*ఏటి పొడవున జూడనెన్నియో శవములు*
*చెట్ల సందులందు గట్లు పడియె*

....................................

*ఈ విధంబున నది పొంగి యిండ్లు ముంచె*
*వహీలు దస్త్రాలు వస్తువుల్ వరదగలిసె*
*చెప్పుకోరాదు ఇక మేము చెడితి మనుచు*
*చెప్పినాతడు శ్రీశుభ యల్లగౌడు*

(మాలికా కర్తయైన ఈ ఎల్లగౌడు సమాచారం లభించలేదు).

"చాటుపద్య రత్నావళి" - డా॥ శ్రీ రంగాచార్య.


(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) ప్రచురణ మార్చి 2005. ఇప్పుడిక మనం మూసీనది పరివాహక ప్రాంత విశేషాలు గురించి తెలుసుకుందాం. మూసీ నది పుట్టిన అనంతగిరి కొండల్లో "అనంద పద్మనాభ దేవాలయం" ఉంది. వికారాబాద్ పట్టణం విషయానికి వస్తే ఈ పట్టణం నిర్మాణంకు మూల పురుషుడు హైదరాబాద్ (నిజాం) రాజ్యంకు ప్రధాని, "పైగా" (Paigah) వంశంకు చెందిన 5వ అమీర్ అయిన "వికార్-ఉల్-ఉమ్రా" (Vicar-Ul-Umra) (1881-1902) ఆయన పేరున ఈ పట్టణం 'వికారాబాద్'గా మారింది. అమీర్ ఉమ్రా మన దేశంతో "పోలో" (POLO) ఆటకు "పితామహుని" వంటివాడు.

మూసీనదికి కొంత దూరంలోనున్నదే 'గోల్కొండ' కోట. దీని చరిత్రను తెలియనివారు ఎవరూ ఉండరు. 'పొన్నకంటి తెలగన్న' కవి 'యయాతి చరిత్ర' అన్న తెలుగు కావ్యాన్ని రచించి గోలుకొండ తాలూకాదారగు "అమీన్‌ఖాన్" కు అంకితం ఇచ్చాడు. 'యయాతి చరిత్ర" ప్రథమ ఆశ్వాసంలో గోలుకొండను వర్ణిస్తూ..

*మిసిమి బంగారు మేడల మీది యెడల*
*నిడిన ముత్యాలు.. జుక్కలు .. దడఁబడంగఁ*
*దెలియకెల్లరు వెఱగంద నలరు నెపుడు*
*మేలు వజీర్ల గమికొండ గోలకొండ'* అని వర్ణించాడు.

యాదాద్రి జిల్లాలో బి.పోచంపల్లి ప్రాంతం నుండి ప్రవహిస్తూ "చిన్న మూసీ" నది వచ్చి వంకమామిడి ప్రాంతం దాటిన తరువాత మూసీనదిలో కలుస్తోంది. ఈ "చిన్న మూసీ" సమీపంలో నున్న ఈ "పోచంపల్లి" దేశస్థాయి కీర్తిని పొందింది. మన దేశంలో "భూదాన్ ఉద్యమానికి ఇది జన్మ స్థలం". వినోబాభావే గారు 1951 ఏప్రిల్ 18న పోచంపల్లి వచ్చేరు. పేదలకు, ధనికులు భూమిని పంచి పెట్టడం గురించి ప్రస్తావించేరు. వేద్రే రామచంద్రారెడ్డి గారు నూరు (100) ఎకరాల భూమిని వినోబాభావే గార్కి ఇవ్వడంతో "భూదాన్ ఉద్యమానికి" ఇక్కడే అంకురార్పణ జరిగింది. అప్పటి నుండి ఈ వూరు "భూదాన్ పోచంపల్లి" అయింది. ఈ వూరు రెండో ప్రాధాన్యత ఏమిటంటే ఇక్కడ తయారు అయ్యే "ఇక్కత్ చీరలు" దేశమంతా ప్రసిద్ధి చెందేయి. ఇవి "పోచంపల్లి ఇక్కత్ చీరలు"గా పేరు పొందాయి.

యాదాద్రి జిల్లాలోని 'కొలనుపాక' పేరు తెలియనివారు ఉండరు. ఈ కొలనుపాక మూసీ నదికి ఉపనదియైన "ఆలేరు" నది సమీపంలో ఉంది. ఎంతో ప్రసిద్ధి పొందిన జైన దేవాలయం, సోమేశ్వర ఆలయాలు ఇక్క ఉన్నాయి. బింబావతి పట్నం, పంచకోశ నగరం, కుల్యాపాకవంటి



ఫిర్జాదీగూడ వద్ద మూసీ ప్రవాహం

పేర్లతో పిలువబడి నేడు “కొలనుపాక” అయింది శైవమత ప్రచారకులు రేణుకాచార్యులు లింగైక్యం పొందిన స్థలం ఇది. అలాగే మూసీకి ఉపనది అయిన ఆలేరు నదికి, ఆలేరు ఉపనది అయిన బక్కవాడు...కు మధ్యలోనున్నదే నరసింహస్వామి వారి యాదగిరి క్షేత్రం. ఈ క్షేత్రం గురించి అందరికీ తెలిసినదే.


సూర్యాపేట జిల్లా విషయానికి వస్తే మూసీ నదీ ప్రాంతంలోనున్న నాగారం మండలంలోని “ఫణిగిరి” గ్రామంలో జరిగిన త్రవ్వకాలలో బౌద్ధమత స్తూపాలు, సభా మందిరాలు బయట పడ్డాయి. మూసీనది పరివాక ప్రాంతంలోనున్న సూర్యాపేటను పూర్వం “భానుపురి” అని పిలిచేవారు. ఈ సూర్యాపేటను “తెలంగాణా ముఖద్వారం” అని అంటారు. మనదేశంలో ఐ.ఎస్.ఓ-14001-2004 ప్రశంసా పత్రం పొందిన తొలి మునిసిపాలిటీగా ప్రసిద్ధి పొందింది. సూర్యాపేట జిల్లాలో “సోలిపేట” గ్రామం వద్ద మూసీ నదిపై ప్రాజెక్టును నిర్మించడం జరిగింది. ఇది 1954లో ప్రారంభమై 1963లో పూర్తి అయింది.

నల్గొండ ప్రాంతం వైపువస్తే ఈ జిల్లాలో మూసీనదికి ఉపనదియైన ‘‘పల్లేరు’’ వాగు తీరంలోనున్నదే “చందుపట్ల” గ్రామం (నకిరేకల్ దగ్గర గ్రామం). కాకతీయ మహారాణి రుద్రమదేవి (మొట్ట మొదటి హిందూ మహిళా చక్రవర్తి) మరణం గురించిన శాసనం ఉంది. దీని ప్రకారం రుద్రమదేవిరాణి 1289 నవంబర్ 27న మరణించినట్లు భావింపబడుతోంది. నల్గొండ సూర్యాపేట జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తున్న మూసీనది నల్గొండ జిల్లాలోనికి “దామరచెర్ల”........ వద్ద పూర్తిగా ప్రవేశించి అక్కడ నుండి ముందుకు సాగి కృష్ణవేణి (కృష్ణా) నదితో “వాడపల్లి” గ్రామం వద్ద ఐక్య మవుతోంది.

ఈ వాడపల్లిలో ప్రసిద్ధి చెందినట్టి శ్రీ మీనాక్షి అగస్తీశ్వర ఆలయం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉన్నాయి. ఇవే కాకుండా చరిత్ర ప్రాధాన్యతకల రెండు మసీదులు ఉన్నాయి. మస్జిద్-ఇ-సారా-ఆలమ్ కుతుబ్ సాహీ మసీదులో ఉన్నాయి. నైజాం బంధువైన నజీర్ సుల్తాన్ ఈ ప్రాంతంను, కోటను ఆక్రమించడంవలన ఈ గ్రామానికి “వజీరాబాద్” అన్న పేరు కూడా వచ్చింది. నల్గొండ జిల్లాలో ఈ ప్రాంతం సిమెంట్ పరిశ్రమకు మంచిపేరు పొందింది.

స్వాతంత్ర్య సమరంలో కూడా మూసీనదీ పరివాహక ప్రాంతం తనవంతు పాత్రను సమర్ధవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌లో 1857 నాటి ‘రెసిడెన్సీపై దాడి. అందులో అల్లాయుద్దీన్ మౌల్వీ, తుర్రేబాజ్ ఖాన్‌ల విరోచిత పోరాటం, భారతజాతీయ కాంగ్రెస్ వారు 1938లో హరిపూర్‌లో నిర్వహించిన సభకు దాదాపుగా 500 మంది పాల్గొనడం, హైదరాబాద్ సంస్థానంలో 1938 అక్టోబరు 24 నుండి డిసెంబరు 24 వరకు సాగిన సత్యాగ్రహం, ఆంధ్ర మహాసభ, తెలంగాణా స్టేట్‌కాంగ్రెస్ కార్యకలాపాలు, కమ్యూనిస్టులు రజాకార్లను అడ్డుకోవడం, దెబ్బదెబ్బకు “వందేమాతరం” నినాదం చేసి “వందేమాతరం రామచంద్రరావ్”గా పేరు పొందిన వావిలాల రామచంద్రరావ్ ధైర్యం, పాత్రికేయుడు (జర్నలిస్టు) షోయబుల్లాఖాన్‌పై జరిగిన అమానుషదాడి, ఐ.ఎన్.ఎ. వీరుడు మేజర్ అయిన అబిద్‌హసన్ “జై హింద్” నినాదాన్ని నేతాజీకి సూచించడంవంటివన్నీ చెప్పుకుంటూపోతే అదొక గ్రంథమే అవుతుంది.

ఇలా హైదరాబాద్ పుట్టుకకు, పెరుగుదలకు కారణం అయిన మహిమాన్విత “మూసీ నది” నేడు ప్రధానంగా హైదరాబాద్ నగర పారిశ్రామిక, ఇతర చర్యల వలన మురికికాలువలా మారిపోవడం అత్యంత హేయమైన చర్యగా భావించవచ్చు. అచ్చమైన తెలంగాణా నది అత్యంత హీనమైన కుళ్ళికాలువగా మార్చబడడం చాలా బాధాకరమైన విషయం. అందుచేత మనం నదిని కాపాడుకోవాలి. నది చేత కాపాడబడాలి. మి



ఇప్పటి మురుగు మూసీ

ఆర్.వి. రమణమూర్తి
విశాఖపట్నం. ఫోన్: 944 079 8301.



# గిరిజనులు: అనుబంధ చేతివృత్తులు

*– అరుణ చామర్తి*

గిరిజనులపై అంతగా అధ్యయనాలు జరగలేదనే చెప్పాలి. కొద్దో-గొప్పో జానపదులు ఈ విషయంలో అదృష్టవంతులే. తెలిసిన కొంత సమాచారం మేరకు గిరిజనుల్లో కూడా అనేక కళారూపాలు, అదీ ఎంతో వైవిధ్యం కలిగి ఉన్నట్లు అర్థమవుతోంది. మీరు ప్రకృతి పైన ఆధారం కాబట్టి, వారి కళలూ అలాగే ఉండి, గిరిజనేతరులకు అవి అంత కళాత్మకంగా అనిపించక పోవచ్చు. ఇతరులకు మోటుగా అనిపించే కళారూపాల్ని కూడా వీరు అతి చురుగ్గా చేయగలరు. వాటికి మనం తగిన గౌరవం ఇవ్వాలి.

ఎలాగంటే - కోయిల కోసం ఆఫ్రికన్లు చేసిన పూర్వీకుల బొమ్మల్లో, దేవతల బొమ్మల్లో తెచ్చిన సహజ నేపథ్యానికి దూరం చేసి అద్దాల షోకేసుల్లో పెడితే అది వెలా-తలా పోతుంది కదా!

దేశంలోని అనేక ప్రాంతాల్లోని గిరిజనులు అనేకానేక చేతి పనుల్లో నిపుణులు. అయితే అవి అంతగా ప్రాచుర్యం పొందక పోవడానికి కారణం కేవలం వాటిని ఆధారంగా బ్రతుకు సాగించకపోవడమే. వేరే ఆధారానికి వేడి నీళ్లకు చన్నీళ్లు తోడుగా మాత్రమే ఇవి అనుబంధ వృత్తులుగా ఎన్నుకుంటారు. శ్రీకాకుళం పరిసరాల్లో నివసించే సవరలు లోహాలతో వస్తువులు తయారు చేస్తారు. గెడకర్రలు, తీగలతో వీటి తయారీలో అలాగే కుండల తయారీలో జీవిస్తున్నారు. కొరవా, అగారియా తెగల గిరిజనులు స్థానిక ఉపయోగ పరికరాల తయారీగా ఇనుము పోతపోయడంలో సిద్ధహస్తులు. ఘాసీలు, వీరు ఉపయోగించే నార, జంతు టిష్యూల నుండి తీయడం వంటి మొరటు పనులు నాగరీకులకు కాస్త ఇబ్బంది కలిగిస్తాయి. ఇరులాలు వెదురుతో బుట్టలు, చాపలు అల్లుతారు. వీరి ఉపయోగానికి పనికివచ్చే నాగళ్ళు, బండి చక్రాలు కూడా అప్పుడప్పుడు చేస్తారు.

అపతానీ గిరిజనులు కత్తులు, కృపాణాలు చేయడంలో ఎంత నిపుణులంటే ఇది వారి వాణిజ్య ఆధారం. నీలగిరిలోని కోట తెగవారు కమ్మరం, కుమ్మరం, వడ్రంగంలో నిపుణులు. బట్టలు నేయడంలో అనేక గిరిజన తెగల వారు నిపుణులే. దేవాంగులు, సవరలు, నాగాలు, అపతానీలు, ఈశాన్య భారతంలోని మిజోలు వీరంతా తాము నేసిన వస్త్రాలను స్థానిక సంస్థల్లో విక్రయిస్తారు.

బస్తర్‌లోని మారియాలు, మురయా గోండ్లు మట్టితోనూ, లోహంతోనూ బొమ్మల్ని అద్భుతంగా తయారు చేస్తారు. వీరు చేసే బొమ్మల్లో దైవచిహ్నాలు బాగా ప్రసిద్ధి. వీరు కూడా వీటిని సమీప హస్తకళా కేంద్రాల్లో మాత్రమే విక్రయానికి పెట్టడంతో వీరిని గురించి బయట ప్రపంచానికి తెలియకుండా పోయింది. బబువాలోని భిల్లులు, భిల్లాలులు పాత గుడ్డలు, నూనె బట్టలతో దరీలు, బొంతలు తయారు చేయడంలో ప్రతిభావంతులు.

అసలు గిరిజనుల కళారూపాల్ని నాలుగు రకాలుగా చెప్పవచ్చు. ఒకటి - బొమ్మల తయారీ, రెండు - రేఖా చిత్ర కళ, మూడు - సంగీత నృత్యం, నాలుగు - మౌఖిక సాహిత్యం అని. ముఖ్యంగా భారతీయ గిరిజన కళలు మతాలతో అనుసంధానమై ఉంటాయి. వీరికి ఒక గురువంటూ ఉండరు. ఎంత కష్టమైన పనైనా

వెనుకడుగు వేయరు. అయితే ఇతర చేతివృత్తుల్లో బొమ్మల తయారీలో ప్రేరణగా కనిపించే విగ్రహారాధన వంటిది వీరిలో కనిపించకపోవటం, గిరిజన దేవుళ్ళ ప్రతిమలు లేకపోవడం కాస్త విడ్డూరంగానే అనిపించక మానదు. గిరిజనులు ప్రకృతి రూపంలో భగవదారాధన చేస్తారు. బస్తరులో మురియాలు తమ దేవాలయాలకు ఇత్తడి గుర్రాలు, ఏనుగులు, మనుషుల బొమ్మలు తయారు చేస్తారు. మరి కొన్ని తెగలు ఇవే విగ్రహాల్ని మట్టితో తయారు చేస్తారు. కానీ దయ్యాలు, భూతాల బొమ్మల్ని కూడా కళాత్మకంగా చేయడం వాటి పట్ల వీరి భయాన్ని తెలుపుతుంది.

చిత్రాలు చక్కగా గీయగలిగిన గిరిజనులు గోడలపై చిత్రించే చిత్రాలు చూడచక్కగా ఉంటాయి. ఉదాహరణకి - గంజాంలోని సవరలు, దేవతలు, దెయ్యాలు, పూర్వీకుల బొమ్మల్ని కూడా చక్కగా చిత్రించగలుగుతారు. మీరు నమ్మే అదృశ్య శక్తుల ఆనందానికి ఈ చిత్రీకరణ అని అదేవిధంగా పెద్దలపై గౌరవం, రోగాలు పారద్రోలడానికి, పంటల సమృద్ధతకు కారణాలుగా చెప్తారు. బొమ్మల్లోని వైవిధ్యం బాగా చూడగలుగుతారు.

మధ్య భారతాన గిరిజనులు నేల మీద రంగులతో బొమ్మల్ని అద్భుతంగా వేయడమే కాక, వధూవరులకు అత్యంత అందంగా కిరీటాలు తయారు చేస్తారు. వివాహాల్లో వాడేందుకు అందమైన దీపస్తంభాలు కూడా తయారు చేయడం వీరి ప్రత్యేకత. బాగా వెనుకబడ్డ తెగగా అగారియా వారు పేరుపడ్డా వారి కళా నైపుణ్యానికి మాత్రం లోటు లేదు. దుప్పి, ఇతర జంతువుల్ని అందంగా అచ్చం సజీవాలేమో అనిపించేలా తయారు చేయగలరు. వీరిలోనే మరికొందరు కొయ్యతో అందంగా బొమ్మలు తయారు చేయగలరు. పెళ్లి సమయంలో కళాత్మక వస్తువుల తయారీలో సంతాల్‌లది అందెవేసిన చెయ్యి. ఉదాహరణకు వధూవరులను మంటపం నుండి ఇంటికి తీసుకువెళ్లే పల్లకీ తయారు చేయడంలో వీరిని మించినవారు లేరంటే అతిశయోక్తి కాదు. గిరిజనులలోని కళాతృష్ణ వారు నేసే బట్టలలోను, ధరించే దుస్తులు, ఆభరణాలులోనూ ప్రస్ఫుటంగా కనబడుతుంది. వీరు ఎక్కువగా పసుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ, ముదురు నలుపు రంగులు ఉపయోగిస్తారు. అయితే క్రమంగా వాటి నుండి కొత్త రంగులు తయారు చేయడం కూడా నేర్చుకున్నారు. కొయ్యతో, వెదురుతో చేసిన హెయిర్ పెన్నులు, దువ్వెనలు పట్ల వీరికి మక్కువ ఎక్కువ. గొప్పగా భావిస్తారు కూడా.

గిరిజన స్త్రీలు తమ వెంట్రుకలు, వక్ష భాగం, మెడ, నుదురులను పూలు, గవ్వలతో అలంకరించుకునే తీరు చూసి తీరవలసిందే. రుతువులకు అనుగుణంగా ఆభరణాలు తయారుచేసి ధరిస్తారు. వీరి ఆభరణాలకు గోధుమ గడ్డి కూడా ఒక కీలక వస్తువు. భిల్లు స్త్రీలు పెద్ద గాజులు, కంచు కడియాలు, తెల్లని రాగి, సీసం, కంచుతో ఆభరణాలు పూసలు, గడ్డి, వెండితో చేసిన ఆభరణాలు ధరించి అందంగా కనిపిస్తారు. ఇప్పుడు మనం ఫ్యాషన్ అని, ట్రెండీ అని ఎవరో అమ్ముతున్నవి తగిలించుకుని మురిసిపోతున్న ఫ్యాన్సీ ఆభరణాలు గిరిజన స్త్రీల చిన్నతనం నుండే స్వయంగా తయారు చేసుకుని మరీ ధరించేవారు.

ఈకలు, నారలతో తయారు చేసే శిరోభరణాలు ఈశాన్య ప్రాంత గిరిజన స్త్రీలే కాదు పురుషులు కూడా ధరిస్తారు. నెమలి, బంగారు ఈకలతో ఓరాన్లు అందమైన ఆభరణాలే కాదు, వస్త్రాలు కూడా తయారు చేయగలరు. అడవి దున్న కొమ్ములతో చేసే శిరోభూషణాలు మరీ అపురూపం. అవును మరి - ఇప్పుడు అడవిదున్నలు కూడా లుప్తమవుతున్నాయి కదా. గవ్వలు, నెమలీకలు శిరోభూషణాలకు నేటి తరాల యువతులలో ఉన్న క్రేజ్ మనం చూస్తూనే ఉన్నాం. ఈ అలంకరణలు వారి-వారి సంప్రదాయ నృత్యాల్లో ఎప్పుడైనా టీవీల్లో ప్రదర్శించినప్పుడు మాత్రమే చూడగలం.

శ్మశానం అన్నా ఎముకలు అన్నా భయపడతాం కదా! కానీ నాగులు, మణిపూరి తెగలవారు ఎముకలతో చేసే అలంకరణ సామాగ్రి చూస్తే మనసు పడకుండా ఉండము. కానీ ఎముకలతో వారి అలంకరణ మాత్రం చూపరులకు కాస్త భయంగొలపడం నిజం. మాంసభక్షణ

అనంతరం మిగిలిన తోళ్ళు, ఎముకలతో ఎంతో కళాత్మక గృహాలంకరణలు చేయటం ఈశాన్య ప్రాంత గిరిజనులకు వెన్నతో నేర్పిన విద్య.

ప్రాంతాన్ని బట్టి అలంకరణలు, ఆభరణాలు అన్నట్లు పుష్పాలు విరివిగా దొరికే మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సాలలో గిరిజన స్త్రీలు కేశాలు, దుస్తుల అలంకరణలో పూలే ప్రధాన పాత్రగా చూస్తారు. రాజస్థాన్ గిరిజనుల తెల్ల రాగి, కంచు, వెండి లోహాభరణాలను తయారుచేసి వాడడంలో నేర్పరులు.

ఇక నాగాలు అయితే మానవులని వేటాడి, కపాల సేకరణ ఆచారం గుర్తుగానేమో కపాలాలను కూడా ఆయుధాలుగా చేసి చక్కగా అలంకరిస్తారు. అంటే వీరంతా వేటకు ఉపయోగించే ఆయుధాలను కూడా అందంగా అలంకరించడంలో వారికి కనబరుస్తారు. కుర్చీలు, పీటలు, మంచాలు గిరిజనులు వాటితో చూస్తే, బహుశా ఇప్పుడు అందమైన ఫర్నిచర్ చేసేవారిలో వలస వచ్చిన గిరిజనులే ఉన్నారేమో అనిపించక మానదు.

ఇదేకాక వీరు వారి సంగీత, నృత్య రూపకాలలో వాడే బూరలు, కొమ్ములు, వేణువు, ఇత్తడి పళ్ళాలు, కర్తాళ్ళు, జాజ్ రాజస్థాన్‌లోని గౌరాసియా తెగవారు వారికి ప్రత్యేకమైన గంగోర ఉత్సవం కోసం తయారు చేసుకునే 'గౌర్జా' అనే సంగీత వాద్యం మట్టితో చేయబడి గవ్వలు, శంఖాలతో అలంకరించబడి ఉంటుంది. వారివారి జెండాల తయారీలో కూడా వీరి కళాభినివేశం ఉట్టిపడుతుంది. నాగా జాతి వారు ద్రవ సేవనానికి తయారుచేసే చెక్క లోటాలు, చెంచాలు, గరిటలు చూసే ప్రముఖ కంపెనీల వారు గాజుతో అదే ఆకారాల్లో తయారు చేశారంటే నాణాల ప్రతిభని మనం అర్థం చేసుకోవచ్చు. కుట్టుపని, అల్లికలు, ఎంబ్రాయిడరీ ఇలా ఒకటేమిటి - కాదేదీ కళకు అనర్హం అన్నట్లుగా ఈ మధ్యన సబ్బుతో అనేక ప్రత్యేక చిహ్నాలు, చాక్‌పీస్‌లతో రకరకాల ఆకారాలు తయారు చేసి చిన్న సీసాలో అమర్చడంవంటివన్నీ



వారి-వారి కళాతృష్ణ తీర్చేవే. మనందరికీ తెలిసిన సుదర్శన్ పట్నాయక్ గారి సైకత శిల్ప ప్రతిభ కూడా ఈ కోవలోదే.

అదేవిధంగా ఎంతో తేలిగ్గా ఉండే 'పొనికి' చెక్కతో అత్యంత అద్భుతంగా బొమ్మలు తయారుచేసే నిర్మల్ కళాకారులు చెప్పుకోదగ్గవారే. ఆదిలాబాద్ అడవుల్లో దొరికే పొనికి చెక్కకి చింతపండు ఉడికించిన గుజ్జును పూసి, నున్నగా చేసి రకరకాలుగా బొమ్మలు చేయడం, కొన్ని-కొన్ని పెయింటింగులు వారికే సాధ్యం. పాన్‌దాన్ వారి తయారీలో మరీ చెప్పుకోదగ్గది.

గిరిజన తెగల్లో పెద్దల కాలం చేస్తే మురియా తెగవారు అతనికి నచ్చిన అంటే మరణించిన వ్యక్తికి ఇష్టమైన కొయ్య స్తంభాలని చెక్కుతారు. వాటి నిండా ఆభరణాలు ధరించిన నాట్యగత్తెలు, బియ్యంతో చేసిన బీర్‌ని అందిస్తున్న యువతులు, వేట దృశ్యాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించే బ్రాహ్మణుల బొమ్మలతో ఈ స్తంభాల నింపేస్తారు. ఈశాన్య ప్రాంత ఫోమ్స్, కోన్యాక్‌లు ఈ సమాధి బొమ్మలు చేయడంలో దిట్టలు. చనిపోయిన వారి ఆత్మ సమాధిలో కొంత కాలం విశ్రాంతి తీసుకుంటుందని వారి విశ్వాసం. ఆ వ్యక్తి ఆభరణాలు, పచ్చబొట్టు గుర్తులుగా బొమ్మలు తయారు చేసి, చిన్న-చిన్న మందిరాలుగా చేసి ఉంచుతారు. అతని తాలూకు ఈటెలు, ఆయుధాలేకాక అతనిచే సృజించబడ్డ కళాత్మక వస్తువులను సైతం సమాధి చేయడం కొంత బాధ కలిగించే విషయమే. ఛాంగ్, ఫోమ్, కోన్యాక్‌ల సమాధులు చూస్తుంటే అవి మ్యూజియముల్లా ఉన్నాయని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. వాటిని నచ్చి ఎవరైనా ముట్టుకున్నా, తెచ్చుకున్నా తీవ్రమైన నేరంగా, అపరాధంగా భావిస్తారు. చావు కూడా పెళ్ళిలాంటిదే అన్న పాట గుర్తు వస్తోంది కదూ! ఈజిప్టు వారి మమ్మీలు కూడా ఇందుకు విరుద్ధం కాదు.


అరుణ చామర్తి, హనుమకొండ.
ఫోన్: 900 068 3826.

# దక్షిణామూర్తి శాస్త్రి

*– కన్నడ మూలం: డి.వి. గుండప్ప*

*– తెలుగు: ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ*

దక్షిణామూర్తి శాస్త్రి గారు కొళ్లేగాల గ్రామానికి చెందినవారు. వైదిక బ్రాహ్మణులు. వేదాధ్యయన సంపన్నులు. సంస్కృత కావ్య వ్యాసంగం చేసినవారు. అందువల్ల కచేరీ చేసేటప్పుడు కానీ, అభ్యాసం చేసేటప్పుడు కానీ ఆయన ఉచ్చారణ స్పష్టంగా, దోషరహితంగా ఉండేది. పద విభాగం కూడా నిర్దుష్టంగా ఉండేది. పొట్టిగా, తెల్లని రంగుతో ఆకర్షణీయంగా ఉండేవారు. తమిళం, తెలుగు భాషల్లో చక్కని పరిచయం ఉండేది. సంగీతం శాస్త్రిగారి కుటుంబానికి వంశపారంపర్యంగా సంక్రమించింది. పైగా అదే కులవృత్తి కూడా. ఆయన అన్నగారి కుమారుడైన అరుణాచల శాస్త్రి గారి పాటలు విన్నాను. అవి శాస్త్రబద్ధంగా ఉండేవి. దక్షిణామూర్తి శాస్త్రి గారు పదిళ్లలో పిల్లలకు సంగీత పాఠాలు నేర్పించి, పొట్ట పోసుకునేవారు. నా బంధువు ఎం. వెంకటప్పయ్య గారు ఆ మహానుభావుని శిష్యులే. కష్టమైన కీర్తనలు పాడటమంటే శాస్త్రి గారికి చాలా ఇష్టం. ఆయన సాధారణంగా ముత్తుస్వామి దీక్షితుల కీర్తనల్నే ఎన్నుకొనేవారు. ఆయనకు ఎంతో ఇష్టమైనది భైరవ రాగంలోని 'త్యాగరాజ యోగవైభవం సమాశ్రయామి'.



దక్షిణామూర్తి శాస్త్రి

*త్యాగరాజ యోగ వైభవం / అగరాజ యోగవైభవం / రాజ యోగ వైభవం / భవం / వం*

చామ రాజేంద్ర సంస్కృత పాఠశాల (బెంగళూర్)లో వినాయక చవితి సాయంకాలం ప్రతి యేటా దక్షిణామూర్తి శాస్త్రి గారి పాట కచేరి తప్పనిసరిగా ఉండేది. అది ఒక ఆనవాయితీనూ, సంప్రదాయమున్నూ. ఆయన ఒక్కోసారి కేవలం పాటకచేరి మాత్రమే చేసేవారు. మరోసారి హరికథ. ఇలా ఆయన ఇష్టం వచ్చినట్లు పసందైన కార్యక్రమాలు జరిగేవి. శాస్త్రి గారు వినాయక చవితి కార్యక్రమంలో వీణ కుప్పయ్య గారు రచించిన కాంభోజి రాగంలోని 'కొనియాడిద నాపై...' వర్ణాన్ని తప్పక పాడేవారు. ఇటీవల ఈ కీర్తనను ఏ ఘన విద్వాంసులూ పాడగా నేను వినలేదు. "మీరెందుకు ఇంత కష్టమైన కీర్తనలు పాడతారు? అదీ వినాయక చవితి నాడు. కడుపు నిండా కుడుములు మెక్కిన రోజున భుక్తాయాసం - పైగా పాడేటప్పుడు మీకు ఇబ్బంది కలుగుతుంది కదా" అని నేను ఓసారి దక్షిణామూర్తి శాస్త్రి గారితో అన్నాను. అప్పుడు ఆయన నవ్వుతూ- "అయితే నీవు నన్ను ఆడవాళ్ళ పాటలు పాడమంటావా?" అని అడిగారు. ఆయనది గంభీర స్వరం. కష్టమైన దాన్ని సాధించడమే ఆయన ధ్యేయమూ, హఠమూనూ. దక్షిణామూర్తి శాస్త్రి గారిని మెప్పించడమంటే కొమ్ములు తిరిగిన విద్వాంసులకే కష్టసాధ్యమైన సంగతి. ఆయన సభలో కూర్చున్నారు అంటే పెద్ద పెద్ద సంగీత విద్వాంసులకే వణుకు పుట్టేది. బెంగళూరు నగర ప్రముఖులలో ఒకరైన ఆర్కాట్ శ్రీనివాసాచార్యుల గారికి దక్షిణామూర్తి శాస్త్రి గారి సంగీతమంటే మహా ఇష్టం. ఆయన బెంగళూరుకు విచ్చేసినప్పుడు సంవత్సరానికి మూడు నాలుగు సార్లైనా తమ భవనంలో శాస్త్రి గారి కచేరీ ఏర్పాటు చేసి ఆనందించేవారు.

శాస్త్రిగారు కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడే స్వభావం కలవారు. అయినా ఎంతో సౌమ్యులూ, వినమ్రులూనూ, పైగా సరసులు కూడానూ. ఓసారి వీణ శేషణ్ణ గారి కచేరి జరుగుతుంది. ఇంకేం, కొద్దిసేపట్లో ముగిసేలా ఉంది. అప్పుడు శేషణ్ణగారు సభికుల వైపు తిరిగి- "మీలో ఎవరికైనా, ఏమైనా కావాలో అడగండి, మీ కోరిక తీరుస్తాను" అని అన్నారు. అప్పుడు సభికులందరికీ చిన్నవాడైన ఓ వ్యక్తి "నాయకిని దయచేయండి" అన్నాడు బిగ్గరగా. అప్పుడు దక్షిణామూర్తి శాస్త్రి గారు "శేషణ్ణ గారి నాయకి అంటే ఎవరు ఇష్టపడరు" అన్నారు మరింత బిగ్గరగా. ఆనంద లహరులు తేలియాడాయి. శేషణ్ణ గారు పరమ సంతోషముతో 'నాయకి'ని వీనులవిందుగా వినిపించారు.

శాస్త్రిగారు పరిశుభ్రమైన జీవితం గడిపినవారు. సంప్రదాయ నిష్ఠ కలవారు. ప్రతిదినము రుద్రాభిషేకం చేసేవారు. సోమవారం సోమరవారం ఏకాదశ రుద్రాభిషేకం చేసేవారు. ఆయన జీవితం పట్ల వేలెత్తి చూపేవారు ఎవరూ ఉండేవారు కాదు. పేదరికం ఉన్నా ఎవరి ముందూ చేయి చాచిన వారు కారు.

దక్షిణామూర్తి గారికి ఆశ్రయమిచ్చి, ఆదుకున్నవారు, ఆదరించినవారు మోడ్రన్ హిందూ హోటల్ యజమాని కె.టి. అప్పణ్ణగారు. వీళ్ళిద్దరూ కొళ్ళేగాలవాళ్లే. వాళ్ళిద్దరి శాఖలు వేరైనా కలిసిమెలిసి జీవించినవాళ్లే. అప్పణ్ణ గారు శాస్త్రి గారికి అందించిన స్నేహ హస్తం ఎంత పెద్దదంటారు? ఎంత గొప్పదంటారు? ఆయన భగవద్భక్తులు. ఆ మహానుభావుడు శాస్త్రిగారికి చివరిదాకా ఎలాంటి కొరతా రాకుండా చల్లగా చూసుకున్నారు.

శాస్త్రిగారు హాస్యప్రియులు. ఓసారి ఆయన చిక్కపేటలో ఓ కట్ట తమలపాకులు కొని, చేతిలో పట్టుకొని ఆ వీధిలోనే ఉన్న ఓ స్నేహితుని దుకాణానికి వెళ్లారు. అప్పుడు ఆ దుకాణదారు మిత్రుడు శాస్త్రి గారి వైపు చూసి నవ్వుతూ- "ఏమిటి - పండుటాకులు కొనుక్కుని వెళ్తున్నారు" అని అడిగాడు.

అప్పుడు శాస్త్రిగారు కూడా నవ్వుతూ- "లేదు మిత్రమా - అన్నీ పండుటాకులు కావు. లేత ఆకులు కూడా ఉన్నాయి. అవి నాకు. ఇక ముదురాకులంటావా వాటిని నా కూతురు వాడుకుంటుంది. మిగిలిన వాటిని మా ఇంట్లోని ముసల్ది మింగుతుంది" అన్నారు.

"ఈ మాటలు మీ ఇంటావిడతో చెప్పనా" స్నేహితుడు కొంటెగా అన్నాడు.

"ఓ... దానిదేముంది - వెళ్ళి చెప్పు. నీకు తగిన జవాబు దొరుకుతుంది. ఇంతకీ నేను వైదికుణ్ణోయ్. ఋషి పంచమి దాటి చాలా కాలమైంది. అన్నారు శాస్త్రిగారు మిత్రునితో.

మిత్రుడు నోరెత్తితే ఒట్టు.

ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ
బెంగుళూరు. ఫోన్: 996 408 2076.

## ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం

ఆంధ్రదేశంలోని అభ్యుదయ రచయితలందరూ కలసి ఒక సంఘంగా ఏర్పడటానికి తెనాలిలో సమావేశమైనారు.



తాపీ ధర్మారావు

ఈ సంఘం యొక్క ప్రారంభ సమావేశం ఇదే. 1943 ఫిబ్రవరి 13, 14 తేదీలలో ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహాసభకు శ్రీ తాపీ ధర్మారావు అధ్యక్షులుగా వ్యవహరించారు. రెండు రోజులు జరిగిన మహాసభల అనంతరం కార్యనిర్వాహక వర్గాన్ని, కార్యదర్శిని ఎన్నుకున్నారు.

ఈ ప్రథమ మహాసభ తెనాలి పట్టణం కొత్తపేటలోగల బాలికల హైస్కూలులో జరిగింది. సభానిర్వహణలో బాగా కృషి చేసిన వారిలో శ్రీయుతులు రామదాసు ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం, అనిసెట్టి సుబ్బారావు మొ. వారున్నారు. ఈ సంఘం కార్యదర్శిగా చదలవాడ పిచ్చయ్యగారు ఎన్నికైనారు. మహాసభల సందర్భంగా రాచమల్ల సత్యవతీదేవిగారి 'తెలుగుతల్లి' అనే పత్రికను ప్రత్యేక సంచికగా వెలువరించారు. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఈ సంఘానికి అండగా నిలిచారు. శ్రీ ప్రయాగ కోదండరామ శాస్త్రి మొదటి నుండి చదలవాడ పిచ్చయ్యగారికి తోడ్పడ్డారు.

## అభ్యుదయ రచయితల పాఠశాల

అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడ్డాక 1946 మే నెలలో అభ్యుదయ రచయితల పాఠశాల నిర్వహించారు.



మల్లంపల్లి

పాఠశాలను తెనాలి సమీప గ్రామం పెదపూడిలో నిర్వహించారు. పాఠశాల ముఖద్వారానికి 'బళ్ళారి రాఘవ' ముఖద్వారమని, పాఠశాల జరుగుతున్న గృహానికి 'గిడుగు' మందిరమని నామకరణం చేశారు. ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ శరణు రామకోటయ్య చౌదరి రచయితలకు ఆహ్వానం పలికారు. ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ దేవీ ప్రసాదరాయ చౌదరి పాఠశాలను ప్రారంభించారు. నాజరు దళం గురజాడ వారి దేశభక్తి గీతం ఆలపించారు. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ పాఠశాల ప్రధాన అధ్యాపకులుగా ఉన్నారు. శ్రీయుతులు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, శ్రీ కోదాడ రామకృష్ణయ్య, శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, అయ్యల సోమయాజుల నరసింహాశర్మ, మద్దుకూరి చంద్రశేఖరరావు, నిడదవోలు వెంకట్రావ్, కొడవటిగంటి కుటుంబరావు అధ్యాపకులుగా తరగతులు నిర్వహించారు.

నూరేళ్ళ తెనాలి రంగస్థలి – నేతి పరమేశ్వర శర్మ

# దుబ్బు కళాకారులు

– బాసని సురేష్

తెలంగాణలోని జానపద కళారూపాలు ప్రదర్శనలో వివిధ ప్రక్రియలను అనుసరిస్తూ, వివిధ రకాల పేర్లతో మనుగడ సాగిస్తున్నాయి.ఈ జానపద కళల్లో ముఖ్యంగా వాద్యాన్ని ఆధారం చేసుకొని ప్రదర్శించే కళల్ని ఆ వాద్యం పేరుతోనే పిలవడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి వాటిలో రుంజ, కొమ్ము, ఉరుము, శారద, పంబ, ఒగ్గు మొదలైనవి. ఇవి ఆయా కళారూపాల కళాకారులు ఉపయోగించే వాద్యాలు. ఈ కోవకు చెందిన కళారూపాల్లో ఒకటి దుబ్బు కళారూపం. తెలంగాణలో మాత్రమే పెద్దేవర లేదా కనకదుర్గమ్మను మాత్రమే కొలిచే అరుదైన కళారూపం.

బెస్త కులానికి చెందిన వారిలో ఒకరైన రామన్న, భీమన్న, శీనన్న, లచ్చన్న, బుచ్చన్న వంశీయులు వంశానుగతంగా కనకదుర్గమ్మను కొలుచుకునే భక్తుల ఇంటిలో దుర్గమ్మను తమ శక్తితో కట్టుబడి చేసి, ఆ ఇంటికి అష్ట ఐశ్వర్యాలతోపాటు, దుష్టశక్తులు తొలగి ఆయురారోగ్యాలు సిద్ధించాలని కొలుపు చేసి, ఆ ఇంటిలోని వారికి మానసిక దృఢత్వాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపుతారు. వీరు బ్రాణావతి (బాణావతి)కి సోదరులుగా, కనకదుర్గమ్మకు మేనమామలుగా చెప్పుకుంటారు. వీరు ప్రదర్శనలో దుబ్బు వాద్యాన్ని వాయించడంతో వీరికి దుబ్బు లోళ్ళు అనే పేరు స్థిరపడిందని చెప్తారు.

**బాణావతి (పెద్దేవర) పుట్టకకు చెందిన మౌఖిక కథ:**

మాటూరి గ్రామం, అంతర్గాం మండలం, పెద్దపల్లి జిల్లాకు చెందిన కళాకారులు మాటూరి కనకయ్య, అతని కుమారుడు సంతోష్ గారు కొలుపులో వంశానుగతంగా మౌఖికంగా చెప్పే బ్రాణావతి మరియు దుర్గమ్మ పుట్టుకకు సంబంధించిన కథను ఈ రకంగా వివరించారు. శంకరుడు పార్వతి సంతానం కోసం గంగమ్మ నోములు గౌరీదేవి నోములు సముద్రం ఒడ్డున చేసి స్నానం చేయగా, వారి మైల నుండి నోముల ప్రతిఫలంగా అక్కడ మూడు గంగలు కలిసేచోట తామరపుష్పంలో బాణావతి పుడుతుంది. ఆమెకు తన తల్లిదండ్రులు ఎవరో తెలియదు. ఆమెనే అరచేతిలో 'అల్లు' వేసుకుని తన తల్లిదండ్రులు శివపార్వతులని తెలుసుకుంటుంది. తల్లిదండ్రుల కోసం సముద్రంలో మత్స్య అవతారంలో వెళుతుండగా బెస్తవారైన రామన్న భీమన్న శీనన్న లచ్చన్న బుచ్చన్న వలలో చిక్కుతుంది. ఆమెను ఈ బెస్తవారు ఎవరింటి పిల్లవని అడగగా నేను శివపార్వతుల బిడ్డనని, వారి జాడ కోసం వెళుతుండగా, మీకు దొరకానని చెబుతుంది. నా తల్లిదండ్రులకంటే ముందు మిమ్మల్ని చూశానని, మీరు నాకు తోబుట్టువులని, మీ ఇంటి ఆడపడుచుగా నన్ను కొలువుమని చెబుతుంది. అంతేకాకుండా రానున్న కాలంలో నేను దేశానికి దేవున్ని, రాజ్యానికి రాణిగా అయ్యేది ఉందని, నాకు పూజ చేసి సేవ చేయండని, మీరు కలియుగంలో నా పూజారులుగా పిలవబడతారని దీవెన పెట్టి వెళుతుంది.

బాణావతి బెస్తవారి నుండి బయలుదేరి శంకరుని పట్నం వెళ్లి తండ్రిని కలుస్తుంది. ఆమె రావడంతో శంకరుడు సకల దేవతలను పిలిపించి ఆమెకు బాణావతి అని పేరు పెడతాడు. ఆ తర్వాత ఆమె ఆడుకోవడానికి పాడుకోవడానికి వెళ్లడానికి, ఆ బిడ్డకు వెండి బంగారు సొమ్ములు కావాలని ఔసలి రామన్నను పిలిపించి కల్తీ కాని సొమ్ములు, కాకతీయని సొమ్ములు, సుత్తె కొట్టని సొమ్ములు, వెదురు గొట్టం పట్టి ఊదని సొమ్ములు తయారు చేయమని వెండి బంగారమిస్తాడు. కానీ ఔసలి రామన్న కల్తీ చేసిన సొమ్ములే తయారు చేసి ఇవ్వడంతో బాణావతి తండ్రికి చెబుతుంది. అప్పుడు శంకరుడు ఔసలి రామన్న నీకు కల్తీ కలిపిన సొమ్ములే చేసి ఇచ్చాడని, నీకు కల్తీ లేని సొమ్ములు ఇస్తానని చెప్పి, ఈత కమ్మలతో చెవి కమ్మలు, బుట్టాలు, ఉంగరం, వడ్డానం తయారు చేసి ఇక నుండి ఈత ఆకులతో చేసిన సొమ్ములు పెట్టుకొని ఆడుకొమ్మని పంపిస్తాడు.

బాణావతి పెరిగి పెద్దది కావడంతో పెళ్లి చేయాలని శివుడు, సూర్యుని కొడుకు సన్యాసి రాయినితో పెళ్లి

చేస్తాడు. అయితే ఆమె ఆ లగ్గం మీద అ ఒక వరం కోరుకుంటుంది. అదేమిటంటే తండ్రి నన్ను కన్నావుగాని నా తలరాతను కనలేదని, నేను ఒక వరం కోరుకుంటానంటుంది. అందుకు శివుడు నువ్వు ఏ వరం కోరుకున్నా నేను తీరుస్తానంటాడు. అప్పుడు ఆమె నరున్ని ఆరం కావాలని కోరుతుంది. ఆమె కోరిన వరాన్ని మొదట కాదన్నప్పటికీ మాట ఇచ్చిన శివుడు సరేనంటాడు. బిడ్డ ముందు పదకొండు నెలలకు పన్నెండు కులాలు, పన్నెండు జాతులు పుట్టేది ఉందని, ఢిల్లీకి రాజు బారోడు, బారోని ఇంటికి కన్నయ్య పుట్టేది ఉందని, అతను పసుపు తోట వేస్తాడని, అతని సంతతితోపాటు ఆవుల మరియు గొర్రెల మందను మాయం చేసి, అతనికి తిందామన్నా తిండి లేకుండా చేస్తే నిన్ను దేవుడని పసుపు తోట మీద ఎత్తుకొని పూజించి, నీకు నరబలి ఇస్తాడని చెప్తాడు. అప్పుడు బాణావతి ఈ పదకొండు నెలలు నాకు ఆహారం ఏం పెడతావని అడుగుతుంది. అందుకు శంకరుడు ఈ పదకొండు నెలలు అడవి ఆహారం పండ్లు ఫలాలు తిని బతుకుమని చెప్తాడు. ఆమె అడవిలో తిరుగుతూ పండ్లు ఫలాలు తింటుండగా దాహం వేస్తుంది. అప్పుడు ఆమె చెరువులు కుంటల్లో చేపలు కప్పలు ఎంగిలి చేసి ఉంటాయని, ఆ నీళ్లు తాగితే నాకు స్వచ్ఛం ఉండదని, రానున్న కాలంలో నన్ను దేవుడిగా కొలిచే ఉందని, ఆమె ఆ నీళ్లు తాగకుండా తన ఎడమ గోరుతో కంక బొంగును చీరుకొని కంక పాలు తాగుతుంది. ఆ పాలు తాగడంవల్ల ఆమెకు కడుపులో గడ్డలు పుట్టి ఆమె గర్భం దాలుస్తుంది. ఆ అడివిలో ఆమెకు ఎవరూ తోడులేక ఒక్కతే కష్టపడుతూ తిరుగుతూ ఉంటుంది. బాణావతి పెళ్లిలోనే శంకరుడు నీ స్వచ్ఛత పోకుండా ఉండేందుకు నువ్వు పంబాల వారికి, శివసత్తులకు, ఎల్లమ్మకు మంత్రాలవారికి ఎవరికీ దొరక వద్దని చెప్తాడు. ఆ కారణంగానే బాణావతి అడవిలో ఒంటరిగానే జీవిస్తుంది.

అడవిలో బాణావతి పుల్లని పదార్థాలను తినాలని కోరుకుంటుంది. అప్పుడు ఆమె తన కోరికలను తీర్చుకోవడానికి బంజారాలకు ఆటంకం కల్పించి, వారి కలలో మీ ఆటంకాలు తొలగి పోవాలంటే నన్ను కొలుచుకొని నా కోరికలు తీర్చమని అంటుంది. అప్పుడు వారంతా అమ్మవారిని స్మరించుకొని ఆమె కోరిన సుక్కకూర, తోటకూర, గోధుమ రొట్టెలు, ఏడు బట్టీల సార సమర్పించుకుంటారు. అప్పటి నుండి బంజారాలు కూడా కనకదుర్గమ్మను తమ దేవతగా కొలుస్తారని చెప్తారు. బాణావతికి నెలల నుండి ఆపద ముంచుకొస్తుందని మంచు కొండ మీద ఉన్న మంత్రసాని ఎల్లమ్మ దగ్గరికి వెళ్లి, నాకు దండి ఆపద ఉందని నీకు సొమ్ములు సొమ్మందాలు ఇస్తా నా ఆపద తీర్చమంటుంది. కానీ అందుకు ఎల్లమ్మ అంగీకరించకుండా, నాకు ఎప్పుడూ ఏమీ ఇవ్వలేదని ఇప్పుడు రానంటుంది. అప్పుడు బాణావతి కంక బొంగుల చుట్టూ చీరను తెరగా కట్టుకొని అందులో పడుకొని ఆమె తల్లిదండ్రులను యాది చేసుకుంటూ, నన్ను ఆగానికి కన్నారని, నాకు తోడూ-నీడా లేకుండా అడవిలో వదిలేశారని, తల్లిదండ్రులను దూషిస్తూ ఏడుస్తూ ఉంటుంది. అప్పుడు శంకరుడు మంచు కొండ మీద ఉన్న ఎల్లమ్మ దగ్గరికి వెళ్లి నా బిడ్డకు ఆపద వచ్చిందని పురుడు చేయమని చెప్పి పంపిస్తాడు. అప్పుడు బాణావతికి కనకదుర్గమ్మ పుడుతుంది.

శంకరునికి మనుమరాలుగా కనకదుర్గమ్మ పుట్టి మూడు గడియలకే ఉయ్యాల మీద నుండి దూకి తల్లితో నన్ను అడవిలో ఆగానికి కన్నావా, నేను పుట్టినప్పటి నుండి నా తండ్రి కనిపించట్లేదని అడుగుతుంది. అప్పుడు ఆమె నీ తండ్రి సన్యాసిరావు పండ్లతోటల మీద కావలికి పోయినాడని, నాకు ఆహారం సరిపోక అవతారమెత్తి తిరుగుతున్నానని చెపుతుంది. అలాగే నీకు తోడుగా ఆడుకోవడానికి బిడారు మైసమ్మనిస్తా ఆడుకోమంటుంది. నాకొద్దని కనకదుర్గమ్మతో పాటే ఆహారం సరిపోక అవతారాలు ఎత్తుతానంటుంది. ఇద్దరికి అడవిలో ఆహారం సరిపోక తొమ్మిది అవతారాలు ఎత్తి ఇంటింటికి తిరుగుతూ ఉంటారు. అయినప్పటికీ ఆహారం సరిపోదు. అప్పుడు బాణావతి మనకు నరుని ఆరం వచ్చేది ఉందని, బారయ్య ఇంటి కన్నయ్య లచ్చమ్మ పసుపు తోట మీద నిలిస్తే మనకి నరుని ఆరం దొరుకుతుందని బయలుదేరుతారు. ఇద్దరు పిల్లల వేషం ధరించి

తోటలోకి ప్రవేశించగా కన్నయ్య మోట కొడుతూ లచ్చమ్మ పొలానికి నీళ్లు పెడుతూ ఉంటుంది. లచ్చమ్మ ఈ ఇద్దరు పిల్లలను చూసి ఈ తోట అంటు ముట్టని తోట ఎవరూ తోటలోకి రాకూడదని దబాయించగా, కన్నయ్య మాత్రం ముల్లు కర్ర తీసుకొని వారిద్దరి మెడ మీద కట్టె పెట్టి బయటికి పంపిస్తాడు.

వీరికి గర్వం బాగానే ఉందని బావిలో నీళ్లు ఎండగట్టి తోటను ఎండబెడతారు. అంతేకాకుండా తోటలో పురుగు తగిలించి దుమ్ము రేపి మాయం చేస్తారు. అలాగే వాళ్ళ కొడుకులను, కోడళ్లను, మనుమలను, మనుమరాళ్ళను వేట కుక్కలను చేసి అడవికి పంపుతారు. అంతేకాక వారి ఆవుల మరియు గొర్రెల మందలను మాయం చేస్తారు. ఇక వీరికి తినడానికి తిండి లేకుండా పోతుంది. అప్పుడు లచ్చమ్మ తోట మీదికి పన్నెండుమంది శివసత్తుల తీసుకుపోయి దీనికి కారణం ఏంటని అడిగి స్తుంది. కానీ ఆ తోటలో ఉన్న దేవుడు బాణావతి కనకదుర్గమ్మ పేర్లు చెప్పనీయక శివసత్తులు తోటలో ఏదో శక్తి ఉందని భయపడి పారిపోతారు. అలాగే ఇంతకు ముందు తోటలో తోట మైసమ్మ ఉందని తెలిసి పంబల, బైండ్ల వారిని పిలిపించి కొలుపు ప్రారంభించి, యాట పోతులు బలిచ్చి బలిజల్లే సమయంలో తోటలోని బాణావతిని కనకదుర్గమ్మను గుర్తించక వారి పేర్లు చెప్పకుండానే దయ్యం భూతం తోటలో ఉందని వారు కూడా పారి పోతారు. ఇక ఎవరు వీరిని గుర్తించకపోవడంతో బాణావతి కనకదుర్గమ్మ ఎరుకల వేషం వేసుకొని ఎరుక చెప్పడానికి గ్రామంలోకి వస్తారు. లచ్చమ్మ వారిని చూసి తమ స్థితికి కారణం వీరైనా చెప్తారేమో అని అడుగుతుంది. అప్పుడు వారు మీ తోట మీదికి బాణావతి కనకదుర్గమ్మ పిల్లల వేషంలో వచ్చారని వారిని మీరు అవమానించి పంపారని, అందుకే మీకు ఈ స్థితి కలిగిందని చెప్తారు. వారిని మీ పసుపు తోట మీద నిలిపి కొలుపు చేస్తే మీకు పూర్వస్థితి కలుగుతుందని చెప్తారు. అయితే ఆ తల్లిని ఎలా కొలువాలని కన్నయ్య దంపతులు అడుగగా ఆ తల్లి కొలుపు గురించి బెస్త రామన్న భీమన్న శీనన్న లచ్చన్న బుచ్చన్నను అడగమని పంపిస్తారు. కనకయ్య దంపతులు బెస్త రామన్న దగ్గరికి వెళ్లి విషయం చెప్పగా అల్లు వేసి చూస్తాడు. దాని ప్రకారం దుర్గమ్మ కొలుపుకు దుబ్బు చప్పుళ్లు, కల్తీలేని వెండి బంగారు సొమ్ములు, యాట పోతులు, ఏడుబట్టీల సారా, చుక్కకూర, తోటకూర, గోధుమ రొట్టెలు, పంచ రంగుల పట్నం ఆ పట్నం మీద గాజులు, అద్దం, కుంకుమ భరణి దసనం మెరుపు ఉంచి కొలుపు చేయాలని చివరగా కనకదుర్గమ్మకు నరున్ని ఆరమిస్తే మీకు పూర్వస్థితి కలుగుతుందని చెప్తారు. అందుకు కనకయ్య దంపతులు మా దగ్గర ప్రస్తుతం ఏమీ లేదని బదిలివ్వగా, ముందు మీరు తోట మీద దుర్గమ్మ కొలుపు కొలుస్తామని ముడుపు కట్టమంటారు. ఆ ప్రకారంగా ముడుపు కట్టగానే తోట పచ్చబడటమేగాక తన సంతతితో పాటు ఆవుల మరియు గొర్రెల మందలు తిరిగి రావడం జరుగుతుంది.

బారయ్య ఇంటి కన్నయ్య దంపతులు బెస్త రామన్న చెప్పినట్టుగా పసుపు తోట మీద దుర్గమ్మను నిలిపి దుబ్బు చప్పుళ్లతో కొలుపు చేయించి,పెద్దమ్మకు ఇద్దరిని నరబలిగా సమర్పిస్తారు. అయితే గ్రామంలోని వారంతా తోట మీద దుబ్బు చెప్పుళ్లకు ఆశ్చర్యపోయి చూడడానికి బయలుదేరుతారు. ఈ విషయం గ్రహించిన దంపతులు దుర్గమ్మ తో నీ కోరిక ప్రకారం నరబలి సమర్పించామని కానీ గ్రామం వారికి ఈ విషయం తెలిస్తే మంచిది కాదని వేడుకుంటారు. అప్పుడు దుర్గమ్మ నరబలి కాబడిన వారిని నల్ల మేకపోతు, ఎర్ర కోడి పుంజుగా మారుస్తుంది. అప్పుడు శంకరుడు ప్రత్యక్షమై కనకదుర్గమ్మతో రానున్న కాలంలో నరలోకం పెరిగేది ఉందని, నీకు మనుషుల ఆరం కావాలంటే ఎవరూ ఇవ్వరని, అంతేకాకుండా నీకు కల్తీలేని వెండి బంగారం సొమ్ములు ఎవరు పెట్టరని, ఈత కమ్మలతో చేసిన సొమ్ములు నల్ల మేకపోతు ఏడు బట్టీల సారా, తెల్ల కళ్ళు సమర్పిస్తారని నువ్వు వీటితోనే తృప్తి చెందాలని దుర్గమ్మను ఒప్పిస్తాడు. రానున్న కాలంలో దేశానికి దేవునివై, రాజ్యానికి రాణివై, నిన్ను కొలుచుకున్న వారికి తలాపున ఉండి రక్షించమని దీవెన పెట్టి వెళ్తాడు. ఇదే కథను దుబ్బుల కళాకారులు దుర్గమ్మ కొలుపు సమయంలో కథా గానం చేస్తారు. బాణావతి కనకదుర్గమ్మ అప్పటి నుండి వారికి ఇష్టమైన ఇంట్లో పెద్దేవరగా

(కనకదుర్గమ్మగా) నిలిచి దుబ్బుల పూజారులతో వంశపారంపర్యంగా పూజలందుకుంటూ, కొలుపు చేయించుకుంటూ వస్తున్నారు.

**కొలుపు విధానం:**

భక్తులు ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి మరియు హోలీ పండుగకు నెల ముందర కనకదుర్గమ్మ ఘడియలని ఆ రోజుల్లో పెద్దేవరను కొలిస్తే ఆ తల్లి అనుగ్రహం ఉంటుందని, మిగతా రోజులకంటే ఎక్కువగా ఆ రోజుల్లోనే కళాకారులను పిలిపించుకొని కొలుపు జరిపించుకుంటారు. కొలుపులు కూడా బుధ గురు వారాల్లో ఎక్కువ నిర్వహిస్తారు. కొలుపులలో కొత్త కొలుపు అనేది ఒకటి ఉంటుంది. ఎవరైనా ఇంటిలో నిత్యం అనారోగ్యంగా ఉండడం, మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులు కలగడం, అటువంటి వారి ఇంటిలో ఎవరికైనా దుర్గమ్మ కలలో కనిపించి మీ ఇంట్లో నిలిచానని కొలుపు చేయండని చెబుతుంది. ఆ కారణంగా కూడా భక్తులు దుర్గమ్మను కొలువాల్సి వస్తుంది. దీన్ని కొత్త కొలుపు అంటారు. ఈ కొలుపును పదకొండు నెలలకే చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మూడు లేదా ఐదు సంవత్సరాలకు తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది. దుబ్బు కళాకారులకు వారికి వంశానుక్రమంగా సంక్రమించిన గ్రామాల్లోనే దుర్గమ్మను కొలిచేందుకు వెళ్తారు. ఒకరికి సంక్రమించిన గ్రామానికి మరో కళాకారుడు వెళ్లకుండా కట్టడి ఉంటుంది. అయితే పట్టణాల్లో మాత్రం ఈ నియమం వర్తించదు. ఏ కళాకారునికి అవకాశం వస్తే ఆ కళాకారుడు వెళ్లి కొలుపు చేస్తాడు. ఒకవేళ ఒకరి కట్టడి గ్రామానికి మరొక కళాకారుడు వెళితే కులం దండుగ అని పంచాయతీ పెట్టుకుంటారు. కళాకారులు కొలుపుకు ప్రధానంగా దుబ్బు వాద్యంతో పాటు ఊదడానికి కొమ్ము మరియు పట్నం వేయడానికి పలక తీసుకొని వెళతారు. కళాకారులు దుబ్బు వాద్యాన్ని గుమ్మడి టేకు కర్రతో తయారు చేసుకొని దానికి ఆవు పర్రను రెండువైపులా ముడుచుకుంటారు. దాని మీద రవ్వ గజ్జలు అలంకరించుకుంటారు. ఈ గజ్జెల శబ్దం కోసం కొందరు పదికి మించి కూడా పెట్టుకోగా, కొందరు దుబ్బు ఆకారాన్నిబట్టి కూడా పెట్టుకుంటారు. కళాకారులు తమ స్వరం యొక్క హెచ్చుతగ్గులనుబట్టి, దుబ్బు ఆకారాన్ని చిన్నగా లేదా పెద్దగా తయారు చేసుకొని వాయించడంలో కూడా తేడాలు పలికిస్తారు. ఈ దుబ్బును కళాకారుడు తన కాళ్లకు గజ్జెలు కట్టుకొని పట్నం ముందర కూర్చుండి, ఎడమ కాలు మీద ఉంచుకొని కుడిచేత్తో తారతోను అంటే వెదురు పుల్లతో కొడుతూ, ఎడమ చేత్తో వాయిస్తున్నప్పుడు డుడుండూ అనే శబ్దం చేస్తుంది. ఈ ధ్వనికి దుర్గమ్మ పరవశిస్తుందని కళాకారులు అంటారు. ఇక కళాకారులు ఉపయోగించే కొమ్ము కాడు బర్లకు చెందిన కొమ్మును ఉపయోగిస్తారు.

కొలుపుకు కళాకారులు ఒకరు లేదా ఇద్దరు వెళ్తారు. మొదట కొలుపులో భాగంగా పెద్దే వరను ఉట్టి మీద నుండి దింపి శుద్ధి చేస్తారు. ఆ తర్వాత పుట్ట మన్ను తెచ్చి ఇంట్లో గద్దె వేసి పసుపు కుంకుమలతో అలంకరించి, గద్దె మీద పంచ లోహాలతో తయారు చేసిన దుర్గమ్మను నిలుపుతారు. కొలుపు చేయడమనేది దేవర కల్యాణం చేయడంతో సమానంగా భక్తులు భావిస్తారు. ఆ కొలుపు తర్వాత అమ్మవారు ఆ కుటుంబాన్ని దుష్ట శక్తుల నుండి రక్షిస్తుందని నమ్ముతారు. ఆ కారణంగానే కళాకారులు అమ్మవారికి పంచరంగుల లగ్గ పట్నం, నాగ పెళ్లి పట్నం వేస్తారు. పట్నం మీద దుర్గమ్మ కొలుపు సమయంలో ఉయ్యాల ఊగుతుందని తొట్టె కడతారు. ఆ తొట్టెకు అమ్మవారికి ఇష్టమైన కల్తీ లేని ఈత కమ్మలతో చేసిన కమ్మలు, బుట్టాలు, ఉంగరాలు, వడ్డానం, జింకలు వంటి సొమ్ములు తయారు చేసి అలంకరిస్తారు. ఈ కొలుపు చేయించుకునే దంపతులు నిష్ఠగా ఉంటారు. కొలుపులో చివరగా కళాకారులు యాట పోతును బలిచ్చి దాని రక్తాన్ని తెల్ల జొన్న గడకలో కలిపి వారి ఇంటి మీద దుష్టశక్తులు ఆవహించకుండా శుభం కలగాలని బలి చల్లుతారు. ఆ తర్వాత ఇంటివారికి అమ్మవారిని ముంతలో ఎత్తి ఇరిగింటికి పొరుగింటికి పోవద్దని అన్ని రకాలుగా పెద్దేవరను కట్టడిచేసి, తృప్తిపరచి అమ్మవారు కొలుపు చేసిన ఇంటికి శుభం కలిగేలా, ఆశీర్వదించేటట్టు తమ శక్తితో ఒప్పిస్తారు కళాకారులు.

దుబ్బు కళాకారులు తరతరాలుగా తమకు సంక్రమించిన సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుంటూ నేటికీ దుర్గమ్మను కొలిచే వృత్తినే నమ్ముకొని జీవిస్తూ వస్తున్నారు. కొలుపులు లేని సమయంలో చేపలు పట్టే వృత్తిని కొనసాగిస్తున్నారు. బాణావతికి సోదరులుగా, దుర్గమ్మకు మేనమామలుగా చెప్పుకునే వీరు, తెలంగాణా అంతటా ఉన్నారు. అయితే కళాకారులు మౌఖికంగా చెప్పే దుర్గమ్మ కథ ప్రాంతాలనుబట్టి కొద్దిపాటి తేడాతో ఉంది. అందుకే వీరు చెప్పే కథను సాంకేతికంగా నిక్షిప్తం చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉన్నది. ఈ కళారూపం అనుష్టాన కళారూపం కావడంతో ఒకప్పుడు కళాకారులు కొలుపులు చేసే సమయంలోనే కథాగానం చేసేవారు కానీ ప్రస్తుతం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తరపున స్వాతంత్ర వేడుకల్లో కూడా గోల్కొండ మీద దుబ్బు వాద్యం మెరవడం గొప్ప విశేషం. అలాగే ఈ మధ్య కాలంలో రంగస్థలం సినిమాలో కూడా వీరు కనిపించటం విశేషం. ఈ కళారూపం మూల సంస్కృతిని కాపాడుకుంటూనే ఆధునికంగా వచ్చే అవకాశాలను కూడా అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నది. అయితే కళాకారులు తమను జానపద కళాకారులుగా గుర్తించి, ప్రభుత్వం కళాకారులకు కల్పించే వసతులను తమకు కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

డా. బాసని సురేష్

వరంగల్. ఫోన్: 998 941 7299.

---

## Statement about ownership and other particulars of **MISIMI**

**FORM IV (SEE RULE - 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |
| 5. | Editor's Name | : | VALLABHANENI ASWINI KUMAR |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

March-31, 2020

**ALAPATI BAPANNA**
Publisher

## వేదిక

*మిసిమి* ఫిబ్రవరి - 2020 సంచికలో మాగురువు గారు డా. మొదలి నాగభూషణ శర్మగారి వ్యాసం చదివాను. చివరలో రాజా ఈడిపస్ నాటకం గురించి రాశారు. ఇది చదివాక కొన్ని విషయాలు మీతో పంచుకోవాలనుకున్నాను. ఇందులో చెప్పినట్లుగా ఈ నాటకం థియేటర్స్ ఆర్ట్స్ రెండవ సంవత్సరం విద్యార్థులు (మొదటి బ్యాచ్) ప్రాక్టికల్ పరీక్షలో భాగంగా ప్రదర్శించారు. అప్పుడు నేను మొదటి సంవత్సరం (రెండవ బ్యాచ్) విద్యార్థిని. మమ్మల్ని సైనికులు, కాపలాదారులు, వార్తాహరులు, భటులులాంటి చిన్న చిన్న పాత్రలకు తీసుకున్నారు. కొంతమందిని back stage కోసం వాడుకున్నారు. అందులో నేను రెండు చిన్న పాత్రలు వేయటం జరిగింది. మా బ్యాచ్‌లోనే ప్రముఖ రంగస్థల, సినీ నటుడు కె. విద్యాసాగర్ కూడా ఉన్నాడు. మా అందరితో చాలా స్నేహంగా ఉండేవాడు. మాలో ఒక బ్యాచ్ (అరడజనుమంది) సగటు వయసు 23. ఇక అల్లరి కూడా అదేవిధంగా ఉండేది. నాగభూషణ శర్మగారు అందరికీ అన్ని పాత్రలు ఇచ్చి రిహార్సల్స్ ప్రారంభించారు. ఆయనకు సహకారం చాట్ల శ్రీరాములు గారు, రాజా రామ్ దాసుగారు. అసలు ప్రధాన పాత్ర ఈడిపస్‌గా కుటుంబరావు గారిని (రెండవ సంవత్సరం విద్యార్థి) సెలెక్ట్ చేశారు. కె. విద్యాసాగర్‌కు మాత్రం ఏ పాత్ర ఇవ్వలేదు. అంతఃపురం మహాద్వారం దగ్గర కాపాలాకు ఇద్దరు భటులు కావాలి. అందులో ఒకరు మా క్లాస్‌మేట్ బీచుపల్లి రాయుడు అనుకుంటాను. ఆ రోజుల్లో మావి పిల్ల చేష్టలు కదా. ఈ రెండో భటుడి పాత్రకు సాగర్‌ను పెట్టమని శర్మగారికి సందు దొరికినప్పుడల్లా సలహాలు ఇచ్చేవాళ్ళం. రిహార్సల్స్ కోఠీలోని మహిళా కళాశాలకు మారింది. ప్రతిరోజు అందరూ యమ సీరియస్‌గా రిహార్సల్స్ చేస్తున్నారు. ఇక తప్పనిసరి పరిస్థితులలో సాగర్‌కు మేము రికమెండ్ చేసిన పాత్ర వచ్చింది. సాయంత్రాలు అప్పుడప్పుడు కనపడి మాయమవుతు ఉండేవాడు. పెద్దగా ఎవరూ పట్టించుకునేవారు కాదు. ప్రదర్శనకు ముందు రోజు సాయంత్రం రిహార్సల్‌కు వెళ్ళేసరికి నాతో సహా చాలామంది ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఆ మెట్ల మీద రాజా ఈడిపస్ పాత్రలో విద్యాసాగర్ రిహార్సల్ చేస్తున్నాడు. వాతావరణం అంతా టెన్షన్‌గా ఉంది. ఆ రోజు మధ్యాహ్నం నుండే రిహార్సల్ మొదలయిందట. మెల్లగా విషయం తెలిసింది. ఈడిపస్ పాత్ర చేసే కుటుంబరావు గారు ముందు రోజు రాత్రి గుండె పోటుతో ఆసుపత్రిలో చేరారు. అందుకని నాటకం ఆగకూడదని మధ్యాహ్నం నుండే సాగర్‌తో రిహార్సల్ మొదలుపెట్టారుట. ఇక అందరిలోనూ టెన్షన్, భయం మొదలయ్యాయి. ప్రదర్శన ప్రారంభమయింది. అక్కడ మెట్లకిరువైపులా రెండు సింహాలు ఉంటాయి. ఆ విగ్రహాలకు వెనుకగా ఇద్దరు మనుషులను (విధార్థులు) కూర్చోపెట్టి సాగర్‌కు prompting ఇప్పించారు. రంగస్థలం మీద prompting తీసుకుంటూ నటించటం ఓ కళ అని ఆ రోజు కె. విద్యాసాగర్ నిరూపించాడు. అందుకే అతను గొప్ప నటుడు. మూడు రోజుల ప్రదర్శన అద్భుతంగా వచ్చింది. ఆ తరువాత అంతా చరిత్ర. అంత గొప్ప కళాకారుడితో కలసి చదువుకున్నందుకు నేను ఈ రోజుకు గర్వంగా భావిస్తాను. మనిషి జీవితం ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడండి. ఒక్క రాత్రిలో భటుడు రాజుగా మారిపోయాడు. ఆ రాజు అసమాన నటన నాటకాన్ని నిలపెట్టింది. ఉస్మానియా యూనివర్సిటీ నాటక విభాగాన్ని ఎంతో ఎత్తుకు తీసుకు వెళ్ళింది. మన తలరాత, జాతకం అంటారే, అదేమిటో అప్పుడే తెలుసుకున్నాను.

నిజానికి ఇడిపస్ నాటకంలో కూడా ఇలాంటి విధి చేష్టలు విరివిగా ఉంటాయి (*మిసిమి* ఎడిటర్ గారు 'మైండ్ మీడియా' వెబ్ రేడియోలో సోఫోక్లిస్ రచనలు ఇడిపస్ రెన్స్, ఆంటగోని, ఇడిపస్ రెన్స్, ఆంటగోని, ఇడిపస్ ది కింగ్ గురించి ప్రసంగించారు).

**ఎన్.వి. హనుమంతరావు**
**ఇ-మెయిల్**: nvhr2016@gmail.com

## వేదిక

"..... కిల్లాడ సత్యనారాయణ గారికి నమస్కారం - *మిసిమి* అక్టోబర్2019 సంచికలో అచ్చయిన మీ వ్యాసం చూశాను. దాన్ని నేను చదవలేదు, మీరు చెప్పిన దాన్ని విన్నాను, శ్రద్ధగా విన్నాను. చాలా విలువైన విషయాలు చెప్పినందుకు మీకు ధన్యవాదాలు. మీరు చెప్పిన విషయం యొక్క ప్రాధాన్యతను మరింత లోతుగా గుర్తించడానికి నాకు తెలిసిన ఒక పుస్తకంలోని వాక్యాలను మీ దృష్టికి తేవడం మంచిదని భావిస్తూ (మీకు చెప్పటానికి సంకోచిస్తూనే) ఈ వాక్యాలు రాస్తున్నాను-

"...this deep split between our biological and our social existences leads to more and more conflicts and 'holes'. The holes are the main characteristic of the incomplete personality. Some of us have no heart or no initiation; some have no legs to stand on no genitals, no confidence, no eyes, or ears. If a person has a hole where other people have eyes, he finds that his eyes are projected Into the environment, and he will lead a life of self consequences, permanently persecuted by the idea that he is looked at, judged, admired, accused etc., The worst hole I can think of is a person having no ears. This is usually found in people who talk and talk and except the world to listener. They use other people's sentences merely as jumping boards for repartee, if they listen that much. They certainly don't listen to the voices of their environment; at the best they abstract the content and stay on an empty intellectual level. We have a peculiarity in this world listening versus fighting people who listen don't fight and people who fight don't listen. If the warring factions in our society marriage patterns, business dependencies would open their ears and listen to their opponents, the hostilities in our environment and among nations would greatly diminish.."


*- F.S. Perls, in Gestalt Therapy..*

మీరు ఈ వ్యాసంలో చెప్పిన విషయాలకు మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తూ...

**డి. చంద్రశేఖర్ - ఫోన్: 929 009 1232.**

## బెంజిమిన్ ఫ్రాంక్లిన్ – విశిష్ట వ్యక్తిత్వం

*– తాజీ ప్రసాద్*



బెంజిమిన్ ఫ్రాంక్లిన్

***నేను మరణించుచున్నాను, ఇటు నశించు / నా కొరకు చెమ్మగిల నయనమ్ము లేదు / నా మరణశయ్య పరచుకొన్నాను నేనే / నేనే నాకు వీడ్కోలుపు వినిపించినాను***

అన్నారు తన గురించి కవితాత్మకంగా ఆఖరి ఘడియలు ఆవిష్కరిస్తూ మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి.

అయితే తన 'చరమ గీతం' తనే వ్రాసుకున్న ఒక ప్రపంచ సాహితీ స్రష్ట ఉన్నారు. తన మరణానికి అరవయి రెండేళ్ళ ముందరే ఆ చరమ గీతాన్ని (EPITAPH) రచించినది లేక వ్రాసుకున్నది ఎవరో కాదు, ఆంగ్ల సాహిత్యాన్ని భావ స్పష్టతతో సుసంపన్నం చేసిన బెంజిమిన్ ఫ్రాంక్లిన్ (1706-1790). చిత్రకారునిగా, ప్రచురణకర్తగా, శాస్త్రజ్ఞుడిగా, దౌత్యవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా రాణించిన బెంజిమిన్ ఫ్రాంక్లిన్ 'చరమ గీతం' హాస్యానికి, వ్యంగ్యానికి పెద్దపీట వేసి, సాహితీ కళాఖండంగా ఈనాటికీ నిలుస్తోంది. ఆ చరమ గీతం ఇలా సాగుతుంది-

***బెంజిమన్ ఫ్రాంక్లిన్ దేహం పాత పుస్తకం, అట్టలాగా క్రిమికీటకాలకు ఆహారంగా ఉంది, అయితే రూపురేఖలు మార్చుకుని పునర్ముద్రణ, పొంది ఆకర్షణీయంగా పునర్జన్మ ఎత్తుతుంది.***


బెంజిమన్ ఫ్రాంక్లిన్ 'చరమ గీతం' సంగతి అలా ఉంచితే అతను తన ఆత్మకథలో (మొదట మెమొరీస్‌గానూ తర్వాత ఆటోబయోగ్రఫీగానూ వెలువడింది) ఏ నాటికీ విలువ కోల్పోని పదమూడు సుగుణాలను పేర్కొన్నాడు. అవి- 1. పరిమితత్వము - Temperance, 2. నిశ్శబ్దం - Silence, 3. క్రమశిక్షణ - Order, 4. దృఢసంకల్పం - Resolution, 5. పొదుపు - Frugality, 6. శ్రద్ధ - Industry, 7. నిజాయితీ - Sincerity, 8. న్యాయం - Justice, 9. సమరసం - Moderation, 10. పరిశుభ్రత - Cleanliness, 11. ప్రశాంతత - Tranquility, 12. పరిశుద్ధత - Chastity, 13. అణకువ - Humility. అలా 'చరమ గీతం' రచించి, జీవితంలో అనుసరించవలసిన సుగుణాలు వెల్లడించిన విశిష్ట వ్యక్తి బెంజిమిన్ ఫ్రాంక్లిన్.

**తాజీ ప్రసాద్, చెన్నై. ఫోన్: 917 674 6536.**

# చదవండి...

- ఖసిలి

📖 **పసిడిమువ్వలు - పారాణి :** రచయిత నటరాజ రామకృష్ణ. నటరాజ రామకృష్ణగారిది ఒక లెజండరీ వ్యక్తిత్వం. ఆయన వ్యక్తిగా కాక, ఒక వ్యవస్థగా తెలుగునాట దేవదాసి నృత్య రీతులకు గ్రామర్ ఏర్పరచి, 'ఆంధ్ర నాట్యము' అని నామకరణం చేశారు. ఈ నాట్యరీతి కూడా, భరతనాట్యం, కూచిపూడి నాట్య – డాన్స్ డ్రామాలవలె చాలా ప్రసిద్ధి పొంది భారతదేశ ఎల్లలు దాటి ఖ్యాతి గాంచింది. కాని ఆచార్యులయిన రామకృష్ణ గారికి రావలసిన గుర్తింపు రాకపోవడం ఎంతో శోచనీయం. ఆయన భిక్షపెట్టిన శిష్యుడు, పేరిణి, ఆంధ్రనాట్యం శిష్యులకు, శిష్యురాండ్రకు నేర్పి కీర్తికనకాన్ని సంపాదించుకుంటున్నారు. అలాంటి నటరాజ రామకృష్ణ విరచితమైన 'పసిడిమువ్వలు – పారాణి' పుస్తకాన్ని ప్రచురించి తెలంగాణ సాహిత్య ఎకాడెమీ ఎంతో మేలు చేసింది. తెలుగు ప్రాంతాన్ని రెండువేల ఏండ్ల నాడు పాలించిన శాతవాహనుల నాటి కళాత్మక విలువలను పరిచయం చేయటమే నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ రచించిన ఈ 'పసిడి మువ్వలు – పారాణి' పుస్తకమని – ప్రచురణకర్తలు ప్రశంస అక్షర సత్యం!





*పేజీలు: 245, ₹ 90/–, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడెమి, కళాభవన్, రవీంద్ర భారతి, హైదరాబాద్–500 004. ఫోన్: 040–29703142.*

📖 **(1) చినుకుల్లో చిరుమంటలు :** ఇది శ్రీధర్ రాసిన కథల సంపుటి. వీరి పూర్తి పేరు శ్రీధర వెంకట రాధాకృష్ణమూర్తి. ఇంకా వీరి కలం పేరులు : మల్లిక, విష్ణుప్రియ, శిరీష. గత 20 సంవత్సరాలుగా వివిధ పత్రికలలో ప్రచురణ పొందినవి వీరి రచనలు. 400 కథలకు పైగా రాశారంటే ఆశ్చర్యమే! న్యాయశాఖలో ఎన్నో పదవులు నిర్వహించిన వీరు ఆకాశవాణిలో పరిచితులే. ఈ సంపుటిలో 21 కథలున్నాయి. పుస్తకానికి ముందుమాట గాని, రచయిత తొలి పలుకులుగాని, కృతజ్ఞతలుగాని లేకపోవటం విచిత్రమే. ఇక కథల విషయానికి వస్తే విస్తృతమై పరిధిలో ఉన్నాయి. అనుభవాలకంటే కల్పనకే ఎక్కువ ఆస్కారం ఉంది. విదేశీ నేపథ్యంలో ఇతివృత్తాలూ ఉన్నాయి.




*పేజీలు: 200, ₹ 150/-*

📖 **(2) కంచికి వెళ్ళకూడని కథలు :** కల్లూరి శ్యామల రచయిత్రి. కథావస్తువుకు ఎలాంటి ఎల్లలు లేవంటారు విహారి ముందుమాటలో. సమస్య – అంతటా సమస్యలే. అందుకని కథల్లో కూడా సమస్యలుంటాయి. కొన్ని పరిష్కరింపబడుతాయి – కొన్ని అలా కొనసాగుతాయి. ఇక కథల్లో శిల్పం – గిల్పం అంటూ విమర్శకులు చెప్పేవి పాఠకులకూ చేరతాయని నమ్మకం లేదు. కథ చదివిన తర్వాత పాఠకుల్ని వెంటాడకపోతే ఆ కథ – కంచికి చేరినట్లే – లేదా చేరనట్లు – ఎలా అయినా ఒక్కటే.




*పేజీలు: 128, ₹ 100/-*

📖 **(3) కొడవంటి కాశీపతిరావు కథలు :** బాల్యం బాగుంటుంది. కౌమారం, యౌవనం కూడా ఓకే – కాని వృద్ధాప్యం వద్దనుకుని వెళ్ళిపోయాడు కాశీపతి – అని జగన్నాథశర్మ తన ముందుమాటలో విచారపడుతూనే – జ్ఞాపకాలన్నీ తిరగబోసుకున్నారు. సుఖం తర్వాత దుఃఖం, దుఃఖం తర్వాత సుఖం – దీని మధ్య అదీ – దీని మధ్య ఇది – నీరు – బురదలా జీవితమంతా పరచుకుంటాయి – ఈ కథల్లో ఇతివృత్తాలు కూడా అటువంటివేనంటారు – శర్మగారు.




*పేజీలు: 202, ₹ 150/-*



**(4) కోకిల - గులాబీ :** రంగనాథ రామచంద్రరావు, ఇవన్నీ అనువాద కథలు. ఆంగ్లం, రష్యన్ - స్పానిష్ ఇలా అన్ని భాషల కథలూ ఉన్నాయి. ఇవన్నీ ఆంగ్లం నుంచే అనుసృజన చేశారు రావుగారు. అనువాదం ఇడియాటిక్‌గానే ఉంది. అతడు నావేపు అనుమానంగా చూశాడు - ఇందులో ఏదో తిరకాసున్నట్టుంది - అన్నాడు. మరి ఇడియాటిక్కే - తెలుగు పుస్తకాల్లో అచ్చుతప్పులు సర్వసాధారణం కాబట్టి ఆ విషయం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు.

*పేజీలు: 104, ₹ 85/-*

**(5) నిఖిలేశ్వర్ కథలు :** నిఖిలేశ్వర్ కథలు ఆలస్యంగా రాశారు. ముందుగా కవిగా ప్రచారం పొంది, కథనాలు, దిగంబర కవుల్లో ఒకరుగా ప్రసిద్ధులు. అసలు యాదవ రెడ్డిగా రచనలు చేశారు. ఈ కథలు



రాయటంతో మనిషి నిజస్వరూపాన్ని వెలుగునీడల్లో చూపవచ్చని, వ్యక్తి అంతరాంతరాలను సామాజిక వ్యవస్థను వెలికితీయవచ్చనే నిఖిలేశ్వర్ అభిప్రాయం ఎంతవరకూ సత్యమో కథలు చదివితేనే తెలుస్తుంది.

*పేజీలు: 148, ₹ 110/-*



**(6) వ్యక్తిత వికాసం - ఆనంద మార్గాలు :** ముకుంద రామారావు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనేది పశ్చిమ దేశాల కార్పోరేట్ సంస్థలు తమ బానిసల దగ్గర్నుంచి వీలయినంత ఎక్కువ శక్తిసామర్థ్యాలు పిండుకునే ప్రక్రియ - ఇది ముఖ్యంగా ఆర్థికపరమైన నిచ్చెనలకు టెక్నిక్స్ నేర్పుతుంది. కొన్ని వేల పుస్తకాలు ఆంగ్లంలో (ముఖ్యంగా అమెరికా నుంచి) వచ్చినవి - అవి అద్దం పెట్టుకుని తెలివిగలవారు తెలుగులో బాగా సొమ్ము చేసుకున్నారు - అయితే ఇవన్నీ కొత్తవేమీ కాదు - మనకు ఎంతవరకూ పనికివస్తాయో పాఠకులే నిర్ణయించుకోవాలి.

*పేజీలు: 88, ₹ 70/- పై ఆరు పుస్తకాలకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.యస్.ఐ. పోస్టు, హైదరాబాద్-500068. ఫోన్: 040-29884453, 54.*


**బుగతలనాటి చుక్కపల్లి:** రచయిత చింతకింది శ్రీనివాసరావు. అన్ని పల్లెటూరుల్లో ఇళ్ళుంటాయి. బయట అరుగులుంటాయి. అయితే చుక్కపల్లి అగ్రహారంలో లక్ష్మణబుగత మిద్దె వీధి అరుగు అరుదైనది - పేకాటకు వేదిక - రమ్మీ -



మూడుముక్కలు - సీక్వెన్సు - ఒకటేమిటి జూదానికి అంచులుంటాయా? మనం భారతం చదవలేదా? ఈ అగ్రహారాకులందరికీ పేకాట వృత్తిలాగా కనపడుతుంది - ఆ ఊరి కథ - ఈ నవల - చదవండి - మీలో జూదం మేల్కోనూవచ్చు.

*పేజీలు: 181, ₹ 150/-, ప్రతులకు: అన్ని పుస్తక షాపులు - మరియు - శ్రీనిజ ప్రచురణలు, 6-60/1, రవీంద్రనగర్, ఓల్డ్ డైరీ ఫార్మ్, విశాఖపట్నం-530040. ఫోన్: 889 714 7067.*

**తెలుగు రాష్ట్రాల రెవెన్యూ వ్యవస్థ నిన్న నేడు రేపు:** ఏనుగు నరసింహారెడ్డి రచయిత. ప్రభుత్వమంటే పన్నులు వసూలు చేసి, ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయటమే - ఇది ప్రభుత్వాలు, రాజులైనా, నిరంకుశులైనా, ప్రజాస్వామ్యమైనా, జరిగేది స్థూలంగా పైన చెప్పినదే. ప్రజాస్వామ్యంలో రెవెన్యూశాఖ పెద్దపీట - ఆ రెవెన్యూశాఖ లోతుపాతులను - మంచి చెడులను - చాలా చక్కగా వివరించారు నరసింహారెడ్డి. వీరికి ఆ శాఖలో



పనిచేసిన అనుభవం కూడా అందుకు దోహదం చేసింది. ఎన్నో విమర్శలను రెవెన్యూశాఖ - ప్రభుత్వపరంగా - వసూళ్ళ విషయంలో ప్రజల నుంచి సంక్షేమ విషయంలో కత్తిమీద సానులాగా ఎదుర్కొంది. ఇది ప్రజారంజకంగా ఎలా చెప్పవచ్చో - చక్కని సంస్కరణలు ప్రతిపాదించి చూపారు రచయిత.

*పేజీలు: 125, ₹ 130/- ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక షాపులు మరియు అడుగుజాడలు పబ్లికేషన్స్, ఎమ్.ఎస్.కె. టవర్స్, ఫ్లాట్ నెం. 410, స్ట్రీట్ నెం. 11, హిమయత్‌నగర్, హైదరాబాద్-29.*

**మిసిమి** మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీకు – మీ స్నేహితులకు కలిపి రెండు సంవత్సరాల చందా కట్టి మీరూ మా నుంచి బహుమతి పొందవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 720/- (రెండు సంవత్సరాలకు) పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారాగానీ, వాట్సాప్ (నెం : 99 49 51 65 67)ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని మంచి సారస్వతంతో పలకరించినట్లే......

**Our A/c Details for Online Transfer**

Bank : **STATE BANK OF INDIA**

Account : **MISIMI**

A/c. No. : **10261569316**

Branch : **Saifabad, Hyderabad, INDIA**

IFS Code : **SBIN0007315**

*ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 20/- బ్యాంకు ఛార్జీలు కలపండి.*

*ఈ ప్రక్క మెయిల్‌కు తెలియజేయండి. e-mail: misimi90monthly@gmail.com*




2 సం.రాలకు (₹ 720/-)

**నోబెల్ వ్యాసాలు,**

**మిసిమి పార్థసారథి వ్యాసాలు**

(పై రెండు పుస్తకాలలో ఏదైనా ఒకటి)



3 సం.లకు (₹ 1080/-)

**చిత్రకళ, చార్లీ చాప్లిన్**

(పై రెండు పుస్తకాలలో ఏదైనా ఒకటి)



4 సం.లకు (₹ 1440/-)

**బైరన్, పునర్వ్యాఖ్య సాహిత్యం**

(పై రెండు పుస్తకాలలో ఏదైనా ఒకటి)

పుస్తకాలు ఉచితం



సంవత్సర చందాదారులకు (₹ 360/-)

**తెలుగు వర్ణమాల : విశిష్టతలు,**

**భాష – భాషాభివృద్ధి,**


My Journey in the art world

పుస్తకాలలో ఏదో ఒక పుస్తకం ఉచితం


**మిసిమి** మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**

MISIMI / మిసిమి
RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2018-20
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.2.2020



నీటి కోసం



అనార్లు